అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంగళవారం 11-7-2023

సంపుటి : 9 సంచిక : 191 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | www.navatelangana.com | 12 పేజీలు వెల : 6.50

కేరళ డీవైఎఫ్‌ఐకి ప్రపంచ ఖ్యాతి

హృదయపూర్వం కార్యక్రమానికి ప్రశంసల వెల్లువ

- ఆస్పత్రుల్లో రోగులు, వారి బంధువులకు ఇప్పటి వరకు ఆరు కోట్ల ఆహార పొట్లాలు
- మానవత్వానికి సంకేతం : అంతర్జాతీయ మీడియా ది గార్డియన్



వివరాలు 3లో..

- ఇది రియల్ కేరళ స్టోరీ : ఎంబీ రాజేష్, కేరళ మంత్రి



మణిపూర్ దహనం వెనుక సంఘ్

అన్నదమ్ముల్లా ఉన్న కుకీ, మెయితీల మధ్య అగ్గి రాజేసిన ముఖ్యమంత్రి

- శాంతి పునరుద్ధరణలో డబుల్ ఇంజన్ సర్కార్ విఫలం
- వామపక్ష ఎంపీల బృందం ఎదుట మణిపూరీల కన్నీరు మున్నీరు
- శరణార్థి శిబిరాలు, అల్లర్ల ప్రాంతాలను సందర్శించిన వామపక్ష ఎంపీలు

న్యూఢిల్లీ : కేవలం 30 లక్షల జనాభా ఉన్న చిన్న రాష్ట్రమైన మణిపూర్ 68 రోజుల క్రితం వరకు ప్రశాంతంగా ఉండేది. కానీ ఇప్పుడు మణిపూర్‌లో ఇంఫాల్ లోయ... దాని చుట్టూ ఉన్న కొండలు రెండు శత్రు శిబిరాల వలె వేరు చేయబడ్డాయి. ప్రస్తుతం లోయలో కుకీ సంఘం సభ్యులు లేరు. అందరూ కొండలపైనే తల దాచుకుంటున్నారు. కొండల్లో నివసించే మెయితీలు లోయలకు పారిపోయారు. మణిపూర్‌లో తన ప్రభావాన్ని సుస్థిరం చేసుకోవడానికి సంఘ్ పరివార్ ఉపయోగించిన మత రాజకీయాలతో ఆ రాష్ట్రం రణ భూమిగా మారింది. వందలాది మంది మరణించారు. చాలా మంది గాయపడ్డారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. 60,000 మంది ప్రజలు రెండు నెలలకు పైగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. వారి జీవనోపాధి నాశనమైంది. వారి ఇండ్లు తగులబెట్టడం ...11లో

ఆపరేషన్ సిట్టింగ్

ప్రజల్లో లేని వారిపై సీఎం కేసీఆర్ నజర్

- వచ్చే ఎన్నికల్లో నో ఛాన్స్ అనే సంకేతాలు
- జనంతో మమేకమైన ఆశావహులకు ప్రోత్సాహం
- అందుకోసం ప్రత్యేక వ్యూహం
- ఉమ్మడి మెదక్, ఖమ్మం, నల్లగొండ బాధ్యతలు హరీశ్‌కు
- కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డికి కేటీఆర్
- నిజామాబాద్‌కు కవిత
- మిగతా జిల్లాలను స్వయంగా తానే పర్యవేక్షించనున్న సీఎం



అధికార బీఆర్ఎస్‌లో సిట్టింగులుగా ఉండి.. ప్రజల్లో లేని ఎమ్మెల్యేలకు ఆ పార్టీ అధినేత కేసీఆర్... దిమ్మదిరిగే షాక్ ఇవ్వనున్నారు. కేవలం సీఎం ఛరిష్మా, ప్రభుత్వ పథకాల మీద ఆధారపడి బండిని లాగించేస్తున్న వారికి 'మీ సేవలు ఇక చాలు...' అనే సంకేతాలను ఆయన ఇప్పటికే ఇచ్చేశారు. కాగా, ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం, నిజామాబాద్ జిల్లాలకు సంబంధించి సీఎం ఓ నిర్ణయానికి వచ్చినట్టు తెలుస్తోంది. ఇదే సమయంలో ప్రజల్లో లేని సిట్టింగుల స్థానంలో మాజీ ఎమ్మెల్యేలు, మాస్ లీడర్లు, గతంలో రకరకాల కారణాల రీత్యా టిక్కెట్ దక్కకుండా పోయిన వారికి, వారితోపాటు కొంతమంది ఆశావహులకు సైతం పోటీకి సిద్ధంగా ఉండాలంటూ కేసీఆర్ సూచించినట్టు సమాచారం. ఆ క్రమంలో వారికి కావాల్సినంత చేయూతనిస్తున్నట్టుగా వినికిడి. పోటీకి సిద్ధంగా ఉండాలంటూ కేసీఆర్ నుంచి తమకు 'సిగ్నల్' వచ్చినట్టు కొందరు ఆశావహులు క్యాడర్‌కు చెప్పుకుంటూ నిత్యం ప్రచారంలో ఉండే ప్రయత్నం చేస్తున్నారు.

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో సిట్టింగులకు టిక్కెట్ ఇవ్వకపోతే... అనేక రకాల ఇబ్బందులు, ధిక్కార స్వరాలు ఎదురవుతాయనే విషయం తెలిసిందే. ఈ క్రమంలో వాటిని ధీటుగా ఎదుర్కొనేందుకు కేసీఆర్ తనదైన వ్యూహాన్ని రచించారు. అందులో భాగంగా ఇటు సిట్టింగులను దారిలోకి తెచ్చుకునేందుకు, అటు ఆశావహులకు అండగా ఉండేందుకు వీలుగా ట్రబుల్ షూటర్ హరీశ్‌రావు, మంత్రి కేటీఆర్, ఎమ్మెల్సీ కవితలకు జిల్లాల బాధ్యతలను అప్పగించారు. ఉమ్మడి మెదక్, ఖమ్మం, నల్లగొండ బాధ్యతలను హరీశ్‌కు అప్పగించిన సీఎం... నిజామాబాద్‌కు కవితను, కరీంనగర్, హైదరాబాద్, రంగారెడ్డికి కేటీఆర్‌ను బాధ్యులుగా నియమించారు. ఆయా జిల్లాల్లో సీట్లు, తిరుగుబాట్లు, అసంతృప్తులు, నిరసనలన్నింటినీ పరిష్కరించాల్సి ఉంటుంది. అదే సమయంలో పరిస్థితిని తమ అదుపులో ఉంచుకుని.. పంచాయితీ సీఎం దాకా రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత కూడా వీరిదేనని సీరియస్‌గా చెప్పినట్టు సమాచారం. దీంతోపాటు సీట్లకు సంబంధించిన ఏ విషయంలోనైనా ఒక జిల్లా బాధ్యుడు మరో జిల్లాలో వేలుపెట్టొద్దంటూ కేసీఆర్ నొక్కి చెప్పారు. బాధ్యులకు అప్పగించిన జిల్లాలు కాకుండా మిగతా జిల్లాలపైనా స్వయంగా దృష్టి సారించనున్నారు.

ఆ 'పెద్ద తలకాయల'పై స్పెషల్ ఫోకస్



మరోవైపు కర్నాటక ఫలితాల తర్వాత అనూహ్యంగా పుంజుకుందని భావిస్తున్న కాంగ్రెస్‌లోని సీనియర్ నేతల నియోజకవర్గాలపై సీఎం ప్రత్యేక దృష్టి సారించారు. ముఖ్యంగా గతంలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి నియోజకవర్గమైన హుజూర్ నగర్, జానారెడ్డి ప్రాతినిధ్యం వహించిన నాగార్జున సాగర్, గీతారెడ్డి సీటైన మెదక్, రేవంత్ పోటీ చేసిన కొడంగల్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పోటీ చేసే నల్లగొండ, జీవన్‌రెడ్డి స్థానమైన జగిత్యాల, గతంలో కాంగ్రెస్‌లో ఉండి, ఇప్పుడు బీజేపీలో కొనసాగుతున్న డీకే అరుణ సీటైన గద్వాల తదితర స్థానాలపై స్పెషల్ ఫోకస్ పెట్టటం, వారిపై బీఆర్ఎస్ అభ్యర్థులు ఈసారి కూడా గెలిచేలా చేయటం ద్వారా పార్టీ ప్రతిష్టను పెంచే దిశగా కారుసారు వ్యూహ రచన చేస్తున్నారు.

ఉమ్మడి పౌరస్మృతి ఆమోదించం

భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంప్రదాయం

- దాన్ని గౌరవిస్తాం
- ఇప్పటికే ప్రజల మధ్య విభజన తెచ్చే చర్యలకు బీజేపీ పాల్పడుతోంది : సీఎం కేసీఆర్ స్పష్టీకరణ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కేంద్రప్రభుత్వం ప్రతిపాదిస్తున్న ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని ముఖ్యమంత్రి కే చంద్రశేఖరరావు స్పష్టం చేశారు. దేశాభివృద్ధిని విస్మరించి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇప్పటికే దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నదనీ, ఈ చర్యల్ని సంపూర్ణంగా ఖండిస్తున్నామని అన్నారు. యూసీసీ పేరుతో మరోసారి దేశ ప్రజలను విభజించేందుకు కుయుక్తులు పన్నుతున్నారని విమర్శించారు. భిన్నత్వంలో ఏకత్వం భారతీయ సంప్రదాయమనీ, ఈ దేశ ప్రజలు విభిన్న ప్రాంతాలు, జాతులు, మతాలు, ఆచార వ్యవహారాలు, సంస్కృతులు కలిగి ఉంటారనీ, దాన్ని తాము పూర్తిగా సమర్థిస్తామని తేల్చిచెప్పారు. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం ఇలాంటి పనికిమాలిన పనులు మానుకోవాలని హితవు పలికారు. ఈ బిల్లు దేశంలోని మెజారిటీ హిందువులనూ ఆయోమయంలోకి నెడుతుందనీ, ప్రజల అస్థిత్వం, తరతరాల సాంప్రదాయ సాంస్కృతిక ఆచార వ్యవహారాలు తుడిచిపెట్టుకుపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

సోమవారం ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు ఖాలీద్ సైఫుల్లా రెహ్మానీ ఆధ్వర్యంలో బోర్డు కార్యవర్గం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమైంది. ఏఐఎంఐఎం అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే అక్బరుద్దీన్, మంత్రులు మహమూద్ అలీ, కే తారకరామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేయాలనుకుంటున్న యూసీసీ నిర్ణయం దురుద్దేశ్యంతో కూడుకున్నదని చెప్పారు. దేశంలో పరిష్కరించాల్సిన సమస్యలు ...11లో

తప్పుడు పోస్టులు పెడితే ఖబడ్దార్




- పెన్షన్ ఆపేస్తాం... కేసులు పెడతాం: మాజీ సైనికులకు ఆర్మీ హెచ్చరిక

న్యూఢిల్లీ : సైనికదళాల ప్రతిష్టకు భంగం కలిగిస్తూ సామాజిక మాధ్యమాలలో తప్పుడు పోస్టింగులు పెడితే తీవ్ర చర్యలు తప్పవని మాజీ సైనికులను ఆర్మీ హెచ్చరించింది. పెన్షన్ నిలిపివేస్తామని, పోలీసు కేసులు పెడతామని స్పష్టం చేసింది. ఈ మేరకు సైనిక కమాండర్లకు అదనపు డైరెక్టర్ జనరల్ (క్రమశిక్షణ, పర్యవేక్షణ) రెండు నెలల క్రితమే లేఖలు పంపారని 'ది ట్రిబ్యూన్' పత్రిక వివరించింది. 'కొందరు మాజీ సైనికోద్యోగుల ప్రవర్తన సైన్యం ప్రతిష్టను దెబ్బతీసేలా ఉంది. సైన్యాన్ని...ముఖ్యంగా అధికారులను లక్ష్యంగా చేసుకొని సామాజిక మాధ్యమాలలో దుష్ప్రచారం చేస్తున్నారు. సైనికుల సర్వీసు, స్థితిగతులు, హక్కుల విషయంలో ...11లో

మత విద్వేష మూక హత్యలపై తీసుకున్న చర్యలేవి?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించిన సుప్రీంకోర్టు





న్యూఢిల్లీ : మత విద్వేషంతో ప్రేరేపించబడిన మూక హత్యలను అరికట్టేందుకు ఇప్పటి వరకు ఏం చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాలని సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. గోసంరక్షణ, ఇతర హింసాత్మక సంఘటనలకు సంబంధించి తెహసీన్ పూనావల్ల, తుషార్ గాంధీతో సహా ఇతరులు దాఖలు చేసిన పిటిషన్ల బ్యాచ్‌లో 2018 జూలై 17 నాటి తీర్పుకు అనుగుణంగా వివరణాత్మక నివేదికను దాఖలు చేయడానికి కేంద్ర, రాష్ట్రాల నుంచి ప్రతిస్పందనలను సుప్రీంకోర్టు కోరింది. మూకదాడులు, హత్యలకు ...11లో

పోరాటాలకు సిద్ధం కావాలి

ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.సింధూ పిలుపు

- దేశవ్యాప్తంగా విజయవంతమైన 'బ్లాక్ దే'
- భారీ వర్షాలను సైతం లెక్క చేయకుండా ఆందోళనల్లో అంగన్‌వాడీలు





న్యూఢిల్లీ : అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.సింధూ పిలుపునిచ్చారు. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ (ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్) ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్తంగా 'బ్లాక్ దే' జరిగింది. వేలాది మంది అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు దేశంలోని చాలా ప్రాంతాల్లో వర్షాలను సైతం లెక్కచేయకుండా భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కేరళ, అసోం, బీహార్, ఛత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమాచల్ ప్రదేశ్, జమ్ము కాశ్మీర్, జార్ఖండ్, కర్నాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, ...2లో



మా ఆవేదన తీర్చండి...

దంపతులను కలపండి : సీఎం కేసీఆర్‌కు స్పౌజ్ టీచర్ల విజ్ఞప్తి

- ఇందిరాపార్క్ వద్ద బోనాలతో మహిళా ఉపాధ్యాయుల ప్రదర్శన
- పలు ఉపాధ్యాయ సంఘాల నాయకుల మద్దతు
- 19 జిల్లాలకు ఒక న్యాయం, 13 జిల్లాలకు ఇంకో న్యాయమా? : చావ రవి
- ప్రభుత్వంపై ఆర్థిక భారం పడదు : ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి

వివరాలు 11లో..

మొన్న చంద్రశేఖర్...నిన్న రవీంద్రనాయక్...

నేడు ఎవరో..?

బీజేపీ అసంతృప్త నేతల ధిక్కార స్వరం

- ఫలించని బుజ్జగింపుల పర్వం
- వరుసగా మీడియాకెక్కుతున్న నేతలు..అధిష్టానంపై మండిపాటు

నిన్న మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్...సోమవారం నాడు మాజీ ఎంపీ రవీంద్రనాయక్ ఇలా రోజుకో బీజేపీ నేత మీడియాకెక్కి తమ అసంతృప్తిని బాహాటంగానే వినిపిస్తున్నారు. దీంతో ఏంచేయాలో పాలుపోక ముఖ్యనేతలు తలలు పట్టుకుంటున్నారు. వివేక్, రవీందర్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, రఘునందన్‌రావు, యెన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ఇలా మిగతా నేతల్లో రేపు ఎవరు బ్లాస్ట్ అవుతారో? అని నానా హైరానా పడుతున్నారు.



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్ బుజ్జగింపుల పర్వం మొదలు పెట్టారు. రాజేందర్ నేరుగా అసంతృప్త నేతల ఇండ్లకు వెళ్లి వారితో భేటీ అవుతున్నారు. వారికి నచ్చజెప్పేందుకు శతవిధాల ప్రయత్నిస్తున్నారు. అయినా, ధిక్కార స్వరం ఆగట్లేదు. రోజుకో ముఖ్యనేత మీడియా ముందుకొచ్చి బీజేపీ జాతీయ నాయకత్వాన్ని కడిగిపారేస్తూ నాయకత్వానికి కునుకు లేకుండా చేస్తున్నారు. అసంతృప్తి జ్వాలను చల్లార్చేందుకు అధ్యక్షున్ని మార్చినా..కొత్త పదవులు సృష్టించినా ...2లో

నవతెలంగాణ

మొన్న చంద్రశేఖర్...నిన్న రవీంద్రనాయక్...నేడు ఎవరో..?

(మొదటిపేజీ తరువాయి)

ఫలితం లేకపోగా మరింత ఎగిసిపడుతున్నది. మొన్నటి వరకూ జరిగిన అంతర్గత పోరును బజారుకీడుస్తున్నారు. అధిష్టానంపైనే ధిక్కార స్వర బాణాలను ఎక్కుపెడుతున్నారు. ఈటలపై రివర్స్ అయ్యి పార్టీలో ఇమడలేమని ఈటలకు బాహాటంగానే చెబుతున్నారు. మీడియాకెక్కుతున్నారు. ఆ పార్టీలో 10 నుంచి 15 మంది ముఖ్య నేతలు తీవ్ర అసంతృప్తిలో ఉండగా...మొదట బ్లాస్ట్ అయింది మాత్రం మాజీ మంత్రి చంద్రశేఖరే. ఆయనైతే ఒకడుగు ముందుకేసి రాష్ట్రంలో దూకుడు పనిచేస్తున్న బండి సంజయ్‌ని ఎందుకు మార్చారు? పార్టీలో పనిచేసేటోళ్లకు కాకుండా పైరవీలు చేసేటోళ్లకు పదవులు కట్టబెడతారా? రాష్ట్రంలో పార్టీ గ్రాఫ్‌నంతా కిందపడేశారు..మిమ్ముల్ని నమ్మేదెట్లా? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ముఖ్యనేతలంతా వేరే పార్టీ పెడదామనీ, లేకపోతే వేరే పార్టీలోకి వెళ్దామని ఒత్తిడి తెస్తున్నారని బాహాటంగానే చెబుతున్నారు. త్వరలో బీజేపీ నుంచి భారీస్థాయిలో వలసలు ఉంటాయని బాంబు పేల్చేశారు. తాజాగా సోమవారం ప్రెస్‌మీట్ పెట్టిన మాజీ ఎంపీ రవీంద్రనాయక్ అధిష్టానానికి డెడ్‌లైన్ విధించారు. ప్రధాని మోడీనే అవినీతి జరిగిందంటున్నడు కదా? కేసీఆర్ పై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదు? ఆగస్టు 15లోగా కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాలి? అని అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేశారు. పీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డిని తెగపొగిడేశారు. ఆయన ప్రెస్‌మీట్ జరుగుతుండగానే ఈటల రాజేందర్ ఫోన్ చేసి మరీ బ్లాస్ట్ కావొద్దని వేడుకోవడంతో ఆయన అక్కడ నుంచి వెళ్లిపోయారు. ఆగస్టు 15 తర్వాత ఏం చేస్తారని మీడియా ప్రతినిధులు అడుగుతున్నా 'ఈటల రాజేందర్ వచ్చిండు. ఆయన పిలుస్తున్నడు' అని చెప్పి వెళ్లిపోయాడు. ఇలా నేతలు మీడియాకెక్కి బీజేపీ జాతీయ నాయకత్వాన్ని బజారుకీడుస్తుండటంతో ముఖ్యనేతలు తలలు పట్టుకుంటున్నారు. రేపు ఎవరు బ్లాస్ట్ అవుతారో అని తెగ భయపడిపోతున్నారు. ఈటల బుజ్జగింపుల పర్వం కొనసాగిస్తున్నా...అసంతృప్తి నేతలంతా బీజేపీని వీడేందుకు సిద్ధమైపోయినట్టు తాజాగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే అర్థమైపోతున్నది.

పోరాటాలకు సిద్ధం కావాలి

(మొదటిపేజీ తరువాయి)

పంజాబ్, పాండిచ్చేరి, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్‌లో ఈ బ్లాక్ డే ఆందోళనలు భారీగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి ఆర్.సింధూ మాట్లాడుతూ వివిధ రాష్ట్రాల్లో పోరాటాన్ని అణచివేయడానికి ప్రభుత్వాలు వివిధ శాఖల కార్యక్రమాలతో ముందుకు వచ్చాయని, అసోం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ఆందోళనకు అనుమతిని నిరాకరిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీ చేశాయని తెలిపారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు మోడీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి నిరసనగా డిమాండ్‌ల దినోత్సవాన్ని బ్లాక్‌డేగా పాటించాలని నిర్ణయించామనీ, మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే 2015లో ఒకసారి, 2021లో రెండోసారి కోవిడ్ మహమ్మారి సమయంలో ఐసీడీఎస్ బడ్జెట్‌ను రెండుసార్లు భారీగా తగ్గించిందని విమర్శించారు. దేశంలోని అనేక ప్రాంతాల్లో దాదాపు రెండేళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలకు గదుల అద్దె చెల్లించడం లేదనీ, బడ్జెట్‌లో కోత కారణంగా, దేశంలోని అనేక ప్రాంతాల్లో పౌష్టికాహారం సరఫరా చేయటం లేదని విమర్శించారు. నెలల తరబడి ఆహారం కోసం బిల్లులు చెల్లించటం లేదని, 2018 నుంచి ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ, అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల వేతనాన్ని మోడీ ప్రభుత్వం పెంచలేదని విమర్శించారు. అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్‌లకు గ్రాట్యుటీ చట్టాన్ని అమలు చేయాలంటూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసి ఏడాది అవుతున్నప్పటికీ, కేంద్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదని ఆరోపించారు. సకాలంలో వేతన సవరణ, సామాజిక భద్రత, పెన్షన్ ప్రవేశపెట్టాలంటూ సుప్రీంకోర్టు, వివిధ పార్లమెంటరీ కమిటీలు, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌లు చేసిన ఆదేశాలను మోడీ ప్రభుత్వం నిరంతరం నిర్లక్ష్యం చేస్తుందన్నారు. అంతేకాకుండా, పౌష్టికాహారం, ఇతర సేవలను ప్రజలకు అందించే బాధ్యత నుంచి ప్రభుత్వం వైదొలగుతోందని, బదులుగా వేదాంత వంటి కార్పొరేట్‌లకు, అక్షయపాత్ర వంటి కార్పొరేట్ ఎన్‌జీఓఎస్‌లకు ఐసీడీఎస్‌ను అప్పగించిందని విమర్శించారు. దేశంలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు, పోరాటాన్ని విజయవంతం చేసిన వందలాది యూనియన్ కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఐసీడీఎస్‌ను కూల్చివేసే ప్రయత్నాల్లో వున్న కేంద్రంలోని కార్పొరేట్, మతపరమైన ప్రభుత్వాన్ని ఓడించాలనే నిర్ణయాన్ని ఏఐఎఫ్ఏడబ్ల్యూహెచ్ పునరుద్ఘాటిస్తుందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పోరాటాలకు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

మణిపూర్‌లో బీజేపీ విభజన రాజకీయాలు ఆపాలి

- ఏఐవైఎఫ్ జాతీయప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్
- హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద నిరసన, ర్యాలీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

రెండు నెలలుగా మణిపూర్‌లో జరుగుతున్న హింస, అల్లర్లపై ప్రధాని మోడీ మౌనం వీడి.. శాంతిని నెలకొల్పేందుకు విభజన రాజకీయాలను తుది ముట్టించాలని ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి తిరుమలై రామన్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం హిమాయత్‌నగర్‌లోని ఎస్.సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి 'వై' జంక్షన్ వరకు ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా తిరుమలై రామన్ మాట్లాడుతూ.. ప్రధాని మోడీ ఎన్నికల తీర్థయాత్ర కోసం ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, మధ్యప్రదేశ్‌కు వెళ్తున్నారే తప్ప ఘర్షణలు జరుగుతున్న మణిపూర్‌లో మాత్రం పర్యటించకపోవడం సిగ్గు చేటన్నారు. మణిపూర్‌లో శాంతిని నెలకొల్పడంలో కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం విఫలమయ్యాయని విమర్శించారు. హోంమంత్రి అమిత్ షా, మణిపూర్ ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్రంలో శాంతిని నెలకొల్పేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వలి ఉల్లా ఖాద్రీ మాట్లాడుతూ.. కేంద్రం, రాష్ట్రాలలో బీజేపీ ప్రభుత్వాలు 'విచ్ఛిన్నకర రాజకీయాలు' చేస్తున్నందు వల్లే మణిపూర్ మంటల్లో చిక్కుకుందని ఆవేదన వ్యక్తం చేశారు.



మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడుదాం

- ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుభాషిణి అలీ

నవతెలంగాణ-వరంగల్

మహిళల హక్కులు సాధన కోసం నిరంతరం పోరాడుదామని ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు సుభాషిణి అలీ అన్నారు. వరంగల్ జిల్లా పోచమ్మ మైదాన్‌లోని అబ్బుస్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఐద్వా వరంగల్ జిల్లా కార్యదర్శి నలిగంటి రత్నమాల అధ్యక్షతన నిర్వహించిన సభలో ఆమె పాల్గొని మాట్లాడారు. తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, విముక్తి కోసం పోరాడిన చరిత్ర మహిళలకు ఉందని గుర్తు చేశారు. మహిళలు పోరాడి సాధించుకున్న తెలంగాణలో వారికి నీడ కరువైందని, దాని కోసం భూ పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు. గుడిసె వాసులకు పక్కా ఇండ్లు, పట్టాలు వచ్చేవరకు ఎర్రజెండా అండగా ఉంటుందని స్పష్టంచేశారు. ప్రధానమంత్రి మోడీ ఓట్ల కోసం తప్ప.. ప్రజల సంక్షేమం గురించి ఏనాడు పట్టించుకో లేదని విమర్శించారు. రేషన్ బియ్యం ఐదు కేజీలకు బదులు ప్రజలకు నాలుగున్నర కిలోలు మాత్రమే వస్తున్నాయని, బియ్యం వండుకుంటే అన్నం ఉడకటం లేదని, కనీసం మేకలు కూడా తినట్లేదని తెలిపారు. ఉచిత వంట గ్యాస్ ఇచ్చి సిలిండర్ ధరను రూ.1200కు పెంచారని అన్నారు. దాంతో మహిళలు వంట చెరుకుపై ఆధారపడాల్సి వస్తోందన్నారు. మహిళలకు సమాన హక్కుల కోసం కొత్త చట్టం తెస్తున్నామని మోడీ చెబుతున్నవన్నీ అబద్ధాలేనని ఆరోపించారు. రెజ్లర్లపై బీజేపీ నాయకుడు అఘాయిత్యానికి పాల్పడితే మోడీ ఇప్పటివరకు ఏమీ మాట్లాడలేదని, కోర్టు వారంట్ ఇచ్చినా నిందితులను అరెస్టు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కానీ ధర్నా చేసిన మహిళలు, బాధితులను మాత్రం అరెస్టు చేశారన్నారు. ఉత్తరప్రదేశ్‌లో ఓ మహిళపై లైంగికదాడి జరిగిందని చెప్పినప్పటికీ అది అబద్ధమని అక్కడి సీఎం చెప్పడం సిగ్గుచేటన్నారు. లైంగికదాడికి పాల్పడిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన పోలీసు అధికారులు.. వారిని కొన్ని రోజులు జైల్లో పెట్టి విడుదల చేశారని, అనంతరం వారికి సన్మానాలు, సత్కారాలు చేశారని వాపోయారు. ఇంతటి దౌర్భాగ్య పాలన దేశంలో నడుస్తుందని తెలిపారు. కొత్త చట్టాలు అవసరం లేదని, పాత చట్టాలనే బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణకు రావలసిన నిధులన్నీ గుజరాత్‌లో పెడుతున్నారని అన్నారు. యువతకు ఉద్యోగాల కల్పనలో నిర్లక్ష్యం చేస్తున్నారని అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గుళ్ళు కట్టిస్తున్నారని, ప్రధానమంత్రి రామ మందిరం కట్టించామని చెబుతున్నారే తప్ప పేదలకు ఇండ్లు మాత్రం కట్టించడం లేదని విమర్శించారు. ఎవరైనా పేదల గుడిసెలు తీసేయాలని వస్తే కర్రలతో తరిమికొట్టాలని అన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు రంగరాజ విజయ, టాగుర్ భవాని, రామన్నపేట, రంగశాయిపేట ఏరియాల కార్యదర్శులు నల్ల రేణుక, మాలోతు ప్రత్యూష, అధ్యక్షులు ఎం జ్యోతి, కరిమబాద్ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు అప్పాజీ వాణి, మేకల సరిత, కాశీబుగ్గ ఏరియా అధ్యక్ష కార్యదర్శులు ధార సునీత, రాయి సుభద్ర, తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతన జీవోలను సవరించాలి

- కార్మిక కోడ్లు రద్దు చేయాలి
- 14న కలెక్టరేట్ల ధర్నాను జయప్రదం చేయండి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, భూపాల్



నవ తెలంగాణ- గజ్వేల్

కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు నిర్ణయించాలని, కనీస వేతనాల జీవోలను సవరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు జె.మల్లికార్జున్, భూపాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు సవరించాలని రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జీపుజాత సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలం కర్కపట్ల, గజ్వేల్ ములుగులో సోమవారం పర్యటించింది. పరిశ్రమల్లో సర్వే నిర్వహించి కార్మికులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం గజ్వేల్ పట్టణ పరిధిలోని రానే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ గేటు ఎదుట జరిగిన సభలో వారు మాట్లాడారు. కూరగాయలు, నిత్యవసర సరుకులు, పెట్రోల్, డీజిల్, గ్యాస్ సిలిండర్ల ధరలు అనేక రేట్లు పెరిగాయన్నారు. కానీ వాటికి అనుగుణంగా కార్మికుల వేతనాలు మాత్రం పెరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 2006లో వచ్చిన జీవోలను రాష్ట్రంలో అమలు చేస్తుండటంతో కార్మికులందరూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. అనేక పరిశ్రమల్లో కార్మిక చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని, కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ బోనస్, గ్రాడ్యుటీ లాంటివి ఉండటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పర్మినెంట్ కార్మికుల సంఖ్య తగ్గిపోయిందని, కాంట్రాక్ట్ కార్మికులే మొత్తం ఉత్పత్తిలో ఉంటున్నారన్నారు. అనేక పరిశ్రమల్లో ఉత్తర భారతదేశం నుంచి వలస వచ్చిన వారు కార్మికులుగా పనిచేస్తున్నారని, వారికి 1979 వలస కార్మిక చట్టాన్ని ఏ పరిశ్రమలోనూ అమలు చేయడం లేదన్నారు. 12 గంటలు పనిచేసినా రూ.10వేలు మాత్రమే ఇస్తూ వెట్టి చాకిరి చేయించుకుంటున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నియోజకవర్గం గజ్వేల్‌లో కూడా ప్రస్తుతం ఉన్న చట్టాలు అమలుకు నోచుకోవడం లేదన్నారు.

కేరళ డీవైఎఫ్ఐకి ప్రపంచ ఖ్యాతి

కేరళ భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ప్రపంచ ఖ్యాతిని సొంతం చేసుకుంది. కేరళలోని ఆస్పత్రుల్లో రోగులు, బంధువులకు డీవైఎఫ్ఐ ఆహార పొట్లాల పంపిణీ కార్యక్రమం 'హృదయపూర్వం' ప్రాజెక్టు ఆరు కోట్ల మందికి చేరువైంది. ఇపుడిది అంతర్జాతీయ మీడియాలో ప్రధాన శీర్షికగా నిలుస్తోంది.



న్యూఢిల్లీ : 2017లో కేవలం 300 పొట్లాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో ఇప్పటి వరకు రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రుల్లో 6,08,42,970 మందికి ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. మెడికల్ కాలేజీలతో సహా వివిధ జిల్లాల్లోని 59 ఆస్పత్రుల రోగులకు, కుటుంబ సభ్యులకు (అటెండర్లు) ప్రేమ ప్యాకేజీ (పేకడ్ ఆహార పొట్లాలు)లు అందజేశారు. ప్రతి ఇంటి వద్ద మహిళలు వండిన వంటను సేకరించి, వాటిని ప్యాకింగ్ చేసి, ఆస్పత్రుల్లోఉన్న రోగులు, వారి సహాయకులైన కుటుంబసభ్యులకు అందజేస్తున్నారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వికె సనోజ్ మాట్లాడుతూ.. మరిన్ని ఆస్పత్రులకు ఈ కార్యక్రమాన్ని వర్తింపజేస్తామనీ, అన్నదానంతో పాటు రక్తదానాన్ని ప్రోత్సహిస్తామన్నారు. వరదలు, కోవిడ్ మహమ్మారి వంటి ఏ సంక్షోభంలోనైనా డీవైఎఫ్ఐ కార్యకర్తలు అలసిపోకుండా రోజంతా పని పూర్తి చేయగలిగారు. రోజుకో ప్రాంతీయ కమిటీ ఆహార పొట్లాల పంపిణీ చేసే బాధ్యత తీసుకుంటుంది. ఆకలితో అలమటిస్తున్న వారికి భోజనం పెట్టేందుకు డీవైఎఫ్ఐ చేస్తున్న కృషికి గృహిణుల సహకారం ఎంతో ఉందని ఆయన అన్నారు. వాయనాడ్, కోజికోడ్, పాలక్కడ్‌లోని అనేక ఆస్పత్రులకు ప్రతి రోజూ మూడు పూటల ఆహారం అందిస్తున్నామని తెలిపారు. డీవైఎఫ్ఐ చేపట్టిన'హృదయపూర్వం' కార్యక్రమం దేశంలోని మరే యువజన సంఘం కూడా చేయలేనిదని జాతీయ, అంతర్జాతీయ మీడియా పేర్కొంది. ప్రపంచంలోని అత్యంత ప్రసిద్ధ, విశ్వసనీయ మాధ్యమాల్లో ఒకటైన బ్రిటన్‌కు చెందిన అంతర్జాతీయ పత్రిక 'ది గార్డియన్' ఈ ప్రాజెక్టును ప్రశంసిస్తూ ఒక ప్రత్యేక కథనాన్ని ప్రచురించింది. ఆస్పత్రి రోగులు, సందర్శకుల్లో ఆకలితో ఉన్నవారికి ఆహారం అందజేయడం 'సమానత్వాన్ని' రూపొందించడంలో సహాయపడుతుందని పేర్కొంది. 2017 నుంచి ప్రతిరోజు 40,000 మందికి మధ్యాహ్న భోజనం అందించినట్టు గార్డియన్ తన నివేదికలో వివరించింది. కార్యక్రమం కేవలం మధ్యాహ్న భోజనం మాత్రమే కాకుండా, కుల, మతాలకు అతీతంగా మానవత్వానికి సంకేతమని గార్డియన్ పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్య ఆరోగ్యం, పాలియేటివ్ కేర్, బ్రాడ్‌బ్యాండ్ సౌకర్యంతో సహా కేరళ మోడల్ లక్షణాల్లో ఒకటిగా 'హృదయపూర్వం' ప్రాజెక్ట్‌ను గార్డియన్ వివరించింది.

డీవైఎఫ్ఐకి గర్వకారణం : ఎంబి రాజేష్,కేరళ మంత్రి



గార్డియన్ కథనాన్ని సోషల్ మీడియాలో షేర్ చేస్తూ డీవైఎఫ్ఐ మాజీ జాతీయ అధ్యక్షుడు, కేరళ స్థానిక స్వపరిపాలన, ఎక్సైజ్ రాష్ట్ర మంత్రి ఎంబి రాజేష్ 'ఇది రియల్ కేరళ స్టోరీ' అని పేర్కొన్నారు. 'ఫేక్ కేరళ స్టోరీని ప్రచారం చేసేవారు తెలుసుకోవాలని చెప్పారు. ఆస్పత్రిలో రోగులకు, అటెండెంట్లకు ఆహార పొట్లాలు అందించే కార్యక్రమం 'హృదయపూర్వం' పై ప్రచురించిన ఆ పత్రిక కథనం డీవైఎఫ్ఐకి అంతర్జాతీయ గుర్తింపును తెచ్చిపెట్టిందని అన్నారు. గార్డియన్ వంటి వార్తాపత్రికలో ఈ వివరణాత్మక కథనం డీవైఎఫ్ఐకి గర్వకారణమని అన్నారు. కేరళలోని మీడియా చూడడానికి, అభినందించడానికి ఎప్పుడూ సిద్ధంగా లేని గొప్ప కార్యక్రమాన్ని లండన్ నుంచి ప్రచురితమైన గార్డియన్ చూసిందని పేర్కొన్నారు. ఇంతటి సాహసోపేతమైన కృషి చేసిన డీవైఎఫ్ఐ కార్యకర్తలందరికీ అభినందనలు తెలిపారు.

సమస్యలపై కదం తొక్కిన రైతాంగం

- భారీ ప్రదర్శన, ధర్నా, తహసీల్దార్‌కు వినతి
- సమస్యలు పరిష్కరించకుంటే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు : సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్



నవతెలంగాణ-నేలకొండపల్లి

ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఇచ్చిన హామీలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం తెలంగాణ రైతు సంఘం, సీపీఐ(ఎం) మండల కమిటీ ఆధ్వర్యంలో రైతాంగం కదం తొక్కింది. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల సీపీఐ(ఎం) కార్యాలయం రావెళ్ళ సత్యనారాయణ భవనం నుంచి భారీ ప్రదర్శనగా బయలుదేరి పొట్టి శ్రీరాములు సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినదించారు. అనంతరం తెలంగాణ రైతు సంఘం జిల్లా నాయకులు రచ్చ నరసింహారావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ మాట్లాడుతూ.. రైతాంగ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే రానున్న కాలంలో రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఎన్నికలకు ముందు హామీ ఇచ్చిన లక్ష రూపాయల రైతు రుణమాఫీని.. ఐదేండ్లు గడుస్తున్నా ప్రభుత్వం ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమన్నారు. అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇస్తానని చెప్పి నెలలు గడుస్తున్నా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిన ధాన్యానికి నేటికీ బిల్లులు చెల్లించలేదని, దాంతో రైతులకు పెట్టుబడులకు డబ్బులు లేక రైతులు అల్లాడుతున్నారని తెలిపారు. డోర్నకల్ నుంచి ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మీదుగా మిర్యాలగూడ వరకు చేపట్టిన రైల్వే లైన్ అలైన్‌మెంట్ వల్ల రైతాంగానికి తీరని నష్టం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పార్టీ జిల్లా నాయకులు వై విక్రమ్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు, పార్టీ మండల కార్యదర్శి కె.వి రామిరెడ్డి, నాయకులు ఏటుకూరి రామారావు, భూక్య కృష్ణ, దుగ్గి వెంకటేశ్వర్లు, మందడపు మురళీకృష్ణ, కట్టెకోల వెంకన్న, భూక్య జ్యోతి, నూతన రైల్వే లైన్ బాధిత రైతులు, పాల్గొన్నారు.

సింగారం కన్న బంగారు బిడ్డ అంతయ్య

పెత్తందార్ల అరాచకాలను ప్రశ్నించినందుకే పొట్టనబెట్టుకున్నారు

- స్థూపావిష్కరణ సభలో రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు
- ప్రమాదకారిగా మారిన బీజేపీని ఓడించాలని పిలుపు



నవ తెలంగాణ- మహబూబ్‌నగర్ ప్రాంతీయ ప్రతినిధి

"భవిష్యత్తు తరాలకు నాందివాచకంగా సింగారం గొప్ప ఉద్యమ నేపథ్యాన్ని కలిగి ఉన్నది.. ఈ గ్రామంలో పుట్టిన సాటు అంతయ్య బంగారంలాంటి ఆణిముత్యం. అంతయ్య పేద ప్రజల కోసం ఉద్యమాలు నడిపారు. భూస్వాములు, పెత్తందారుల అరాచకాలను ప్రశ్నించినందుకే ఆయనపై మావోయిస్టులు కాల్పులు జరిపి పొట్టన పెట్టుకున్నారు.." అని సీపీఐ(ఎం) ఆంధ్రప్రదేశ్ నాయకులు, రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు అన్నారు. అంతయ్య 31వ వర్ధంతి నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండల పరిధిలోని సింగారం గ్రామంలో పునర్నిర్మాణం చేసిన ఆయన స్థూపాన్నిసోమవారం మధు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడారు.

ఈ ప్రాంతంలో నక్సలైట్లు పొట్టన పెట్టుకున్న అమరుల త్యాగాలు వెలకట్టలేనివని చెప్పారు. మన ముందు అంతయ్య, రహీమ్, నరసింహ, రామచంద్రారెడ్డి లేకపోయినప్పటికీ వారి ఆశయాల కోసం పునరంకితం కావాలని పిలుపునిచ్చారు. అయినోలులో రామచంద్రారెడ్డి, బొమ్మనపల్లిలో రహీం, ఉపాధ్యాయులు కంరుద్దీన్, సుధాకర్ రెడ్డి, చంద్రమౌళి సేవలు మరువలేనివని గుర్తు చేశారు. ప్రజల కోసం, ప్రజా హక్కుల కోసం పనిచేసిన అంతయ్య, రహీం లాంటి ఉద్యమకారులను చంపడానికి భూస్వాములు మావోయిస్టులతో కుమ్మక్కయ్యారని చెప్పారు. మావోయిస్టుల నుంచి ప్రమాదాన్ని గుర్తించి 70 మంది కార్యకర్తలు కాపలాగా ఉన్నప్పటికీ రహీం ఇంటిపై బాంబులు వేసి, ఆయన్ని తుపాకి తూటాలకు బలి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అంతయ్యను గ్రామంలో రాత్రి వేళ పట్టుకొని చేతులు కట్టేసి గోడకు నిలబెట్టి అత్యంత దారుణంగా కాల్చి చంపారని, అది పిరికిపందల చర్య అన్నారు. పేదల పక్షాన పోరాటాలు చేసిన ఉద్యమకారులను చంపి మావోయిస్టులు ఏమి సాధించారని ప్రశ్నించారు. సీపీఐ(ఎం) సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి ఇంటి మీద సైతం దాడులకు పాల్పడ్డారన్నారు. ఎంతమంది ఉద్యమకారులను చంపినా మనోధైర్యంతో ఉద్యమాలు నడిపిన చరిత్ర ఈ సింగారం గడ్డకే దక్కిందని అన్నారు.



రాజకీయాలను వ్యాపారంగా మార్చిన పార్టీలు

ప్రస్తుతం ఎమ్మెల్యేలు, ఎంపీలు ఇసుక గుట్టలు ధ్వంసం చేస్తూ వేల కోట్ల రూపాయలు సంపాదిస్తున్నారని విమర్శించారు. తద్వారా వచ్చిన డబ్బుతో ప్రజా ప్రతినిధులను సరుకులా కొనుగోలు చేసి ప్రభుత్వాలను పడగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్, టీఆర్ఎస్, బీజేపీ రాజకీయాలను వ్యాపారంగా మార్చాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో రైతుబంధు అవసరం లేదన్న ప్రధాని మోడీ కర్నాటక ఎన్నికల సందర్భంగా ప్రతి ఇంటికీ పాలను మొదలుకొని అనేక సరుకులను ఉచితంగా ఇస్తామని చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. చంటి పిల్లలు తాగే పాలు మొదలుకొని అనేక వస్తువులపై జీఎస్టీ విధించి సామాన్యుల నడ్డి విరిచిందన్నారు. జీఎస్టీ విషయంలోనూ సీపీఐ(ఎం) వ్యతిరేకించిందని చెప్పారు. దేశ రాజకీయాలలో అత్యంత ప్రమాధికారిగా మారిన బీజేపీని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చెరుపల్లి సీతారాములు, జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు కిల్లే గోపాల్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటా రమేష్, జిల్లా కార్యదర్శులు ఎండి జబ్బార్, వర్ధం పర్వతాలు, ఏ వెంకటస్వామి, కార్యదర్శివర్గ సభ్యులు దేశ నాయక్, కందికొండ గీత, భాస్కర్ రెడ్డి, నాగిరెడ్డి, గిరిజన సంఘం నాయకులు ధర్మానాయక్, శంకర్ నాయక్, నిర్మల, బక్కయ్య, మండల కార్యదర్శి ఎస్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలి

- అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి : అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త ధర్నాలు





నవతెలంగాణ-విలేకరులు

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, వారిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల పలు సమస్యలపై అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆలిండియా పిలుపుమేరకు సోమవారం రాష్ట్రవ్యాప్తంగా ధర్నాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ధర్నా చౌక్ నుంచి కొత్త కలెక్టరేట్ వరకు నల్ల చీరెలతో పది కిలోమీటర్ల మేర అంగన్‌వాడీలు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిదేండ్లు అవుతున్నా అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలను ఏ ఒక్కటీ పరిష్కారం చేయలేదన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు అనేక రెట్లు పెరుగుతున్నా.. అందుకనుగుణంగా కేంద్ర ప్రభుత్వం అంగన్వాడీల వేతనాలు పెంచటం లేదని విమర్శించారు. 2018లో టీచర్లకు రూ.1,500, హెల్పర్లకు రూ.750, మినీ వర్కర్లకు రూ.1,250 కేంద్ర ప్రభుత్వం పెంచిందని గుర్తు చేశారు. కానీ కేంద్రం వాటా తన బడ్జెట్‌ను 40 శాతం తగ్గించడం వల్ల రాష్ట్ర ప్రభుత్వాలు వీటిని చెల్లించడం సాధ్యం కాదని చెబుతున్నాయన్నాయన్నారు. బడ్జెట్ తగ్గింపుతో వేతనాలే కాక, మొత్తం ఐసీడీఎస్ సేవలకు అంతరాయం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వం ఆన్‌లైన్‌లో అనేక యాప్‌లు పెట్టి అంగన్వాడీలపై పని భారాన్ని పెంచుతున్నదని విమర్శించారు. ఆసరా, కళ్యాణ లక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అంగన్వాడీ ఉద్యోగులు అనర్హులని ప్రభుత్వం చెబుతున్నదని, ఇటు కనీస వేతనం లేక, అటు సంక్షేమ పథకాలు అమలు కాక ఉద్యోగులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ తహసీల్దార్ కార్యాలయం నుంచి పది కిలోమీటర్ల పాదయాత్రతో భారీ ప్రదర్శనగా కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న అంగన్‌వాడీలు.. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 5 గంటల వరకు కలెక్టరేట్ ఎదుట మహాధర్నా నిర్వహించారు. వారి నినాదాలతో కలెక్టరేట్ మారుమోగిపోయింది. పలు దఫాలుగా జరిగిన ధర్నాల్లో జిల్లా డీడబ్ల్యూడీఆర్‌ఓ సీఐటీయూ నాయకులతో చర్చలు జరిపినప్పటికీ సమస్యలు పరిష్కారం కాలేదని, అందుకే నేరుగా కలెక్టర్ తోటే మాట్లాడాలని అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పట్టుపట్టారు. అనంతరం డీఆర్‌ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏజే రమేష్ మాట్లాడుతూ.. ఐసీడీఎస్‌ను ప్రభుత్వ శాఖగా గుర్తించి, కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంగారెడ్డి జిల్లాలో వేలాది మంది అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు నల్లచీరలు ధరించి.. స్థానిక ఐబీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు మండుటెండలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఐసీడీఎస్ పీడీ, డీఆర్‌ఓకు వినతి పత్రాలు ఇచ్చారు. బీఎల్‌ఓ డ్యూటీల్ని రద్దు చేయాలని అధికారుల్ని కోరగా పరిశీలిస్తామని చెప్పారు. సిద్దిపేట జిల్లాలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. అనంతరం ఏవోకు వినతిపత్రం ఇచ్చారు. మెదక్ జిల్లాలో వందలాది మంది అంగన్వాడీలు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ఎదుట వందలాది మంది అంగన్వాడీలు నల్ల చీరలతో నిరసన వ్యక్తం చేస్తూ మహా ధర్నా నిర్వహించారు. అనంతరం జిల్లా కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, జిల్లా సంక్షేమ అధికారి కృష్ణవేణికు వినతి పత్రాలు అందజేశారు.నిర్మల్ జిల్లా కేంద్రంలో డిగ్రీ కళాశాల నుంచి సమీకృత కలెక్టర్ భవనం వరకు అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నల్లదుస్తులు ధరించి, రైల్వే స్టేషన్ నుంచి పంజాబ్ చౌక్, కలెక్టర్ చౌక్ మీదుగా కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నల్ల చీరలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్‌కు చేరుకుని ఆర్డీఓ రాజేశ్వర్‌కు వినతి పత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో అంగన్‌వాడీలు నల్ల చీరలతో నిరసన ర్యాలీ నిర్వహించారు. నస్పూర్‌లోని కలెక్టరేట్‌కు చేరుకుని అదనపు కలెక్టర్ రాహుల్‌కు వినతి పత్రం అందజేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో కలెక్టరేట్ ఎదుట ధర్నా(బ్లాక్‌డే) నిర్వహించారు.

కల్లుగీత కార్మికులకిచ్చిన హామీలు అమలు చేయాలి

- బీసీ కుల వృత్తుల ఆర్థిక సహాయానికి గడువు పెంచాలి : కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రమణ, వెంకటేశ్వర్లు
- కలెక్టరేట్ల ఎదుట కేజీకేఎస్ ధర్నా



నవతెలంగాణ - విలేకరులు

గౌడ ఆత్మీయ సమ్మేళనంలో కల్లుగీత కార్మికులకు మంత్రి కేటీఆర్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (టీకేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎంవీ రమణ, బెల్లంకొండ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో ప్రదర్శనలు, కలెక్టరేట్ల ఎదుట ధర్నా నిర్వహించారు. మహబూబాబాద్ జిల్లాలో కలెక్టరేట్ వరకు భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంవీ రమణ మాట్లాడుతూ.. రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలు నేటికి కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయన్నారు. ఏటా రాష్ట్రంలో సుమారు 550 మందికి పైగా ప్రమాదానికి గురవుతుండగా, ఈ ఏడాది ఇప్పటికే 180 మంది చనిపోయారని తెలిపారు. కల్లుగీత పారిశ్రామిక సహకార ఆర్థిక సంస్థ గీత కార్మికులకు రుణాలు ఇవ్వడం, నీరా, తాటి ఉత్పత్తుల శిక్షణా కేంద్రం ఏర్పాటు, నందనంలో 5 ఎకరాల భూమి కొనుగోలు తదితర కార్యక్రమాలు చేపట్టగా, ప్రభుత్వం వాటికి బడ్జెట్ కేటాయించకపోవడంతో ప్రస్తుతం నిర్వీర్యం అయ్యాయన్నారు. బీసీ కుల వృత్తులకు రూ.లక్ష ఆర్థిక సహాయం గడువు 15 రోజులు మాత్రమే ఇవ్వడంతో కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందక 13 వేల మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని, కాబట్టి అందరికీ అందుబాటులో ఉండేలా మరొక 15రోజులు పొడిగించాలని కోరారు. ప్రధానంగా భూమి, కల్లుకు మార్కెట్, తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రాను కలిసి వినతిపత్రం అందించారు. హన్మకొండ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి వినతిపత్రం సమర్పించారు. ములుగు జిల్లాలో డీఎల్ఆర్ ఫంక్షన్ హాల్ నుంచి కలెక్టరేట్ వరకు భారీ ర్యాలీ చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు మాట్లాడారు. నీరా కేఫ్‌ను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప చేయాలని కోరారు. గీత వృత్తిదారులకు మోపెడ్‌లు, గౌడబంధు పథకం, సొసైటీలకే లిక్కర్ షాపులు ఇచ్చి అన్ని రకాలుగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కల్లుగీత కార్పొరేషన్‌కు 5 వేల కోట్ల రూపాయలు కేటాయించి, తద్వారా నీరా కేంద్రాలు విస్తరింపచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ వెంకట్రావుకు వినతిపత్రం అందజేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించిన ధర్నాలో.. రాష్ట్ర ఉపాధ్యక్షులు బొలగాని జయరాములు మాట్లాడుతూ.. కార్మికులకు రూ.లక్ష ఆర్థిక సహాయం అందించాలని, ఉచితంగా మోటార్‌సైకిళ్లు అందజేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు.

అర్వింద్‌కు వై...ఈటలకు వై ప్లస్ భద్రత

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బీజేపీ ఎమ్మెల్యే, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మెన్ ఈటల రాజేందర్‌కు వై ప్లస్ కేటగిరీ, ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు వై కేటగిరీ భద్రతను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది. ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డి నుంచి తన భర్తకు ప్రాణహాని ఉందంటూ ఈటల రాజేందర్ సతీమణి జమున ప్రెస్‌మీట్ పెట్టి మరీ చెప్పిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. వై ప్లస్ కేటగిరీ భద్రత కింద ఈటల రాజేందర్‌కు బుల్లెట్‌ప్రూఫ్ వాహనం కేటాయించింది. 11 మంది సీఆర్పీఎఫ్ జవాన్లు భద్రత కల్పించనున్నారు. వారు మూడు షిఫ్టుల్లో డ్యూటీ చేస్తారు. అందులో ఇద్దరు నుంచి నలుగురు స్పెషల్ కమాండోలుంటారు. అర్వింద్‌కుమార్‌కు బుల్లెట్ ప్రూఫ్ వాహనంతో కూడిన వై కేటగిరీ భద్రత కింద 8 మంది సీఆర్పీఎఫ్ జవానులు భద్రత కల్పిస్తారు. అందులో ఒకరిద్దరు కమాండోలుంటారు. తనపై పదేపదే దాడులు జరుగుతున్నా భద్రత కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనీ, ఈ నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నదని అర్వింద్ కుమార్ చెప్పారు.

డిప్యూటీ సీఎం కాదు.. సీతక్క సీఎం కూడా కావొచ్చు : రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉప ముఖ్యమంత్రి కాదు సందర్భం వస్తే ఎమ్మెల్యే సీతక్క ముఖ్యమంత్రి అయినా కావొచ్చని టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అమెరికా పర్యటనలో ఉన్న ఆయన.. మీడియాతో మాట్లాడారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రజలు వేరు వేరు కాదని అభివృద్ధిలో అమెరికాతో పోటీ పడేట్టు ఉండాలని సూచించారు. ఎస్టీ అయిన సీతక్కకు ఉప ముఖ్యమంత్రి పదవి వచ్చే అవకాశం ఉందా? అని మీడియా అడిగిన ప్రశ్నకు రేవంత్ రెడ్డి ఈ విధంగా జవాబిచ్చారు.

సమ్మెలోనే జీపీ కార్మికులు

- పలువురి సంఘీభావం



నవతెలంగాణ- విలేకరులు

సమస్యల పరిష్కారం కోసం గ్రామ పంచాయతీ కార్మికులు సమ్మె కొనసాగిస్తున్నారు. తమను పర్మినెంట్ చేయాలని, వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ ఎంపీడీఓ కార్యాలయం వద్ద గ్రామ పంచాయితీ కార్మికుల ఐదోరోజు సమ్మెను ప్రారంభించారు. అనంతరం జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం మానవీయతను ప్రదర్శించి తక్షణమే చర్చలకు పిలిచి సమస్యలను పరిష్కరించాలని కోరారు. నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పంచాయతీ కార్మికులను కించపరుస్తూ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నట్టు చెప్పారు.ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండల కేంద్రంలో జీపీ కార్మికుల దీక్షకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండి రమేష్ సంఘీభావం తెలిపారు. కల్లూరులో కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు మట్ట దయానంద్ సంఘీభావం తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటలో మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు సంఘీభావం తెలిపి, సమ్మెకు మద్దతుగా 10వేలు రూపాయలు అందజేశారు. అశ్వాపురంలో వంటావార్పు నిర్వహించారు. దమ్మపేటలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు వగ్గేల పూజ మద్దతు తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట గ్రామపంచాయతీ సిబ్బంది చేపట్టిన సమ్మె శిబిరాన్ని గ్రామపంచాయతీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ పాలడుగు సుధాకర్ సందర్శించి మాట్లాడారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, పీఆర్సీలో నిర్ణయించిన బేసిక్ ప్రకారం రూ.19 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. రామన్నపేట మండల కేంద్రంలో పంచాయతీ కార్మికుల సమ్మెకు సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్ మద్దతు తెలిపారు. నల్లగొండ జిల్లా కేంద్రంలో జీపీ కార్మికుల సమ్మెకు ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు ప్రభావతి మద్దతు తెలిపారు.

గవర్నర్ల రచ్చకీయం

సంపాదకీయం

దేశంలో రాజ్‌భవన్‌లు వివాదాలకూ, విపరీతాలకూ 'కేంద్ర' బిందువులవుతున్నాయి. రాజ్యాంగ నియమాలు, ప్రజాస్వామ్య విలువలు తుంగలో తొక్కి కేవలం ఏలినవారి మనసెరిగి మసులుకోవడమొక్కటే తమ ఏకైక విధిగా వ్యవహరిస్తోన్న గవర్నర్‌ల తీరు జుగుప్స పుట్టిస్తోంది. తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ 'మా గవర్నర్ రాష్ట్రంలో మత విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. అలాంటి గవర్నర్ మాకొద్దు' అని రాష్ట్రపతికే ఫిర్యాదు

> రాజ్‌భవన్ పాలనాధీశులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడమంటే ప్రజాస్వామ్యాన్ని నిలువునా పాతరేయడమే. బీజేపీయేతర ప్రభుత్వాలున్న ప్రతిరాష్ట్రంలోనూ గవర్నర్లు అక్కడి ప్రజాప్రభుత్వాలకు పక్కలో బల్లెంలా తయారయ్యారు. ఆర్‌ఎన్ రవి ఆ రాజ్యాంగబద్ధ పదవికి అనర్హుడని, ఆయనను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలన్న స్టాలిన్ లేఖపై రాష్ట్రపతి స్పందన ఎలా ఉండనుందో వేచి చూడాలి. కేంద్రం చేతిలో కీలుబొమ్మల్లా మారకుండా గవర్నర్ల వ్యవస్థలో కూడా మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

చేయాల్సి రావడం విషాదం. మరోవైపు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ 'రాజకీయ పార్టీల నాయకులకు ఉన్నట్టే రాజకీయాలపై మాట్లాడే హక్కు గవర్నర్లకు కూడా ఉంటుంది' అని వ్యాఖ్యానించారు. ఈ అంశం కూడా మళ్లీ తమిళనాడు చుట్టూ అల్లుకున్నదే. 'గవర్నర్లు రాజకీయాల గురించి చర్చించకుండా ఉండాలి' అన్న ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు అన్నామలై వ్యాఖ్యల నేపథ్యంలో పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ కూడా అయిన తమిళిసై తన వైఖరి స్పష్టం చేశారు. అన్నామలై తమిళనాడులో తాజా రాజకీయ పరిణామాలు, రాష్ట్ర గవర్నర్ ఆర్‌ఎన్ రవిని ఉద్దేశిస్తూ చేసిన వ్యాఖ్యలపై తమిళిసై ఘాటుగా స్పందించారు.

కనీసం ముఖ్యమంత్రికి సమాచారమైనా లేకుండా ఆయన మంత్రివర్గ సభ్యుడిని గవర్నర్ బర్తరఫ్ చేయడం...అంతలోనే ఆ ఉత్తర్వులను నిలిపివేయడం. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలచేత ఎన్నికైన ఏ ప్రభుత్వానికైనా ఆగ్రహం తెప్పించే అంశమే. తమిళనాడు గవర్నర్ అనుసరించిన ఈ వైఖరి రాజ్యాంగ విరుద్ధమని చెప్పడానికి రాజకీయ పండితులు కావలసిన అవసరం లేదు. స్టాలిన్ మంత్రివర్గ సహచరుడు తప్పు చేసి ఉంటే ఉండవచ్చు. ఆయన మీద ఎన్ని ఆరోపణలైనా ఉండొచ్చు. ఒక మంత్రి మీద తనకు విశ్వాసం లేదని గవర్నర్ భావించినట్టయితే ఆ విషయం ముఖ్యమంత్రికి తెలియజేసి, ఆయన సలహా మేరకు నడుచుకోవాలే కానీ, ఇష్టారీతిగా వ్యవహరించకూడదు. ఇవేవీ గవర్నర్ రవికి పట్టిన దాఖలాలు లేవు. గవర్నర్ రాజ్యాంగ సూత్రాలకు, చట్టాలకు, నిబంధనలకు లోబడి పనిచేయాల్సిందే కానీ, ఏకపక్ష, విపరీత చర్యలు రాజ్యాంగ సమ్మతమూ కావు. అంతే కాదు అసెంబ్లీలో చోటుచేసుకున్న పరిణామాలను కూడా ఏకరవు పెడుతూ సీఎం స్టాలిన్ రాష్ట్రపతికి లేఖ రాశారు.




గవర్నర్ల చర్యలు రాష్ట్ర ప్రభుత్వాల పతనానికి కారణమైతే దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడినట్టేనని సుప్రీంకోర్టు గతంలోనే ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వ పతనానికి దారితీసే విధంగా గవర్నర్ చర్యలు ఉండటానికి ఎంతమాత్రం వీల్లేదని స్పష్టం చేసింది. ఇది మన ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమైన అంశమని (వెరీ వెరీ సీరియస్), దాని ప్రాధాన్యాన్ని అత్యున్నత న్యాయస్థానం నొక్కి మరి చెప్పింది. అయినా, ఈ గవర్నర్లకు అవేమి పట్టడం లేదు. గవర్నర్లు బిల్లులపై సంతకాలు చేయడానికి నిరాకరిస్తున్నారని దక్షిణాది రాష్ట్రాలైన తెలంగాణ, కేరళ ప్రభుత్వాలు గతంలో ఆందోళన వ్యక్తం చేశాయి. తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ 'రాజ్యాంగ ప్రతిష్టంభన సృష్టిస్తున్నారని' పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టును ఆశ్రయించవలసి కూడా వచ్చింది. చివరకు న్యాయస్థానం జోక్యంతోనే ఆమె బిల్లులకు ఆమోదం తెలిపారు.

బీజేపీయేతర ప్రభుత్వాలున్న ప్రతి రాష్ట్రంలోనూ గవర్నర్ల తీరు ఇలాగే ఉంటోంది. కేంద్రంలో అధికారంలోకి వచ్చిననాటి నుంచి కాషాయపార్టీ ఆధిపత్య ధోరణితో రాష్ట్రాలను నిర్వీర్యం చేస్తూ వస్తోంది. రాష్ట్రాలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన నిధులను నిరాకరిస్తోంది. రాష్ట్ర పరిధిలోని అంశాల్లోకి దొడ్డిదారిన చొరబడి హక్కులను కాలరాస్తోంది. బలమైన రాష్ట్రాలతోనే బలమైన కేంద్రం రూపుదిద్దుకుంటుందన్న సహజ సూత్రానికి సైతం తిలోదకాలిచ్చి రాష్ట్ర ప్రభుత్వాలను వివిధ రూపాల్లో వేపుకుతింటోంది. వినాశకరమైన ఈ విధానాలను ప్రతిఘటిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాలపై అక్కడి గవర్నర్ల ద్వారా నిత్యం ఘర్షణలు రాజేస్తూ ప్రజాస్వామ్యాన్ని మోడీ సర్కార్ ఖూనీ చేస్తోంది.

ప్రజాస్వామ్యంలో ప్రజలు ఎన్నుకున్నవారిదే అంతిమ నిర్ణయమని సుప్రీంకోర్టు ఇటీవలే తేల్చి చెప్పింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజా ప్రభుత్వాలను ఏమాత్రం లెక్కచేయకుండా, కనీసం పరిగణలోకి కూడా తీసుకోకుండా రాజ్‌భవన్ పాలనాధీశులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడమంటే ప్రజాస్వామ్యాన్ని నిలువునా పాతరేయడమే. బీజేపీయేతర ప్రభుత్వాలున్న ప్రతిరాష్ట్రంలోనూ గవర్నర్లు అక్కడి ప్రజాప్రభుత్వాలకు పక్కలో బల్లెంలా తయారయ్యారు. ఆర్‌ఎన్ రవి ఆ రాజ్యాంగబద్ధ పదవికి అనర్హుడని, ఆయనను తక్షణమే ఆ పదవి నుంచి తొలగించాలన్న స్టాలిన్ లేఖపై రాష్ట్రపతి స్పందన ఎలా ఉండనుందో వేచి చూడాలి. కేంద్రం చేతిలో కీలుబొమ్మల్లా మారకుండా గవర్నర్ల వ్యవస్థలో కూడా మార్పులు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

హిందూత్వ-కార్పొరేట్ కూటమిది ఏ విధానం?



ప్రభాత్ పట్నాయక్

ప్రతీ ఆధునిక సమాజంలోనూ ఫాసిస్టు శక్తులుంటాయి. సాధారణ పరిస్థితుల్లో అవి సమాజ జీవితపు ప్రధాన స్రవంతికి దూరంగానో, కాస్త ఎడంగానో నామమాత్రపు శక్తులుగా కొనసాగుతూ ఉంటాయి. ఒకసారి గుత్త పెట్టుబడిదారీ వర్గం ఈ శక్తులకు మద్దతునివ్వడం జరిగితే అవి అమాంతం కేంద్ర స్థానాన్ని ఆక్రమించుకుంటాయి. గుత్త పెట్టుబడిదారీ వర్గం ఈ ఫాసిస్టు శక్తులకు కావలసినంత ధనాన్ని అందిస్తుంది. విపరీతమైన మీడియా కవరేజి ఇస్తుంది. పెట్టుబడిదారీ సంక్షోభం ఏర్పడి దాని వలన నిరుద్యోగం బాగా పెరిగిపోయి దాని పర్యవసానాలు ఆ గుత్త పెట్టుబడిదారీ వర్గ ఆధిపత్యానికే ఒక సవాలుగా మారినప్పుడు ఆ వర్గం ఫాసిస్టు శక్తులకు పూర్తి మద్దతునందిస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థలో జీవిస్తూ ఆ వ్యవస్థలో ఏర్పడిన సంక్షోభం ఫలితంగా తీవ్ర పేదరికాన్ని అనుభవించే ప్రజానీకపు దృష్టిని మళ్ళించి సమాజంలో ఎవరో మైనారిటీ మతాలుగానో, మైనారిటీ జాతులుగానో ఉన్న ప్రజల పట్ల విద్వేషాన్ని, శతృత్వాన్ని పెంచడం అనేది ఈ ఫాసిస్టు శక్తులు చేసే పని. దీనికి తోడు ఒకసారి ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రాగానే రాజ్యాధికారాన్ని ఉపయోగించి అణచివేతకు పాల్పడతాయి. అంతే కాక, మైనారిటీలను లక్ష్యంగా చేసుకుని వారిపై ఫాసిస్టు గూండాలను ఉసిగొల్పి నానారకాలుగా లైంగికదాడులకు పాల్పడతాయి. ఈ గూండాలు కేవలం మైనారిటీలనే గాక, ఆలోచనాపరులమీద, మేధావుల మీద, రాజకీయ ప్రత్యర్థులమీద, స్వతంత్రంగా వ్యవహరించే విద్యావేత్తలమీద సైతం దాడులకు తెగబడతాయి.

ప్రస్తుతం భారతదేశంలో ఇదే జరుగుతోంది. ఫాసిస్టు శక్తులు అధికారంలోకి రావడంతోపాటు ఇంకో కొత్త శక్తులు కూడా ముందుకొచ్చాయి. "నూతన గుత్త పెట్టుబడిదారీ వర్గం" అనేదే ఆ కొత్త శక్తి. ఈ వర్గం ఫాసిస్టు శక్తులతో ఒక ప్రత్యేకమైన సన్నిహిత సంబంధాన్ని కలిగివుంది. డేనియల్ గ్యూరిన్ అనే ఫ్రెంచి మేధావి "ఫాసిజం, బడా పెట్టుబడిదారీ వర్గం" అనే తన గ్రంథంలో జర్మనీలో జరిగిన పరిణామాలను ఈ విధంగా వివరించాడు... జర్మనీలో కొత్తగా ఉక్కు, వస్త్రోత్పత్తి రంగం, ఆయుధాల తయారీ రంగాల్లో తలెత్తిన గుత్త పెట్టుబడిదారీ వర్గం 1930 దశకంలో నాజీలకు సంపూర్ణ మద్దతునందించింది. జౌళి రంగం, వినిమయ వస్తువుల తయారీ తదితర రంగాల్లో ముందునుంచీ ఉన్న గుత్త పెట్టుబడిదారులు అందించిన మద్దతుతో పోల్చితే ఈ కొత్త గుత్త పెట్టుబడిదారీవర్గం అందించిన మద్దతు చాలా ఎక్కువ. దానర్థం పాత గుత్త పెట్టుబడిదారీ వర్గం నాజీలను బలపరచలేదని మాత్రం కాదు. కొత్తగా తలెత్తిన గుత్త పెట్టుబడిదారీ వర్గం మరింత దూకుడుగా నాజీలను బలపరిచింది. అదే మాదిరిగా జపాన్‌లో నిస్సాన్, మోరీ వంటి కొత్త గుత్త పెట్టుబడిదారీ సంస్థలు అక్కడి మిలిటరీ-ఫాసిస్టు ప్రభుత్వాన్ని 1930వ దశకంలో బలపరిచాయి. వాళ్ళతో పోల్చితే పాత గుత్త పెట్టుబడిదారులుగా ఉన్న మిత్సుయి, మిత్సుబిషి, సుమిమోటో వంటి గుత్త సంస్థలు అంత ఉధృతంగా బలపరచలేదు. దానర్థం ఈ పాత గుత్త సంస్థలు అక్కడి ప్రభుత్వాన్ని బలపరచలేదని కాదు. బలపరిచే ఉధృతిలోనే తేడా ఉంది. జపాన్‌లోని గుత్త పారిశ్రామిక సంస్థలు అక్కడి మిలిటరీ-ఫాసిస్టు ప్రభుత్వాన్ని బలపరిచాయి గనుకనే రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ ఓడిపోయిన అనంతరం అక్కడ జనరల్ డగ్లస్ మెకార్థర్ ఆధ్వర్యంలో అమెరికన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక ప్రభుత్వం అంతవరకూ అక్కడున్న గుత్త పారిశ్రామిక సంస్థలను అన్నింటినీ మూసేసింది (అయితే అలా మూతబడ్డ సంస్థలన్నీ వేరే రూపాల్లో తిరిగి రంగం మీదకొచ్చాయి అన్నది వేరే విషయం). జపాన్‌లో కూడా కొత్తగా ఏర్పడ్డ గుత్త సంస్థలు అక్కడి మిలిటరీ-ఫాసిస్టు ప్రభుత్వానికి తిరుగులేని పూర్తి మద్దతు నందించాయి.

ఇప్పుడు మన దేశంలో కూడా ఇదే ధోరణి కనిపిస్తోంది. కొత్త గుత్త పెట్టుబడిదారీ సంస్థలైన అదానీ, అంబానీలు మోడీ ప్రభుత్వానికి మద్దతును అందించడంలో బాగా చురుకుగా వ్యవహరిస్తున్నారు. దానికి ఫలితంగా ఈ సంస్థలు పొందుతున్న ప్రయోజనాలు కూడా ఇబ్బడిముబ్బడిగా ఉన్నాయి. వీటితో పోల్చితే ఎప్పటి నుండో గుత్త సంస్థలుగా ఉన్నవి ఈ విషయంలో వెనకబడ్డాయి. దానర్థం ఆ పాత గుత్త సంస్థలు మోడీని బలపరచడానికి విముఖంగా ఉన్నట్టు కాదు. నిజానికి టాటా సంస్థల అధినేత నాగపూర్‌లోని ఆరెస్సెస్ కేంద్ర కార్యాలయానికి వెళ్ళి తమ మద్దతు ప్రకటించడం ఆ సంస్థ హిందూత్వ ప్రభుత్వానికి ఎంత సన్నిహితంగా ఉందో సూచిస్తుంది.

గుత్త పెట్టుబడిదారీ వర్గంతో, అందునా కొత్తగా తలెత్తిన గుత్త పెట్టుబడిదారీ శక్తులతో మోడీ ప్రభుత్వం అత్యంత సాన్నిహిత్యాన్ని కలిగివుండడాన్ని తరచూ 'ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం' (క్రోనీ క్యాపిటలిజం) అని వర్ణిస్తున్నారు. ఫాసిస్టు శక్తులకు, గుత్త పెట్టుబడిదారీ వర్గానికి, అందునా కొత్త గుత్త పెట్టుబడిదారులకు మధ్య నెలకొన్న సాన్నిహిత్యాన్ని ఇది సూచిస్తుంది. కాని ఈ బంధం తాలూకు నిర్దిష్ట ప్రత్యేక లక్షణాన్ని అది సూచించడం లేదు. కార్పొరేట్-హిందూత్వ కూటమి అని ఆ బంధం ప్రత్యేక లక్షణాన్ని గురించి చెప్పవచ్చు. ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అనేది అన్ని తరహాల ఆధునిక పెట్టుబడిదారీ వ్యవస్థలకూ వర్తించే వర్ణన. అయితే, ఫాసిస్టు శక్తులు ఆధిపత్యంలోకి వచ్చిన ప్రత్యేక పరిస్థితుల నిర్దిష్ట స్వభావాన్ని అది సూచించదు. ఒక అర్థంలో చెప్పుకుంటే, పెట్టుబడిదారీ విధానం యావత్తూ ఆశ్రిత పెట్టుబడిదారీ విధానమే. పెట్టుబడిదారీ వ్యవస్థలో అందరూ "నిబంధనలకు లోబడి" నడుచుకోవాలి. కాని ఆ నిబంధనల చట్రం లోపలే కొందరు ఆశ్రితులకు ప్రత్యేక ప్రయోజనాలు సమకూర్చవచ్చు.

ఇక గుత్త పెట్టుబడిదారీ వ్యవస్థలోనైతే రాజ్యానికి, గుత్త పెట్టుబడిదారులకూ మధ్య ఉండే సంబంధం మరింత సన్నిహితంగా తయారౌతుంది. ద్రవ్య పెట్టుబడిపై రుడాల్ఫ్ హిల్ఫెర్డింగ్ (జర్మనీ) రాసిన ఉద్గ్రంథంలో బ్యాంకులకు, పారిశ్రామిక పెట్టుబడికి మధ్య "వ్యక్తిగత సంపర్కం" జరిగి, దాని ప్రాతిపదికన "ద్రవ్య గుత్తాధిపత్య సంస్థలు" ఏర్పడతాయని ఆయన సూచించాడు. అదే మాదిరిగా, ఈ "ద్రవ్య గుత్తాధిపత్య సంస్థలకు", ప్రభుత్వానికి నడుమ "వ్యక్తిగత సంపర్కం" ఉంటుందని కూడా ఆయన సూచించాడు. బహుళజాతి కంపెనీలలో ముఖ్య అధికారులుగా పని చేసినవారు ప్రభుత్వ పదవులలో ముఖ్య స్థానాలను చేపడతారు, అదే మాదిరిగా ప్రభుత్వంలో ముఖ్య పదవులు నిర్వహించినవారు బహుళజాతి కంపెనీలలో ముఖ్య అధికారులుగా నియమించబడతారు. ఈ క్రమంలో ప్రభుత్వ విధానాలు గుత్త పెట్టుబడిదారుల ప్రయోజనాలను సంరక్షించే విధంగా మలచబడతాయి. ఈ విధంగా గుత్త పెట్టుబడిదారులకు ఎంత అనుకూలంగా మారిపోతున్నా, ఈ వ్యవహారం అంతా కొన్ని "నియమనిబంధనల" చట్రం లోపలే జరుగుతూ ఉంటుంది.

> ఈ మొత్తం వ్యవహారాన్ని కేవలం "ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం" అని చెప్పడమంటే జరుగుతున్నదాన్ని బాగా తక్కువ చేసి చెప్పడమే అవుతుంది. ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అయితే, దీనికి ముందు స్వచ్ఛమైన, పక్షపాతంలేని పెట్టుబడిదారీ విధానం అమలులో ఉండేదని, దానిని అణగదొక్కి హిందూత్వ శక్తులు ప్రస్తుత విధానాన్ని అమలు చేస్తున్నాయని అర్థం వస్తుంది. స్వచ్ఛమైన పెట్టుబడిదారీ విధానం అనేది ఎక్కడా, ఎప్పుడూ లేనే లేదు. పెట్టుబడిదారీ విధానం అంటేనే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం. గుత్త పెట్టుబడిదారీ విధానం ఉనికిలోకి వచ్చాక ప్రభుత్వానికి, ఆ గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. అయితే ఫాసిస్టు పాలన వచ్చాక ఈ సంబంధంలో గుణాత్మకమైన మార్పు వస్తుంది. ఇక్కడ ఏ నియమాలూ ఉండవు. హిందూత్వ-కార్పొరేట్ కూటమి ఏం చేస్తే అదే నియమం.



గ్వాటెమాలాలో అధినేతగా ఉండిన జాకొబో ఆర్బెంజ్ ప్రవేశపెట్టిన భూసంస్కరణలు అమెరికాకు చెందిన యునైటెడ్ ఫ్రూట్స్ కంపెనీ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పరిణమించాయి. అప్పుడు సిఐఎ కుట్ర పన్ని ఆ ప్రభుత్వాన్ని కూలదోసింది. అదే విధంగా ఇరాన్‌లో మొస్సాద్ ప్రధానిగా ఉన్న కాలంలో చమురు పరిశ్రమను జాతీయం చేశాడు. దాని ఫలితంగా బ్రిటిష్ యాజమాన్యంలో ఉన్న చమురు కంపెనీ తన ఆధిపత్యాన్ని కోల్పోయింది. అప్పుడు బ్రిటిష్, అమెరికన్ గూఢచారి సంస్థలు రెండూ కలిసి కుట్ర పన్ని మొస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోశాయి. అయితే ఈ అన్ని సందర్భాలలోనూ ఆ గూఢచారి సంస్థలు కొన్ని గుత్త పెట్టుబడిదారీ సంస్థల ప్రయోజనాల కోసం కుట్రలు చేశాయి తప్ప అక్కడి ప్రభుత్వాల నియమనిబంధనలను ఎన్నడూ తిరస్కరించలేదు. నిజానికి ఈ రోజు వరకూ బ్రిటిష్ ప్రభుత్వం ఇరాన్‌లో మొస్సాద్ ప్రభుత్వాన్ని కూలదోయడానికి జరిగిన కుట్రలో తమ ప్రభుత్వానికి భాగస్వామ్యం ఉన్నట్టు ఒప్పుకోనేలేదు.

అయితే ఫాసిస్టు శక్తులు రాజ్యాధికారాన్ని చేపట్టాక అంతా మారిపోయింది. ఒక మౌలికమైన మార్పే జరిగింది. "నియమ నిబంధనలు" అనే వాటినే తోసిరాజనే కొత్త పద్ధతి వచ్చింది. ఇది మన దేశంలో స్పష్టంగా కనిపిస్తుంది. రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందంలో మన ప్రధాని అప్పుడే కొత్తగా అనిల్ అంబానీ స్థాపించిన సంస్థను రాఫెల్ యుద్ధ విమానాల స్థానిక తయారీదారుడిగా గుర్తించాలని ఫ్రెంచి ప్రభుత్వాన్ని కోరాడు. ఇక్కడ గ్లోబల్ టెండర్లు పిలవాలన్న నిబంధన గాలికి పోయింది. కనీసార్హతలు ఈ స్థానిక తయారీదారుడికి ఉండాలన్న నిబంధన కూడా అంతే. అప్పటికే విమానాల ఉత్పత్తిలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థను సైతం పక్కన పెట్టేశారు. ఎందుకిలా చేశారన్న ప్రశ్నకు ఇప్పటికీ సమాధానం లేదు.

అదే విధంగా అదానీ గ్రూపు "నియమ నిబంధనలను" ఉల్లంఘించిందన్న హిండెన్‌బర్గ్ నివేదిక వెలువడిన తర్వాత కూడా అదానీ సంస్థల వ్యవహారం మీద ఎటువంటి విచారణా లేదు. కొన్ని పారిశ్రామిక సంస్థలను "ఎంపిక" చేసి, ఇతర దేశాలలోని సంస్థలతో జరిగే పోటీలో ఈ ఎంపిక కాబడిన సంస్థలే గెలుపొందేలా బీజేపీ ప్రభుత్వం పథకరచన చేస్తోందని కొన్ని కథనాలు వెలువడ్డాయి. గుత్త పెట్టుబడితో, అందునా, మరీ ముఖ్యంగా కొత్త గుత్త పెట్టుబడితో మోడీ ప్రభుత్వం ఎంత సన్నిహితంగా జతకట్టిందో ఇవి సూచిస్తున్నాయి. ఇటువంటి "గెలుపు గుర్రాలను" ఎంపిక చేయడంలో ఎటువంటి నియమ నిబంధనలూ ఉండవు అన్నది స్పష్టం. ఈ ప్రభుత్వం హిందూత్వ శక్తులతో జతకట్టిన కొన్ని గుత్త పెట్టుబడిదారీ సంస్థల వ్యాపార సామ్రాజ్యాల విస్తరణకు తోడ్పడుతుంది.

దీనికి బదులుగా, ఈ కొత్త గుత్త పెట్టుబడిదారీ సంస్థలు ఈ హిందూత్వ ప్రభుత్వానికి మీడియా నుండి పూర్తి మద్దతు ఉండేట్టు చూస్తాయి. స్వతంత్రంగా వ్యవహరించే ఒకటో రెండో టివి చానెళ్ళను అదానీ గ్రూపు కొనుగోలు చేసేసింది. దాంతో కార్పొరేట్-హిందూత్వ కూటమికి మీడియా నుండి సంపూర్ణ మద్దతు దొరకడం ఖాయం అయిపోయింది.

ఈ మొత్తం వ్యవహారాన్ని కేవలం "ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం" అని చెప్పడమంటే జరుగుతున్న దాన్ని బాగా తక్కువ చేసి చెప్పడమే అవుతుంది. ఇది ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం అయితే, దీనికి ముందు స్వచ్ఛమైన, పక్షపాతంలేని పెట్టుబడిదారీ విధానం అమలులో ఉండేదని, దానిని అణగదొక్కి హిందూత్వ శక్తులు ప్రస్తుత విధానాన్ని అమలు చేస్తున్నాయని అర్థం వస్తుంది. స్వచ్ఛమైన పెట్టుబడిదారీ విధానం అనేది ఎక్కడా, ఎప్పుడూ లేనే లేదు. పెట్టుబడిదారీ విధానం అంటేనే ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం. గుత్త పెట్టుబడిదారీ విధానం ఉనికిలోకి వచ్చాక ప్రభుత్వానికి, ఆ గుత్త పెట్టుబడిదారీ సంస్థలకు మధ్య సాన్నిహిత్యం పెరుగుతుంది. అయితే ఫాసిస్టు పాలన వచ్చాక ఈ సంబంధంలో గుణాత్మకమైన మార్పు వస్తుంది. ఇక్కడ ఏ నియమాలూ ఉండవు. హిందూత్వ-కార్పొరేట్ కూటమి ఏం చేస్తే అదే నియమం.

- స్వేచ్ఛానుసరణ



కల్లుగీత కార్మికులకిచ్చిన హామీల అమలేది?



ఎం.వి. రమణ

తరాలు మారుతున్నా గీతన్నల తలరాతలు మాత్రం మారడం లేదు. వారి వృత్తికి సరైన గ్యారంటీ, జీవితానికి భద్రత లేక కుటుంబాలు అగమ్యగోచరంగా ఉన్నాయి. దీనిపై దృష్టి పెట్టాల్సిన ప్రభుత్వం తాత్కాలిక ఉపశమనం పొందే కార్యక్రమాలే తీసుకుంటున్నాయి. ఇవి గీతవృత్తిని నమ్ముకున్న కుటుంబాలకు శాశ్వత పరిష్కారం దిశగా ఫలితాలనివ్వడం లేదు. అందుకే కల్లుగీత కార్మికసంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అనేక పోరాటాలు, ఆందోళనల ద్వారా ప్రభుత్వం ముందు కొన్ని డిమాండ్లను పెట్టింది. ఆ డిమాండ్లను నెరవేర్చుకునేందుకు ఈ నెల 10న అన్ని జిల్లాల కలెక్టరేట్ల ముందు ధర్నాలకు పిలుపునిచ్చింది. అయితే అంతకన్నా ముందు రాష్ట్రంలో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చ అవసరం. రాష్ట్రంలో 5లక్షల కుటుంబాలు నేటికి కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నాయి. కుటుంబ పోషణ కోసం ప్రమాదకరమైన వృత్తి అయినప్పటికీ కొనసాగిస్తున్నారు. ఈ వృత్తిలో ప్రతి ఏడాది సుమారు 550మందికి పైగా ప్రమాదానికి గురవుతున్నారు. వీరిలో సుమారు 180మంది చనిపోతున్నారు మిగతా వారి కాళ్లు, చేతులు విరగడం, నడుము పడిపోవడం జరుగుతూనే ఉన్నాయి. సగటున నెలకు 47మంది పడిపోగా రెండురోజులకు ఒకరు చనిపోతున్నారంటే ఇంతటి మరణాలు ఎందులోను లేవు. ఇది ప్రభుత్వాలు, రాజకీయ పార్టీలు గుర్తించాల్సిన ముఖ్యమైన అంశం. చిన్న యాక్సిడెంట్‌లు జరిగితేనే మీడియాలో గగ్గోలు పెట్టి ఎక్స్‌గ్రేషియో డిమాండ్ చేసేవారు గీత కార్మికులకు ఇన్ని ప్రమాదాలు జరిగినా గుర్తించకపోవడం బాధాకరం.

2021 డిసెంబర్ 10న హైదరాబాద్ సుందరయ్య కళానిలయంలో కల్లుగీత కార్మిక సంఘం అధ్వర్యంలో జరిగిన రాష్ట్ర సెమినార్‌లో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశం(ఐఎయస్) పాల్గొన్నారు. గీత కార్మికుల మరణాలు, సమస్యల్ని సంఘం ఆధ్వర్యంలో ఆయన దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియా చాలా లేటు అవుతున్నందున కార్పొరేషన్ ద్వారా ఆర్థిక సహాయం చేయాలని, ప్రమాదాలు నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించాం. ఇది జరిగిన వారం రోజుల్లోనే సిరిసిల్లా జిల్లా తంగళ్లపల్లిలో గీత కార్మికుడు చెట్టుపై నుండి పడి మరణించాడు. ఈ విషయం ఆయన దృష్టికి తీసుకపోగా కల్లుగీత కార్పొరేషన్ నుండి దహన సంస్కారాల ఖర్చుల కోసం రూ.25వేలు ఆ కుటుంబానికి ఇచ్చారు. నేను, సెక్షన్ ఆఫీసర్ రవీందర్ గౌడ్ స్వయంగా ఆ గ్రామానికి వెళ్లి చెక్కు ఇచ్చి వచ్చాం. అప్పటి నుండి వృత్తిలో ప్రమాదం జరిగి చనిపోయిన వారి కుటుంబాలకు దహన సంస్కారాల ఖర్చుల కింద రూ.25వేలు, దెబ్బలు తగిలిన వారికి మెడికల్ ఖర్చులకు రూ.15వేలు కార్పొరేషన్ నుండి ఇస్తున్నారు. ఇది సంఘం చేసిన కృషిలో ముఖ్యమైనది. ఈ 18నెలల కాలంలో సుమారు 840కుటుంబాలకు రూ.1.50కోట్ల రూపాయలు ఆర్థిక సహాయం చేశారు. 270మంది చనిపోగా 570మందికి తీవ్రంగా దెబ్బలు తగిలాయి. ఈ ప్రమాదాల నివారణకు కృషిలో భాగంగా యాదగిరిగుట్టలో జరిగిన కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర మహాసభల సందర్భంగా 2022 అక్టోబర్ 21న సేఫ్టి మోకు డెమో ప్రాక్టికల్‌గా ఇప్పించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వచ్చిన గీత కార్మికులు దీనితో చెట్టు ఎక్కి చూశారు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుండి జారితే కింద పడకుండా లాక్ అవుతుంది. దీనిలో కొన్ని మార్పులు చేయాలని సూచనలు చేశాం. త్వరలో అందుబాటులోకి తెచ్చి ఈ ప్రమాదాలు నివారిస్తామని చెప్పారు.

1991లో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం కల్లుగీత పారిశ్రామిక సహకార ఆర్థిక సంస్థ ఏర్పాటైంది. గీత కార్మిలకు రుణాలు ఇవ్వడం, నీరా తాటి ఉత్పత్తుల శిక్షణా కేంద్రం ఏర్పాటు, నందనవనంలో ఐదెకరాల భూమి కొనుగోలు తదితర కార్యక్రమాలు చేపట్టింది. ప్రభుత్వాలు మారడం తగిన శ్రద్ధ చూపకపోవడంతో ఈ కార్పొరేషన్ క్రమంగా నీర్వీర్యమైంది. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తర్వాత కూడా దీనికి తగిన బడ్జెట్ కేటాయింపులు జరగలేదు. దీని ద్వారా ఎలాంటి పథకాలు అమలు కాలేదు. దీని లక్ష్యం గీత కార్మికులను ఆర్థికంగా అభివృద్ధి చేయడం, మారుతున్న కాలానికి అనుగుణంగా వృత్తిలో అధునీకరణ తీసుకరావడం. కానీ అది నేటికీ నెరవేరలేదు. ఇటీవల ఎక్సైజ్ శాఖామాత్యులు వి. శ్రీనివాస్ గౌడ్ నీరా పాలసి గురించి ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన చొరవతో హైదరాబాద్‌లోని నక్లెస్‌రోడ్‌లో నీరా కేఫ్ నిర్మించారు. ఇది మంచి విషయం. అయితే దీనిని రాష్ట్ర వ్యాపితంగా విస్తరింప చేయాల్సిన అవసరం ఉంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి తొమ్మిదేండ్ల తర్వాత కల్లు గీత కార్పొరేషన్ చైర్మెన్‌గా పల్లె రవికుమార్ గౌడ్‌ని నియమించారు. గీత కార్మికుల సంక్షేమం కోసం ఈ కార్పొ రేషన్ కృషి చేయాల్సిని అవసరం ఉంది. ప్రతి సంవత్సరం రూ.25 కోట్లు కేటాయి స్తున్నప్పటికీ నిధులు మాత్రం విడుదల చేయడం లేదు. 2023-24 రాష్ట్ర బడ్జెట్‌లో రూ.30కోట్లు ప్రకటించి వదిలేశారు. కార్పొరేషన్‌కు సరిపడా నిధులు కేటాయించి, వృత్తిలో ఉపాధి కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో తక్షణ అవసరం.

త్వరలో 'గీతన్న బీమా' అమలు చేస్తామని ముఖ్యమంత్రి ఇటీవల ప్రకటించారు. రైతులకు మాదిరిగానే గీత కార్మికులకు వర్తింపచేస్తా మన్నారు. ప్రస్తుతం ఇస్తున్న ఎక్స్‌గ్రేషియో యథావిధిగా కొనసాగిస్తూనే ఇందులో కొన్ని మార్పులు చేయాలని పలుసంఘాలతో కలిసి కోరాం. సహజ మరణాలకు కూడా వర్తింప చేయాలని, వయసు పరిమితి 65సంవత్సరాలు ఉండాలని విన్నవించాం. మునుగోడు ఎన్నికల సందర్భంగా 2022 అక్టోబర్ 23న బీఆర్‌యస్ నిర్వహించిన గౌడ ఆత్మీయ సమేళనంలో కేసీఆర్ గీత కార్మికులకు మోపెడ్‌లు ఇస్తామని, 'గౌడబంధు' అమలు చేస్తామని చెప్పారు. వృత్తిలో ప్రమాదాలు నివారిస్తామని, సొసైటీలకే లిక్కర్ షాపులు ఇస్తామన్నారు. అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీనిచ్చినా నేటికి అమలు చేయలేదు. బీసీ కుల వృత్తులు చేసేవారికి లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని జూన్ 6న జీఓ నెం.5 విడుదల చేశారు. ఇందులో కల్లుగీత కార్పొరేషన్‌తో పాటు 11 కార్పొరేషన్స్, ఫెడరేషన్స్ ఉన్నట్లు ప్రకటించారు. 7న ఇచ్చిన మెమోలో గీత కార్మికుల ప్రస్తావనలేదు. రాష్ట్రంలో ప్రధాన వృత్తిదారులైన గీత కార్మికులను విస్మరించారు. అయినప్పటికీ 13వేల మంది దరఖాస్తు చేసు కున్నారు. ఆదాయ ధృవీకరణ పత్రాలు అందకపోవడంతో ఇంకా చాలా మంది చేసుకోలేకపోయారు. దీనికి మరొక 15రోజులు అవకాశం కల్పించి సభ్యత్వమున్న అందరికీ లక్ష రూపాయల చొప్పున ఇవ్వాలి. కల్లుగీత కార్మికుల సంక్షే మానికి ఏర్పడ్డ కార్పొరేషన్‌కు రూ.5వేల కోట్లు కేటాయించి దీని ద్వారానే నీరా కేంద్రాలు విస్తరింప చేయాలి. ప్రధానంగా భూమి, కల్లుకు మార్కెట్, తాటి ఈత ఉత్పత్తుల పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. అప్పుడే గీతకార్మికుల జీవనోపాధి మెరుగు పడటంతో పాటు వృత్తికి తగిన భద్రత ఉంటుంది.

సెల్:9490098485

డోలాయమానంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి పదవి?



జి. తిరుపతయ్య
9951300016

మహారాష్ట్ర రాజకీయాల్లో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్ నాథ్ షిండే పరిస్థితి ఇప్పుడు కుడితిలో పడ్డ ఎలుకలా తయారైంది పాపం. తనకు తెలియకుండానే తనకు డిప్యూటీగా ఉపముఖ్యమంత్రి వచ్చి మరొకరు అదనంగా కూర్చున్నారు. తనను ఎవరు ముంచుతారో ఎవరు తేల్చుతారో తెలియని విధంగా ఉన్నది. తన పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఒక అనిశ్చితితో కూడిన భయాం దోళనలో ఉన్నారు. ఏకనాథ్ షిండే తనకున్న బలం వల్ల ముఖ్యమంత్రి కాలేదు. ఒక పార్టీని చీల్చి వెన్నుపోటుతో బయటికి రాగలిగిన బలహీనత వల్ల ముఖ్యమంత్రి కాగలిగాడు. ఈ బలహీనతను అవకాశంగా మలుచుకుని వందకు పైగా శాసనసభ్యులు ఉన్న బీజేపీ 50లోపు శాసనసభ్యులు గల ఏకనాథ్ షిండేను ముఖ్యమంత్రిని చేసి 'మహా వికాస్ ఆగాది'గా చెప్పుకుంటున్న కూటమిని పడగొట్టగలిగింది. ఈ రకంగా చేసి, 'అయితే మేము పదవిలో ఉండాలి లేదా మా అండదండలతో ప్రభుత్వాలు ఉండాలి' అన్న అధికార దాహాన్ని తీర్చుకోవడానికి వంతెనగట్టుకుని కూర్చున్నది బీజేపీ. ఈ విధంగా అధికార దాహంతో దశాబ్దాలుగా వేచి చూస్తున్నా అజిత్ పవార్ నేషనలిస్ట్ కాంగ్రెస్‌పార్టీ అసంతృప్త సీనియర్ నాయకుణ్ణి మరోసారి వలవేసి వశపరచుకోగలిగింది. ఇలా ఎన్సీపీని చీల్చడంలో పాపం ఏకనాథ్ షిండేకి ఎలాంటి పాత్ర లేదు. కథ నడిపిస్తున్నదంతా బీజేపీకి చెందిన ఆ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్. కాంగ్రెస్ నుండి కూడా ఒక వర్గం చీలి వస్తే మరో ఉప ముఖ్యమంత్రిని చేయడానికి బీజేపీ సిద్ధంగా ఉన్నట్లు ఉన్నది. స్థిరమైన ప్రభుత్వము కొనసాగాలనే ఉద్దేశంతోనైనా ఇన్నాళ్లు ఏకనాథ్ షిండేకు ఆదేశాలు బీజేపీ నుండి వెళ్లి ఉండకపోవచ్చు. ఇప్పుడు ఏ రకమైన ఆదేశాన్ని ఇవ్వడానికైనా బీజేపీకి అధికారం లభించింది. ఇప్పుడున్న ముఖ్యమంత్రి ఏకనాథ్ షిండే కేవలం ఒక రబ్బరు స్టాంపులా ఉండవలసిందే. లేదంటే ఆయనను మార్చి మరొకరిని ముఖ్య మంత్రి స్థానంలో కూర్చో బెట్టడానికి సర్వం సిద్ధంగా ఉన్నది. షిండేకు సంబంధించిన శివసేన పార్టీ ఎమ్మెల్యేల్లో అసంతృప్తి రోజు రోజుకు రాజుకుంటున్నది. ఇది కాస్త పెరిగి పెద్దదైతే దానిని అడ్డం పెట్టుకొని షిండే వర్గాన్ని పూర్తిగా తప్పించి బీజేపీనే ముఖ్యమంత్రి స్థానాన్ని అతి త్వరలో ఆక్రమించే అవకాశమూ లేకపోలేదు. అధికారానికి దగ్గర లేకుండా చాలా కాలం కార్యకర్తలను, నియోజక వర్గాన్ని మైంటైన్ చేయడం అంత సులభం కాదని ఎమ్మెల్యేలు ఎంపీలు బహిరంగంగా ఒప్పుకుంటారు. అలాంటప్పుడు ఈ పార్టీ ఫిరాయింపులన్నీ ప్రజాసేవ కోసం మాత్రమే జరిగాయని ప్రజలకు చెబితే అది హాస్యాస్పదమే అవుతుంది. షిండే వర్గాన్ని మహారాష్ట్ర నుండి అస్సాంకు అక్కడి నుండి గుజరాత్‌కు మార్చి ప్రమాణ స్వీకారం చేసే నాటికి వేల కోట్ల రూపాయలు చేతులు మారాయని జాతీయ మీడియా కుప్పలు తెప్పలుగా ప్రచురించింది. మరి ఇప్పుడు జరిగిన చీలికలోను కోట్ల రూపాయలు చేతులు మారలేదని విశ్వసించలేం. ఏదో ఒక వృత్తిలో నిమగ్నమై అప్పుడప్పుడు వార్తలు చూస్తూ ఎప్పుడూ సెల్ ఫోన్లలో అసంబద్ధ సత్యాలను ఫార్వర్డ్ చేస్తున్న మధ్యతరగతి ప్రజానీకానికి ఈ రాజకీయాల వెనుక ఉన్న కులం, మతం లేదా పైపై మెరుగుల దేశభక్తి వంటివి కనిపిస్తాయి. నిజానికి ఇలాంటి అనిశ్చితి కలిగిన రాజకీయాల వల్ల పరిపాలన పూర్తిగా అస్తవ్యస్తమవుతున్నది. అంత పెద్ద పారిశ్రామికీకరణ జరిగిన మహారాష్ట్ర, అభివృద్ధిలో దేశంలోనే మొదటి స్థానంలో ఉండాలి. కానీ ఇన్నాళ్ళ తర్వాత కూడా



అది సాధ్యం కాలేదు. సీనియర్ పాత్రికేయులు పాలగుమ్మి సాయినాథ్ వెలువరించిన రిపోర్టు ప్రకారం అత్యధిక ఆత్మహత్యలు మహారాష్ట్రలోనే జరిగాయి. విదర్భ ప్రాంతమంతా పేదరికంతో అల్లాడుతున్నది. అంబానీ ఆంటీల్లాతో పాటు పేదలకు నెలవైన స్లమ్స్ (మురికివాడలు) ముంబైలోనే అత్యధికం. అక్షరాస్యతలో రెండు దశాబ్దాలుగా ఆశించిన అభివృద్ధి లేదు. మరాఠీలు కానీ వారు ఎవరు ముంబై ప్రాంతంలోని పారిశ్రామిక, వ్యాపారాల్లో ఉపాధి చేయరాదంటూ ప్రాంతీయ అస్తిత్వాన్ని రెచ్చగొట్టటం ద్వారా శివసేన పార్టీని స్థాపించిన బాల్ ఠాక్రే పార్టీ నేడు చీలిపోవడంతో పాటు జరిగిన పరిణామం ఏమంటే ఆ రాష్ట్రం నుండే ఇతర రాష్ట్రాలకు వలసలు పెరుగుతున్నాయి. నిర్మాణరంగానికి నెలవైన ముంబై నొండి ఇవి నమోదౌతున్నాయి. ఇలాంటి అంశాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించ గలిగిన నిబద్ధతగల పాత్రికేయులకే సాధ్యమవుతుంది. గుత్తాధిపతుల చేతు ల్లో బంధీయైన కార్పోరేట్ మీడియా ఈ వాస్తవాలను బయటికి రానీయదు.

విలువలకు వలువలు లేని రాజకీయ వ్యవస్థలో అధికారమే పరమావధి రక్షణగా మారింది. దేశానికి ఆర్థిక రాజధానిగా పిలువబడే ముంబైలో జరిగే ఆర్థిక అవకతవకలకు అంతే లేదు. ఈ వ్యవహారాల్లో అక్కడి దాదాపు అన్ని రాజకీయ పార్టీల నాయకులు పీకల్లోతు కేసుల్లో ఇరుక్కుని కూడా ఉన్నారు. ప్రతిపక్ష పార్టీ నాయకులు కూడా లోపాయికారిగా అధికార పక్షంతో కలిసి ఉండడం వారికి తప్పని పరిస్థితి. అజిత్ పవార్, ప్రఫూల్ పటేల్ వంటి అనేక మంది నాయకులు ఇప్పటికే ఈడీ వంటి సంస్థల నిఘాలో ఉన్నారు. తమ వ్యాపార సామ్రాజ్యాలను కాపాడుకోవడం కోసం రాజకీయ నీతిని పాటిస్తే కుదరని పరిస్థితి అక్కడ ఉన్నది. విధానాల ద్వారా కాకుండా పలు రకాల సమీకరణల ద్వారా ఓట్లు రాబట్టుకొనే కొత్త పంథాలు మహారాష్ట్ర రాజకీయాల్లో ఎప్పుడో ప్రవేశపెట్టారు. వాటికోసం బహుళ జాతి సంస్థల స్థాయిలో వ్యవస్థలు కూడా వెలిశాయి. ఇలాంటి వ్యవస్థల్లో ఆరితేరిన వారే ప్రశాంత్ కిషోర్. ఇవన్నీ తెలిసి కూడా కురువృద్ధుడు, రాజకీయ దురంధరుడుగా పిలువబడే శరద్‌పవార్, పార్టీ అధికారాన్ని తన కూతురుకు అప్పజెప్పి కూడా అందరి నుండి విధేయతను ఆశించడం మతి తప్పిన అతి

> అజిత్ పవార్, ప్రఫూల్ పటేల్ వంటి అనేక మంది నాయకులు ఇప్పటికే ఈడీ వంటి సంస్థల నిఘాలో ఉన్నారు. తమ వ్యాపార సామ్రాజ్యాలను కాపాడుకోవడం కోసం రాజకీయ నీతిని పాటిస్తే కుదరని పరిస్థితి అక్కడ ఉన్నది. విధానాల ద్వారా కాకుండా పలు రకాల సమీకరణల ద్వారా ఓట్లు రాబట్టుకొనే కొత్త పంథాలు మహారాష్ట్ర రాజకీయాల్లో ఎప్పుడో ప్రవేశపెట్టారు. వాటికోసం బహుళ జాతి సంస్థల స్థాయిలో వ్యవస్థలు కూడా వెలిశాయి. ఇలాంటి వ్యవస్థల్లో ఆరితేరిన వారే ప్రశాంత్ కిషోర్. ఇవన్నీ తెలిసి కూడా కురువృద్ధుడు, రాజకీయ దురంధరుడుగా పిలువబడే శరద్‌పవార్, పార్టీ అధికారాన్ని తన కూతురుకు అప్పజెప్పి కూడా అందరి నుండి విధేయతను ఆశించడం మతి తప్పిన అతి వివేకమైంది.

వివేకమైంది. కనీసం ఆయన చనిపోయిన తర్వాతనైనా పార్టీ పగ్గాలు తనకే అందుతాయి అని ఆశించిన అజిత్ పవార్‌కు ఆ అవకాశం ఇవ్వకపోవడంతో ఆయన చేసిన తిరుగుబాటు మహారాష్ట్ర సమాజంలో సమంజసమైంది. ఇక ఆంగ్ల చదువులు చదువుకొని, అనర్గళమైన ఉపన్యాసాలు ఇస్తూ అందరిని ఆకట్టుకుంటున్న ఎన్సీపీ అధ్యక్షురాలు సుప్రియ సూలే రాజకీయానుభవ రాహిత్యంతో పార్టీలో అంత ర్గతంగా ఏర్పడిన ముసలాన్ని గమనించలేక పోయింది. తన వర్గం నుండి చీలిపోయి కొత్త కుంపటి పెట్టుకున్న శివసేన ఎమ్మెల్యేలందరినీ సుప్రీంకోర్టు అనర్హులుగా ప్రకటిస్తుందనే ఆశతో ఒరిజినల్ శివసేన అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే జరుగుతున్న ఈ పరిణామాలకు స్పందించడం లేదు. తమ ఎమ్మెల్యేలంతా తమ గూట్లో ఉంటే చాలు అన్న క్షణక్షణ భయంతో కాంగ్రెస్ ఎదురుచూడడం తప్ప చేసేదేమీలేదు!

పెండింగ్ దస్త్రాలు త్వరగా పరిష్కరించండి

- ఢిల్లీలో కేంద్ర కార్యదర్శులకు సీఎస్ శాంతికుమారి విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలోని పలు అభివృద్ధి పథకాలకు సంబంధించి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను త్వరగా పరిష్కరించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారంనాడామె ఢిల్లీలో ఒక్కరోజు పర్యటన నిమిత్తం వెళ్లారు. అక్కడ వేర్వేరు శాఖలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ కార్యదర్శులతో ఆమె భేటీ అయ్యారు. కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్, కేంద్ర పర్యావరణ, అటవీ శాఖ కార్యదర్శి లీలానందన్, కేంద్ర రహదారులు, రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌లతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేయాలని కోరారు.

సికింద్రాబాద్ ప్యారడైజ్ జంక్షన్ నుంచి కండ్లకోయ ఔటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకు, ప్యారడైజ్ నుంచి కరీంనగర్, రామగుండం మార్గంలో ఓఆర్ఆర్ వరకు నిర్మించ తలపెట్టిన రెండు ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం, మెహిదీపట్నం జంక్షన్‌లో ప్రతిపాదిత స్కై- వాక్ నిర్మాణ పనులకు అవసరమైన 150.39 ఎకరాల రక్షణ శాఖ భూములను రాష్ట్ర ప్రభుత్వానికి బదలాయింపు చేయాలని సీఎస్ శాంతికుమారి కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర్‌ను కోరారు. ఆ భూములకు సరిపడా ప్రత్యామ్నాయ భూములను కూడా అందిస్తామని ఆమె ప్రతిపాదించారు. అలాగే జాతీయ వన్యప్రాణి సంరక్షణ బోర్డులో రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన 60 ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నాయనీ, వాటికి ఆమోదం తెలుపాలని కోరారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాలు, పీఎమ్‌జీఎస్‌వై పనులకు సంబంధించి అటవీశాఖ అనుమతులు ఇవ్వడానికి నేషనల్ బోర్డు ఫర్ వైల్డ్ లైఫ్ కమిటీ ప్రత్యేక సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని కోరారు. కేంద్ర రహదారులు, రవాణా, జాతీయ రహదారుల శాఖ కార్యదర్శి అనురాగ్ జైన్‌తో భేటీ అయ్యి రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణ పనులకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న పలు ప్రతిపాదనలకు ఆమోదం తెలపాలని కోరారు. సీఎస్ వెంట రాష్ట్ర ప్రభుత్వ రవాణా, రోడ్లు భవనాల శాఖ కార్యదర్శి శ్రీనివాస రాజు, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమీషనర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఉన్నారు.

జూపల్లి చేరిక రాష్ట్రానికి ఎంతో ఉపయోగం : మల్లు భట్టివిక్రమార్క

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు కాంగ్రెస్‌లో చేరడం పార్టీకి, రాష్ట్రానికి ఎంతగానో ఉపయోగమని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. ఆయన చేరిక సమయంలో భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్టు ఆయన వెల్లడించారు. సోమవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని భట్టి నివాసానికి జూపల్లి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. మహబూబ్‌నగర్‌లో భారీ బహిరంగసభ ఏర్పాటు చేసి కాంగ్రెస్ పార్టీలో చేరే విషయంపై భట్టితో వారు చర్చించారు. అనంతరం జూపల్లి మాట్లాడుతూ 'కొల్లాపూర్ బహిరంగ సభకు రావాలని భట్టిని కోరాం. సభకు పార్టీ జాతీయ నేతలు కూడా రాబోతున్నారు. అన్ని నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరికలు ఉంటాయి. కూచుకుంట్ల దామోదర్‌రెడ్డి, ఆయన కుమారుడు మేఘా రెడ్డి కాంగ్రెస్‌లో చేరతారు' అని జూపల్లి పేర్కొన్నారు. పొంగులేటి మాట్లాడుతూ 'భట్టితో ఖమ్మం జిల్లా రాజకీయాలపైనా, తెలంగాణలో కేసీఆర్ పాలనను బంగాళాఖాతంలో కలపడంపైనా చర్చించాం. నేను కొట్టినట్టు చేస్తా.. నువ్వు ఏడ్చినట్టుచెయ్యి.. అనేలా కేసీఆర్ పట్ల ప్రధాని మోడీ తీరు ఉంది. రాష్ట్రంలో ఇప్పుడు రెండే వర్గాలు ఉన్నాయి. ఒకటి ప్రభుత్వ అనుకూల వర్గం, రెండు వ్యతిరేక వర్గం. ఈసారి కేసీఆర్‌ను ఇంటికి పంపాలని రాష్ట్ర ప్రజలు బలంగా నిర్ణయించుకున్నారు. దానికి కాంగ్రెస్ పార్టీయే ప్రత్యామ్నాయమని వారు విశ్వసిస్తున్నారు. ఈ నెల చివర్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నుంచి భారీ స్థాయిలో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలుంటాయి.' అని పొంగులేటి తెలిపారు.

షర్మిల విషయం చర్చించలేదు..

'షర్మిల విషయంపై భట్టితో ఏమాత్రం చర్చించలేదు. వైకాపాను జగన్ తెలంగాణలో వద్దనుకున్నారు. అలాంటిది చెల్లి కోసం ప్రయత్నాలు చేయడం అంటూ ఉండదు. కాంగ్రెస్‌లో షర్మిల చేరికకు సంబంధించి.. సీఎల్పీ నేత, టీపీసీసీ అధ్యక్షులు, కాంగ్రెస్ అధిష్టానం చూసుకుంటుంది.' అని స్పష్టం చేశారు.

100 డేస్ యాక్షన్ ప్లాన్

- సంస్థాగత పట్టులేకుండా అధికారమేల?
- క్షేత్రస్థాయిలో బలోపేతమవ్వాలని జవదేకర్ అక్షింతలు
- 3 ప్రాంతాల నుంచి ముగ్గురు బీజేపీ నేతల పాదయాత్రలు!
- రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, మోడీ ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నిర్ణయం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో బీజేపీ 100 రోజుల యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేసుకుంటున్నది. ఎన్నికల వేళ ఎలా ముందుకెళ్లాలనే దానిపై తీవ్రస్థాయిలో కసరత్తు చేస్తున్నది. కేంద్ర మాజీ మంత్రి, రాష్ట్ర ఇన్‌చార్జి ప్రకాశ్‌జవదేకర్ పర్యవేక్షణలో వరుసగా సమావేశాలు జరుగుతుండటంతో ప్రాధాన్యత సంతరించుకున్నది. అందులో భాగంగా సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆఫీస్‌బేరర్ల సమావేశం జరిగింది. జాతీయస్థాయి, ముఖ్యనేతలు అని చూడకుండా ఓన్లీ రాష్ట్ర ఆఫీస్‌బేరర్లకు మాత్రమే ఆ సమావేశంలో పాల్గొనేలా చూశారు. మంగళవారం నాడు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలతో మరో సమావేశాన్ని నిర్వహించనున్నారు. సంస్థాగతంగా పట్టులేకుండా అధికారంలోకి రావడం కష్టమని రాష్ట్ర నేతల ముందే ప్రకాశ్ జవదేకర్ తేల్చిచెప్పినట్టు తెలిసింది. మీడియా ప్రతినిధులతో జాగ్రత్త ఉండాలని కూడా సూచించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే రాష్ట్రంలో పోలింగ్ బూతుల వారీగా బలోపేతం కావడంపైన దృష్టిసారించాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. ఎన్నికల కాలంలో ఇప్పటికిప్పుడు అది సాధ్యమవుతుందా? అనే ప్రశ్న కూడా ఉత్పన్నమైన నేపథ్యంలో కనీసం గ్రామస్థాయి వరకైనా పార్టీని తీసుకెళ్లేలా 100 రోజుల ప్రణాళిక రూపొందించే పనిలో పడింది. అందులో భాగంగానే నేతలంతా హైదరాబాద్‌కు పరిమితం కాకుండా క్షేత్రస్థాయికి వెళ్లి పనిచేయాలనీ, లేనిపక్షంలో చర్యలు తప్పవని జవదేకర్ హెచ్చరించినట్టు తెలిసింది. ప్రజల్లోకి 9 ఏండ్ల మోడీ ప్రభుత్వ విజయాలు, అమల్లోకి తీసుకొచ్చిన పథకాలను విస్తృతంగా తీసుకెళ్లాలని ఆయన ఆదేశించినట్టు సమాచారం. అదే సమయంలో రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు, వాటి అమలు తీరు, వైఫల్యాలను ఎక్కడికక్కడ ఎండగట్టాలని నిర్ణయించినట్టు తెలిసింది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ముగ్గురు కీలక నేతలతో (కిషన్‌రెడ్డి, ఈటల, బండి?) పాదయాత్రలు చేయించాలనే నిర్ణయానికి వచ్చినట్టు విశ్వసనీయ సమాచారం. ఉమ్మడి 10 జిల్లాలను మూడు భాగాలుగా విభజించి ఒక్కొక్కరు ఒక్కో ప్రాంతంలో పాదయాత్ర మొదలుపెట్టనున్నట్టు తెలిసింది. ఆయా ప్రాంతాల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించే బాధ్యతను కూడా వారికే కట్టబెట్టే అవకాశం ఉంది. అయితే, ఈ నిర్ణయాలను అధికారికంగా వెల్లడించలేదు. మంగళవారం జరిగే జిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమావేశంలో మరింత క్లారిటీ వచ్చే అవకాశముంది.

12న గాంధీభవన్‌లో సత్యాగ్రహ దీక్ష : డాక్టర్ మల్లు రవి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అణచివేతకు వ్యతిరేకంగా ఈ నెల 12న హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో అక్కడి మహాత్ముని విగ్రహం ముందు సత్యాగ్రహ దీక్ష చేయనున్నట్టు టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి తెలిపారు. గాంధీభవన్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని దేశ ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ప్రజలంతా ఐక్యమత్యంగా ఉండాలని కోరుకుంటూ ఆయన భారత్ జోడో యాత్ర చేశారని గుర్తుచేశారు. రాజకీయంగా ఆయన్ను దెబ్బతీసేందుకే చిన్న కేసును పెద్దగా చేసి బీజేపీ ప్రభుత్వం అణచివేస్తున్నదని విమర్శించారు.

రాజ్యాంగ రక్షణకు అందరూ ఏకమవ్వాలి

దళితుల సమస్యలపై జాతీయస్థాయి ఉద్యమం

- ఏఐఏడబ్ల్యూయూ ప్రధాన కార్యదర్శి బి వెంకట్
- రాజ్యాంగం రద్దుకు బీజేపీ ప్రయత్నం
- ఏఐడీఆర్ఎం ప్రధాన కార్యదర్శి నిర్మల్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాజ్యాంగ రక్షణకు అందరూ ఏకం కావాల్సిన అవసరముందని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) బి వెంకట్ పిలుపునిచ్చారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ స్థాయి ఉద్యమాన్ని చేపడతామని చెప్పారు. ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోని బీజేపీ ప్రభుత్వం పదేండ్ల పాలనలో దళితులు, పేదల హక్కులను కాలరాసిందని ఆలిండియా దళిత్ రైట్ మూవ్‌మెంట్ (ఏఐడీఆర్ఎం) ప్రధాన కార్యదర్శి నిర్మల్ విమర్శించారు. రాజ్యాంగం రద్దుకు ప్రయత్నిస్తున్నదని అన్నారు. మధ్యయుగాల కాలంనాటి మనుస్మృతిని తిరిగి ప్రవేశపెట్టాలని చూస్తున్నదని చెప్పారు. బీజేపీ పాలనలో దళితులకు ఎలాంటి రక్షణ లేదనీ, దాడులు దౌర్జన్యాలు 300 రెట్లు పెరిగాయన్నారు. సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని మఖ్దూంభవన్‌లో కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్), తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (జవహర్‌నగర్), తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (అమృత ఎస్టేట్) సంఘాల సంయుక్త సమావేశం బీకేఎంయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన బి వెంకట్, నిర్మల్ మాట్లాడుతూ బీజేపీ అధికారంలో వచ్చినప్పటి నుంచి రాజ్యాంగ హక్కుల రద్దు కాబడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాజ్యాంగంలో ఒక్కొక్క పేజీని ప్రభుత్వం చింపుతోందని విమర్శించారు. దేశ ప్రజలందరికీ దిశా నిర్దేశం చేసే రాజ్యాంగాన్ని రద్దుచేసి మనుస్మృతిని ప్రవేశపెట్టి మత రాజ్యాన్ని స్థాపించాలని చూస్తున్నదని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ఒక్కొక్కటిగా అమ్ముతూ రిజర్వేషన్లు లేకుండా చేసి రాజ్యాంగంలో మూల స్తంభంలాంటి సామాజిక న్యాయాన్ని సమాధి చేస్తుందన్నారు. వామపక్షాల ఒత్తిడితో వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం కూలీలలో అత్యధికలు దళితులే ఉన్నారని వివరించారు. వారికి కేటాయించిన నిధులు ఏటా తగ్గిస్తూ ఆ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రమైన మధ్యప్రదేశ్‌లో ఆదివాసి గిరిజన బిడ్డపై అధికార పార్టీ ఎమ్మెల్యే సహాయకుడు నడిరోడ్డుపై మూత్రం పోయడం చూస్తే దేశం ప్రస్తుతం ఎటు పోతుందనే అనుమానం కలుగుతుందన్నారు. ఈ పోకడలు చూస్తే మనువాదానికి మత ఘర్షణలకు పేదల మధ్యలో వైషమ్యాలకు ఉద్దేశపూర్వకంగానే బీజేపీ కుటిల ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రజాస్వామిక దేశంలో పౌరులు ప్రశ్నించడాన్ని స్వాగతించాల్సింది పోయి అక్రమ కేసులు బనాయించటం సరికాదన్నారు. జాతీయ స్థాయిలో దళితుల హక్కుల కోసం ఒక కీలకమైన ఎజెండాను వారి ముందు ఉంచుతామని చెప్పారు. ఈ సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్‌వెస్లీ, టి స్కైలాబ్‌బాబు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాంతయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, రాష్ట్ర నాయకులు ఆర్ అంజనేయులు, డీహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్, రాష్ట్ర గౌరవాధ్యక్షులు యేసు రత్నం కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం కృపాసాగర్, ఎన్ బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయండి

- ఆ పదంలోనే వివక్ష : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా





నవతెలంగాణ-సుల్తాన్ బజార్

పదహారు సంవత్సరాల నుంచి ఎన్‌హెచ్ఎంలో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలందరినీ రెగ్యులర్ చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లో వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ధర్నాలో కూనంనేని మాట్లాడారు. అసలు రెండో ఏఎన్ఎం అనే పదంలోనే వివక్షత ఉందన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులందరినీ ద్వితీయ శ్రేణి ఉద్యోగులుగా భావిస్తున్నారనటానికి ఈ పదమే నిదర్శనం అన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు సేవ చేసిన సిబ్బందిని గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకే పని.. ఒకే విద్యార్హత ఉండి వేతనంలో భారీ స్థాయిలో వ్యత్యాసాలు ఉండటం సరైందని కాదన్నారు. గ్రామపంచాయతీ పరిధిలో రోగులతో అత్యంత ప్రేమగా ఉంటూ సేవ చేసే ఏఎన్ఎంలను ప్రభుత్వం మంచిగా చూసుకుంటే వారు ప్రభుత్వం గురించి మంచిగా చెబుతారని చెప్పారు. ఉద్యోగంలో చేరి 20, 25 సంవత్సరాలు అయినా ఒట్టి చేతులతో ఇంటికి వెళ్లడం బాధాకరమన్నారు. ప్రభుత్వం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల గురించి ఆలోచించి పర్మినెంట్ చేయడంతోపాటు.. 20 సంవత్సరాల సేవకుగాను రిటైర్ అయ్యాక పెన్షన్ సౌకర్యాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ..

చాలీచాలని వేతనాలతో బతుకుతున్నామని రెండో ఏఎన్ఎంలు తమ గోడును వెళ్లబోసుకుంటుంటే.. వేతనాలు చాలకపోతే ఈ పని మానేసి వేరే పనికి పోండి అని ఎగతాళి చేసిన మంత్రి హరీశ్‌రావు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాయకులు నరసింహ మాట్లాడుతూ.. సెకండ్ ఏఎన్ఎంలకు రూ.41 వేల వేతనంతోపాటు, రూ.10 లక్షల హెల్త్ ఇన్సూరెన్స్, ఎవరైనా సెకండ్ ఏఎన్ఎం ప్రమాదవశాత్తు మరణిస్తే రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియా, కుటుంబంలో ఒకరికి కారుణ్య నియమాకాన్ని ఆరు నెలల్లోపు అందించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌లను 15 రోజుల్లో నెరవేర్చకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెండో ఏఎన్ఎంల యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బడేటి వనిజ, ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ, ఆర్గనైజింగ్ కార్యదర్శి చిడుమూరి విజయ, ఉపాధ్యక్షులు మంజుల, పుష్పలత, ప్రవీణ, శారదా, స్వప్న, చంద్రకళ, తులసి, అరుణ, సరళ, సంగీత తదితరులు పాల్గొన్నారు.



రేపటి విద్యాసంస్థల బంద్‌కు వామపక్ష యువజన సంఘాల సంపూర్ణ మద్దతు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 12న వామపక్ష విద్యార్థి సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త విద్యాసంస్థల (పాఠశాలలు, జూనియర్ కళాశాలల) బంద్‌కు వామపక్ష యువజన సంఘాలు డీవైఎఫ్ఐ, ఏఐవైఎఫ్, పీవైఎల్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కమిటీలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయి. ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొనాలని నిర్ణయించాయి. వామపక్ష యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సమావేశం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని రాజ్‌బహదూర్‌హాల్‌లో సోమవారం నిర్వహించారు. విద్యాసంస్థల బంద్‌కు సంబంధించిన గోడపత్రికను ఆయా సంఘాల నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధర్మేంద్ర, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ ప్రదీప్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా నేటికీ ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలు అందలేదనీ, మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని చెప్పారు. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామంటూ ప్రకటనలు చేస్తున్నా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. జీవో నెంబర్ ఒకటి నిబంధనలను ఉల్లంఘిస్తూ ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు యథేచ్ఛగా విద్యావ్యాపారాన్ని కొనసాగిస్తున్నాయని విమర్శించారు. చదువు'కొన'గలిగే వారికే అందుతున్నదని అన్నారు.

ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై విద్యాశాధికారుల ఆజమాయిషీ తగ్గిందని, అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్నా, అనధికారికంగా విద్యాసంస్థలను నడిపిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక, నాన్ టీచింగ్ పోస్టులను, ఎంఈఓ, డిప్యూటీ ఈవో, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

జీవో నెంబర్ ఒకటి నిబంధలను పాటించని ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని కోరారు. వాటిలో పనిచేస్తున్న డ్రైవర్లు, బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలివ్వాలని చెప్పారు. ఫీజుల నియంత్రణ కమిటీ సిఫారసులను అన్ని విద్యాసంస్థలూ అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్, ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నిర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సల్మాన్ బైగ్, టి సత్యప్రసాద్, పీవైఎల్ రాష్ట్ర నాయకులు రవికుమార్, బి కృష్ణ, బి శ్రీనివాస్, రాజు, ఏఐఎఫ్‌డీవై హైదరాబాద్ జిల్లా నేత మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎల్ఎఫ్ మద్దతు

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రయివేట్ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యార్థి సంఘాలు ఈనెల 12న తలపెట్టిన విద్యాసంస్థల బంద్‌కు తెలంగాణ ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్ల ఫెడరేషన్ (టీపీటీఎల్ఎఫ్) మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర కన్వీనర్ ఎ విజయ్‌కుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజులకు నియంత్రణ చట్టం చేయాలని డిమాండ్ డిమాండ్ చేశారు. అధిక ఫీజుల సమస్యలతోపాటు, ఫీజుల వసూలుకు తగ్గట్లు వసతులు కల్పించడంలో విద్యాసంస్థలు శ్రద్ధ చూపడం లేదని విమర్శించారు. టీచర్లు, లెక్చరర్లకి జీతాలివ్వడంలో వైఫల్యాలున్నాయని తెలిపారు. బోధనా సిబ్బందికి ఈఎస్ఐ, పీఎఫ్ ఇవ్వకపోవడం, వారికి భద్రత కల్పించకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. విద్యాసంవత్సరం మధ్యలో తీసేయడం సమంజసం కాదని తెలిపారు. ప్రయివేటు టీచర్లు, లెక్చరర్ల సేవలను గుర్తించి అందరినీ రిజిస్ట్రేషన్ చేయాలనీ, గుర్తింపు కార్డులివ్వాలనీ, ఆరోగ్య కార్డులివ్వాలని సూచించారు.

కరీంనగర్ ఎమ్మెల్యే ఎన్నికలపై విచారణ 21కి వాయిదా

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కరీంనగర్ అసెంబ్లీ స్థానానికి 2018లో నిర్వహించిన ఎన్నికల్లో అవకతవకలు జరిగాయంటూ దాఖలైన పిటిషన్ విచారణకు బీజేపీ ఎంపీ బండి సంజయ్ కుమార్ సోమవారం హైకోర్టుకు హాజరయ్యారు. ఆయన సాక్ష్యాన్ని న్యాయమూర్తి రికార్డు చేశారు. తదుపరి విచారణను ఈనెల 21కి వాయిదా వేశారు. 2018లో ఎమ్మెల్యేగా గంగుల కమలాకర్ ఎన్నిక చట్టవిరుద్ధమని ప్రకటించాలంటూ బీజేపీ ఎంపీ బండి సంజయ్ 2019లో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ 21వ తేదీకి వాయిదా వేస్తూ జస్టిస్ సుమలత ఆదేశాలు జారీ చేశారు.

కోకాపేట్‌లో బీఆర్ఎస్‌కు 11 ఎకరాలను రద్దు చేయాలి

రంగారెడ్డి జిల్లా గండిపేట్ మండలం, కోకాపేట్ గ్రామంలోని సర్వే నంబర్ 239, 240లో ఉన్న 11 ఎకరాల ప్రభుత్వ భూమిని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ కార్యాలయానికి కేటాయింపులను రద్దు చేయాలని కోరుతూ ఫోరమ్ ఫర్ గుడ్ గవర్నెన్స్ కార్యదర్శి ఎం పద్మనాభరెడ్డి సోమవారం పిల్ దాఖలు చేశారు. రూ.500 కోట్ల అత్యంత విలువైన భూమిని కేటాయించడాన్ని రద్దు చేయాలని కోరారు. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్‌ని స్థాపించడానికి 11 ఎకరాలు కేటాయించాలని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దరఖాస్తు చేసుకున్నారనీ, అందులో పార్టీ కార్యాలయాన్ని నిర్మించడం చట్ట వ్యతిరేకమైమని ప్రకటించాలని కోరారు. అక్కడ ఎకరం ధర రూ.50 కోట్ల వరకు ఉందని చెప్పారు. భూమి విలువ రూ.3.41, కోట్లకే ఇవ్వడం అన్యాయమని అన్నారు. దరఖాస్తు చేసుకున్న ఐదు రోజుల్లోనే భూమి కేటాయింపు చేయడం జరిగిందని ఆక్షేపించారు.

గతేడాది ఇచ్చిన వాగ్దానాలు మరిచారు

- బోనాల ఉత్సవాల రంగంలో స్వర్ణలత
- విద్యుద్ఘాతంతో ఒకరు మృతి



నవతెలంగాణ-బేగంపేట్/కంటోన్మెంట్

సికింద్రాబాద్ లష్కర్ బోనాల్లో భాగంగా సోమవారం ఉజ్జయిని మహంకాళి ఆలయంలో రంగం కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది స్వర్ణలత కుండపై నిలబడి మాట్లాడారు. భక్తులు చేసిన పూజలతో తాను సంతోషంగా ఉన్నానని తెలిపారు. సంతోషంగా, ఆనందంగా, ఎటువంటి లోపం లేకుండా పూజలు అందుకున్నానని చెప్పారు. గతేడాది తనకు మాట ఇచ్చి ఎందుకు మరిచి పోయారని ప్రశ్నించారు. వర్షాలు వస్తాయని, కానీ కొంచెం ఒడిదుడుకులు ఉంటాయని అన్నారు. తన వద్దకి వచ్చిన వారిని చల్లగా చూసుకునే బాధ్యత తనదేనన్నారు. ఐదు వారాలపాటు తనను ముత్తైదులందరూ భక్తిశ్రద్ధలతో కొలుచుకోవాలన్నారు. ఐదు వారాలు సాక పోయాలన్నారు. అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. కొన్ని ప్రమాదాలు జరుగుతుంటాయని, ఒడిదుడుకులు ఎదుర్కోవాల్సి ఉంటుందని తెలిపారు. వచ్చే ఏడాది అన్ని పూజలు జరిపించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

రంగం కార్యక్రమం అనంతరం అంబారిపై అమ్మవారిని పురవీధుల్లో ఊరేగించారు. పోతరాజుల విన్యాసాలు, సాంస్కృతిక కార్యక్రమాలు డప్పు దరువులతో వేడుక ఘనంగా జరిగింది. శ్రీ ఉజ్జయిని మహంకాళి దేవాలయానికి వచ్చిన తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌కు ఈవో మనోహర్ రెడ్డి స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేయించారు.

బోనాల ఉత్సవాల్లో అపశృతి

సికింద్రాబాద్ బోనాల ఉత్సవాల్లో అపశృతి చోటుచేసుకుంది. మహంకాళి అమ్మవారిని దర్శించుకోడానికి వచ్చిన ఓ వ్యక్తి విద్యుత్ స్తంభాన్ని తాకి షాక్‌కు గురై మృతిచెందాడు. కార్వాన్ ప్రాంతానికి చెందిన ఆకాష్ సింగ్ (27) సేల్స్ మెన్‌గా బేగంబజార్‌లో పని చేసేవాడు. ఆదివారం రాత్రి మహంకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చాడు. ఈ క్రమంలో సిటీ లైట్ హోటల్ సమీపాన కరెంట్ పోల్ తగిలి వర్షం వల్ల షాక్ కొట్టి ప్రాణం కోల్పోయాడు. సమాచారం అందుకున్న మోండా మార్కెట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ కుదరదు

- యూజీసీ నిబంధనలు అంగీకరించవన్న విద్యాశాఖ
- కేయూ వీసీ ప్రతిపాదనల తిరస్కరణ
- రూ.50 లక్షల వరకు వసూలు చేసినట్టు ఆరోపణలు
- ఆందోళనలో పార్ట్‌టైం అధ్యాపకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాకతీయ విశ్వవిద్యాలయం (కేయూ)లో ఫుల్ వర్క్‌లోడ్ కలిగిన పార్ట్ టైం అధ్యాపకులను కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ చేసేందుకు కుదరదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. కన్వర్షన్ చేసేలా యూజీసీ నిబంధనలు, మార్గదర్శకాల్లో లేదని విద్యాశాఖ ప్రకటించింది. ఈ మేరకు ఇటీవల కాకతీయ విశ్వవిద్యాలయానికి విద్యాశాఖ కార్యదర్శి లేఖ రాయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. పార్ట్‌టైం లెక్చరర్ల ఆశలపై ప్రభుత్వం నీళ్లు చల్లింది. దీంతో వారు తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. వాస్తవానికి కాంట్రాక్టు లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కోరుతూ మాజీ ఎంపీ, ప్రణాళికా సంఘం వైస్ చైర్మెన్ బోయినపల్లి వినోద్ కుమార్‌ను కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేశారు. ఆయన సిఫారసు మేరకు ఆ వర్సిటీలో ఫుల్ వర్క్‌లోడ్ కలిగిన పార్ట్ టైం లెక్చరర్లందరి వివరాలు పంపాలని ఉన్నత విద్యాశాఖ కాకతీయ వర్సిటీకి లేఖ రాసింది. అయితే యూనివర్సిటీ అధికారులు మాత్రం అందరి పేర్లు పంపకుండా కేవలం 30 మంది పార్ట్ టైం లెక్చరర్లనే కాంట్రాక్టు లెక్చరర్లుగా మార్చాలని కోరుతూ 2022, ఫిబ్రవరి 22న కేయూ వీసీ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు తెలిసింది. అర్హులు సుమారు 70 మంది వరకు ఉన్నప్పటికీ ఇలా కొందరి పేర్లు మాత్రమే పంపడం వివాదానికి దారితీసింది. పార్ట్ టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ చేస్తామంటూ ఇందుకు ఖర్చులుంటాయనే పేరుతో వర్సిటీలోని ఓ కీలక అధికారి కోసం కొందరు పార్ట్ టైం లెక్చరర్ యూనియన్ నాయకులు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలొచ్చాయి. సుమారు రూ.50 లక్షల వరకు వారి నుంచి వసూలు చేసినట్టు సమాచారం. ఇంటెలిజెన్స్ విభాగం అందించిన సమాచారం, ఇప్పటికే తెలంగాణ యూనివర్సిటీ అనుభవాలు అవినీతి ఆరోపణల నేపథ్యంలోనే కాంట్రాక్ట్ కన్వర్షన్ కుదరదని విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది. దీంతో రెండేండ్ల క్రితం పంపిన ప్రతిపాదనలను తాజాగా ప్రభుత్వం తిరస్కరించడంతో ఆ వర్సిటీలో చర్చనీయాశంగా మారింది. ఈ కారణంగా ఎన్నో ఏండ్లుగా పార్ట్ టైం లెక్చరర్లు ఎదురు చూస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లుగా కన్వర్షన్ ప్రక్రియ గందరగోళంలో పడింది. దీంతో వారు తీవ్ర నిరాశలో ఉన్నారు.

ఆర్టీసీలో ఎన్నికలు నిర్వహించాలి

- మాస్టర్ పేస్కేలు అమలు చేయాలి
- సిబ్బందిపై వేధింపులు ఆపాలి..

పనిగంటలు తగ్గించాలి : కార్మిక శాఖ అదనపు కమిషనర్ గంగాధర్‌కు ఆర్టీసీ జేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీలో తక్షణమే ఎన్నికలు జరిపేలా చర్యలు తీసుకోవాలనీ, సిబ్బందికి మాస్టర్ పేస్కేలు అమలు చేయడంతో పెండింగ్‌లో ఉన్న రెండు పీఆర్సీలను వర్తింపజేయాలని ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ ఇ.అశ్వత్థామరెడ్డి, కన్వీనర్ కె.హనుమంతు ముదిరాజ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయంలో అదనపు కమిషనర్ గంగాధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్టీసీలో సిబ్బంది ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఎన్నికలు జరిపేలా చూడాలని కోరారు. అనంతరం కమిషనరేట్ బయట వారిద్దరూ మీడియాతో మాట్లాడారు. కార్మికులను చైతన్యం చేయడం కోసం డిపోల్లో భరోసా యాత్రలు చేపడుతున్నామని చెప్పారు. జేఏసీతో మిగతా సంఘాలు కూడా కలిసిరావాలని కోరారు. ఆర్టీసీ కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటానికి అందరూ మద్దతు తెలపాలని కోరారు. కార్మికులతో సంస్థ 12 నుంచి 15 గంటలు పనిచేయించడం దారుణమనీ, వేధింపులను ఆపాలని డిమాండ్ చేశారు. పక్కరాష్ట్రంలో మాదిరిగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సీసీఎస్, పీఎఫ్ డబ్బులను వెంటనే రిలీజ్ చేయాలని విన్నవించారు. టికెట్ తీసుకునే బాధ్యత పూర్తిగా ప్రయాణికుడిదిగా నిర్ణయించాలనీ, 2021లో విడుదల చేసిన ఉద్యోగభద్రత గైడ్‌లైన్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీలోని హైర్ బస్సులన్నింటినీ సంస్థ స్వాధీనం చేసుకోవాలనీ, వాటిపై పనిచేస్తున్న డ్రైవర్లను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. ప్రయివేటు వాహనాల ద్వారా ప్రయాణికులను తరలిస్తున్న వారికి అడ్డుకుని వాటిని సీజ్ చేయాలన్నారు. 8 గంటలు దాటి పనిచేస్తే డబుల్ వేజ్ చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కో-కన్వీనర్లు నరేందర్, సుద్దాల సురేశ్, హరికిషన్, సత్యనారాయణరెడ్డి, స్వాములయ్య, చెన్నారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 9 కేసులు నమోదు



నవతెలంగాణ-సంతోష్ నగర్

చంపాపేట్ డివిజన్ చౌరస్తా, యాదిరెడ్డి గార్డెన్ వద్ద సంతోష్ నగర్ ట్రాఫిక్ పోలీసులు ఆదివారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ట్రాఫిక్ సీఐ విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించగా సుమారు 9 కేసులను నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఎస్సై వి. సత్యనారాయణ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపిన 9 మంది (6 ద్విచక్ర వాహనదారులు, 2 ఆటోలు, 1 కారు) డ్రైవర్లపై కేసులు నమోదు చేసినట్టు పేర్కొన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. ఎన్ని అవగాహన కార్యక్రమాలను నిర్వహించినా వాహనదారుల్లో మార్పు రావడం లేదన్నారు. కార్యక్రమంలో పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బ్యాడ్మింటన్ సామాగ్రి అందజేత



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీలో బ్యాడ్మింటన్ గ్రౌండ్ సభ్యులు సోమవారం బి.యన్ రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి బ్యాడ్మింటన్ గ్రౌండ్‌ను అభివద్ధి చేయాలని కోరారు. స్పందించిన కార్పొరేటర్ వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలోనే గ్రౌండ్‌ను అభివద్ధి చేయాలని సూచించారు. బ్యాడ్మింటన్ సభ్యులకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు సుబ్రహ్మణ్యం, పవన్, రాజేష్, కిరణ్, అనిల్, రాజశేఖర్, సాయి సుబ్రహ్మణ్యం, వీరు, కిరణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

- నాన్ లోకల్ ప్రజలకు ప్రతినిధిగా పని చేస్తా..
- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ-మీర్‌పేట్

నాన్ లోకల్ ప్రజలకు ప్రతినిధిగా నియోజకవర్గ అభివద్ధే ధ్యేయంగా పనిచేస్తానని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 9,10వ డివిజన్ పరిధిలో వివిధ అభివద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా 10వ డివిజన్ కార్పొరేటర్ ముద్ద పవన్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన బహిరంగంగా సభలో ఆమె మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో నందీహిల్స్ కాలనీలోని డ్రయినేజీ అవుట్ లేట్ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరగా సంబంధించిన తీగల మోహన్ రెడ్డి సోదరులతో మాట్లాడి అవుట్లెట్ నిర్మాణం చేసుకున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నిరంతరం ప్రజాప్రతినిధులకు ప్రజల అవసరాలను దష్టిలో పెట్టుకొని పని చేయాలని చెప్తుంటారన్నారు. ప్రతిపక్ష పార్టీల నాయకులు సబితా ఇంద్రారెడ్డి నాన్ లోకల్ అని విమర్శలు చేస్తున్నారని... నియోజకవర్గం అభివృద్ధి చేస్తూ నాన్ లోకల్ ప్రజలకు ప్రతినిధిగా పనిచేస్తానని చెప్పారు. మీర్‌పేట్ కార్పొరేషన్ లో అనుకూలమైన పాలకవర్గం ఉండటం కూడా సమస్యలను పరిష్కారం చేయడం సాధ్యమవుతుందని తెలిపారు. చెరువుల మురికి కుపలుగా ఉన్నా అభివద్ధి చేస్తూ సుందరీకరణ చేసుకున్నామని పేర్కొన్నారు. ఎన్ని నిధులు అవసరం ఉన్నా తీసుకోండి.. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకోండి.. అని ముఖ్యమంత్రి కేసీఆర్ దైర్యం ఇవ్వడం వల్లనే అభివృద్ధి చేసుకుంటున్నామని తెలిపారు. మంచి నీటి సమస్య, రోడ్లు, డ్రయినేజీ సమస్యలు త్వరలోనే పరిష్కారమవుతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మంచి విజన్ ఉన్న నాయకుడు ఆయనతో పని చేయడం అదష్టంగా భావిస్తున్నాట్టు సంతోషం వ్యక్తం చేశారు. ఐదు సంవత్సరాలకు ఒకసారి వచ్చే ఓట్ల కోసం కాదు రాజకీయం.. తనను నమ్మి ఓట్లేసి గెలిపించిన ప్రజల కోసం అన్నారు. నిరంతరం ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. రాబోయే ఎన్నికల్లో నిరంతరం ప్రజల బాగుకోసం తపన పడుతున్న కేసీఆర్ ప్రభుత్వానికి, బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ దుర్గా దీప్ లాల్ చౌహన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్ రెడ్డి, ఫ్లోర్ లీడర్ అర్కల భూపాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ సిద్దాల లావణ్య బీరప్ప, స్థానిక కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులు, వివిధ కాలనీల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.



సంక్షేమం అభివృద్ధి లక్ష్యం



- రూ. 470 కోట్లతో ఉప్పల్ అభివృద్ధి
- తూర్పు హైదరాబాద్ అభివృద్ధికి చిరునామా ఉప్పల్
- ప్రతిపక్ష పార్టీలు చిల్లర రాజకీయాలు మానుకోవాలి : ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి
- పాదయాత్రకు విశేష స్పందన

నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి సంక్షేమ లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్ రెడ్డి అన్నారు. ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి తూర్పు హైదరాబాద్‌కు చిరునామా అన్నారు. సోమవారం చిలకనగర్ డివిజన్‌లో ఆరో రోజు నిర్వహిస్తున్న పాదయాత్రను సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉప్పల్ నమస్తే పేరుతో ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం లక్ష్యంగా అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ పరిష్కరిస్తున్నామని తెలిపారు నాలుగు సంవత్సరాల రూ. 470 కోట్లతో ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేశామని ఆయన పేర్కొన్నారు. ఉప్పల్లో ముఖ్యంగా స్కైవాక్ ఏర్పాటు, మినీ శిల్పారామం ఏర్పాటుతో అభివృద్ధికి చిరునామన్నారు. డివిజన్‌లో ఎక్కడ డ్రయినేజీ సమస్య లేకుండా ఎప్పటికప్పుడు అధికారులతో సంప్రదించి పరిష్కారం కోసం కాంట్రాక్టర్లతో సమావేశాలు ఏర్పాటు చేసి నూతన డ్రయినేజీ వ్యవస్థను ఏర్పాటు చేశామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి ఆమడ దూరం నిలిచిందని ఆయన విమర్శించారు. పనులు చేయని గత పాలకులు వారికి అభివృద్ధి పనులు కనిపిస్తున్న రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటు అన్నారు నియోజకవర్గంలోని కల్వర్టులు, రోడ్లు, పార్కులు ఏర్పాటుచేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చేస్తున్నామన్నారు. అనంతరం కాలనీవాసులు లోతట్టు ప్రాంతాలలో డ్రయినేజీ సమస్య పరిష్కారం కోసం, లో ప్రెషర్ సమస్యకు వినతి పత్రాలు సమర్పించారు

లోతట్టు ప్రాంతాలలో రోడ్లపై నీరు నిలవకుండా డ్రయినేజీ వ్యవస్థను ఆధునికపరిచి అవసరమైన రోడ్లు వేయాలని, తాగునీరు సమస్య, కలుషిత నీరు, ఎత్తయిన ప్రదేశాలలో తాగునీటి లోప్రెజర్ సమస్య, వంగిపోయిన విద్యుత్ స్తంభాల ఆధునీకరణ, వీధి దీపాల ఏర్పాటు, మురికి కాలువ నుంచి తీసిన వ్యర్థాలను తొలగించాలని, ఓపెన్ నాలాపై పై కప్పు నిర్మాణం, మాన్యువల్స్ ఏర్పాటు చేయాలని డ్రయినేజీ, ఓపెన్ నాలా ఆధునికరణ, అవసరమైన చోట్ల మ్యాన్ హెూల్ ల ఏర్పాటు, సీసీ రోడ్లు వేయాలని, వీధి దీపాల ఏర్పాటు, తాగునీరు పైపులైను వేయాలని, లీకేజీ సమస్యను పరిష్కరించాలని, బోర్ వెల్ హ్యాండ్ పంపు రిపేర్ చేయించాలని, త్రీఫేస్ ఎలక్ట్రిసిటీ, సీసీ రోడ్డు వెయ్యాలని, ఆసరా పెన్షన్స్ ఇవ్వాలని , వెంకటేశ్వర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్‌కు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేయాలని, ఆదర్శనగర్ కాలనీలో రోడ్ నెంబర్ 3 లో పార్కును అభివృద్ధి పరచాలని, న్యూరాం నగర్ లో ఓల్టేజ్ కరెంటు సమస్య పరిష్కరించాలని స్థానిక కాలనీ వాసులు ఎమ్మెల్యేకు వినతి పత్రాలు అందజేశారు. అందుకు ఎమ్మెల్యే ప్రజల నుంచి వినతి పత్రాలను స్వీకరిస్తూ వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేసి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం వెంకటేశ్వర నగర్ పోచమ్మ దేవాలయం ఆవరణంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి, ప్రెస్ మీట్ పెట్టి ఈ పాదయాత్రలో ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన సమస్యలను వివరించి, సమస్యలను త్వరతగతిన పరిష్కరించిన విషయాలను తెలిపారు ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు జనం పెళ్లి వెంకటేశ్వర రెడ్డి గుడి మధుసూదన్ రెడ్డి పల్లె నర్సింగరావు పిట్టల నరేష్ చెల్లి మోహన్ ఈరేలి రవీందర్ వేముల సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

జర్నలిస్టుల సమస్యలు నాకు తెలుసు



- ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ-హాయత్ నగర్

సమాజంలో ఉన్న అసమానతలను రుగ్మతలను రూపుమాపుతూ సమాజ ఉద్ధరణకు పాటుపడుతున్న జర్నలిస్టుల సమస్యలు తనకు తెలుసునని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. సోమవారం ఎల్బీనగర్ వర్కింగ్ జర్నలిస్టు జేఏసీ ఆధ్వర్యంలో చైర్మెన్ వి ఎస్ రాజు అధ్యక్షతన ఏర్పాటుచేసిన మాట ముచ్చట కార్యక్రమానికి విచ్చేసి ఆయన మాట్లాడారు. సమాజంలో మార్పునకు మీవంతు ప్రయత్నాలు చేస్తున్నారు,కానీ మీ బతుకులు మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో పనిచేస్తున్న జర్నలిస్టులు గత కొంతకాలంగా నివాస స్థలాలు కేటాయించాలని కోరుతున్నారని తెలిపారు. తన వంతు ప్రయత్నంగా జిల్లా మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి ద్వారా ప్రయత్నాలు మొదలుపెట్టానని అన్నారు. ప్రయత్నంలో భాగంగా కొంతమేర సక్సెస్ సాధించడం జరిగిందని, పూర్తిస్థాయిలో అందరి జర్నలిస్టులకు నివాస స్థలాలు ఇప్పించడానికి తాను నిరంతరం శ్రమిస్తున్నట్లు తెలిపారు. మీ జీవన ప్రమాణాలు మెరుగుపరచడానికి దొరికిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మీకు న్యాయం జరిగే వరకూ నావంతు కృషి చేస్తానన్నారు. ఎల్బీ నగర్ నియోజకవర్గం జీహెచ్ఎంసీ పరిధిలో ఉండడంతో ప్రభుత్వ స్థలాలు లేకపోవడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు. అందుకే జిల్లా మంత్రి సహకారంతో పక్క నియోజకవర్గమైన ఇబ్రహీంపట్నం పరిధిలో ఉన్న స్థలాలను ఎమ్మెల్యే సహకారంతో పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.ప్రయత్నలోపం లేకుండా మీకోసం నేను గత మూడు నెలలుగా ఎంతో శ్రమిస్తున్నట్లు తెలిపారు. శ్రమకు తగిన ఫలితం దక్కుతుందని తాను ఆశిస్తున్నానని మీరు కూడా తనకు అండగా ఉండాలని కోరారు.ఫలితం అనుభవించే వరకు మీ జేఏసీ నిరంతరం ఇలాగే క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. రెండు మూడు రోజులలో జిల్లా మంత్రి సబితఇంద్రారెడ్డి తో తేనేటి విందు కార్యక్రమం ఏర్పాటు చేసుకొని మన సమస్యను ఆమె దృష్టిలో పెట్టి పరిష్కారం కోసం కృషి చేసుకుందామని సూచించారు. జర్నలిస్టులు వారి కుటుంబసభ్యులతో కలిసి భోజనం చేశారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

12న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా



నవతెలంగాణ-వనస్థలిపురం

వనస్థలిపురం డివిజన్‌లోని తెలంగాణ ప్రభుత్వం ఫంక్షన్స్ జేఏసీ కార్యాలయంలో జేఏసీ చైర్మెన్ కొలిశెట్టి లక్ష్మయ్య అధ్యక్షతన సోమవారం జేఏసీ కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మెన్ లక్ష్మయ్య, సెక్రటరీ జనరల్ టీ సుబ్బారావు లు మాట్లాడుతూ ఫంక్షన్స్ జేఏసీ ఆధ్వర్యంలో సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ జూన్ 28న కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన విజయవంతం చేసిన కార్యకర్తలను అభినందించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పెద్ద ఎత్తున ఈ నిరసన చేపట్టినప్పటికీ ప్రభుత్వంలో స్పందన రాకపోవడంతో రెండో దశ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో మహా ధర్నా కార్యక్రమాన్ని జూలై 12 నాడు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. ఈ ధర్నా కార్యక్రమానికి ఆల్ ఇండియా స్టేట్ పెన్షనర్స్ ఫౌండేషన్ జనరల్ సెక్రెటరీ డి సుధాకర్, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, తెలంగాణ జన సమితి పార్టీ ఫౌండర్ కోదండరాం, మాజీ ఎమ్మెల్సీ నాగేశ్వర్, సెంట్రల్ యూనివర్సిటీ హర గోపాల్, విశ్వేశ్వరరావు, అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్ స్వామి, టీఎస్ యూటీఎఫ్ సెక్రటరీ రవి, ఎస్టీయూ టీఎస్ అధ్యక్షుడు సదానంద్‌లో హాజరవుతున్నట్టు జేఏసీ చైర్మెన్ తెలిపారు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలపై 12 వరకు సమ్మె



నవతెలంగాణ-హాయత్‌నగర్

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనాలు, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచి,పెండింగ్ బిల్లులు ఇవ్వాలని సీఐటీయూ ఆధ్వర్యంలో 12వ తారీఖు వరకు జరిగే సమ్మెను జయప్రదం చేయాలని హయత్ నగర్ మండల కేంద్రంలో సోమవారం ర్యాలీ నిర్వహించి, ఎంఈఓ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు ఏర్పుల నరసింహ హాజరై మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం చేసిన వాగ్దానం నిలబెట్టుకోవాలని, మూడు వేలు పెంచుతున్నట్టు ప్రకటించి ఇప్పటివరకు దిక్కు దివానా లేదని అన్నారు. గత ఎనిమిది నెలలుగా మెస్ బిల్లు రాకపోవడం వల్ల, లక్షలు వడ్డీలకు తెచ్చి అన్నం వండి పెడుతున్నారని, ముందే మధ్యాహ్న భోజన కార్మికులు చాలీచాలని వేతనాలతో కుటుంబాలు పోషించుకుంటున్న వీరికి వడ్డీలు కట్టలేక ఇల్లు గడవక నాన్న ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఈ సమస్యల మీద మూడు రోజులు నిరసన కార్యక్రమాలు చేస్తుంటే, ప్రభుత్వ పాఠశాలల హెడ్మాస్టర్స్ సమ్మెను విఫలం చేయడం కోసం కార్మికులను బెదిరిస్తూ, మిమ్మల్ని తీసివేసి కొత్తవారిని పెట్టుకుంటామని, వారే వంటలు చేసి పిల్లలకి వడ్డించాలని చూడడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ ప్రభుత్వం దిగివచ్చి మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ బిల్లులు వెంటనే ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తుర్కయంజాల్ సీఐటీయూ నాయకులు ఎం సత్యనారాయణ, హయత్ నగర్ నాయకులు కనకయ్య కార్మికులు ,రమాదేవి, నిర్మల, లక్ష్మమ్మ, మంజుల, నాగరాణి, రంగమ్మ, స్వరూప, అలివేలు, మంగమ్మ, లలిత చాలామంది మధ్యాన భోజన కార్మికులు పాల్గొన్నారు.

జైలుకు వెళ్లొచ్చినా తీరు మారలే..

- ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న దొంగలు అరెస్టు



నవతెలంగాణ-బోడుప్పల్

తాళాలు వేసి ఉన్న ఇండ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలతో పాటు, నలుగురు మైనర్లను అరెస్టు చేసిన సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. మేడిపల్లి పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ ధరవాత్ జానకి వివరాలను వెల్లడించారు. ఉప్పల్ పరిధిలోని అమత కాలనీలో నివాసం ఉంటున్న రాపోలు కృష్ణ అలియాస్ చందు,అదే కాలనీలో నివాసం ఉంటున్న సంపంగి సాంబయ్యలు సెంట్రింగ్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇదే తరుణంలో సులువుగా డబ్బులు సంపాదించడానికి నలుగురు మైనర్లను కలుపుకుని మేడిపల్లి పీఎస్ పరిధిలోని బోడుప్పల్, చెంగిచెర్ల,పీర్జాదిగూడ పరిధిలోని తాళాలు వేసిన ఇండ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఇలా వచ్చిన సొమ్ముతో జల్సాలు చేసుకుంటున్నారు. గతంలో రాపోలు కృష్ణ మైనర్‌గా ఉన్నప్పుడే పలు దొంగతనాల కేసులో రెండు వారాలపాటు జైలుకు వెళ్ళి వచ్చాడు. ఈ క్రమంలో సోమవారం బోడుప్పల్ కమాన్ వద్ద డీఎస్ఐ లక్ష్మణ్ నేతృత్వంలో వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో అదుపులోకి తీసుకుని విచారించగా చేసిన నేరాలను అంగీకరించారు.వారి వద్ద నుంచి 25 తులాల బంగారం,5 వేల నగదు, ద్విచక్ర వాహనం,ఆటో తో పాటు కొన్ని వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకోవడంలో విశేషంగా కషి చేసిన డీఎస్ఐ లక్ష్మణ్‌తో పాటు అతని బృందానికి డీసీపీ రివార్డు అందచేశారు. ఈ మీడియా సమావేశంలో మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, మేడిపల్లి సీఐ గోవర్ధన గిరి తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



నవతెలంగాణ-సంతోష్ నగర్

సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయంలో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. డ్రయినేజీ మురుగు, మంచినీరు, పరిశుభ్రతకు చర్యలు తీసుకోవాలని వేపుగా పెరిగిన చెట్లు, కొమ్మలు, పిచ్చి మొక్కలు క్లీన్ అండ్ నీట్ ఉంచాలని కార్పొరేటర్ అధికారులకు ఆదేశించారు. గత కొద్దిరోజులుగా కురు స్తున్న వర్షాల వల్ల డివిజన్ల వారిగా సమస్యలను గుర్తించి తగు చర్యలు తీసుకో వాలన్నారు. రానున్న బోనాల పండుగను దష్టిలో పెట్టుకొని దేవాలయాల పరిస రాలను శుభ్రం చేసి ప్రజలకు ఎటువంటి ఆటంకాలు లేకుండా చూడాలని ఆమె అన్నారు. ఇంకా రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జీహెచ్ఎంసీ, విద్యుత్ శాఖ, వాటర్ వర్కర్స్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, సానిటరీ, అధికారులు, ప్రజలకు అందుబాటులో ఉండి అప్రమత్తం చేయాలని అన్నారు. బోనాల పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో వాటర్ వర్కర్స్ డీజీఎం షీలా రాణి, మేనేజర్ శ్రవణ్, ఏఎస్‌పీ డివిజన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన కమ్యూనిటి హాల్ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-హాయత్ నగర్

మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కాముని కాంతలో జరుగుతున్న నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే దేవి రెడ్డి సుదీర్ రెడ్డి సోమవారం పరిశీలించారు .ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి మాట్లాడుతూ గతంలో తాను కార్పొరేటర్ గా ఉన్న సమయంలో దాదాపు ఐదు నూతన కమ్యూనిటీ హాల్స్ కోసం దాదాపు రూ. 50 లక్షల జీహెచ్ఎంసీ నుంచి నిధులు మంజూరు చేయిస్తూ టౌన్ ప్లానింగ్ క్లీయరెన్సు అనుమతులు తీసుకొచ్చానని, దానిలో భాగంగా ఇప్పటి వరకు వీరన్న గుట్ట, ఎల్ఐసి కాలనీ నందు కమ్యూనిటి హాల్స్ నిర్మించడం జరిగిందని తెలిపారు.అలాగే వీకర్ సెక్షన్ కాలనీ,కుమ్మరి బస్తీలో నూతన కమ్యూనిటీ హాల్ పనులు టెండర్ దశలో ఉన్నాయని, అతి త్వరలోనే ఈ పనులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ డివిజన్ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు,జగదీష్ యాదవ్,యువ నాయకులు జక్కిడి రఘువీర్ రెడ్డి,నగేష్ యాదవ్,త్రిలోక్ గౌడ్,అఖిల్ యాదవ్,శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'గ్రామ పంచాయతీ సిబ్బంది గోడు వినిపించట్లేదా..?'



నవతెలంగాణ-ఘట్కేసర్

గత ఐదు రోజులుగా వేలాదిమంది గ్రామపంచాయతీ సిబ్బంది తమ న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తుంటే వారి గోడు సీఎంకు వినిపించట్లేదా అని జేఏసి నేతలు ప్రశ్నించారు. ప్రభుత్వం మానవీయతను ప్రదర్శించి తక్షణమే జేఏసీని చర్చలకు పిలిచి సమ్మెను విరమింప చేయాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం ఘట్ కేసర్ ఎంపీడీఓ కార్యాలయంవద్ద గ్రామ పంచాయితీ కార్మికుల ఐదోరోజు సమ్మెను వారు ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని పలుమార్లు ప్రభుత్వానికి విన్నవించినా ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. అధికారుల బెదిరింపులు పాల్పడటం సరైనది కాదన్నారు. నల్గొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి పంచాయతీ కార్మికులను కించపరుస్తూ వ్యాఖ్యానించడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. కార్మికులు కరోనా వంటి కష్ట కాలంలో తమ ప్రాణాలను ఫణంగా పెట్టి పల్లెలను పరిశుభ్రంగా ఉంచారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం మల్టీపర్పస్ విధానం తీసుకొచ్చి ఒకే కార్మికుడికి అనేక రకాల పనులు అప్పగించి పని భారం పెంచిందన్నారు. తక్షణమే మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలన్నారు. పంచాయతీ కార్మికులకు పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం రూ. 19000కు పెంచాలన్నారు. ప్రభుత్వం కార్మికులను బెదిరించడం మానుకొని జేఏసీని చర్చలకు ఆహ్వానించి సమస్యలను పరిష్కరించి సమ్మెను విరమింపచేయాలన్నారు.

సమ్మెకు పలు పార్టీల సంఘీభావం

గ్రామ పంచాయతీ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఘట్కేసర్ ఎంపీడీవో ఆఫీస్ వద్ద సమ్మెకు సీపీఐ(ఎం), సీపీఐ, కాంగ్రెస్, ఎమ్మార్పీఎస్ నేతలు సమ్మె శిబిరం వద్దకు వచ్చి తమ సంపూర్ణ సంఘీభావం ప్రకటించారు. సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చింతల యాదయ్య. కాంగ్రెస్ నాయకులు హరివర్ధన్ రెడ్డి, మేడ్చల్ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, బొచ్చు రెడ్డి, బి నాగేష్ గౌడ్‌లి ఆంజనేయుల, ఐఎఫ్టియూ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ తదితరులు పాల్గొన్నారు. ఐఎఫ్టియూ రాష్ట్ర కార్యదర్శి ఎం శ్రీనివాస్, సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్ సబిత, ఏఐటీయూసీ జిల్లా నాయకులు జయచంద్ర, మండల కార్యదర్శి లొట్టి ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు

పాదాచారులు సురక్షితంగా రోడ్డు దాటండి

- ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తే చట్టప్రకారం చర్యలు
- ట్రాఫిక్ అదనపు సీపీ జీ. సుధీర్‌బాబు



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరంలో పాదాచారులు సురక్షితంగా రోడ్డు దాటాలని హైదరాబాద్ అదనపు సీపీ(ట్రాఫిక్) జీ. సుధీర్‌బాబు సోమవారం తెలిపారు. నగరంలో పాదాచారులు రహదారులపై వెళ్లి ప్రమాదాలకు గురికాకుండా వారి రక్షణ కోసం అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. 'సేఫ్టీ ప్రాజెక్టు'లో భాగంగా ఫుట్‌పాత్‌లు, ఫుటోవర్ బ్రిడ్జిలను ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని గుర్తు చేశారు. పాదాచారులు సులువుగా రోడ్డు దాటేందుకు నగరంలో 31 ప్రాంతాలల్లో పెలికాన్ సిగ్నల్స్‌ను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అయితే కొందరు వ్యాపారులు, దుకాణం దారులు, స్థానికులు ఫుట్‌పాత్‌లను ఆక్రమిస్తుండడంతో పాదాచారులు ఇబ్బందులకు గురవుతున్నారని, కొందరు రోడ్డుపై వెళ్తుండడంతో ప్రమాదాల బారిపడు తున్నారని తెలిపారు. ఆక్రమణ దారులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. కొందరు వాహనదారులు రహదారులపై ఏర్పాటు చేసిన ఫ్రీ లెఫ్టలల్లో సైతం వాహనాలు నిలిపి, ఇతర వాహనదారులకు ఇబ్బందులకు గురిచేస్తున్నారని అలాంటి వారిపై కేసులు నమోదు చేస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది ఫ్రిలెఫ్ట్‌ను బ్లాక్ చేసిన వారిపై 51,533 కేసులు నమోదు చేయగా, సిగ్నల్స్ వద్ద స్టాప్‌లైన్ దాటిన వారిపై 2,71,187 కేసులు నమోదు చేసినట్టు తెలిపారు. నో పార్కింగ్‌లో వాహనాలు నిలిపిన కారణంగా 49,038కేసులు నమోదు చేశామన్నారు. నగరంలో రోడ్డు దాటే సమయంలో పాదాచారులు ఫుట్‌పాత్‌లను, ఫుటోవర్ బ్రిడ్జిలను ఉపయోగించాలని అదనపు సీపీ కోరారు. చౌరస్తాలు, సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేసిన పెలికాన్ సిగ్నల్స్‌ను ఫాలోకావాలని తెలిపారు.

ప్రయివేటు బస్సులో గంజాయి రవాణా..



నవతెలంగాణ-హాయత్ నగర్

రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డేవిడ్ రవికాంత్ ఆదేశాలతో గత మూడు రోజులుగా సరిహద్దు జిల్లాల నుంచి ఎక్సైజ్ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేకంగా చెక్ పోస్టులను అసిస్టెంట్స్ ఎక్సైజ్ సూపింటెండెంట్ హనుమంత రావు పర్యవేక్షణలో ఆరు బృందాలను ఏర్పాటు చేశామని రంగారెడ్డి ఎన్‌ఫోర్స్మెంట్ అధికారులు జీవన్ కిరణ్,హాయత్ నగర్ ఎక్సైజ్ శాఖ ప్రత్యేక బందం సోమవారం రామోజీ ఫిల్మ్ సిటీ వద్ద సంయుక్తంగా కలిసి వాహనాలను తనికీ చేస్తుండగా ప్రయివేటు ట్రావెల్స్ లో విశాఖ పట్నం అరకులోయ నుంచి అక్తరీ ఇషాక్ మన్సూరీఅనే మహిళ వద్ద నుంచి 12 కిలోల గంజాయిని పట్టుకొని స్వాధీనం చేసుకున్నామని హాయత్ నగర్ ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఒక్కో పాకెట్‌లో రెండు కిలోల చొప్పున మొత్తం ఆరు పాకెట్స్ నుంచి 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈమె స్వస్థలం మహారాష్ట్ర థానే. అరకులో కిలో రూ. 6000/- లకు కొనుక్కుని మహారాష్ట్ర లోని కళ్యాణ్ పట్టణానికి రవాణా చేస్తున్నట్టు విచారణలో వెల్లడించిందని హాయత్ నగర్ ఎక్సైజ్ సీఐ లక్ష్మణ్ గౌడ్ తెలిపారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రంగారెడ్డి జిల్లాలో ఎలాంటి ఎక్సైజ్ నేరాలకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందాయని, నేరాలను అరికట్టేందుకు నిరంతరం గట్టి నిఘాను, ప్రత్యేక బృందాలు 24 గంటలు అందుబాటులో ఉంటామని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీ ఐ లు పి.శ్రీధర్, ఎస్.కల్పన, సత్యనారాయణ, ఎస్సైలు కుర్మనాయకులు, హన్మంతు, వెంకన్న గౌడ్, సరళ, సుతారి సరూర్ నగర్ డివిజన్ లోని ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చలో హైదరాబాద్‌ను జయప్రదం చేయండి

- బోడుప్పల్ కమిషనర్‌కు వినతిపత్రం అందించిన సీఐటీయూ నాయకులు



నవతెలంగాణ-బోడుప్పల్

మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలలో పనిచేసే కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈ నెల 12 తలపెట్టిన చలో సీడీఎం కార్యాలయం ముట్టడిని జయప్రదం చేయాలని సీఐటీయూ మేడిపల్లి మండల కార్యదర్శి ఎన్.సజన అన్నారు. చలో హైదరాబాదు కార్యక్రమానికి సంబంధించిన వినతిపత్రాన్ని బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా సజన మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాల్టీలలో పనిచేసే కార్మికులకు కనీస వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధన కోసం కార్మికులు అందరూ పాల్గొనాలని కోరారు. మున్సిపల్ ఎంప్లాయిస్ రాష్ట్ర నాయకుడు మైసగళ్ల బాల్ నరసింహ ఇతర కార్మికులు పాల్గొన్నారు.

ఇన్‌స్పెక్టర్ నాగార్జునకు సన్మానం



నవతెలంగాణ- చైతన్యపురి

రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని చైతన్య పురి పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన నాగర్జునను మంగళ వారం కాంగ్రెస్ రాష్ట్ర యువజన నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి , కాంగ్రెస్ రామకష్ణ పురం డివిజన్ అధ్యక్షులు పున్న గణేష్ నేత పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలియజేశారు. శాలువాతో ఘనంగా సత్కరించారు. ఆయన మాట్లాడుతూ శాంతి భద్రత విషయంలో రాజీ లేకుండా పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన నాయకులు రవీంద్ర, రమేష్ నేత, బొడ్డుపల్లి మహేందర్, పగడాల శ్రీశైలం,కళ్యాణ్ యాదవ్, ప్రేమ్ నాయక్, సలీం, పాండు,అనుదీప్, సల్లంగి శ్రీనివాస్,హరి,వంగాల శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్, పింటూ, విప్లవ్ రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మల్లారెడ్డికి నిరసన సెగ



నవతెలంగాణ-సిటీబ్యూరో/ఘట్‌కేసర్

మంత్రి చామకూర మల్లారెడ్డికి నిరసన సెగ తగిలింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో ఘట్‌కేసర్ మండలం, కాచవాణిసింగారం గ్రామంలో రూ.కోటీ 50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన మంత్రిని స్థానికులు అడ్డుకున్నారు. సింగారం గ్రామంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీసీ రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి స్థానిక సర్పంచ్ కొంతం వెంకట్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షులు నాగులపల్లి రమేశ్‌తో కలిసి పూలమాల వేసి నివాళ్లర్పించారు. అనంతరం శంకుస్థాపన వద్దకు వెళ్తున్న మంత్రిని స్థానిక మహిళలు, వైస్ ఎంపీపీ కర్రె జంగమ్మ, ఉప సర్పంచ్ చెట్టిపల్లి గీత, వార్డు సభ్యులు మంత్రిని అడ్డుకుని నిలదీశారు. గ్రామంలోని సమస్యలను ఎందుకు పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. పాత గ్రామ పంచాయతీ స్థలంలో బీసీ భవనం నిర్మించాలనీ, అర్హులైన వారికి డబుల్ బెడ్‌రూం ఇండ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతంలో ఇక్కడ ఉన్న గది కూల్చివేతలను అడ్డుకున్నప్పటికీ తిరిగి కొత్తది నిర్మించి ఇస్తామని సర్పంచ్ చెప్పడంతో నాడు వెనక్కి తగ్గామనీ, ఇప్పుడు విగ్రహం చుట్టూ సీసీ రోడ్డు వేస్తామని శంకుస్థాపన చేయడం ఏంటని ప్రశ్నించారు. ఈ పనులు ఏవిధంగా చేపడుతారో చూస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి డౌన్.. డౌన్.. అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో స్వల్ప తోపులాట జరిగింది. అక్కడ ఉన్న స్థానికులను పోలీసులు పక్కకు జరపడంతో మంత్రి కొబ్బరికాయ కొట్టి ముత్వెల్లిగూడలోని పనుల శంకుస్థాపన కార్యక్రమానికి వెళ్లిపోయారు.

జాతర కోసం చెక్కు అందజేసిన బీఆర్ఎస్ నేత తేజ్‌పాల్



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి లాల్‌బజార్‌లో మహంకాళి అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించాలని ఏడో వార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు తేజ్‌పాల్ సోమవారం ఆలయ ఈవో మహేందర్‌కు తన సొంత డబ్బు రూ. 30501.00 ముప్పై వేల ఐదు వందల ఒక్క రూపాయల చెక్కున అందజేశారు అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో మహేందర్‌రెడ్డి తేజ్‌పాల్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఆర్. శ్రీనివాస్, రాజు, శాంత మూర్తి, శ్రీధరన్ ఇతరులు పాల్గొన్నారు.

రూ.24లక్షలతో సీసీ రోడ్డు పనులు : ఎమ్మెల్యే మైనంపల్లి



నవతెలంగాణ-మల్కాజిగిరి

గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున నగర్‌లో రూ.24లక్షలతో సీసీ రోడ్డు పనులను సోమవారం ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కార్పొరేటర్ మేకల సునీతారాము యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈ లౌక్య ఏఈ దివ్య జ్యోతి, కార్పొరేటర్ ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, సీనియర్ నాయకుడు మేకల రాముయాదవ్, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బొంతు రామ్మోహన్‌ను కలిసిన గౌడ సంఘం సభ్యులు



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చర్లపల్లి డివిజన్‌లో నూతనంగా ఎన్నికైన గౌడ్ సంఘం సభ్యులు మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను సోమవారం చర్లపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొంతు రామ్మోహన్ నూతనంగా ఏర్పాటైన గౌడ సంఘం సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ ఆనంద్ రాజ్ గౌడ్, జనరల్ సెక్రటరీ రామచంద్రాగౌడ్, వైస్ ప్రెసిడెంట్లు నరసింహ, అశోక్, మెంబర్స్ రాములు, శశి కుమార్, ప్రభు గౌడ్, బాబూగౌడ్, ప్రభాకర్‌గౌడ్, రజినీకాంత్‌గౌడ్, నాదం గౌడ్, లక్ష్మణ్‌గౌడ్, శ్రీరాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్వో కార్యాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని వినతి



నవతెలంగాణ-కాప్రా

కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను ఇవ్వడంలో ఎమ్మార్వో కార్యాలయ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివానంద్ సోమవారం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.అనంతరం శివానంద్ మాట్లాడుతూ.. సర్టిఫికెట్ల కోసం జనం అల్లాడుతున్నారని పేర్కొన్నారు. కులం, ఆదాయ సర్టిఫికెట్స్ కోసం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా కింది స్థాయి ఉద్యోగులు పట్టించుకోవడం లేదన్నారు. ఆయన వెంట హరికృష్ణ, ఆనంద్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా : మన్నె క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ పరిధిలోని బోయినపల్లి మార్కెట్‌కు ఆనుకుని ఉన్న అంబేడ్కర్ నగర్ గుడిసెల్లో ఉండే పేదలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ మన్నె క్రిశాంక్ అన్నారు. పేదల గుడిసెలను ఎటువంటి నోటీసు లేకుండా బాలానగర్ ఎమ్మార్వో కూల్చివేశారు. విషయం తెలుసుకున్న క్రిశాంక్ సోమవారం ఘటనా స్థలానికి వచ్చి బాధితులను ఓదార్చారు. స్థాని కుల వివరాలను కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ దృష్టికి తీసుకెళ్లారు. నిర్వాసితులకు ఆర్థిక సహాయం చేశారు. విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి పేదలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని భరోసానిచ్చారు.

ఆలయ నిర్మాణానికి సాయం చేయండి : కుమ్మరి సంఘం



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం కుషాయిగూడ డివిజన్‌లోని కుమ్మరి సంఘం సభ్యులు పోచమ్మ ఆలయం నిర్మాణం పనులకు ఆర్థిక సాయం చేయాలని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులను సోమవారం కలిశారు. బొంతు రామ్మోహన్ దంపతులు ఆలయ నిర్మాణానికి సాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు బొంతు రామ్మోహన్ దంపతులకు కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, టెంపుల్ కమిటీ సభ్యులు ఈశ్వర్, జనార్ధన్, లక్ష్మణ్, సన్నీ, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ. 50వేల ఆర్థిక సాయం



నవతెలంగాణ- నేరేడ్‌మెట్

నేరేడ్‌మెట్ డివిజన్ మహిళా నాయకురాలు విజయ లక్ష్మీ భర్త అనారోగ్యంతో మరణించాడు. విషయం తెలుసుకున్న మల్కాజి గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతా రావు మృతుడి కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సాయం ప్రకటించారు. దశదిన కర్మ ఖర్చుల కోసం బీఆర్ఎస్ మల్కాజిగిరి ఉపాధ్యక్షుడు ఉపేందర్‌రెడ్డి సోమవారం మృతుడి నివాసానికి వెళ్లి నగదును అందజేశారు. వారి వెంట మహేష్, చెన్నారెడ్డి, శివ తదితరులు ఉన్నారు.

పద్మారావు మృతి కాంగ్రెస్‌కు తీరని లోటు

- జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పద్మారావు మృతి పార్టీకి లోటు అని మేడ్చల్ మల్కాజిగిరి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. వెంకటాపురం డివిజన్ అంబేద్కర్ నగర్‌కు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పద్మారావు సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న నందికంటి శ్రీధర్ మృతుడి స్వగృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిన్నారులు ఉన్నత లక్ష్యం వైపు నడవాలి : మేయర్ కావ్య



నవతెలంగాణ- జవహర్‌నగర్

చిన్నారులు ఉన్నత లక్ష్యంవైపు అడుగులు వేయాలని, క్రీడలు ఆత్మరక్షణకు, మానసికొల్లాసానికి దోహదం చేస్తాయని అన్నారు. కార్పొరేషన్‌లోని 15వ డివిజన్‌లో తైక్వాండో మాస్టర్ నరేందర్ యాదవ్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మేయర్ కావ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ అనిల్ కుమార్ యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం క్రీడలకు అత్యధిక ప్రాధాన్యనిస్తుందని తెలిపారు. క్రీడాకారులు రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణిస్తున్నారని అన్నారు. తైక్వాండో పోటీలు చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని సూచించారు. తైక్వాండో పోటీల్లో 107 మంది క్రీడాకారులు పాల్గొన్నారని మాస్టర్ నరేందర్ యాదవ్ తెలిపారు. కార్యక్రమలో బీఆర్ఎస్ నాయకుడు జిట్ట శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ మాస్టర్ హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలను చేపడితే క్రిమినల్ చర్యలు

- రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్



నవతెలంగాణ- జవహర్‌నగర్

ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేస్తే ఊరుకునేది లేదని, కబ్జాదారులపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లో అక్రమంగా నిర్మించిన నిర్మాణాలను రెవెన్యూ సిబ్బంది సహాయంతో కూల్చివేశారు. ఈ సందర్భంగా విశ్వనాథ్ మాట్లాడుతూ సర్కారు భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేసిన సహించేదిలేదని తెలిపారు. అక్రమ లేఔట్లు వేస్తూ పేదల ప్రజలకు అమ్ముతూ సొమ్ముచేసుకుంటున్న కబ్జాదారులను వదలబోమని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సహాయకులు నాగరాజు, రాజు పాల్గొన్నారు.

అద్దెలు ఇవ్వకుండా అంగన్వాడీ సెంటర్ల నడపడమెలా?

- పాలు, పప్పులు సరఫరా చేయకపోతే పిల్లలకు పోషకాహారం ఎలా అందించాలి: తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఉన్నికృష్ణన్
- మేడ్చల్-మల్కాజిగిరి సమీకృత కలెక్టరేట్ వద్ద ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

అంగన్‌వాడీ సెంటర్లకు అయిదు నెలలుగా అద్దెలు రావడం రాలేదని, రెండు నెలలుగా పాలు, పప్పులు సరఫరా చేయకపోతే సెంటర్లను ఎలా నడిపించాలని తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ(సీఐటీయూ) అంగన్వాడీ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఉన్నికృష్ణన్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ మేరకు సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్ వద్ద ధర్నా(బ్లాక్ డే) నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షురాలు పి.శివరాణి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీ సెంటర్లకు సకాలంలో బిల్లులు చెల్లించకుంటే అంగన్‌వాడీ టీచర్లు పిల్లలకు పోషకాహారం ఎలా అందిస్తారని, ప్రభుత్వం ఇచ్చిన సిమ్‌కు నెట్ రాకుంటే ఆన్‌లైన్ వర్క్ ఎలా చేయాలని ప్రశ్నించారు. ప్రభుత్వం వెంటనే ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచాలని, నూతన విద్యావిధానం రద్దు చేయాలన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ వెంటనే చెల్లించాలని, నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలన్నారు. ఎలాంటి కండిషన్లు లేకుండా మినీ అంగన్వాడీ టీచర్లను మెయిన్ టీచర్‌గా నియమించాలన్నారు. 2018 అక్టోబర్‌లో కేంద్ర ప్రభుత్వం పెంచిన వేతనం అంగన్వాడీ టీచర్లకు రూ.1500, హెల్పర్లకు, మినీ అంగన్వాడీ టీచర్లకు రూ.750 రాష్ట్ర ప్రభుత్వం ఏరియర్స్‌తో సహా మూడేండ్ల రేషన్‌షాప్ ట్రాన్స్‌పోర్ట్ చార్జీలను చెల్లించాలన్నారు. పీఆర్సీ ఏరియర్స్- 2021 జులై అక్టోబర్ నవంబర్‌లో చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.అశోక్ మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లకు పప్పు,మిల్క్, సరఫరా లేకపోతే.. అంగన్వాడీ టీచర్లు తమ జీతం నుంచి తీసుకోని వంట చేయాలని సూపర్‌వైజర్లు బెదిరిస్తుండటం దారుణమనీ, ప్రభుత్వం వెంటనే సరుకులు సరఫరా చేయాలని ఆయన కోరారు. అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.శోభారాణి మాట్లాడుతూ తమకు పెన్షన్ గ్రాట్యూటీ కల్పించాలని, స్కూల్ కిరాయి వెంటనే చెల్లించాలని ఆమె ప్రభుత్వాన్ని కోరారు. అంతకముందు అంగన్వాడీ యూనియన్ నాయకులు డీడబ్ల్యూవోకి కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలమణి, అంజమ్మ, రమా, శివరాణి, భాగ్య, మంజు, శైలజ, రేణుకతో పాటు 100 మంది అంగన్వాడీ టీచర్లు, ఆయామ్మలు పాల్గొన్నారు.



తెలంగాణ సర్కారుతోనే బడులకు మహర్దశ

- జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య



నవతెలంగాణ-జవహర్‌నగర్

తెలంగాణ సర్కారుతోనే సర్కారు బడులకు మహర్దశ వచ్చిందని, ఊరు..మన బడితో సర్కారు బడుల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్య అందుతుందని మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. సోమవారం కార్పొరేషన్ లోని జవహర్‌నగర్, బాలాజీనగర్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మేకల కావ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలో అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందుతుందంటే ఈ ఘనత సీఎం కేసీఆర్‌కు దక్కుతుందని పేర్కొన్నారు. పాఠశాలలో డిజిటల్ క్లాసులు ఏర్పాటుతో విద్యార్థులు చదువుల్లో మరింత రాణిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే విద్యార్థులు విదేశీ విద్యను పొందుతున్నారని తెలిపారు. అనంతరం 1946 మంది విద్యార్థులకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ రాంచందర్, ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య, బీఆర్ఎస్ నాయకుడు మతిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళ సాధికారతే లక్ష్యం..

మహిళ సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని మేయర్ కావ్య అన్నారు. సోమవారం కార్పొరేషన్‌లో కుట్టు మిషన్ శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. స్వయం ఉపాధితో మహిళలు మహారాణులుగా మారాలని, మంత్రి మల్లారెడ్డి మహిళల కోసం ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కుతాడి శ్రీకాంత్ పాల్గొన్నారు.

అక్రమంగా ఆయుధాల సరఫరా

- ఇద్దరు నిందితుల అరెస్టు



నవతెలంగాణ-సిటీబ్యూరో

అక్రమంగా ఆయుధాలు సరఫరా చేస్తున్న ఇద్దరు నిందితులను సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి నాలుగు డాగుర్లు, నాలుగు ఏయిర్ గన్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. సోమవారం డీసీపీ రాధాకిషన్ రావు తెలిపిన వివరాల ప్రకారం న్యూ బోయిన్‌పల్లికి చెందిన వినయ్ శర్మా కొలారియా, ఆకాశ్ కొలారియా 'జేసీ క్రాఫ్ట్' పేరుతో వ్యాపారం చేస్తున్నారు. వ్యాపారంలో నష్టాలు రావడంతో డాగర్లు, ఏయిర్ పిస్టోల్స్, కత్తులను విక్రయిం చాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో రాజస్తాన్ నుంచి రూ.6వేలకు ఆయుధాలు తీసుకొస్తున్న నిందితులు నగరంలో రూ.15వేలకు విక్రయిస్తున్నారు. సమాచారం అందుకున్న ఇన్‌స్పెక్టర్ రఘునాథ్ తన బృందంలోని ఎస్ఐ ఎస్.సాయి కిరణ్, సీహెచ్ నవీన్ కుమార్‌లతో కలిసి నిందితులను అరెస్టు చేశారు. తదుపరి విచారణ కోసం నిందితులను బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్టు డీసీపీ తెలిపారు.

ఆలయాల్లో శ్రీనివాస్ యాదవ్ పూజలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

గోషామహల్ నియోజకవర్గంలోని ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని పలు ఆలయాల్లో బోనాల జాతర ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ వివిధ ఆలయాల్లో పూజలు నిర్వహించారు. ఉస్మన్ గంజ్ నల్ల పోచమ్మ ఆలయం, సుల్తాన్‌బజార్ వజ్ర మైసమ్మ ఆలయం, మలక్‌పేట్‌లో నవ దుర్గ మాత, అఖిల హైదరాబాద్ హమాలీ సంఘం ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లోని కమిటీ పెద్దలు శ్రీనివాస్ యాదవ్‌ను పూలమాలు, శాలువాతో సన్మానించారు.

సమస్యలపై జులై12న విద్యాసంస్థలు బంద్

- ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఫ్, పీడీఎస్‌యూ పిలుపు



నవతెలంగాణ-కాప్రా

విద్యారంగ సమస్యలను పరిష్కారించాలని ఈ నెల 12న రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలు, ఇంటర్ కళాశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిచ్చాయి. సోమవారం ఈసీఐఎల్ ఎస్ఎఫ్ఐ జిల్లా కేంద్రంలో బంద్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకటేష్, రాథోడ్ సంతోష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎండీ.అన్వర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో కార్పొరేట్, ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఫీజులు దందా కొనసాగుతుందన్నారు. వాటిపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. తిరుపతిరావు కమిటీ రిపోర్ట్ బహిర్గతం చేయకపోవడం చూస్తే ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు అనూకులంగా వ్యవరిస్తున్నట్లుగా ఉందని ఆరోపించారు. విద్యాసంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల్లో యూనిఫామ్ ఇవ్వలేదని తెలిపారు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. తాగునీరు, మధ్యాహ్న భోజనం బిల్లుల పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. పాఠశాలల్లో మూత్రశాలలు మౌలిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం అస్తవ్యస్థంగా ఉందన్నారు. మనఊరు-మనబస్తీ-మనబడి ప్రణాళికలో తూతూమంత్రంగా మాత్రంగ పనులు చేసి ఆ నిధులను గత్తెదారులు దండుకున్నారని ఆరోపించారు. ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందని ద్రాక్షగా మారిందని తెలిపారు. ఇంటర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు ఇంకా పంపిణీ చేయలేదని విమర్శించారు. నాలుగేండ్ల నుంచి స్కాలర్ షిప్స్ రూ.5,177 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. వాటిని ఎందుకు విడుల చేయడంలేదని ప్రశ్నించారు. గురుకులాలు, కేజీబీవీ, ఇంటర్ కళాశాలలుగా అఫ్ గ్రేడ్ చేసిన నేటికీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయని తెలిపారు. ఇప్పటికీ డీఎస్సీ వేయలేదని తెలిపారు. ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అరుణ్, ఏఐఎస్ఎఫ్ హరీష్ ఉన్నారు.

ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి



వతెలంగాణ-కాప్రా

ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని జోనల్ కమిషనర్ పంకజం తెలిపారు. సోమవారం వార్డు ఆఫీసుల పనితీరుపై రివ్యూ మీటింగ్ కాప్రా సర్కిల్ ఆఫీసులో నిర్వహించారు. ఈ మీటింగ్‌లో డిప్యూటీ కమిషనర్ శంకర్, ఎస్ఈ అశోక్ రెడ్డి, సీపీ ప్రసాద్‌రావు, యూబీడీ డీడీ రాజ్‌కుమార్, ఈఈ హరిలాల్, హెల్త్ ఆఫీసర్ స్వప్నారెడ్డి, సీపీ శ్రీధర్ ప్రసాద్, అసిస్టెంట్ ఇంజనీర్లు, వార్డ్ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

బోర్వెల్‌కు మోటార్ ఏర్పాటు



నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డ్ ఏడో వార్డు నెహ్రూ సెంటెనరీ కాలనీలో ఎమ్మెల్యే సాయన్న నిధులతో ఏర్పాటు వేయించిన బోర్వెల్‌కు ఏడోవార్డు బీఆర్ఎస్ అధ్యక్షుడు సోమవారం మోటర్ ఏర్పాటు చేయించారు. ఎమ్మెల్యే సాయన్న హయాంలో బోరు మంజూరు అయిందని తెలిపారు. పనులను ఎమ్మెల్యే కుమార్తెలు నివేదిత, లాస్య, నందిత దగ్గరుండి పర్యవేక్షించారని తెలిపారు. కార్యక్రమంలో యూత్ అసోసియేషన్ సభ్యులు నవీన్, శివ, రాకేష్, కిరణ్ పాల్గొన్నారు.

బొంతు శ్రీదేవిని కలిసిన బీఆర్ఎస్ నేత విశ్వనాథం



నవతెలంగాణ-కాప్రా

ఇటీవల అనారోగ్యానికి గురైన బీఆర్ఎస్ నాయకుడు విశ్వనాథం కోలుకుని చర్లపల్లి డివిజన్ కార్పొ రేటర్ బొంతు శ్రీదేవి యాదవ్‌ను సోమవా రం కలిశారు. ఈ మేరకు ఆమె విశ్వనాథం యోగ క్షేమాలను తెలుసుకుని ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, నరసింహ, వంశీ, రాజ్ పాల్గొన్నారు.

నూతన కమిటీకి శుభాకాంక్షలు

నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ నియోజకవర్గం చర్లపల్లి డివిజన్ పరిధిలో నూతనంగా ఎన్నికైన సోనియా గాంధీ నగర్ కాలనీ ఫేజ్ -2కమిటీ సభ్యులు సోమవారం బొంతు శ్రీదేవిని చర్లపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె నూతనంగా ఏర్పాటైన సోనియా గాంధీ నగర్ కాలనీ ఫేజ్-2 కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. కమిటీ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమం లో ప్రెసిడెంట్ దాసరి కనకయ్య, వైస్ ప్రెసిడెంట్ రాజు నాయక్, జనరల్ సెక్రెటరీ శివకుమార్, ట్రెజరర్ బాలకృష్ణ, జాయింట్ సెక్రెటరీ మహేష్, కాలనీ సభ్యులు నరేష్, బాలకృష్ణ, శ్రీనివాస్, యాకయ్య, సుబ్బయ్య, వెంకట్, నాగిళ్ల బాల్ రెడ్డి, రాజేశ్వర్ రెడ్డి, భానుచందర్, శ్రీకాంత్ యాదవ్, నరసింహ వంశి రాజ్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

నవతెలంగాణ-కంటోన్మెంట్

బోయినపల్లి అంబేద్కర్ నగర్, అంజయ్యనగర్‌లో నిరాశరాయులైన గుడిసె వాసులకు మల్కాజిగిరి పార్లమెంట్ ఇన్ చార్జి మర్రి రాజశేఖర్‌రెడ్డి అండగా ఉంటారని శ్రీ గణేష్ ఫౌండేషన్ చైర్మెన్ హామీ ఇచ్చారు. బాలానగర్, తిరుమలగిరి ఎమ్మార్వో ఇలా చేయడం సబబు కాదన్నారు. విషయాన్ని కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు దృష్టి తీసుకు పోయి న్యాయం జరిగేలా చేస్తానన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్‌కు అంతరాయం

నవతెలంగాణ-దుండిగల్

వర్షాకాలం దృష్ట్యా విద్యుత్ వినియోగదారుల ప్రజలకు ఇరువైపులా రోడ్లు, బస్తీలలో సైడ్ల విద్యుత్ తీగలకు అడ్డుగా తగులుతున్న చెట్ల కొమ్మలను తొలగించడంలో భాగంగా మంగళవారం గాగిల్లాపూర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలలో, విద్యుత్ కొన్ని గంటలు అంతరాయం కలుగుతుందని, ఏఈ. సురేందర్ రెడ్డి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11కెవి ఎఫ్2 ఫీడర్ పరిధిలోని చైతన్య కాలనీ, చర్చి గాగిల్లాపూర్, గాగిల్లాపూర్ ఎక్స్ రోడ్స్, 214 కాలనీలు తదితర ప్రాంతాలలో ఉదయం 9గంల నుండి మధ్యాహ్నం 1 గంల వరకు, 11కెవి చైతన్య కాలనీ ఫీడర్ పరిధిలోని గ్రీన్ వుడ్ విల్లాస్, డ్రీమ్ వన్ విల్లాస్, గాగిల్లాపూర్ గ్రామం, ప్రధానరహదారి తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 2 గంల నుండి సాయంత్రం 5 గంల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సమస్యను గుర్తించి వినియోదారులు తమతో సహకరించాలని ఏఈ. కోరారు.

స్మశానవాటిక పనులు పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, జీడిమెట్ల 132 డివిజన్ పరిధిలోని అయోధ్యనగర్ హిందూ స్మశానవాటికలో రూ.45 లక్షలతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులను సోమవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కాంపౌండ్ వాల్, బోర్ వెల్, నీటి సంపు పూర్తి కావడంతో మిగిలి ఉన్న బాత్ రూమ్‌లు, బర్నింగ్ ప్లాట్ ఫామ్‌లు, సిట్టింగ్ గ్యాలరీ, బెంచీలు, ఇంటర్నల్ రోడ్లు, మొక్కలు నాటి మోడల్ గ్రేవియార్డుగా అభివృద్ధి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ. కృష్ణ చైతన్య, ఏఈ. సురేందర్ నాయక్, కాలనీ అధ్యక్షుడు పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌ను విజయవంతం చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్

నవతెలంగాణ-మేడ్చల్



విద్యారంగ సమస్యల పరిష్కారానికై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పాఠశాల, ఇంటర్ కళాశాలల బంద్‌ను విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ పిలుపునిచ్చారు. సోమవారం మేడ్చల్ పట్టణంలో ఎస్ఎఫ్ఐ నిరసన కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ రాష్ట్రంలో కార్పోరేట్, ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులు దందా కొనసాగుతున్న ప్రభుత్వం వాటి నియంత్రణ కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయలేదని మండిపడ్డారు. విద్యా సంస్థలలో సరిపడా టీచర్లు లేరని, పారిశుద్ధ్యం లోపించి అనేక సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్రాగునీరు, మధ్యాహ్న భోజన బిల్లుల పెండింగ్, మూత్రశాలలు, సరైన మౌళిక సదుపాయాలు లేక ప్రభుత్వ విద్యారంగం నిర్వీర్య పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. మన ఊరు-మన బడిలో గుత్తేదారులు తూతూమంత్రంగా మాత్రమే పనులు చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో గత నాలుగేళ్ల నుండి ఫీజు రీయంబర్ మెంట్స్, స్కాలర్ షిప్ నిధులు రూ.5,177 కోట్లు పెండింగులో ఉన్నాయని వాటిని ప్రభుత్వం విడుదల చేయలేదని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. జిల్లాలో బంద్ విజయవంతం చేయాలని విద్యార్థి లోకానికి వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపునిస్తున్నాయని తెలియజేశారు. ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మండల కార్యదర్శి కిరణ్, యశ్వంత్, శివ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను పరిష్కరించాలి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

అన్ని విభాగాల అధికారులు ఒకరికొకరు సమన్వయం చేసుకుని పనులు పూర్తి చేయాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు అన్నారు. ఎమ్మెల్యే తన క్యాంపు కార్యాలయంలో, సోమవారం అన్ని విభాగాల ప్రభుత్వ అధికారులతో సేవరేజ్ పైప్ లైన్ నిర్మాణం కొరకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో పైప్ లైన్ నిర్మాణం కొరకు ఎక్కడికి అక్కడ పైపులు సిద్ధం చేశామని, ఇందులో వాటర్ వర్క్స్, జీహెచ్ఎంసీ, ఎలక్ట్రిసిటీ అందరూ సమన్వయం చేసుకుని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తు ప్రణాళికల దృష్ట్యా ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ పటిష్ట చర్యలు తీసుకుంటున్నారని, ఇందులో భాగంగానే పైప్ లైన్ల నిర్మాణం కొరకు నిధులకు ఎక్కడా వెనుకాడకుండా కేటాయిస్తున్నారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అలాగే ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాల విషయంలో అధికారులందరూ వారికి అందుబాటులో ఉండి, ఎక్కడైనా సమస్యలు ఉన్న ఎడల పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు, అన్ని విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం 129 డివిజన్ నెహ్రూనగర్‌కు చెందిన తెలంగాణ భవన నిర్మాణ కార్మిక యూనియన్ శ్రీ చైతన్య సాగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు , బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై సోమవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ సమక్షంలో చింతల్‌లోని ఎమ్మెల్యే కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని అన్నారు. చేతివృత్తుల వారికి రూ.1.00.000 అందించి ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. ఈ పథకంలో భాగంగా సగర సంఘానికి కూడా అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్ర మంలో డివిజన్ల అధ్యక్షులు పుప్పాల భాస్కర్, పోలే శ్రీకాంత్, నాయకులు మారయ్య, సిద్ధిక్, ఫెరోజ్, గండయ్య, దశరత్, అఖిల్, కిరణ్ సాగర్, తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు ఆటలే ఆయుధం



- డా.హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్ డా హిప్నో పద్మా కమలాకర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

పిల్లలకు ఆటలే ఆయుధమని డా.హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. మాస్టర్స్ గేమ్స్ అండ్ తెలంగాణ చైర్మెన్ వినయ్, నవభారత లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీల్లో క్రికెట్, ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో సాధన అండ్ నియో ఐజీ స్కూల్స్ ఛాంపియన్ షిప్ గెలుచుకున్నారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన డా.హిప్నో పద్మా కమలాకర్, గోపాల్ కష్ణ, పి.స్వరూపారాణి బహుమతులను అందజేసి మాట్లాడారు. సంతోషంగా ఎదగాలనీ, ఆరోగ్యంగా ఉండాలంటే ఆటలు ఆడటం ఎంతో అవసరమన్నారు. పిల్లలను ఆటలు ఆడటానికి ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఆటలతో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, క్రియేటివిటీ బాగా పెరుగుతాయని చెప్పారు. పిల్లలు శారీరక ఆరోగ్యానికి దూరమవుతున్నారన్నారు. బద్ధకానికి బానిసలవుతున్నారని తెలిపారు. గెలుపు ఓటములను సమంగా చూడటం, భావోద్వేగాల నియంత్రణ, క్రీడాస్ఫూర్తి మొదలైనవి చిన్నప్పటి నుంచే ఆటల ద్వారా సాధ్యమవుతుందని చెప్పారు. అంతరాలు లేని స్నేహం అక్కడి నుంచే చిగురిస్తుందన్నారు. ప్రతి రోజూ పిల్లలను ప్రోత్సహిస్తూ ఆటలు ఆడిస్తున్న ఎమ్ జీటి. చైర్మెన్ వినయ్, ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్, సెక్రెటరీ రామారావు, భారత్ కుమార్, స్కూల్స్ కెప్టెన్స్ బెల్లం కొండ భార్గవ, శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ పోటీలో సాధన ఇన్ ఫీనిటి ఇంటర్ నేషనల్ స్కూల్, నియో ఐజా స్కూల్, స్కాలర్స్ అకాడమీ స్కూల్ విద్యార్థులు క్రీడల్లో పాల్గొన్నారు.

కాటికాపరి హక్కులను హరిస్తే సహించేదిలేదు

- జాతీయ అధ్యక్షులు ఎత్తపు కేశవులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



మాల, బ్యాగరీ, కాటికాపరుల హక్కులను హరిస్తే సహించబోమని బ్యాగరి సంఘం జాతీయ అధ్యక్షులు ఎత్తపు కేశవులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం జగద్గిరిగుట్ట సమీపంలోని గుబురు గుట్ట స్మశాన వాటిక సంఘం కార్యాలయంలో గ్రేటర్ హైదారాబాద్ సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ రాష్ట్ర వ్యాపితంగా స్మశాన వాటికలను ప్రయివేటీకరణ చేయడం ప్రభుత్వ హేయమైన చర్య అని, కులవృత్తి చేస్తూ జీవనం సాగించే వారిమీద ప్రతాపం చూపిస్తూ పెట్టుబడి దారుల వర్గానికి ప్రభుత్వం సోమ్ము కాస్తుందన్నారు. స్మశానవాటికలను సుందరంగా చేయడం మంచిదే కానీ, సుందరీకరణ ముసుగులో మా హక్కులను హరిస్తే ఊరుకునేది లేదని ఘాటుగా విమర్శించారు. ఏ రోగమొచ్చిన, అనాధలైనా, ఎవరెవరు ఎలా చనిపోయినా మా ఆరోగ్యాన్ని ఫణంగా పెట్టి అంతిమ సంస్కార కార్యక్రమం చేస్తామని అలాంటిది మమ్ములను ఇబ్బందులు పెడితే సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో కాటికాపరులకు ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు, ఇన్సూరెన్స్, పెన్షన్ స్కీమ్, బ్యాగరులు చనిపోతే వారికి ప్రభుత్వం తరపున 25000/- దహన సంస్కార ఖర్చుల నిమిత్తం ఇవ్వాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు కత్తుల దుర్గయ్య, సురేందర్, నాగరాజు, యాదయ్య, పోచయ్యా, మోహన్, శ్రీనివాస్, హనుమంతు, చిట్కుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్

నవతెలంగాణ-కూకట్‌పల్లి



ఆల్విన్ కాలని డివిజన్‌లోని ఆల్విన్ కాలనీ పరిధిలో భూదేవి హిల్స్ కాలనీలో రూ. 32 లక్షల నిధులతో నూతనంగా నిర్మిస్తున్న, సీసీ రోడ్డు నిర్మాణ పనులను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలతో యుద్ధ ప్రాతిపదికను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. అలాగే వర్షాకాలంలో నీరు నిలిచిపోవడం వంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలతో సీసీ రోడ్డు నిర్మించాలని సంబంధిత అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు సమ్మారెడ్డి, యడ్ల సత్యనారాయణ, సుందు యాదగిరి, శ్రీనివాస్, రాజు, మల్లేష్, ఏఈ శ్రావణి, వర్క్ ఇన్స్పెక్టర్ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరికలు

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కాంగ్రెస్ పార్టీలోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. తాజాగా అయోధ్య నగర్‌కు చెందిన వివిధ పార్టీల కార్యకర్తలు దాదాపు 200 మందికి పైగా టీపీసీసీ ప్రతినిధి కోలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం సూరారం 129 డివిజన్ పరిధిలోని సూరారం గ్రామవాసులు బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకులు కె.నిఖిల్ రెడ్డి, కేంద్ర రాష్ట్ర వైఫల్యాల పై నిరంతరం పోరాటం చేస్తున్న టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై సూరారం గ్రామవాసులు నిఖిల్ రెడ్డి, బాబన్, సజ్జు భాయ్, విక్రాంత్, సంతోష్, సందీప్, రాజు, కిరణ్ , రాజశ్రీ వారి మిత్రబృందంతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంత్ రెడ్డి సమక్షంలో టీపీసీసీ అధికార ప్రతినిధి అద్దంకి దయాకర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు అందడం లేదన్నారు. కాంగ్రెస్ ప్రభత్వం అధికారంలోకి రాగానే ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ప్రభుత్వ రాయితీలు పొందిన ప్రయివేటు కంపెనీల్లో తెలంగాణ యువతకు 75% రిజర్వేషన్ కల్పిస్తామని తెలిపారు. కొలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇందిరమ్మ ఇంటికి ఐదు లక్షల సాయం, ఆడబిడ్డకు 500 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలల్లో కుత్బుల్లాపూర్‌లో కాంగ్రెస్ పార్టీ జెండ ఎగర వేయడం కాయం అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షులు శ్రవణ్ కుమార్ ముదిరాజ్, అవిజె జేమ్స్, బేకు శ్రీనివాస్, ఐలయ్య, సిద్దనోళ్ళ బాలయ్య సంతోష్, జెస్సి పల్, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఆర్ఈసీలో బ్లాక్ చైన్ టెక్నాలజీ పై వర్క్ షాప్



నవతెలంగాణ-దుండిగల్

మేడ్చల్ మైసమ్మగూడలోని నర్సింహరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం వారు సొసైటల్ అప్లికేషన్ ఆఫ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అనే అంశంపై భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన (సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు) వారి సహకారంతో కళాశాల ప్రాంగణంలో వర్క్ షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జేఎన్టీ యూహెచ్ రెక్టర్ డా.గోవర్ధన్, గౌరవ అతిథిగా డా.సి. శోభాబిందు జేఎన్టీయూఏ డైరెక్టర్ అనంతపూర్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.గోవర్ధన్ మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీ అనేది ఒక రకమైన డిజిటల్ లేడ్జర్ టెక్నాలజీ అని, ఇది సిస్టమ్‌ను మార్చడం హ్యాక్ చేయడం, సైబర్ ఫ్రాడ్స్ వంటివి నిరోధిస్తూ, ఇన్ఫర్మేషన్ ట్రాన్సాక్షన్‌ను రికార్డు చేస్తుందని, వీటి వల్ల బ్యాంకు లావాదేవీలు మరింత సురక్షితంగా ఉంటాయని తెలిపారు. డా.సి. శోభా బిందు మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీ నేటి కాలంలో ప్రజాదరణ పొందడానికి అత్యంత కీలకమైన కారణం దాని పారద ర్శకత మార్పు చేయలేని లక్షణమని అత్యంత సురక్షితమైనదని, డి సెంట్రలైజ్డ్ సిస్టమ్ ఆటోమేటెడ్, ఫాస్ట్ ప్రోసెసింగ్ కెపాసిటీ వంటి ఎన్నో ప్రయోజనాలు బ్లాక్ చైన్ టెక్నాలజీ సొంతం అని తెలిపారు. ఇది బ్యాంకింగ్‌లోనే కాక వ్యక్తిగత గుర్తింపు భద్రత, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్. (ఎల్ఓటి), ఆరోగ్య సంరక్షణ లాజిస్టిక్ వంటి అనేక రంగాలలో కూడా ఇది ముఖ్య పాత్ర పోషించగలదని తెలిపారు. ఎథేరియం, హైపర్ లెడ్జర్, క్రిప్టో వంటి అంశాలపై పలువురు నిపుణులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ క్రిప్టో ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇలాంటి వర్క్ షాప్‌ల వల్ల అధ్యాపకులు అభ్యసించగలరని, విద్యార్థులను సాంకేతిక వైపు నడిపించ గలరని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ నర్సింహరెడ్డి, కోశాధికారి త్రిలోక్ రెడ్డి, కళాశాల డైరెక్టర్ డా.మోహన్ బాబు, ప్రిన్సిపల్ డా. ఆర్ లోకనాథం, సీఎస్ ఈ విభాగాధిపతి సునీత , కార్యక్రమ కార్యకర్త డా, దిలీప్ రెడ్డి, వివిధ కళాశాలల నుంచి పలువురుకు అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రంగారెడ్డి నగర్‌లో చెట్లు నరికివేత

- పట్టించుకోని అధికారులు
- హరితహారానికి తూట్లు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



చెట్లు ప్రగతికి మెట్లు అంటూ ప్రభుత్వం ఒక వైపు హరిత తెలంగాణ మా ధ్యేయం అని ప్రభుత్వం హరితహా రం కోసం కోట్లు ఖర్చు చేస్తూ పెంచుతుంటే అదేమీ పట్టనట్టు కొన్ని ప్రాంతాల్లో యదేచ్ఛగా చెట్లను నరికి వేస్తున్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని రంగారెడ్డి నగర్ ప్రాంతంలో గల ప్రభుత్వ పాఠశాల సమీపంలో ఓ వ్యక్తి యదేచ్ఛగా రెండు మూడు భారీ చెట్లను నరికి వేశారు. హార్టికల్చర్ అధికారుల ఈ విషయాన్ని స్థానికులు ఫోన్ ద్వారా తెలిపిన, కనీసం అక్కడికి వచ్చిన పాపాన పోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సదరు వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సదరు వ్యక్తిని ఎందుకు నరికి వేస్తున్నారంటూ అడుగుతుంటే మీకెందుకు నా ఇష్టం అంటూ గొడవకు దిగుతున్నాడని తెలిపారు.

ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం



- ఎమ్మెల్యే కేపీ వివేకానంద్
- రూ.90 లక్షలతో బాక్స్ నాలా నిర్మాణ పనులు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

వర్షాకాలం రానున్న నేపథ్యంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని ముంపు ప్రాంతాలలో సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపట్టడం జరిగిందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గిరినగర్‌లో రూ.90 లక్షలతో నూతనంగా చేపడుతున్న బాక్స్ నాలా నిర్మాణ పనులకు ముఖ్య అతిథిగా పాల్గొని, స్థానిక కార్పొరేటర్ బి.విజయ్ శేఖర్ గౌడ్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రజల ఇబ్బందులను స్వయంగా చూసి, అందుకు పరిష్కారంగా నాలా నిర్మాణ పనులను శ్రీకారం చుట్టామన్నారు. ప్రగతియాత్ర పర్యటనలో సైతం ప్రజలు ఈ సమస్యను తన దృష్టికి రావడం జరిగిందని, సమస్యపై ప్రత్యేక చొరవ చూపి శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో మంత్రి కేటీఆర్ సహకారంతో గడిచిన 9 ఏండ్లలో నియోజకవర్గంలో కోట్ల నిధులతో అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు వచ్చిన వీలైనంత త్వరగా పూర్తి చేయిస్తారని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మెన్ జయరాం, డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఏర్వ శంకరయ్య, జీహెచ్ఎంసీ డీఈఈ భానుచందర్, జలమండలి మేనేజర్ పూజిత సీనియర్ నాయకులు, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రంగారెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని గాంధీ నగర్ రోడ్ నంబర్ 12, ఖాజా భాయ్ ఇంటి నుండి హిందూ స్మశాన వాటిక వరకు నడవ లేని స్థితిలో ఉన్న రోడ్డు మరమ్మత్తులతోపాటు, ఓపెన్ నాలా క్లీనింగ్, వీధి దీపాల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని బస్తీ వాసులు కోరారు. ఈ మేరకు గాంధీ నగర్‌లోని డివిజన్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ సిబ్బంది మహిపాల్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో స్వామి వివేకానంద యూత్ అసోసియేషన్ అధ్యక్షులు, బీఆర్ఎస్ యువజన నాయకులు జల్దా లక్ష్మినాథ్, స్థానిక నాయకులు శ్రీనివాస్, బిక్షపతి, మధు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణను మహిళలు సద్వినియోగించుకోవాలి



నవతెలంగాణ-కూకట్‌పల్లి

మూసాపేట్ భరత్ నగర్ మహిళా మండలి భవనంలో, ఖార్డ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్న, ఉచిత కుట్టు మిషన్ శిక్షణ తరగతుల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, ఫతేనగర్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌లు, ఖార్డు సంస్థ నిర్వాహకులు సుమన్ మల్లాది హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహిళల ఆర్థిక స్వాలంబన కోసం ఖార్డు సంస్థ ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ శిబిరాన్ని మహిళలు సద్వినియోగ పరుచుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత నిర్వాహకులే ఉద్యోగాలు కల్పిస్తారని, ఒకవేళ కొంతమంది మహిళలు సంఘటితంగా ఏర్పడితే, ఆర్డర్లు కూడా ఇప్పిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఖార్డు సంస్థ నిర్వాహకులతో మాట్లాడి, ప్రతి డివిజన్‌లో ఉచిత నైపుణ్య శిక్షణ తరగతుల ఏర్పాటు చేయించి మహిళల ఉన్నతి కోసం ఎనలేని కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సి.ఓ మురళి, సురేష్ నాయుడు, సాంబశివ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, పవన్ రెడ్డి, సూర్యకళ, హరిత, అనురాధ, మేరీ, ఆదిలక్ష్మి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హైటెన్షన్ లైన్ రోడ్డును పరిశీలించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి ప్రధాన రహదారి నుండి హైటెన్షన్ లైన్ మీదుగా, ప్రకాష్ నగర్ రోడ్డు విస్తరణ కొరకు, స్థానిక కార్పొరేటర్ జూపల్లి సత్యనారయణతో కలిసి ఎమ్మెల్యే మాధవరం కృష్ణా రావు పరిశీలించారు. రహదారి సమీపంలోని నివాస సముదాయం వారికి టీడీఆర్ ఇచ్చేందుకు చర్చించి నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు స్థానికులు సైతం సంతోషం వ్యక్తం చేశారు.

ఉత్సవాలకు సౌకర్యాలు మెరుగుపరచాలని వినతి

నవతెలంగాణ-దుండిగల్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని, సీనియర్ నాయకులు సోమవారం కలిశారు. ఈ సందర్భంగా నిజాంపేట్ మాల, మాదిగ (ఎస్సీ కమ్యూనిటీ) సభ్యులు మాట్లాడుతూ నిజాంపేట్‌లో బోనాల ఉత్సవాలు నిర్వహణ, ఏర్పాట్లు, అమ్మవారి ఆలయాల అలంకరణ, భక్తులకు సదుపాయాలు, అందుకు తగు నిధులు వంటి విషయాలపై చర్చించడం జరిగింది. ఇందులో భాగంగా పోచమ్మ గుడి (ఎస్సీ మాల) ,శ్రీ శ్రీ శ్రీ పోచమ్మ తల్లి ఆలయాలకు పెయింట్ ఖర్చులకు గానూ కొంత నగదును మేయర్ చేతుల మీదుగా వారికి అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో, కార్పొరేటర్లు బాలాజీ నాయక్, సీనియర్ నాయకులు బొర్రా చందు ముదిరాజ్, చంద్రగిరి సతీష్, ఆయా ఆలయాల కమిటీ సభ్యులు, ఇతర ముఖ్యులు తదితరులు పాల్గొన్నారు.

ముందుగా గుర్తించిన అక్రమ కట్టడాలను కూల్చేయ్యండి

- కలెక్టరేట్‌లో సీపీఐ నేతల ఫిర్యాదు

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట



కుత్బుల్లాపూర్ మండల రెవెన్యూ పరిధిలోని గాజుల రామరం డివిజన్‌లో సర్వే నెంబర్ 329,326,342,306 లలో గుర్తించిన 2500 అక్రమ నిర్మాణాలను కూల్చకుండా అధికారులు జాప్యం చేస్తున్నారని వెంటనే కూల్చి వేయాలని కుత్బుల్లాపూర్ మండల సీపీఐ కార్యదర్శి ఈ.ఉమా మహేశ్ డిమాండ్ చేశారు. గత కొద్ది సంవత్సరాలుగా నివసిస్తూ కరెంట్ బిల్లు, టాక్స్‌లను కట్టుతున్న వారిని జి ఓ నెంబర్ 59 పేరుతో క్రమబదికరించుకోకుంటే కూల్చేస్తామని బెదిరించడం అన్యాయమన్నారు. ముందుగా మీ పై అధికారి రెవెన్యూ శాఖ కార్యదర్శి జారీ చేసిన ఆదేశాల ప్రకారం అక్రమ ఇండ్లను కూల్చివేయ్యాలని సోమవారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో సీపీఐ నాయకులతో కలిసి ఫిర్యాదు చేశారు. ప్రతి సోమవారం ప్రజావాణి ఉంటుందని భావించి, వందలాది మంది ప్రజలు తమ సమస్యలు చెప్పొచ్చని ముఖ్యంగా జి ఓ 59 పరిష్కరించుకోవాలని తెలిపారు. కలెక్టర్ కార్యాలయానికి వస్తే ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ప్రజావాణి రద్దు చేయడం అన్యాయమని, ఏ పని ఉన్న మిగితా రోజుల్లో చేసుకొని ప్రజలు వచ్చే సోమవారం మాత్రం ప్రజావాణి కొనసాగించాలని కోరారు. కొందరికి క్రమబద్ధీకరణ కొరకు నోటీసులు కూడా రాలేదని, ఒకే ప్రాంతంలో ఒక్కొక్కరికి ఒక్కో విధంగా రేట్ నిర్ణయించడం దారుణమని అన్నారు. జి.ఓ 59 అంటే పేద, మధ్య తరగతి ప్రజలు సులువుగా తక్కువగా ప్రభుత్వమే పట్టాలు ఇస్తుందనే భావనతో అప్లై చేసుకుంటే ఇదే అదనుగా ప్రభుత్వం అత్యధికంగా డబ్బులు విధించడం ప్రజలను మోసం చెయ్యడం మానుకోవాలని లేనిపక్షంలో ప్రజలు తిరుగుబాటు చేస్తారని, దానికి సీపీఐ నాయకత్వం వహిస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వి. హరినాథ్, కోశాధికారి సదానంద్, మండల నాయకులు నర్సయ్య, ఇమామ్, ముసలయ్య, సామెల్, ప్రభాకర్‌లు పాల్గొన్నారు.

మూసాపేట, షాపూర్ యూపీహెచ్‌సీల సందర్శన

నవతెలంగాణ-సిటీబ్యూరో



మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీని వాస్ సోమవారం జిల్లాలోని మూసాపేట, షాపూర్ యూపీహెచ్‌సీలను సందర్శించారు. ఈ సందర్భంగా అటెండెన్స్, స్టాక్, ఏఎన్‌సీ డ్యూ, ఇమ్యునైజేషన్ రిజిస్ట్రే షన్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫార్మసీ, ల్యాబ్స్‌లో శానిటేషన్‌ను పరిశీలి ంచారు. అనంతరం నూతనంగా జాయిన్ అయిన ఆశాలతో మాట్లాడారు. వారి నియమ నిబంధనల గురించి వివరించారు. ఓపీని ఇంకా మెరుగుపర్చేలా చూడాలని సూచించారు.

సెక్రటరీని కలిసిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో జీవో 59 కింద దరఖాస్తు చేసుకున్న పేదలకు రిజిస్ట్రేషన్ ఛార్జీల్లో తారతమ్యం రావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నరన్నారు. వారికి ఇబ్బంది లేకుండా న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, సోమవారం ఎమ్మెల్యే కేపి వివేకానంద్ రాష్ట్ర రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్‌ని హైదరాబాద్‌లోని వారి కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి వహించి పునఃపరిశీలన చేసి పేదలకు న్యాయం జరిగేలా చూడాలని నవీన్ మిట్టల్‌ని కోరారు.

కిషన్ రెడ్డిని అభినందించిన సురభి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సమావేశం సందర్భంగా, రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ని రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురభి రవీందర్ రావు కలిసి అభినందించారు.

నర్సింగ్ రావు జయంతి సందర్భంగా రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కూకట్‌పల్లి



దివంగత నేత కీర్తిశేషులు వడ్డేపల్లి నర్సింగరావు జయంతి సందర్భంగా, మూసాపేట్‌లోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయం వద్ద టీమ్ వీఆర్ఆర్ సభ్యుల ఆధ్వర్యంలో, ఓమ్ని హాస్పిటల్స్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు పాల్గొన్నారు. వారి సౌజన్యంతో ఏర్పాటు చేసినటువంటి మెగా రక్తదాన శిబిరాన్ని సందర్శించి, రక్తదానం చేసి వేరొకరి ప్రాణాలు కాపాడారు. దాతలను అభినందించి బ్లడ్ డొనేషన్ సర్టిఫికెట్లు అందించిన, రక్త దాన శిబిరంలో 150 మందికి పైగా రక్త దాతలు పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క కార్యకర్తకు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో యువమోర్చా నాయకులు తిరుపతిరెడ్డి, ఇళగల సాయి, వంశీ నేత, దినేష్ టీం వీఆర్ఆర్, వీఎస్ఆర్ అభిమానులు బీజేపీ నాయకులు కార్యకర్తలు సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

సత్య సాయి కాలనీలో సమస్యను పరిష్కరిస్తా



నవతెలంగాణ-వనస్థలిపురం

బి.యస్ రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సత్యసాగర్ కాలనీలో వర్షపు నీరు రోడ్లపై నిలిచి ఇబ్బందికరంగా ఉందని కాలనీవాసులు సోమవారం బి.యస్ రెడ్డి నగర్ డివిజన్‌కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి కి తెలియజేశారు. స్పందించిన కార్పొరేటర్ సంబంధిత జీహెచ్ఎంసీ అధికారి డిప్యూటీ ఇంజనీర్ దామోదర్ రావుతో కలిసి అట్టి కాలనీలో పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ వెంటనే కాలనీవాసులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని, వీలైనంత త్వరగా సమస్య పరిష్కారమయ్యే విధంగా కృషి చేస్తామని కాలనీవాసులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాకేష్, పార్టీ డివిజన్ ఉపాధ్యక్షులు మెట్టుపల్లి సంతోష్ రెడ్డి, శ్యామ్ గౌడ్, వర్క్ ఇన్స్పెక్టర్ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జార్ఖాండ్ పిస్టల్‌ను అమ్మేందుకు యత్నించిన వ్యక్తి అరెస్ట్



నవతెలంగాణ-హాయత్ నగర్

జార్ఖాండ్ నుండి తయారు చేసిన పిస్టల్ ను నగరంలో విక్రయించడానికి యత్నించిన వ్యక్తి ని ఎల్బీ నగర్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం ఎల్‌బీ నగర్ జోన్ డీసీపీ సాయి శ్రీ తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు.మహమ్మద్ షాబుద్దీన్ అన్సారీ స్వస్థలం జార్ఖాండ్ రాష్ట్రం.గత ఏడాది నుంచి కందుకూరులో అతని బంధువుల ఇంట్లో ఉంటున్నాడు. ఎల్‌బీ నగర్ రింగ్ రోడ్డు వద్ద అధిక ధరకు పిస్టల్‌ను అమ్మకానికి యత్నించగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.అతని వద్ద తయారు చేసిన పిస్టల్,రెండు బుల్లెట్స్,ఒక ఫోన్ స్వాధీనం చేసుకున్నారు.ఈ సమావేశంలో ఎల్‌బీ నగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అంజి రెడ్డి,క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వీరస్వామి, ఎస్ ఐ లు రవి కుమార్, నరేందర్,సిబ్బంది అనిల్,శ్రీనివాస్,భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

తృణమూల్ కాంగ్రెస్ గుండాలను శిక్షించాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి. నాగరాజు
- ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడిని ఖండిస్తూ.. మమతా బెనర్జీ దిష్టిబొమ్మ దహనం



నవతెలంగాణ-సిటీబ్యూరో

బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో రిగ్గింగ్ చేస్తున్న తృణమూల్ కాంగ్రెస్ దౌర్జన్యాన్ని అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడిని భారత విద్యార్థి సమాఖ్య(ఎస్ఎఫ్ఐ) ఖండించింది. వెంటనే తృణమూల్ కాంగ్రెస్ పార్టీ గుండాలను శిక్షించాలని కోరుతూ సోమవారం నారాయణ గూడ చౌరస్తాలో బెంగాల్ సీఎం మమతా బెనర్జీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె.అశోక్ రెడ్డి అధ్యక్షత జరిగిన నిరసన సభలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ పంచాయతీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుందని విమర్శించారు. ఓటర్లను భయభ్రాంతులకు గురి చేస్తూ.. పోలింగ్ స్టేషన్స్ నుంచి ప్రజలను వెళ్ళగొట్టి భారీగా రిగ్గింగ్ చేయడం దుర్మార్గమన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేస్తున్నారని, ఈ ఎన్నికల్లో ఎస్ఎఫ్ఐ ధీటుగా ప్రచారం చేసిందని గుర్తుచేశారు. అదివారం జరిగిన పోలింగ్ సందర్భంగా ప్రజలు, లెఫ్ట్ కార్యకర్తలపై దాడి చేయడం అన్యాయమన్నారు. ఎస్ఎఫ్ఐ ఆలిండియా సహాయ కార్యదర్శి దీప్సితా ధర్, బెంగాల్ రాష్ట్ర ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై దాడి చేసి గాయపర్చారన్నారు. బెంగాల్ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేకుండా కేంద్ర బీజేపీతో చేతులు కలిపి ఎన్నికల కమిషన్, పోలీసు వ్యవస్థనూ తన చెప్పినట్లు చేయాలని ఒత్తిడి తీసుకువచ్చి వ్యవస్థలను ధ్వంసం చేస్తుందన్నారు. ఎస్ఎఫ్ఐ నాయకులపై దాడి చేసిన తృణమూల్ గుండాలను శిక్షించాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా ఆందోళనలు చేస్తామని రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు లెనిన్ గువేరా, కె.అశోక్ రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జూనుగరి రమేష్ ,జిల్లా ఉపాధ్యక్షులు శ్రీమాన్, స్టాలిన్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్‌లో బదిలీలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ టౌన్‌ప్లానింగ్‌లో గత కొంతకాలంగా పనిచేస్తున్న అధికారులు బదిలీ అయ్యారు. సోమవారం స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్‌కుమార్ ఆదేశాలు జారీ చేశారు. జీహెచ్ఎంసీలో చీఫ్‌సిటీ ప్లానర్‌గా(సీసీపీ) పనిచేస్తున్న ఎస్.దేవేందర్‌రెడ్డిని డైరెక్టర్ ఇఫ్ టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ (డీటీసీపీ)కి బదిలీచేశారు. హెచ్ఎంఆర్ఎల్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఎం.రాజేంద్ర ప్రసాద్ నాయక్‌ను జీహెచ్ఎంసీ సీసీపీగా నియమించారు. జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న మరో డైరెక్టర్ కే.శ్రీనివాస్‌ను హెచ్ఎండీఏ (ప్లానింగ్-2) డైరెక్టర్‌గా బదిలీ చేశారు. జీహెచ్ఎంసీలో అదనపు డైరెక్టర్ టౌన్‌ప్లానింగ్‌లో పనిచేస్తున్న బీ.ప్రదీప్‌కుమార్, కే.గంగాదర్‌ను అదనపు చీఫ్ సిటీప్లానర్‌గా ప్రొమోషన్ పొందారు.



జల్ పల్లి మున్సిపల్ లో జరిగిన బోనాల పండుగ ఉత్సవాల సందర్భంగా టిపీసీసీ కార్యదర్శి ఎల్మేటి అనరేందర్ రెడ్డి,సీనియర్ నాయకులు కొత్త మనోహర్ రెడ్డిలు పోచమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు మస్నా రవికుమార్,నాయకులు శ్రీనివాస్, జలపల్లి మున్సిపాల్టీ కాంగ్రెస్ అధ్యక్షులు అహ్మద్ బామ్ , యూసఫ్, వంగేటి మధుసూదన్ రెడ్డి, ఆంజనేయులు, రామస్వామి తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-బడంగ్‌పేట్

ఘనంగా ముజీబ్ జన్మదిన వేడుకులు



- టీఎన్జీఓ జిల్లా కమిటీ ఆధర్వంలో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదానం కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని(ముజీబ్) జన్మదినం పురస్కరించుకొని సోమవారం జిల్లా కార్యదర్శి విక్రమ్ కుమార్, సహాధ్యక్షుడు కె.ఆర్.రాజ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు కుర్రాడి శ్రీనివాస్, వైదిక్ శస్త్ర, శంకర్, శ్రీధర్, ముఖీమ్ ఆధ్వర్యంలో ఎం.ఎన్.జే క్యాన్సర్ ఆస్పత్రిలో, కనకదుర్గ అమ్మవారి దేవాలయం, యూసఫ్ సైన్ బాబా దర్గా, బంగారు మైసమ్మ అమ్మవారి దేవాలయం, డాన్ బాస్కో అనాధాశ్రమంలో ముజీబ్ ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు చేసి, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు చంద్రశేఖర్, రాజు, రాజేందర్, రాజ్ కుమార్, కృష్ణ, గోపాలకృష్ణ, జోయెల్, ఇబ్రహీం, అసద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలతో ట్రాఫిక్ అవస్థలు

- సైదాబాద్ డివిజన్‌లో వాహనాదారుల ఇబ్బందులు
- ట్రాఫిక్ పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు



నవతెలంగాణ-సంతోష్‌నగర్

సైదాబాద్ డివిజన్ పరిధిలోని శంకేశ్వర్ బజార్ రోడ్డును ఆక్రమించి వైన్స్ ఏర్పాటు చేసుకున్న కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తోందని వాహనదారులు వాపోతున్నారు. డీసీపీ ఆఫీస్ నుంచి సైదాబాద్ సంకేశ్వరం బజార్ సరూర్ నగర్ వెళ్లే ప్రధాన రహదారి నుంచి వైపు వెళ్లే మార్గంలో పరిస్థితి మరింత క్లిష్టంగా తయారైంది. స్థానికంగా ఓవైపు, ఎదురుగా మరో వైన్స్, పెట్రోల్ పంప్, ఫ్రెష్ చికెన్ సెంటర్‌లతో ఇక్కడికి వస్తున్న వాహనదారులు పార్కింగ్ సదుపాయం లేకపోవడంతో రోడ్డుపైనే వాహనాలను నిల పాల్సి వస్తోంది. మరోవైపు దుకాణ సముదాయాలు ముందు నడక మార్గాలను ఆక్రమిస్తూ పలువురు చిరువ్యాపారులు టీకొట్టు, పండ్ల రసాల దుకాణాలను ఏర్పాటుచేశారు. రోడ్డుకు సగం వరకు ఆక్రమించి వీటిని ఏర్పాటు చేయడంతో దుకాణాలకు వచ్చే వినియోగదారులు నడిరోడ్డుపై వాహనాలను పార్కింగ్ చేస్తున్నారు. అలాగే చిరువ్యాపా రులు రోడ్డును ఆక్రమించి దుకాణాలు ఏర్పా టుచేయడంతో తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. ఆరు నెలలక్రితం మలక్ పేట్ ట్రాఫిక్ పోలీసులు ఆక్రమణలను తొలగించినా తిరిగి చిరువ్యాపారులు దుకాణాలను ఏర్పాటుచేశారని తెలుస్తోంది. ఈ ప్రాంతానికి వచ్చేవారు గత్యంతరం లేక వాహనదారులను రోడ్డుపైనే నిలిపి ఉంచుతున్నారు. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంటోంది. మరోసారి ట్రాఫిక్ పోలీసులు రోడ్డుపై ఏర్పాటు చేసిన ఆక్రమణలను తొలగించి. ట్రాఫిక్ ను క్రమబద్ధీకరించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలి



- చైర్మెన్ గోవర్ధన్ రెడ్డి

నవతెలంగాణ- చైతన్యపురి

విద్యార్థులు పాఠశాల దశ నుంచే నాయకత్వ లక్షణాలను కలిగి ఉండాలని త్రివేణి సంస్థల చైర్మెన్ గోవర్ధన్ రెడ్డి అన్నారు. సోమవారం త్రివేణి పాఠశాలలో నూతన విద్యార్థి మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. విద్యాంస్థలు మార్చ్ ఫాస్ట్‌తో కార్యక్రమానికి ప్రారంభించారు. పాఠశాల హెడ్ బాయ్ గా యశస్వి ధర్, హెడ్ గర్ల్ గా ప్రియ లు ఎన్నికై ప్రమాణ స్వీకారం చేశారు. స్పోర్ట్స్ కెప్టెన్, వైస్ కెప్టెన్లను బ్యాలెట్ పేపర్ ద్వారా ఎన్నికలు నిర్వహించి గౌరవ సూచ కంగా బ్యాడ్జీలు అందజేసి విద్యార్థులకు అభినందనలు తెలియ జేశారు. అనంతరం గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ జ్ఞానం ,నాయ కత్వ సాధన, శక్తి యుక్తులతో కూడిన విద్య బోధన త్రివేణి విద్యా సంస్థల లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీల్ ,హెడ్ మిస్ట్రిస్ యోగేశ్వరి, ఉపాధ్యాయ బందం, విద్యార్థులు,

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి.



నవతెలంగాణ-తుర్కయాంజల్

ఐసిడిఎస్‌కు బడ్జెట్ పెంచి అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదిభట్ల మున్సిపాలిటీ బొంగళూరు చౌరస్తా నుండి మన్నెగూడ చౌరస్తా వరకు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు.ఈ సందర్భంగా సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం చంద్రమోహన్ అంగన్వాడి టీచర్స్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ఐసీడీఎస్ కు బడ్జెట్ పెంచి బలోపేతం చేయాలని, ప్రమాదకరమైన 20 20 నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలని కోరారు. 45వ ఐ ఎల్ సి సిఫారసులను అమలు చేసి అంగన్వాడీ ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు , పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్‌తో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీ వెంటనే చెల్లించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని పేర్కొన్నారు. ఎలాంటి షరతులు లేకుండా మినీ అంగన్వాడీ టీచర్లను మెయిన్ టీచర్ గా గుర్తించాలని, అంగన్వాడీ ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇచ్చి వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని, 2017 నుండి రావలసిన టిఏ, డిఏ బకాయిలను మొత్తం చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి సరిపడా బడ్జెట్ను వెంటనే రిలీజ్ చేయాలని, అంగన్వాడీ ఉద్యోగులకు ఆసరా కళ్యాణ లక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు డి కిషన్, ఏ రవికుమార్, టి నరసింహ, సిహెచ్ బుగ్గ రాములు, పోచమోని కృష్ణ, అంగన్వాడీ టీచర్లు బాలమణి, బేబీ, సుజాత, లలిత, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

జలమండలి ఎండీని కలిసిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-ఉప్పల్



ఉప్పల్ నియోజకవర్గంలోని పలు సమస్యల పరిష్కారానికి ఐదు కోట్ల రూపాయలు కేటాయించాలని కోరుతూ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి జలమండలి ఎండి దాన కిషోర్ ని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఉప్పల్ బాగాయత్ లే అవుట్ లో తాగునీటి కనెక్షన్లు ఇవ్వాలని , త్వరలోనే ఉప్పల్ బాగాయత్ లేఅవుట్ అసోసి యేషన్ సభ్యులు , హెచ్ఎం డిఏ , జలమండలి అధికారులతో నీటి కనెక్షన్ కోసం సమా వేశం ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. జలమండలి డైరెక్టర్ ఆఫ్ ఆపరేషన్ స్వామి, సీజీఎం నాగేందర్, జీఎం సంతోష్ కుమార్, డీజీఎం రజినీకాంత్ రెడ్డి, మేనేజర్ సత్యనారాయణ, నాయకులు వెంకటేశ్వర రెడ్డి,మహేందర్ రెడ్డి, చంద్రారెడ్డి, పోచయ్య భార్గవ చారీ, తదితరులు పాల్గొన్నారు.

IN THE COURT OF THE MACT-CUM-PRL.DISTRICT JUDGE AT MAHABUB-NAGAR
M.V.O.P.No. 108 of 2021

Between:
Mohammed Sohel @ Md.Saali @ Md.Soyel ....Petitioner
And
Koppula Shesanna and others ....Respondents

TO,
Syed Riyaz Pasha S/o Syed ahamed,age Major,Occ: Owner of Tipper Lorry bearing No.AP 29-T-7461,r/o H.No.19-1-1084/12,Doodhbowli,Bandlaguda,Bahadurpura,Hyderabad,500064(TS) **(Respondents No.2)**

WHEREAS The Petitioner has filed above M.V.O.P.against you and others for claiming compensation for the injuties sustained by him in a motor accident.The said M.V.O.P.case stands posted on 27-07-2023 for your appearance.you are hereby directed to appear before the above Court by 10.30 A.M.on the said date in person or through Advocate,otherwise the matter will be decided on the material available on records.

//BY ORDER OF THE HON'BLE COURT//
COUNSEL FOR THE PETITIONER
Sd/-P.MALLIKARJUN, G.MURALIDHAR, ADVOCATES, MAHABUBNAGAR, "SRI SAI CHAMBER OF LAW" CELL-9848071148 9182894411

PUBLIC NOTICE

The General Public is nereby informed that our client M/s. Shriram Finance Limited, Chikkadpally Branch, Hyderabad is dealing with financing business. In the course of business, **Sri Yeparalla Nova Stallin, S/o. Late V. Jeevan Kumar, aged about 30 years, Occupation: Pvt. Employee, R/o. H.No.1-1-18/25, Jawar Nagar, Chikkadpally, Hyderabad**, has approached our client for trade finance and accepted to deposit his title deeds in the respect of the property

SCHEDUE OF PROPERTY:-

All that the House bearing No.4-147/5/A in Revenue Block No.4 and Revenue Ward No.18, admeasuring an area of 85 square yards or its equivalent to 71.06 square meters, Situated at Balapur Village and Mandal, Badangpet Municipality, Ranga Reddy District and bounded by:- **North** : Neighbor's, **South** : Neighbor's House, **East** : Road, **West** : Neighbor's House No.4-143/6, as security for the loan availed by him. If any person or persons having any claim or interest in the above property may approach the undersigned within seven days from the date of this publication or else our client will proceed with the transaction.

M.VANAMA RAJU
ADVOCATE
HYDERABAD.
Mobile No.9963874156

IN THE COURT OF THE HON'BLE XI ADDL.CHIEF JUDGE, CITY CIVIL COURT : AT HYDERABAD
O.S.No. 354 of 2021

Between:
Aourias Sultana ......Petitioner/Plaintiff
And
Talari Ravi Kumar &others ....Respondents/Defendants

To,
(1) T. Monika D/o Talari Ravi Kumar. Aged about: 31 years, Occ:student R/o H.no:6-3-1216/12, Flat no:205, Deepak Apartment, Methodist Colony, Kundan Bagh, Begumpet, Hyderabad-500016.

Whereas the above named petitioner has filed the above O.S.354 of 2021 for Specific performance of an Agreement of Sale against you and others. You are hereby summoned to appear in this court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the case on **14.8.2023, at 10.30 AM.** Please take notice that, if you are failed to appear, the matter will be heard and decided as per law in your absence.

"By order of the court"
M/s. MOOSA AHMED. AAMIR AHMED & HENNA ADVOCATES.
R/o. H.No. 1-1-523/44, Gandhi Nagar, Golconda X' Road, Musheerabad, Hyderabad-500 080.T.S.

IN THE COURT OF THE MACT-CUM-III ADDL.DISTRICT JUDGE(FAMILY COURT JUDGE) AT MAHABUBNAGAR
M.V.O.P.No. 329 of 2022

Between:
Pullari Thirupathamma and others ....Petitioners
And
Varun Tours & Travels Hyderabad and others ....Respondents

TO,
Varun Tours & Travels,represented by Mr.E.Satyanarayana S/o Not Known, Aged Major,Occ:Business and Owner of Ashok Leyland Bus bearing No.TS 08 UB-0840,R/o H.No.2-3-676/3/153,Road No.9,Lalithanagar,Nagole,Hyderabad-500068. **(Respondents No.1)**

WHEREAS The Petitioner has filed above M.V.O.P.against you and others for grant of compensation for the death of husband of petitioner No.1 and father of the petitioners No.2 and 3 who died in a motor accident.The said M.V.O.P. case stands posted on 18-07-2023 for your appearance.you are hereby directed to appear before the above Court by 10.30 A.M.on the said date in person or through Advocate,otherwise the matter will be decided on the material available on records.

//BY ORDER OF THE HON'BLE COURT//
COUNSEL FOR THE PETITIONER
Sd/-P.MALLIKARJUN, ADVOCATES, MAHABUBNAGAR, "SRI SAI CHAMBER OF LAW" CELL-9848071148

NOTICE
IN THE COURT OF THE HON'BLE 1ST ADL DISTRICT JUDGE, MALKAJGIRI AT: MALKAJGIRI
O.S. NO. 106 OF 2023

Between:
T. T. V. L. KANTHA RAO & others ...Plaintiffs
AND
All concerned and another ...Defendants

To
All concerned

Please take notice that in the above matter i.e., O.S. No. 106 of 2023 on the file of Hon'ble 1st Adl Dist Judge, Malkajgiri, the Hon'ble court ordered substitute of service of summons to All concerned. The matter pertains to declaration of Leal Heirs. The matter is posted on 26-07-2023 at 10.30 a.m. at the above mentioned Court for your appearance either in person or through an advocate and submit the objections if any without fail. Otherwise, the matter will be decided in your absence.

(BY ORDER OF THE HON'BLE COURT)
D. MADHUSUDHAN
ADVOCATE
Flat No. 201, Sri Sai Balaji Residency (B1), Street No. 1, Sai Ram Nagar Colony, Mamatha Nagar, Nagole, Hyderabad – 500 068. Ph. No. 9848590612

IN THE COURT OF THE HON'BLE XVII SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT AT HYDERABAD
O.S.No. 50 of 2016

Between :-
M. Vthal Died Per Lrs. .....Plaintiff
AND
Narsingh Rao Died Per Lrs & Others .....Defendants

To.
M. Sunitha W/o Mr. Mahesh & D/o M. Narsing Rao Age about 38 years, Occ: Housewife, H.NO. 13-4-606/2, (Part of 13-4-6060/1) Jiyaguda, Hyderabad. (Defendant No.4)
M Saikiran S/o late M. Narsing Rao Age about 26 years, Occ : Business H.NO. 13-4-606/2, (Part of 13-4-6060/1) Jiyaguda, Hyderabad. (Defendant No.5)

Take notice that the Plaintiff herein namely M. Vithal died Per Lrs M. Kalpana & others filed the above Suit for Declaration Of Title And Recovery Of Possession before the Hon'ble Court and the same is posted to 21.07.2023 for your appearance.
Hence you are hereby directed to appear either in person or through Advocate on **21.07.2023 at 10:30 AM** before the Honble Court lest the matter would be decided as per law.

// By order of Court //
M.Vidya Sagar
Advocates
13-6-460/115. Maheshnagar, Gudimalkapur, Hyd. Mobile No: 99480-46972

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS AT : HYDERABAD
O.S. No. 3421 of 2023

Between:
1) Dr. Daljeet Pandoh, S/a. B.R. Pandoh,
2) Karthik Pandoh, S/o. Dr. Daljeet Pandoh,
3) Ritvik Pandoh, S/o. Daljeet Pandoh, ...Plaintiffs
AND
The TahaslIdar, Himayathnagar Revenue Mandal, Hyderabad & another .....Defendants

To
All concerned .....Defendants No.2

NOTICE

That the above named plaintiffs filed the above suit for Declaration to declare them as legal heirs of deceased **LATE. SMT. DR. CHAMUNDI PANDOH**, W/o. Dr.Daljeet Pandoh who died intestate on 25.07.2017 due to ill-heath by leaving behind the plaintiffs as her legal heirs against you and another and the above suit is pending before the Hon'ble X Junior Civil Judge, City Civil Court At: Hyderabad and the above suit is posted on 07.08.2023 for any objections. If any person/s is/are having any objections he/she may appear before the Honble Court on **07.08.2023 at 10.30 A.M.** either in person through an advocate, failing which the matter will be decided as per Law in your absence.

[By Order of the Court]
M/s. M. DEVENDER REDDY
Advocate
Flat No. 306, Raghavendra Heavens Road No. 1, Telephone Colony, Kothapet, Hyderabad. Cell: 9440036699

IN THE COURT OF THE HON'BLE IX JUNIOR CIVIL JUDGE C.C.C AT : HYDERABAD
O.S.No. 3420 of 2023

Between :
1. Gaddam Bharathi W/o Late Gaddam Lakshmi Raj Aged about 58 years Occ: Household,
2. Gaddam Bala Sunder Raj S/o Late Gaddam Lakshmi Raj Aged about 44 years Occ: Business,
3. Gaddam Malathi D/o Late Gaddam Lakshmi Raj Aged about 41 years Occ: Household,
All R/o H.No.12-2-61914/D, Guddimalkapur, Near Methodist Church, Mehdipatnam, Hyderabad-T.S. .....Plaintiffs

AND
1) The Tahsildar Asif Nagar Mandal, Hyderabad. Opp : Govt Boys High School, Vijay Nagar Colony, Hyderabad-T.S. Pin Code.500028.
2) All Concerned. .....Defendants

To
ALL CONCERNED

Please take notice that the above named Plaintiffs have filed the above suit to declare the plaintiffs as legal heirs of Late Gaddam Lakshmi Raj S/o Late Gaddam Balaiah Died on 20-12-2021. If any person or persons have any objection for the same may appear personally or through counsel on **04-08-2023 at 10-30 AM** before the Hon'ble IX Junior Civil Judge, Hyderabad, otherwise the Hon'ble Court will proceed according to law.

//By order//
M/s Hameed Pasha
Advocate
10-2-400, Asif Nagar Hyderabad, T.S. Cell No. 9849713633

IN THE COURT OF THE HON'BLE X JUNIOR CIVIL JUDGE, CITY CIVIL COURTS, AT: HYDERABAD.
O.S. No. 3242 of 2023

Between:
1. Smt Uppu Radha, W/o. Late Sri Uppu Sathaiah Ashok @ Uppu Ashok Aged about: 65 years, Occ; Household,
2. Sri Uppu Ashok Bhardwaj, S/o. Late Sri Uppu Sathaiah Ashok @ Uppu Ashok Aged about: 42 years, Occ; Business,
3. Sri Uppu Srichand, S/o. Late Sri Uppu Sathaiah Ashok @ Uppu Ashok Aged about: 39 years, Occ; Business,
All are Resident of MCH No. 1-1-2/G/1, Jawaharnagar, Behind Musheerabad Telephone Exchange, Musheerabad, Hyderabad-500 020.
4. Smt Korivi Shoba @ U Mrinalini, W/o. Sri K Vinod Kumar, D/o. Late Sri Uppu Sathaiah Ashok @ Uppu Ashok Aged about: 40 years, Occ; Household, R/o. H. No. 13-6-916/9/11/A, Banjawadi, Karwan, Asifnagar, Hyderabad. .....Plaintiffs

AND
1. The Tahsildar, Musheerabad Mandal, Hyderabad District, Hyderabad.
2. All Concerned .....Defendants

To,
Defendant No-2

To,
Whom so ever all concerned

Please take notice that the Plaintiffs herein have filed the above suit for declaration of Plaintiffs as the Legal Heirs of the deceased Uppu Sathaiah Ashok @ Uppu Ashok, who died on 04.08.2011 for legal status purpose only. The above Said case is posted to **21.07.2023 at 10.30 am**. In the above Court, If anybody is having any claim or objection may approach this Hon'ble Court with valid documents, either in person or through an Advocate, failing which the case will be heard and decided on merits in your absence.

// By Order Of the Court //
MOOLA MURALI MOHAN,
Advocate
Flat No-3, Dharani Sai Shelters, Padmarao Nagar, Secunderabad-500 025. 9848238766

IN THE COURT OF THE HON'BLE, JUDICIAL MEGISTRATE OF FIRST CLASS – SPCIL(MOBILE) PCR ACT.RANGAREDDY CUM- IV ADDL M.M.CUM- IV ADDL.JUNIOR CIVIL JUDEGE, AT: L.B. NAGAR.
O.S.NO. 1353 OF 2022

BETWEEN:
1. PEDDABAVI MAHENDER REDDY S/o. P. Yadagiri reddy, Aged about 44 years, Occ: Business, R/o.H.No.24-115, Sita meadows, Badangpet, Rangareddy District.
2. V. SATYANARAYANA YADAV S/o. Late.V. Balaiah, Aged about 52 years, Occ: Business, R/o.H.No.17-1-376/79, Santhoshnagar, Saidabad, Hyderabad.
3. D. MOHAN S/o. D. Jangaiah, Aged about 49 years, Occ: Business, R/o.H.No.1-94, Old Hanuman Temple, Badangpet, Rangareddy District. ...PLAINTIFFS

A N D
1. SAKHAMURI SRINIVASA RAO S/o S. Mallikarjuna Rao, Aged about:48 years, Occ: Employee, R/o H.No.609/11/1/A, Nelapadu, Tenali, Guntur- 522201. Presently R/o. H.NO.3-5-65/A/1, Nehrunagar, Ramanthapur, Amberpet, Hyderabad.
2. NAGESHWAR RAO K.V. S/o. K. Ramanjaneyulu, Aged about 46 years, Occ: Business, R/o.H.No.13-14/A, Shalivahana Nagar, Dilsukhnagar, Saroornagar, Hyderabad. ...DEFENDANTS

NOTICE

Please take notice that the Plaintiffs herein have filed the above petition seeking declaration &consequential injunction which is posted to 20/07/2023 by the Hon'ble Court to receive the objections of persons opposing.
If any person or persons have any objections, claim or concern of whatsoever against such relief they may put forth their objections before the Hon'ble court on **20/07/2023 at 10:30 a.m.** either personally or through authorized counsel or otherwise the matter will be adjudicated in due process of law. Hence this Notice.

(BY THE ORDER OF THE COURT)
RAMESH CHERUKU
ADVOCATE
#11-59, Sai township, Badangpet, Kanchan Bagh, Hyderabad.9849078361

IN THE COURT OF THE HON'BLE ADDITIONAL JUNIOR CIVIL JUDGE: RANGA REDDY DISTRICT AT HAYATHNAGAR.
O.S. NO. 514 OF 2023

Between:
1. Madireddy Someswari and another, ...Plaintiffs
And:
1. The Tahsildar, Hayathnagar Mandal,
2. All Concerned (Public at large) .... Defendants

To,
ALL CONCERNED

Please take notice that the plaintiffs namely (1) Madireddy Someswari and (2) Madireddy Yatendra Narasimha Rao have instituted the above suit seeking Declaration declaring the plaintiffs are being the legal heirs of missed out person Sri. Madireddy Venkateshwar Rao who is the husband of 1st plaintiff and father of Plaintiff No.2. The said Madireddy VenkateshwarRao suffered with "PARKINSON SYNDROME" disease and used to take treatment and missed out on 08.03.2014 for which the Plaintiff No.1 lodged a complaint with Police Vanasthali puram on 09.03.2014. The Police Vanasthalipuram registered a case in Cr. No.200/2014 on 09.03.2014 under the caption of "Man-MISSING". The Police issued LOOK OUT NOTICE. After the due investigation, the Police Vanasthalipuram filed final report before the Court of Hon'ble VII Metropolitan Magistrate, Cyberabad at L.B.Nagar on 31.12.2014 referred the case as "UN-DETECTED". The above suit is posted to 19.07.2023 for calling objections and reply from the concerned parties/Public in General if any and therefore you are hereby summoned to appear in person or through an Advocate duly instructed at. 10.30 AM on 19.07.2023 before the Hon'ble Court, failing which the matter will be heard and the same be determined exparte.

//BY ORDER OF THE HON'BLE COURT//
Sd/-
(J.PHANINDRA KUMAR)
Advocate,
Plot No. 344/E, Road No.3/3 Vaidehinagar, Vanasthalipuram Hyderabad-500070 Cell No.9912904074 Land Line: 040-29327567

IN THE COURT OF THE HON'BLE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL-CUM-PRINCIPALDISTRICT JUDGE, RANGA REDDY DISTRICT, AT: L.B.NAGAR
O.P.NO.741 OF 2022

BETWEEN:
MAMUDA SARKAR And another .. PETITIONERS
A N D
MIR NAQI ALI KHAN And others .. RESPONDENTS

To
R-1 MIR NAQI ALI KHAN, S/o Mir Laiq Ali Khan, Aged about 45 years, Occ: Business, R/o H.No.20-3-835, Shah Gunj, Near Limra Mission School, Charminar, Hyderabad – 500 002. (Owner of Bolero Vehicle bearing No.TS 12 UB 7640)
R-3 MOHAMMED ARIF KHAN @ ARIF, S/o Late Md.Hameed Khan @ Md.Haneef Khan, Aged about 39 years, Occ: Driver, R/o H.No.4-11-34/2/1/A, Mohd.Server House, MM Pahadi, Rajendranagar, Ranga Reddy District. (Driver of Bolero Vehicle bearing No.TS 12 UB 7640)

NOTICE

The Petitioners herein had filed the above petition for compensation under Section 166 of the M.V.Act, 1988 and Rule 475/1B of A.P.M.V. Rules, 1989 for the death of Majidur Rehaman in the Motor Vehicle accident against the Respondents which includes you. The Hon'ble Court waspleased to order for publication of this notice for your appearance in the above Petition and the matter is posted to **27.07.2023 at 10.30 a.m.** and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]
Sd/-
G.RATHNAM REDDY,
Advocate,
11-6-227, Pochamma Bagh, Beside GHMC Office, Saroornagar, Ranga Reddy District Cell No.9912658614

కింగ్ కోఠి జిల్లా ఆస్పత్రి ఆకస్మిక తనిఖీ

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



కింగ్ కోఠి జిల్లా ఆసుపత్రి ని సోమవారం వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలోని ఆయా విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్ నుఅడిగి తెలుసుకున్నారు. మాతా శిశు కేంద్రంలో నార్మల్ డెలివరీలు సంఖ్య పెంచాలని సూచించారు. ఆస్పత్రిలో సర్జరీలు. ఓపి విభాగం. ఐపి విభాగాల వార్డులను సందర్శించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రనాథ్. హెచ్ ఓ డి డాక్టర్ జలజ. డాక్టర్ రాజశేఖర్ బాబు. డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి. డాక్టర్ వెంకటేష్. షాహిదా. స్టాఫ్ నర్సులు. తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

నవతెలంగాణ-ముషీరాబాద్



మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బోలక్‌పూర్ డివిజన్ ఇందిరానగర్‌లో బాబుజగ్జీవన్‌రామ్, డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ కార్యక్రమాన్ని ఎమ్మార్పీఎస్ ముషీరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ గజ్జల రాజశేఖర్ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా మహాజన సోశలిస్ట్ పార్టీ సీనియర్ నాయకులు గండి కృష్ణ మాదిగ హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో నే ఏబిసిడి వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు.జులై చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించే ఎమ్మార్పీఎస్ సింహ గర్జన సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాబు జగ్జీవన్ సంఘం అధ్యక్షులు సంఘపాక భాస్కర్ బస్తి నాయకులు మాదిరి నరసింహ రావు చిలుక ఎల్లయ్య దశరథ్ నంది జీవన్ మాదిగ ఎం శ్రీనివాస్ విజయ మాదిగ తదితరులు పాల్గొన్నారుల

రాష్ట్ర వ్యాప్తంగా '12వ తేదీన విద్యా సంస్థలు బంద్

- సంపూర్ణ మద్దతు తెలిపిన వామపక్ష విద్యార్థి సంఘాలు, తెలంగాణ రాష్ట్ర కమిటీలు



నవతెలంగాణ-హిమాయత్ నగర్

వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 12వ తేదీన చేపట్టిన రాష్ట్ర వ్యాప్త విద్యా సంస్థలు (పాఠ శాలలు, జూనియర్ కళాశాలల) బంద్‌కు వామపక్ష యువజన సంఘాలు ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్, ఏఐఎఫ్ డీవై రాష్ట్ర కమిటీలు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ, ప్రత్యక్షంగా బంద్‌లో పాల్గొనాలని పిలుపునిచ్చాయి. సోమవారం హిమాయత్‌నగర్‌లోని రాజ్ బహదూర్‌హాల్‌లో వామపక్ష యువజన సంఘాల ఐక్య కార్యాచరణ సమితి సమావేశం నిర్వహిం‌చారు. ఈ సందర్భంగా బంద్‌కు సంబంధించిన గోడ పత్రికను సోమవారం విడుదల చేశారు. అనంతరం ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర, డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆనగంటి వెంకటేష్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఎస్.ప్రదీప్, ఏఐఎఫ్‌డీవై రాష్ట్ర కార్యదర్శి వనం సుధాకర్ కలిసి మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, విద్యా సంవత్సరం ప్రారంభమైన నేటికీ ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర మౌలిక సదుపాయాల కల్పన జరగలేదని ఆరోపించారు. ఒకవైపు ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నామని అధికార యంత్రాంగం ప్రకటనలు చేస్తున్న సూత్రప్రాయంగా మాత్రం విద్యా సంస్థల్లో ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థలపై విద్యా శాఖ అధికారులు అజమాయిషీ తగ్గిందని, అధిక ఫీజులు వసూళ్లు చేస్తున్న అనధికార విద్యా సంస్థలను నడిపిస్తున్న అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఉపా ధ్యాయ, అధ్యాపక, నాన్ టీచింగ్ పోస్టులను, ఎంఈఓ, డీఈవో పోస్టులను భర్తీ చేయాలని, ప్రభుత్వ విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని, జీఓ నెం.1 నిబంధలను పాటించని విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని, ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల్లో పని చేస్తున్న డ్రైవర్లు, బోధనేతర సిబ్బందికి కనీస వేతనాలు ఇవ్వాలని, ఫీజుల నియంత్రణ కమిటీ సిఫార్సులను అన్ని విద్యా సంస్థలు అమలు చేయాలనే ప్రధాన డిమాండ్ల సాధన కోసం బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా ఉన్న యువజన సంఘాల నేతలు అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో ప్రత్యక్షంగా పాల్గొని, జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి నెర్లకంటి శ్రీకాంత్, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు సల్మాన్ బైగ్, కార్యదర్శి టి.సత్యప్రసాద్, డీవై ఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి జావీద్, పీవైఎల్ రాష్ట్ర నేతలు రవికుమార్, బి.కృష్ణ, బి.శ్రీనివాస్, రాజు, ఏఐఎఫ్ డీవై హైదరాబాద్ జిల్లా నేత మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

మహిళా యూనివర్సిటీలో విద్యార్థిని లకు హాస్టల్ వసతిని కల్పించాలి

- కోఠి మహిళా విశ్వవిద్యాలయం ప్రధాన గేటు ముందు విద్యార్థినిల ధర్నా..
- ఏబీవీపీ విద్యార్థినిల కన్వీనర్ పి.సిరివెన్నెల గౌడ్




నవతెలంగాణ -సుల్తాన్ బజార్

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఏబీవీపీ తెలంగాణ మహిళ యూనివర్సిటీ శాఖ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ప్రధాన గేటు ముందు పెద్ద ఎత్తున విద్యార్థినిలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ స్టేట్ విద్యార్థినిల కన్వీనర్ పి. సిరివెన్నెల గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ మహిళా యూనివర్సిటీ కి 100 కోట్లు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ఈ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క పైసా ఇవ్వని దుస్థితి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని మహిళ యూనివర్సిటీలో మౌలిక వసతులు లేకుండా విద్యార్థులు ఎంతో ఇబ్బంది గుంవుతున్నారు అని మండిపడ్డారు. రాష్ట్రంలోని మారుమూల గ్రామాల నుండి సామాన్య మధ్య తరగతి విద్యార్థులు చదువుకోవడానికి యూనివర్సిటీకి వస్తే యూనివర్సిటీ హాస్టల్లో సదుపాయాలు లేక విద్యార్థులు ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నటువంటి పరిస్థితి ఎన్నిసార్లు యూనివర్సిటీ అధికారులకు ఎన్ని సార్లు విన్నవించిన కనీసం విద్యార్థుల గోడు వినని పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థినీలు ప్రవేట్ హాస్టల్లో ఉండే సోమత లేక చదువును అర్థాంతరంగా నిలిపివేసే పరిస్థితి ఏర్పడుతుందని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ అధికారులు విద్యార్థులకు అనుగుణంగా హాస్టల్లో వసతిని కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంతోషి , హరిణి , శ్రావణి , ప్రత్యూష పాల్గొన్నారు.

దేశ సంపదను అమ్ముతున్న ప్రధాని మోడీ'

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఆత్మనిర్భర్ భారత్ నినాదంతో ప్రజలను మోసం చేస్తూ భారతదేశానికి ప్రతిష్టాత్మకమైన ఇస్రో సంస్థలో ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిం చటం దేశద్రోహ చర్య అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఎస్.బోస్ సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థను స్థాపించటానికి, దాన్ని అభివృద్ధి చేయటానికి నాటి పాలకులు ఎంతో నిబద్ధతో కృషి చేశారని గుర్తు చేశారు. ఇస్రో ప్రారంభించిన నాటి నుండి పశ్చిమ దేశాల్లో ఇస్రో అభివృద్ధికి ఆటంకాలు కలి గిస్తూనే ఉన్నారని, ఇప్పుడు మన దేశ ప్రధాని మోడీ పశ్చిమ దేశాల ఆలోచనా విధానాన్ని అమలు చేస్తూ ఇస్రోను నిర్వీర్యం చేయటాన్ని తీవ్రంగా ఖండించారు. ఎంతో మంది శాస్త్రవేత్తలు తమ జీవితాలను అంకితం చేసి నిర్మించిన ఇస్రో సంస్థను ప్రైవేటు సంస్థలకు ధారాదత్తం చేయటాన్ని, ప్రభుత్వరంగ సంస్థలను దేశ, విదేశీ సంస్థలకు కట్టబె డుతూ దేశ అంతరిక్ష పరిశోధనలకు ముఖ్యమైన ఇస్రోను ప్రైవేటు సంస్థలకు తలుపులు తెరవటం దేశ భవిష్యత్‌కు తీవ్ర విఘాతం కలుగనుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరే కంగా కార్మికులు తీవ్రంగా పోరాటం చేస్తున్నారని, వారి పోరాటానికి మేధావులు, శాస్త్రవేత్తలు బహిరంగ మద్దతు తెలియజేస్తూ కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలని సూచించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం ఇస్రోలో ప్రైవేటు సంస్థల అనుమతిని రద్దు చేయాలని, అమెరికాతో ఏర్పాటు చేసుకున్న ఇప్పటి వరకు బహిర్గతమైన 2 ఒప్పందాలను రద్దు చేసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆర్టీసీలో యూనియన్లను అనుమతించి వెంటనే ఎన్నికలు నిర్వహించాలి

తెలంగాణ ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ అశ్వద్ధామ రెడ్డి, కన్వీనర్ హనుమంతు ముదిరాజ్ అడిషనల్ లేబర్ కమిషనర్ గంగాధర్‌కు వినతి



నవతెలంగాణ-అడిక్‌మెట్

తెలంగాణ ఆర్టీసీలో యూని యన్ లోని అనుమతించి వెంటనే ఎన్నికల నిర్వహించాలని తెలం గాణ ఆర్టీసీ జేఏసీ చైర్మెన్ అశ్వద్ధామ రెడ్డి, కన్వీనర్ హనుమంతు ముదిరాజ్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం చిక్కడపల్లి అం జయ్య భవన్ కార్మిక కార్యాలయం లో అడిషనల్ లేబర్ కమిషనర్ గం గాధర్‌ను కలిసి మెమొరండం అందజేశారు. అనంతరం జేఏసీ చైర్మెన్ అశ్వద్ధామ రెడ్డి, కన్వీనర్ హనుమంత్ ముదిరాజులు మాట్లాడుతూ. తెలంగాణ ఆర్టీసీలో కార్మి క చట్టాలను తుంగలో తొక్కి రోజుకు 16 గంటల వరకు డ్యూటీ చేయిస్తూ డబుల్ వేతనాలు ఇవ్వకుండా నానారకాలుగా ఆర్టీసీ ఉద్యోగులను ఇబ్బంది పెడుతు న్నార న్నారు. పొదుపు చేసుకున్న డబ్బులు కూడా వాడుకుంటూ యాజమాన్యం అక్రమా లకు పాల్పడుతుందని తెలిపారు. ఆర్టీసీ లో యూనియన్లను అనుమతించి వెం టనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. పోరాటం చేస్తే తప్ప సమస్యలు పరిష్కారం కావని ఆర్టీసీ కార్మికులు ముందుకు రావాలని భరోసా తెలియజేశారు. తమ న్యాయమైన డిమాండ్లకు స్పందించిన అడిషనల్ లేబర్ కమిషనర్ ఆర్టీసీ సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామనీ హామీ ఇచ్చారు అని తెలిపారు.ఈ కార్యక్రమంలో కో కన్వీనర్లు నరేందర్, సుద్దాల సురేష్,పున్న హరికిషన్, ఎర్ర స్వామి, జేఏసీ కమిటీ నాయకులు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

పాతబస్తీలోని దేవాలయాలకు ఆర్థిక సాయం

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



నవతెలంగాణ-చాంద్రాయణ గుట్ట

పాతబస్తిలోనే ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీలోని 206 దేవాలయాలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందజేస్తుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో చాంద్రాయణ గుట్ట, యాకుత్పురా, చార్మినార్, బహదూర్పుర నియోజకవర్గాల సంబంధించిన దేవాలయా లకు ఆర్థిక సహాయాన్ని సోమవారం గౌలి పురాలోని భారత్ మాత దేవాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చెక్కులను అందజేశారు. ఆయన మాట్లా డుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా పాత బస్తీ లోని ప్రజలందరూ బోనాల పండుగని ఘనంగా జరు పుకోవాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా జాగ్ర త్తలు తీసుకున్నామన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్క రించడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి దేవాల యాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజు, గౌలిపురా కార్పొరేటర్ భాగ్యలక్ష్మి, ఉమ్మడి దేవాలయ ఉత్సవ కమిటీ మాజీ అధ్యక్షులు రాకేష్ తివారీ, వివిధ దేవాలయాల అధ్యక్షులు, మీరాలమ్మండి మహాకాళేశ్వర దేవాలయం అధ్య క్షుడు గాజుల అంజయ్య, లాల్ దర్వాజా సింహవాహిని దేవాలయం అధ్యక్షుడు చిన్నబోయిన రాజేందర్ యాదవ్ పాల్గొన్నారు.

డిగ్రీ గెస్ట్ లెక్చరర్‌లను కొనసాగించాలి'



రాజ్య సభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-అంబర్ పేట

రాష్ట్రంలోని 132 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో గెస్ట్ లెక్చరర్స్‌గా పని చేస్తున్న అధ్యాపకులను కొన సాగించాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్ హెూటల్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లా డుతూ..ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పని చేస్తున్న గెస్ట్ లెక్చరర్స్‌ను యధావిధిగా కొనసాగించి, వారికి 12 నెలలకు గానూ కన్సలిడేట్ జీతం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో దాదాపు 3 లక్షల మంది నిరుపేద బడుగు, బలహీన వర్గాల పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారని, వారిని సరైన మార్గంలో నిర్దేశింపచేసేది అధ్యాపకులేనని గుర్తు చేశారు. ఇప్పటికైనా ఈ విషయంలో సీఎం కేసీఆర్, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి గెస్ట్ లెక్చరర్స్ ను యధావిధిగా కొనసాగిస్తూ, జీతాలు పెంచాలని ఆయన డిమాండ్ చేశారు.లేనియెడల ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ నిరుద్యోగ జేఏసీ చైర్మెన్ నీల వెంకటేష్, బీసీ సంఘం నేత గుజ్జ కృష్ణ, తెలంగాణ డిగ్రీ లెక్చరర్స్ ఫోరం అధ్యక్షులు జి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు జి.నాగేశ్వరరావు, జయరాములు, బి.వెంకటస్వామి, గెస్ట్ లెక్చరర్స్ శ్యామల, మమత, భార్గవి, లక్ష్మీనారాయణ, కరుణాకర్, కేశవులు, కృష్ణ పాల్గొన్నారు.

అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



- సీఐటీయు సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం. మీనా..
- సీడీపీఓకి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-ధూల్ పేట్

ఐసీడీఎస్‌కు బడ్జెట్ పెంచి, అంగన్వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయు సౌత్ జిల్లా అధ్యక్షురాలు ఎం. మీనా డిమాండ్ చేశారు. అంగన్వాడి ఆల్ ఇండియా డిమాండ్స్ డే సందర్భంగా సీఐటీయు సౌత్ జిల్లా ఆధ్వర్యంలో సీడీపీఓ అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐసీడీఎస్ బడ్జెట్‌ను పెంచి బలోపేతం చేయాలన్నారు. ఐసీడీఎస్‌కు ప్రమాదకరమైన 2020 నూతన జాతీయ విద్యా విధానం చట్టాన్ని రద్దు చేయాలని, 45వ ఐ ఎల్ సి సిఫారసులు అమలు చేయాలన్నారు. అంగన్వాడి ఉద్యోగులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడి ఉద్యోగులకు గ్రాడ్యుయేటీ వెంటనే చెల్లించాలన్నారు. కార్మిక ఉద్యోగాల నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, ఖాళీ పోస్టులు వెంటనే భర్తీ చేయాలన్నారు. అంగన్వాడి ఉద్యోగులకు ఆసరా, కళ్యాణ లక్ష్మి తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, జీవో నెంబర్ 14, 19, 8 లను వెంటనే సవరించాలి కోరారు. అంగన్వాడి ఉద్యోగులకు హెల్త్ కార్డులు ఇవ్వాలి వేతనంతో కూడిన మెడికల్ సెలవులు అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు ఆఫీస్ బేరర్ సురేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలకు 'కేరాఫ్'గా అడ్డగుట్ట

- నిత్యం కలుషిత జలాలతో ప్రజల ఇబ్బందులు
- ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పాలకుల విఫలం
- ఛాయాదేవి సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి

నవతెలంగాణ-ఓయూ



ప్రజా సమస్యలను పరిష్కరించాలని డి మాండ్ చేస్తూ అడ్డగుట్ట డివిజన్ వార్డు ఆఫీ సు ఎదుట సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించి, అనంతరం సంబంధిత అధికారులకు వినతిపత్రాన్ని అం దజేశారు. ఈ సందర్భంగా సిపిఐ హైద రాబా ద్ జిల్లా కార్యదర్శి కామ్రేడ్ ఛాయా దేవి మాట్లాడుతూ.పాలకుల నిర్లక్ష్యం అడ్డగుట్ట నేడు సమస్యలకు కేరాఫ్‌గా తయారైందని, ప్రజల సమ స్యలను పరి ష్కరించడంలో పాలకులు విఫలమయ్యారన్నారు. అడ్డగుట్ట 'సి'సెక్షన్‌లో నిత్యం వస్తున్న కలుషిత జలాలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు, అనారోగ్యానికి గురవుతున్నారని, 'బీ' సెక్షన్‌లో రహదారి అంత గుంతలమయం కావడంతో ఆ దారిన నడిచే వాళ్లంతా ఇబ్బందులకు గుర వుతున్నారని, రాత్రి సమయంలో వృద్ధులు చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్య పరిష్కరించాలని అనేకసార్లు స్థానిక కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోయిన ఏమాత్రం స్పందించకుండా తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరి స్తున్నారని ధ్వజమెత్తారు. పై సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేనియెడల సమస్యలను పరిష్కారం అయ్యేంతవరకు పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.ఈ నిరసన కార్యక్రమంలో సిపిఐ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్,సహాయ కార్యదర్శి కొమరెల్లి బాబు,అడ్డగుట్ట కార్యదర్శి పాకాల యాదగిరి,తార్నాక కార్యదర్శి షేక్ లతీఫ్,రషీద్,భవన నిర్మాణ కార్మిక సంఘం అడ్డగుట్ట అధ్యక్షుడు నాగరాజు, ఖాసీం, రాములు తదితరులు పాల్గొన్నారు.

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా

నవతెలంగాణ-ముషీరాబాద్



పెళ్లి చేసుకొని కాపురానికి రాకుండా భర్త, అత్త, ఆడ పడుచులు వేధింపులకు గురిచేస్తున్నారని, న్యాయం చేయాలని కోరుతూ ఓ బాధితురాలు, కుటుంబ సభ్యులు, మహిళా సంఘంతో ఆది వారం మధ్యాహ్నం భర్త ఇంటి ఎదుట ధర్నా చేపట్టారు.ఈ సందర్భంగా బాధితురాలు స్వప్న మాట్లా డుతూ తాను కార్వాన్‌లోని కుమ్మరివాడలో ఉంటానని, తనకు 2021 జూన్ 6న బాకారంలోని ఫణీంద్రతో పెద్దల సమక్షంలో వివాహం జరిగిందన్నారు. ఒప్పందం ప్రకారం కట్న కానుకలు ఇచ్చి వివాహనం చేసినట్లు తెలిపారు. కొద్ది రోజుల నుంచి తన అత్త, ఆడపడుచులు భర్త వేధింపు లకు గురి చేస్తున్నారని ఆరోపించారు. తనను భర్తతో ఉండేలా న్యాయం చేయాలని కోరారు. మహిళాసంఘాల నేతలు మాట్లాడుతూ భర్త వద్దకు పంపేందుకు ఆదివారం స్వప్నను తీసుకొని ఫణింద్ర ఇంటికి వస్తే అత్త, ఆడ పడుచులు ఆమెను ఇంట్లోకి వెళ్లకుండా అడ్డుకోవడంతో పాటు తమపై దాడి చేశారని ఆరోపించారు. ముషీరాబాద్ పీఎస్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయమైపై ఫణీంద్ర, ఆయన కుటుంబ సభ్యులు మాట్లాడుతూ స్వప్న చేస్తున్న ఆరోపణలు వాస్తవం కాదన్నారు. అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపడుతున్నామని, ఫణీంద్రను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలి

- వడ్డెర, బంజారా, సంచార జాతుల సంఘం అధ్యక్షుడు రాజు



నవతెలంగాణ-అంబర్‌పేట:

ప్రభుత్వ నామినేటెడ్ పోస్టుల్లో స్థానం కల్పించాలని జాతీయ వడ్డెర, బంజారా, సంచార జాతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేలంకి రాజు డిమాండ్ చేశారు. 75 ఏళ్ల స్వతంత్ర భరత దేశంలో వడ్డెరులకు ఒరిగిందేమి లేదన్నారు. ఈ మేరకు సోమవారం హైదర్గూడా ఎన్‌ఎస్ఎస్ లో ఏర్పాటు చేసిన విలేక‌రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇంజనీర్లు లేని ఆ కాలంలోనే దేవాలయాలు, చెరువులు, చెరువు కట్టలు నిర్మించిన ఘనత వడ్డెరులకే దక్కిందన్నారు. బీసీ-ఏ జాబితాలో ఉన్న వడ్డెరలతో పాటు 36 సంచార జాతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేశారు. జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీ కాంట్రాక్టుల్లో ఎలాంటి షరతులు లేకుండా కుల ధ్రువీకరణ పత్రంతో అవకాశం కల్పించాలని అన్నారు. సామాజిక న్యాయం, స్వాభిమానం, స్వయం పాలన కోసం తెలంగాణ పోరాటం చేశామన్నారు. కానీ ఇవేవి కేసీఆర్ ప్రభుత్వానికి లేవన్నారు. దేశ సంపాదన దోచుకుంటుంటే కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఓ గిరిజన మహిళను నరేంద్రమోదీ రాష్ట్రపతిని చేసాడని, దళితలను సీఎం చేస్తానని కేసీఆర్ మోసం చేసాడన్నారు. ఈ సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి అశోక్ రాథోడ్,ఉపాధ్యక్షులు రవి నాయక పాల్గొన్నారు.

విద్యాశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కరానికి కృషి

- డాక్టర్ ముజీబ్
- ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు ముజీబ్‌కు వినతి



నవతెలంగాణ-సిటీబ్యూరో

జిల్లా విద్యాశాఖలో నెలకొన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎం.హుస్సేని (ముజీబ్) అన్నారు. నాంపల్లి గృహకల్పలోని ఆ సంఘం కార్యాలయంలో టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్, ఎం.భాస్కర్ ఆధ్వర్యంలో విద్యాశాఖలో మిడ్ డే మీల్స్ పోస్టుల భర్తీ, సీపీఎస్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆయనకు వినతి పత్రం సమర్పించారు. మిడ్ డే మీల్స్ పోస్టులకు మాత్రమే పరిపాలన పోస్టులు మంజూరు అవుతాయని, ఇందులో భాగంగా ఎండీఎంలో పది అసిస్టెంట్ డైరెక్టర్లు, పది సూపరిటెండెంట్, 20 సీనియర్ అసిస్టెంట్ పోస్టులు మంజూరు చేయాల్సి ఉందని గుర్తుచేశారు. జిల్లా విద్యాశాఖలో 2004 అనంతరం అపాయింట్‌మెంట్ అయిన 150 మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌లోకి తీసుకురావాలనే విషయాలపై టీఎన్జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరిస్తానని హామీచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి వైదిక్ శస్త్ర, సభ్యులు శంకర్, నాల్గవ తరగతి కేంద్ర సంఘం అసోసియేట్ అధ్యక్షుడు ఎం.ఎ.ముజీబ్, టీఎన్జీవో స్కూల్ ఎడ్యుకేషన్ యూనిట్ కోశాధికారి ప్రేమ్ కుమార్, సభ్యులు ముజాహిద్, ప్రియాదేవ్ ఠాకూర్, యోగేందర్, సూర్య జాంబయ్య, ఆజీజ్, అన్వర్, పరమేశ్, జమీల్, శ్రీకాంత్, ప్రవీణ్, దామోదర్, సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

- వామపక్ష విద్యార్థి సంఘాలు పిలుపు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఈనెల 12న వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జరిగే రాష్ట్రవ్యాప్త బంద్‌ను విజయవంతం చెయ్యాలని విద్యార్థి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆదివారం ఎస్వీకేలో బంద్‌కు సంబంధించిన పోస్టర్‌ను ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ రెడ్డి, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం శ్యామ్, నాగరాజు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షులు అనిల్, ఏఐడీఎస్‌వో నితీష్, లెనిన్, స్టాలిన్, గణేష్ తదితరులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా నేటికీ ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడ పుస్తకాలు పంపిణీ చేయలేదన్నారు. మరో వైపు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టు ఖాళీగా ఉన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మన ఊరు-మన బడి పథకం ద్వారా పాఠశాలలు మెరుగుపడ్డాయని చెప్పుకున్నప్పటికి కనీస మౌలిక సదుపాయాలు టాయిలెట్స్, తరగతి గదులు, లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్పొరేట్ విద్యాసంస్థలను కృష్ణనది అవతలికి తన్ని తరుముతామన్న కేసీఆర్ నేడు రెడ్ కార్పెట్ పరిచి ఆహ్వానిస్తున్నాడని వారు విమర్శించారు. తక్షణమే ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు.

చేనేత వస్త్రాలనే కొని ఎవరికైన బహుమతిగా ఇవ్వండి



- గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రభుత్వ ఉద్యోగులు ప్రతినెల మొదటివారం కచ్చితంగా చేనేత వస్త్రాలు ధరిస్తే చేనేత కళా కారులను మరింత గుర్తింపును ఇచ్చిన వారమవుతామని గవర్నర్ తమిళిసై సౌందర్యరాజన్ అన్నారు. సోమవారం సాయంత్రం శ్రీనగర్ కాలనీలోని సత్యాసాయి నిగమాగమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా సహకారంతో ఏర్పాటుచేసిన ఇండియన్ సిల్క్ గ్యాలరీని ప్రారంభించి సందర్శించారు. ఆమె మాట్లాడుతూ చేనేతకళాకారులకు కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారాన్నిఅందిస్తుందని,ఇక్కడిచీరలుచాలా ఆకర్షణీయంగా ఉన్నాయన్నారు. విద్యార్థులు ఒకరోజు చేనేతవస్త్రాలను ధరించాలని సూచించారు. ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలను తయారు చేసే మగ్గాలను పరిశీలిం చారు. చేనేత కారుల వస్త్రా లను ఇక్కడి నేరుగా తీసుకువచ్చి వారిని ప్రోత్సహిస్తున్న నిర్వహ కులు. శ్రీనివా సరావు, వినయ్‌కుమార్లను అభినందించారు. తమిళంలో వస్త్రాలపై ఉన్న ఆల్ కాది ఆర్ట్ కాల్ అనే సందేశాన్ని తెలిపారు. కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ టెక్స్టైల్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రతినిధి అరుణ్కుమార్, డాక్టర్ సుధావాణి తదితరులు పాల్గన్నారు.

లక్ష్యాన్ని చేరాలంటే...




పెద్ద వ్యాపారవేత్తగా పేరు తెచ్చుకోవాలనే కోరిక కొందరికి ఉంటుంది. కానీ దానికి తగ్గ ప్రణాళికను మాత్రం రూపొందించు కోరు. స్నేహితులతో కలిసి సమయాన్ని వృథా చేస్తుంటారు. తమ ఆశయాలను మాత్రం మాటల్లో గొప్పగా చెప్పుకుంటుంటారు. బలమైన లక్ష్య మంటూ ఉంటే, దానికి తగినట్లుగా ముందు నుంచే ప్రణాళికాబద్ధంగా అడుగులేయాలంటున్నారు కెరియర్ నిపుణులు..

డిగ్రీలోకి అడుగుపెట్టక ముందే భవిష్యత్తులో ఏ లక్ష్యంవైపు నడవాలో ముందే ఆలోచించుకొని పాటించాల్సిన ప్రణాళికలపై అవగాహన పెంచుకోవాలి. అడుగుపెట్టనున్న రంగంపై అధ్యయనం చేయాలి. యుక్త వయసులో సమయాన్ని వృథా చేయకుండా ఉంటేనే ఇదంతా వీలవుతుంది.

- లక్ష్యం ఒక్కటే ఉంటే సరిపోదు. ప్రతి క్షణాన్నీ సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే లక్ష్యాన్ని చేరుకున్నవారి గురించి తెలుసుకోగలిగితే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది. తమ ఇబ్బందులను వారెలా దాటగలిగారో తెలుసుకోవచ్చు. వారు చెప్పేవన్నీ సలహా లేదా సూచనలుగా మాత్రమే ఉపయోగపడతాయి. భవిష్యత్తులో ఏం సాధించాలనుకుంటున్నామో ఎవరికి వారే సొంతంగా ఆలోచించుకోవాలి. అప్పుడే దాన్ని చేరుకోవాలన్న తపన మనసులో మొదలవుతుంది.
- వ్యాపారమే మన లక్ష్యమైతే దానికి కావాల్సిన విద్యార్హతలతోపాటు తగిన నైపుణ్యాలను పొందడం మొదటి మెట్టు. ఈ అర్హతలతోపాటు జీవన నైపుణ్యాలు, సామర్థ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం వంటివన్నీ అందుకోవాలి. చదువు పూర్తయిన వెంటనే అర్హత వచ్చింది కదా అనుకొంటూ.. వ్యాపారవేత్తగా కెరియర్ ప్రారంభించకూడదు. ఆయా రంగాల్లో శిక్షణ లేదా అనుభవాన్ని పొందడానికి కృషి చేయాలి. ఈ ఉద్యోగ అనుభవంతో భవిష్యత్తులో మంచి వ్యాపారవేత్తగా నిలవడానికి పాఠాలెన్నింటినో నేర్చుకోవచ్చు.
- కష్టపడి పనిచేసే తత్వాన్ని అలవరుచుకోవాలి. అలాగే వ్యాపారవేత్తగా నిలిచి మరికొందరికి ఉపాధి కల్పించాలనుకొంటే, దానికి కావాల్సిన నాయకత్వ లక్షణాలు, నిర్వహణ సామర్థ్యం వంటివి పెంచుకోవాలి. లాభనష్టాలే కాకుండా మార్కెట్ పరిస్థితి, వినియోగదారుడి అవసరం వంటి వాటిపై ముందుగానే తెచ్చుకొనే అవగాహన భవిష్యత్తులో ఉపయోగపడుతుంది. అప్పుడే వ్యాపారవేత్తగా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చు.

ఇట్ల చేద్దాం



ఈ కాలంలో నీరు నిల్వ ఉండి మొక్కల పెరుగుదలకు ఆటకం కలుగుతుంది. నీటి ఎద్దడి ఎక్కువై వేర్లకు శ్వాసతీసుకోవడం కష్టమై మొక్క చనిపోతుంది. నీళ్లు నిల్వ ఉండటం వల్ల కుళ్లిపోతుంది. ఈ సమస్యల నుంచి బయటపడాలంటే మొక్కలు ఉన్న ప్రాంతంలో సరైన డ్రైనేజీని ఏర్పాటు చేయాలి. కుండీల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలి.

విద్యావనంలో విరబూసిన కుసుమం

పచ్చని విద్యావనంలో విచ్చుకున్న నిండు కమలం ఎలా ఉంటుంది..? తన దరికి చేరేవారందరినీ ఆప్యాయతతో ఆహ్వానిస్తున్నట్లు, మమకారంతో ఆదరిస్తున్నట్లుగా ఉంటుంది. అలాగే ఆమెను చూడగానే ఇలాంటి భావనే కలుగుతుంది. ఉన్నత ఆశయం కోసం ముందుకెళుతున్న విద్యాలయంలో చదువుల తల్లి కొలువు తీరిందా అనిపిస్తుంది. సందిగ్ధావస్తల్లో సరైన సమాధానం కోసం వెతుకున్నప్పుడు సమాధానమే మన దరికి చేరిందా అనే భావన కలుగుతుంది. ఆమె మరెవరో కాదు. ఓయూ విద్యావనంలో ఉస్మానియా విశ్వవిద్యాలయ పరీక్షల విభాగంలో అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ హోదాలో విధులు నిర్వహిస్తున్న ప్రొ.వర్ధని.



తన, పర తారతమ్యం చూపరు. చిన్నా పెద్దా అనే హోదాకు పోరు. విద్యార్థులందరూ తనవాళ్లే, ప్రతిఒక్కరూ తన పిల్లలే అనుకుంటారు. ఎంతో ఓర్పు, మరెంతో నేర్పు రెండింటినీ మిళితం చేసుకుని అవిరళ సేవా ధృక్పథాన్ని చాటడం ప్రొ.వర్ధినిలోని ప్రత్యేకం. అనేకమైన అర్హతలు, అపారమైన అనుభవాలను తన జీవన గమనంతో పాటు ఒంటబట్టించుకున్నారు. రాబోయే తరాలకు ఓ నారీ కిరణంలా ముందుకు దూసుకుపోతున్నారు. మేటి మహిళా అధ్యాపకురాలిగా అందరి మన్ననలు చూరగొంటున్న విద్యార్థుల శ్రేయోభిలాషి ఆమె.

అధ్యాపకురాలిగా...

ఎందరో సామాన్యులను అసమాన్యులుగా, మరెందరో వ్యక్తులను మహోన్నతులుగా తీర్చిదిద్దిన ఉస్మానియా యూనివర్సిటీ గాలి తాకితే చాలు అని భావించే వారు ఎంతో మంది. అలాంటిది ఇదే విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం కొనసాగించి డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యను పూర్తి చేసుకుని.. ఇదే యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా జీవితాన్ని ప్రారంభించిన ప్రొఫెసర్ వర్ధని, నేడు రీసెర్చ్ వింగ్ అయిన కాన్ఫిడెన్సియల్ విభాగం పరీక్షల విభాగాధిపతిగా బాధ్యతలు నిర్వర్తిస్తుండటం విశేషమనే చెప్పాలి.

నిత్యం విద్యార్థులతో...

ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి 1995లో పీహెచ్‌డీ పట్టా అందుకోకముందు నుంచే బోధనా రంగంలోకి ప్రవేశించారు వర్ధని. 1990 నుంచి 2007 వరకు ఏఎమ్మెస్ మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేశారు. తర్వాత కోటి మహిళా కళాశాలలో 2007 నుంచి 2015 వరకు అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా, 2015 నుంచి 2019 వరకు ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని ఫిజిక్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా వేలాది మంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. 2019 నుంచి ఓయూ ఫిజిక్స్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ఉస్మానియా యూనివర్సిటీ పీహెడీ కాన్ఫిడెన్షియల్ విభాగంలో అదనపు పరీక్షల పర్యవేక్షణా అధికారిగా... వేలాది మంది విద్యార్థులు తమ రీసెర్చ్ పూర్తి చేసుకుని, పీహెచ్‌డీ పట్టా అందుకోవడంలో ఎనలేని తోడ్పాటునందిస్తున్నారు. నిత్యం విద్యార్థులకు అందుబాటులో ఉంటూ వేల మంది విద్యార్థులు తమ పీహెచ్‌డీలను పూర్తి చేసుకునేందుకు కావాలసిన సహాయ సహకారాలను అందిస్తున్నారంటే.. విద్యార్థుల పట్ల ఆమెకున్న అంకిత భావం, చిత్తశుద్ధిని ఇట్టే అర్థం చేసుకోవచ్చు.



కళాతపస్వీ విశ్వనాథ్ నుంచి పురస్కారాన్ని స్వీకరిస్తూ...

అంతర్జాతీయ సెమినార్లలో...

ఇప్పటి వరకు దాదాపు పది మందికి పైగా విద్యార్థులు ప్రొ.వర్ధని ఆధ్వర్యంలో తమ రీసెర్చ్ అధ్యయనాన్ని పూర్తిచేశారు. అమెరికా, చైనా, జపాన్, నేదర్లాండ్స్ వంటి వివిధ దేశాల్లో అనేక జాతీయ, అంతర్జాతీయ సెమినార్లు, వర్క్‌షాప్‌ల్లో పాల్గొన్న ఆమె అనేక ప్రజెంటేషన్స్‌తో తన పరిశోధనా ఫలాలను, తన విజ్ఞానాన్ని విద్యార్థి లోకం కోసం విశ్వవ్యాప్తం చేశారు.

ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్‌గా...

పరహితార్థ సేవే పరమార్థం అని దృఢంగా విశ్వసించే ప్రొ.వర్ధని అటు సేవారంగంలోనూ తన వంతు కృషి చేస్తూ స్ఫూర్తితో ముందుకు సాగుతున్నారు. అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఎన్ఎస్ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్‌గా 2005లోనే ఇందిరాగాంధీ జాతీయ అవార్డును కైవసం చేసుకున్నారు. అంతేకాదు ఈ దేశంలోనే ఈ అవార్డును గెలుచుకున్న ఏకైక మహిళగా ఆమె రికార్డు సృష్టించారు. 2015లో వాసవి క్లబ్ వారి ఉత్తమ అధ్యాపకురాలి అవార్డు, 2015లో ఎన్ఆర్‌సీ ఇండియా ఐఐటీ చెన్నై వారి అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్, అలాగే 2017లో ఎన్ఆర్‌సీ ఇండియా ఐఐటీ ముంబై వారి అవార్డు ఆఫ్ ఎక్సలెన్స్ ఆమె వృత్తికి మరింత వన్నె తెచ్చాయని.

అతిపెద్ద ప్రాజెక్టుతో...

నానో మెటీరియల్స్ పొటానిక్స్, నానోపొటానిక్స్ అంశంపై పరిశోధన పూర్తి చేసిన ప్రొ.వర్ధని ఓయూలోనే 59 లక్షల రూపాయల అతిపెద్ద ప్రాజెక్టును చేపట్టిన మొట్టమొదటి అధ్యాపకురాలు కావడం మరో విశేషం. దీంతో పాటు పొటానిక్స్ రీసెర్చ్ కోసం డీఆర్‌డీవో నుంచి 50 లక్షల రూపాయలను అందుకున్న ఏకైన మహిళ కావడం నిజంగా విశ్వవిద్యాలయానికే కాదు దేశానికే గర్వకారణం. 2017 నుంచి 2022 వరకు సైన్స్ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారిణిగా పనిచేసిన ఆమె దేశంలోనే జాతీయ అవార్డును పొందిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు.

కీలక పాత్రను పోషిస్తూ...



ఏపీఏఎస్ అసోషియేట్ ఫెల్లోగా, అమెరికాలోని ఐఈఈఈ పొటానిక్స్ సొసైటీ సభ్యురాలిగా, ఇండియన్ సైన్స్ కాంగ్రెస్, కొల్‌కత్తా సభ్యురాలిగా, ఎస్సార్పీ గవర్నింగ్ బాడీ సభ్యురాలిగా ఇలా ఆమె అనేక జాతీయ, అంతర్జాతీయ సైన్స్ కమిటీల్లో, ఆయా విభాగాల్లో కీలక పాత్రను పోషిస్తూ విశ్వమానవ విపణిపై తన విజ్ఞాన సుగంధాలను వెదజల్లుతూనే ఉన్నారు. కాలంతో పాటు పరుగెడుతూ.. విధులు, బాధ్యతలను నెరవేరుస్తూ.. నిత్యం తన వద్దకు వచ్చే విద్యార్థులకు ఎంతో ఓపిగ్గా సమాధానం చెబుతూనే... అనేక మంది విద్యార్థుల పరిశోధన పత్రాలకు సంబంధించిన అనేక సందేహాలను నివృత్తి చేస్తూనే ఉన్నారు. ఎంతో సహనంతో.. మరెంతో సుమధుర మందహాసంతో... అలుపెరుగని వదనంలో అనునిత్యం విరబూసే చిరునవ్వు చాలదా...ఆమె ఓ ఫ్రెండ్లీ ప్రొఫెసర్ అని చెప్పడానికి.

- కుంట సురేష్, సీనియర్ జర్నలిస్ట్

మత విద్వేష మూక హత్యలపై తీసుకున్న చర్యలేవి?

(మొదటిపేజి తరువాయి)

సంబంధించి దాఖలైన ఫిర్యాదులు, ఎఫ్ఐఆర్‌లు, కోర్టుల్లో సమర్పించిన చలాన్‌లకు సంబంధించి 2018 నుంచి ఏడాది వారీగా డేటాను దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. ఆ తీర్పులో "భయంకరమైన మూకస్వామ్య చర్యలను" సుప్రీం కోర్టు ఖండించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం. త్రివేదిలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్లను సోమవారం విచారించింది. "2018 జూలై 17 నాటి ఉత్తర్వులో పేర్కొన్న నిర్దేశించిన చర్యలకు అనుగుణంగా డేటాను తయారు చేయడం కోసం హోం మంత్రిత్వ శాఖ రాష్ట్ర క్యాబినెట్‌ల విభాగాధిపతుల (సమావేశం)ని ఏర్పాటుచేస్తుందని మేం అంగీకరిస్తున్నామని అటార్నీ జనరల్ తెలిపారు. కోర్టు రాష్ట్ర ప్రభుత్వం కూడా తన సంవత్సర వారీ డేటాను హోం మంత్రిత్వ శాఖ ముందు దాఖలు చేయాలి. ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయబడిన కేసుల సంఖ్యకు సంబంధించి సంవత్సరాల వారీగా డేటాను ఇస్తూ స్టేటస్ రిపోర్ట్‌ను ఫైల్ చేయాలని ఆదేశించింది. 2018 జూలై 17 నాటి తీర్పు ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నివారణ చర్యలను కూడా నివేదికలో పేర్కొనాలి. దీనికి సంబంధించి హోం మంత్రిత్వ శాఖ అఫిడవిట్‌ను కూడా దాఖలు చేయాలి" అని ధర్మాసనం పేర్కొంది. పిటిషనర్ తరపున ఏఓఆర్ షుబ్ ఆలం వాదనలు వినిపిస్తూ సంబంధిత కేసులో రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద హింసకు పాల్పడుతున్న గోసంరక్షణ సమూహాలపై తక్షణ, అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రతివాదులకు ఆదేశాలను కోరారు. గుజరాత్ జంతు సంరక్షణ చట్టం-1954లోని సెక్షన్ 12, మహారాష్ట్ర జంతు సంరక్షణ చట్టం-1976లోని సెక్షన్ 13, కర్నాటక గోహత్య నిరోధక చట్టం-1964లోని సెక్షన్ 15 రాజ్యాంగ విరుద్ధంగా ప్రకటించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం తరపున అటార్నీ జనరల్ ఆర్. వెంకటరమణి వాదనలు వినిపించారు. ప్రస్తుత సీజేఐ డివై చంద్రచూడ్, అప్పటి ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, జస్టిస్ ఖాన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం పరిష్కార చర్యలను నిర్దేశిస్తూ సెక్షన్‌లోని నిబంధనలను దృష్టిలో ఉంచుకుని మూక హింస బాధితుల పరిహార పథకాన్ని సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అందుకోసం ప్రతి జిల్లాలో నిర్దేశిత కోర్టు, ఫాస్ట్ ట్రాక్ కోర్టులతో హత్యలు, మూక హింస కేసులను ప్రత్యేకంగా విచారించాలని కోర్టు ఆదేశించింది.

మణిపూర్ దహనం వెనుక సంఘ్

(మొదటిపేజీ తరువాయి)

కుటుంబ సభ్యుల్ని కాల్చి చంపడం వల్ల కలిగిన గాయం వారిని వెంటాడుతున్నది. మణిపూర్‌లో పాలనా వ్యవస్థ పూర్తిగా కుప్పకూలింది.

సైన్యం, పోలీసులు అందరూ కేవలం ప్రేక్షకులుగా మారారు. లోయ, కొండలు కలిసే సరిహద్దు ప్రాంతాలు ఇంకా ఉద్రిక్తంగానే ఉన్నాయి. రాత్రి పూట ఎడతెగని కాల్పులు జరుగుతున్నాయి. తుపాకీ పట్టుకున్న యువకులు ఒకరికొకరు కాల్చుకుంటున్నారు. మణిపూర్ రక్తసిక్తంగా మిగిలిపోయినప్పటికీ, శాంతిని పునరుద్ధరించడానికి బీజేపీ 'డబుల్ ఇంజన్' ప్రభుత్వం నుంచి ఎటువంటి ప్రయత్నం జరగలేదు.

సీపీఐ(ఎం) ఎంపీలు జాన్ బ్రిట్టాస్, బికాష్ రంజన్ భట్టాచార్య, సీపీఐ ఎంపీలు బినోయ్ విశ్వం, పి. సంతోష్ కుమార్, కె. సుబ్బరాయన్‌లో కూడిన వామపక్ష ఎంపీల బృందం మణిపూర్‌లో దాడులు జరిగిన ప్రాంతాలను, శరణార్థి శిబిరాలను సందర్శించింది. జూలై 6 నుంచి మూడు రోజుల పాటు శరణార్థి శిబిరాలు, లోయ, కొండ ప్రాంతాల్లోని వివిధ ప్రాంతాలను సందర్శించారు. ప్రజలను, రాజకీయ నేతలను, మత పెద్దలను, గవర్నర్‌ను బృందం కలుసుకుని చర్చలు జరిపింది. ఎంపిల బృందం ఎదుట శిబిరాల్లో ఉన్న శరణార్థులు కన్నీరు మున్నీరయ్యారు. తాము ఈ దేశంలో భాగంకాదా? అని ఆవేదనలు వ్యక్తంచేశారు. 67 రోజులుగా తాము భయంతో వణికిపోతున్నామనీ, పాలకులు విభజన రాజకీయాలకు పాల్పడుతున్నారని రోధిస్తున్నారు. చిన్నారులు సాయం కోసం అమాయకంగా చేతులు చాస్తున్నారు. వారి పరిస్థితులు ఇంత దయనీయంగా వుంటే, పాలకులు ఏసీ రూముల్లో ఎంజాయ్ చేస్తున్నారని ఎంపీలు విమర్శించారు. స్కూళ్లు, కాలేజీలకు వెళ్లాల్సిన విద్యార్థులు శరణార్థి శిబిరాల్లో దిక్కుతోచకుండా ఉన్నారు. అల్లర్లలో నష్టపోయిన ప్రజలను పరామర్శించిన ఎంపీల బృందం సభ్యులు సంఘీభావం తెలిపారు. ఇంఫాల్‌లోని మెయితీ శరణార్థి శిబిరాన్ని, చురచంద్‌పూర్‌లో కుకీ శరణార్థి శిబిరాలను సందర్శించారు.

దయనీయ దృశ్యాలు

ఇంఫాల్‌కు 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఖుద్రక్‌పం అనే చిన్న పట్టణంలోని నవోరం బీరాదేవి కళాశాల మెయితీల కోసం ఏర్పాటు చేయబడిన శరణార్థి శిబిరాల్లో ఒకటి. ఆ శిబిరానికి చేరుకున్న తమకు దయనీయ దృశ్యాలు కనిపించాయని ఎంపీ జాన్ బ్రిట్టాస్ తెలిపారు. కళాశాల ఆడిటోరియం తాత్కాలిక శిబిరంలా పనిచేస్తోంది. గడ్డి పైకప్పు ఉన్న హాలులో సౌకర్యాలు అంతంత మాత్రమే. రెండు నెలలకుపైగా శిబిరంలో ఉన్న 300 మందిలో 90 ఏండ్ల వృద్ధుల నుంచి చిన్నారుల వరకు అన్ని వయసుల వారూ ఉన్నారు. ఇంఫాల్ లోయ చుట్టూ ఉన్న కొండల వెంబడి నివసించే మెయితీలు తిరుగుబాటు తీవ్రతరం కావడంతో తమ ఇండ్లను వదిలి శిబిరాల్లో తలదాచుకున్నారు.

తక్కువ ప్రభుత్వ సహాయం పొందుతున్న మెయితీ క్యాంపులోని బాధితులకు చెప్పడానికి చేదు అనుభవాలే మిగిలాయి. మణిపూర్‌కు వెళ్లే అనేక ప్రధాన రహదారులు మూసుకుపోవడంతో రాష్ట్రం తీవ్ర ఆహార కొరతను ఎదుర్కొంటోంది. శిబిరంలో నాటక కర్త తమిన్ లీమా మాట్లాడుతూ అన్ని శిబిరాల్లో కూడా ఇది ప్రతిబింబిస్తోందన్నారు. పిల్లలకు పాలు, గుడ్లు దొరకడం లేదు. సుమారు 300 మందికి క్యాంపులో ఉన్నవి ఎనిమిది టాయిలెట్లు. వర్షాకాలం వచ్చిన తర్వాతనే నీటి సమస్య తీరిందని లిమా చెప్పారు. ఏ క్షణంలోనైనా అంటువ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని క్యాంపు శరణార్థులు ఆందోళన చెందుతున్నారు.

మే నెలలో తాము గడిపిన ఆ మూడు రాత్రులను (మే 3, 4, 5) తాము జీవితంలో మరచిపోలేమని ఇకావు గ్రామానికి చెందిన మహిళా రైతు పుల్సిబా ఆవేదన వ్యక్తంచేశారు. వందలాది మంది మూకలు గ్రామాన్ని చుట్టుముట్టి ఇండ్లకు నిప్పు పెట్టారు. పల్సిబా, ఆమె కుటుంబం కొన్ని నెలల వయసున్న తమ పసిపాపతో ఎంతో కష్టపడి ఖుద్రక్‌పామ్‌లో ఆశ్రయం పొందారు. ఇంటికి తిరిగి వెళ్లగలరా? అనే ప్రశ్నకు పల్సిబా దగ్గర సమాధానం లేదు. శిబిరంలోని ప్రతి ఒక్కరూ ఇలాంటి దుర్ఘటనలను ఎదుర్కొన్నవారే. అల్లర్లను ముగించి శాంతిని నెలకొల్పాలని మెయితీ శరణార్థులు వామపక్ష ఎంపీలకు చెప్పారు. ఇలా అన్ని శరణార్థి శిబిరాల్లో బాధితులు తమ గోడును వెలిబుచ్చారు.

గవర్నర్‌ను కలిసిన ఎంపీల బృందం

గవర్నర్ అనుసూయ ఉయికేను ఎంపీల బృందం కలిసి చర్చించింది. తాము గుర్తించిన అంశాలను ఆమెకు వివరించింది. దీనికి స్పందించిన గవర్నర్ తాను ప్రధాన మంత్రి కార్యాలయం, రాష్ట్రపతి, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, రక్షణ శాఖ తదితరులకు రోజువారీ సమగ్ర నివేదికలను పంపిస్తున్నానని చెప్పారు. ఈ సంఘటనల పట్ల తాను విస్తుపోయాననీ, తన జీవితంలో అలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదని ఆమె చెప్పారని ఎంపీల బృందం పేర్కొంది.

మణిపూర్‌లో ప్రణాళికాబద్ధంగా క్రైస్తవ వేట సాగించారని ఇంఫాల్ ఆర్చ్ బిషప్ డొమినిక్ లుమినో వామపక్ష ఎంపీలకు వివరించారు. మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లోని కాంచీపురం, సంకైపూర్‌లో దుండగులు తగులబెట్టిన చర్చ్‌లు క్రైస్తవ సమాజంపై ముతా ద్వేషానికి, శత్రుత్వానికి ప్రత్యక్ష నిదర్శనమని మణిపూర్‌లో పర్యటించిన వామపక్ష ఎంపీలు అన్నారు. దశాబ్దాల నాటి క్యాథలిక్ చర్చ్‌లకు నిప్పు పెట్టారు. దీని వెనుక కచ్చితమైన మతతత్వ అజెండా ఉంది. మెయితీస్ పూజించే చర్చిలను కూడా ధ్వంసం చేశారు. మండుతున్న చర్చి నుంచి పూజారులు పారిపోతున్నారని ఎంపీలు ఆందోళన వ్యక్తంచేశారు.

దాడి చేసిన వారికి బీజేపీ ప్రభుత్వం రక్షణ కల్పించింది. మణిపూర్‌లో రెండు పురాతన దేవాలయాలను తగులబెట్టిన వారిని పోలీసులు అడ్డుకోలేదు. అల్లర్లు, హింస జరగకుండా నివారించలేదు. హింస చెలరేగి 67 రోజులు కావస్తున్నా ఇప్పటి వరకు నిందితులపై ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. ఈ దాడుల వెనుక సంఘ్ పరివార్ హస్తం ఉందని వామపక్ష ఎంపీలు విమర్శించారు. ఈ అంశాన్ని పార్లమెంట్ ఉభయ సభల్లో గట్టిగా లేవనెత్తుతామని బాధితులకు ఎంపీలు హామీ ఇచ్చారు.

రాష్ట్రంలో శాంతి, సాధారణ పరిస్థితులు నెలకొల్పేందుకు బీరేన్ సింగ్ ప్రభుత్వం పెద్ద అవరోధమని ఎంపీలు అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ప్రస్తుత పోలరైజేషన్ వెనుక సంఘ్ పరివార్ జోక్యం ఉంది. ప్రధాని మౌనాన్ని బట్టి ఇది మరింత స్పష్టమవుతున్నది. పోలీసులు, కేంద్ర బలగాలు అల్లర్లను ఆపేందుకు ప్రయత్నించడం లేదు. ప్రధాని మోడీ మౌనం వీడాలని, మణిపూర్ ప్రజల గురించి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఇరు వర్గాలు రాజీకి సిద్ధంగా ఉండాలనీ, శాంతికి బాటలు వేయాలని మూడు రోజుల పర్యటన ముగించుకున్న ఎంపీలు పిలుపునిచ్చారు.

మా ఆవేదన తీర్చండి...

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

'ముఖ్యమంత్రి కేసీఆర్ స్కూల్ అసిస్టెంట్ (ఎస్ఏ) స్పౌజ్ బదిలీలు చేసినందుకు ధన్యవాదాలు. మిగిలిపోయిన 13 జిల్లా ఎస్జీటీ, లాంగ్వేజ్ పండిట్ (ఎల్పీ), పీఈటీల స్పౌజ్ బదిలీలను వెంటనే చేపట్టాలి. మా ఆవేదన తీర్చండి. స్పౌజ్ దంపతులను కలపండి'అంటూ సీఎం కేసీఆర్‌కు స్పౌజ్ టీచర్లు విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయ దంపతుల బదిలీలు చేపట్టాలని కోరుతూ స్పౌజ్ ఫోరం ఆధ్వర్యంలో ఆవేదన సభ పేరుతో సోమవారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించారు. 13 జిల్లాల నుంచి స్పౌజ్ టీచర్లు, వారి పిల్లలు భారీగా పాల్గొన్నారు. 'ముఖ్యమంత్రి మాటే ముద్దు, దంపతులు విడిగా వద్దు, ఉద్యోగ దంపతులను కలపండి, ముఖ్యమంత్రి మాటను నిలబెట్టుకోండి' అంటూ ప్లకార్డులను ప్రదర్శించారు. 'అమ్మ అటు, నాన్న ఇటు మరి నేను ఎటు?' అనే ప్లకార్డులను పిల్లలు ప్రదర్శించడం అందరిలోనూ బాధ కదలించింది. స్పౌజ్ బదిలీలు చేపట్టాలి, ముఖ్యమంత్రి కేసీఆర్ స్పందించాలి, దంపతులు విడిగా వద్దంటూ స్పౌజ్ టీచర్ల నినాదాలతో ఆ ప్రాంగణం దద్దరిల్లింది. ఈ ధర్నాకు 13 జిల్లాల నుంచి 13 బోనాలతో మహిళా ఉపాధ్యాయులు హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రత్యేక బోనాలను తయారు చేసి మహిళా ఉపాధ్యాయులు ఇందిరాపార్క్ వద్ద ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. బదిలీలను వెంటనే జరిపించాలని ఆవేదన సభ సాక్షిగా మహిళా ఉపాధ్యాయులు వేడుకున్నారు. 'ఉపాధ్యాయ దంపతుల బదిలీలు వెంటనే చేపట్టాలి, భార్య ఒక జిల్లాలో, భర్త మరొక జిల్లాలో 18 నెలలుగా నరకయాతన అనుభవిస్తున్నాం. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించాలి.'అంటూ పలువురు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. కొందరు వారి బాధలను తలుచుకుని కన్నీటి పర్యంతమయ్యారు. స్పౌజ్ ఫోరం ధర్నాకు టీఎస్‌యూటీఎఫ్, ఎస్టీయూటీఎస్, టీపీటీఎఫ్, తపస్, పీఆర్టీయూ తెలంగాణ, ఆర్‌యూపీపీటీఎస్, టీఎస్టీయూ నాయకులతోతోపాటు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి హాజరై మద్దతును ప్రకటించారు. స్పౌజ్ బదిలీలు అయ్యేంత వరకూ అండగా ఉంటామనీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని చెప్పారు.

610 జీవో తరహాలో మరో ఉద్యమం : చావ రవి

ఉపాధ్యాయులు ధర్నా చేయాల్సిన పరిస్థితి రావడం దురదృష్టకరమని టీఎస్‌యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి ఆందోళన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా తెచ్చిన 317 జీవో వల్ల ఈ పరిస్థితి వచ్చిందన్నారు. 19 జిల్లాలకు ఒక న్యాయం, 13 జిల్లాలకు ఇంకో న్యాయమా?అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంకా 1500 మంది మిగిలిపోయారనీ, వారిని స్పౌజ్ బదిలీలు చేపట్టి కుటుంబాలను కలపాలని డిమాండ్ చేశారు. మూడు, నాలుగు జిల్లాల్లో ఉపాధ్యాయ పోస్టుల్లేకపోతే స్పౌజ్ బదిలీలను డిప్యూటేషన్ కింద తీసుకోవాలంటూ విద్యామంత్రి, అధికారులకు విన్నవించామని గుర్తు చేశారు. స్పౌజ్ బదిలీల సమస్య అత్యంత న్యాయమైందన్నారు. స్థానికతకు అనుగుణంగా 317 జీవో లేదని చెప్పారు. క్యాడర్ సీనియార్టీ ఆధారంగా కేటాయించడం తప్పని అన్నారు. స్థానికత కోసమే 610 జీవో వచ్చిందనీ, ఇది ఆంధ్రవారి కోసమే కాదని వివరించారు. స్థానికతను కాపాడుకోవడం కోసం 610 జీవో తరహాలో మరో ఉద్యమం రావాల్సిన అవసరముందన్నారు. కొన్ని జిల్లాల్లో ఉద్యోగులు రిటైర్ అయ్యేదాకా కొత్త ఉద్యోగాలు వచ్చే అవకాశం లేదని చెప్పారు. స్పౌజ్ బదిలీలు చేపట్టాలనీ, దంపతులను కలపాలని కోరారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ (యూఎస్‌పీసీ) ఆధ్వర్యంలో ఈనెల 18,19 తేదీల్లో మండలాల్లో బైక్ ర్యాలీలు, వచ్చేనెల 12న జిల్లా కేంద్రాల్లో ధర్నాలు, సెప్టెంబర్ 1న హైదరాబాద్‌లో మహాధర్నా ఉంటుందని చెప్పారు. దశలవారీ పోరాటంలో స్పౌజ్ టీచర్ల సమస్య కూడా ఉందనీ, ఉపాధ్యాయులు భాగస్వాములు కావాలని కోరారు.

ప్రభుత్వం పరిష్కరించాలి : ఏవీఎన్ రెడ్డి

తరగతి గదిలో బోధించే ఉపాధ్యాయులు ఇందిరాపార్క్ వద్ద ఎండలో ధర్నా చేసే పరిస్థితి రావడం బాధాకరమని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. వారి మనోవేదన ఏ స్థాయిలో ఉన్నదో ప్రభుత్వానికి అర్థం కావాలని సూచించారు. ఈ బదిలీలు చేపట్టడం వల్ల ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం పడబోదని స్పష్టం చేశారు. ఖాళీల్లేవంటూ సాకు చూపించి బదిలీలు చేపట్టకుండా తప్పించుకునే అవకాశం లేదన్నారు. ఆ వివరాలు తమ వద్ద ఉన్నాయనీ, స్పౌజ్ బదిలీలను చేపట్టాలని కోరారు. 317 జీవో అశాస్త్రీయంగా వచ్చిందన్నారు. భార్య ఒక చోట, భర్త మరో చోట, పిల్లలు ఇంకో చోట ఉండడం బాధాకరమనీ, ప్రభుత్వం ఈ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూటీఎస్ అధ్యక్షులు జి సదానందంగౌడ్, టీపీటీఎఫ్ అదనపు ప్రధాన కార్యదర్శి ముత్యాల రవీందర్, తపస్ రాష్ట్ర అధ్యక్షులు హనుమంతరావు, ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షులు జగదీశ్, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య టీఎస్టీయూ అధ్యక్షులు ఎండీ అబ్దుల్లా మాట్లాడుతూ 317 జీవోను తెచ్చి ఉపాధ్యాయులను బలవంతంగా బదిలీ చేసిందన్నారు. ఉపాధ్యాయుల్లో అనైక్యతను సృష్టించి ప్రభుత్వ బడుల్లో నాణ్యతా ప్రమాణాలు పడిపోవడానికి కారణమవుతున్నదని విమర్శించారు. పోరాటాలతోనే సమస్యలు పరిష్కారమవుతాయనీ, ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని చెప్పారు. స్పౌజ్ బదిలీలు వెంటనే జరపాలని స్పౌజ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు వివేక్ డిమాండ్ చేశారు. బదిలీలు నిర్వహించడానికి అవకాశముందని స్పౌజ్ ఫోరం సభ్యులు నరేష్ అన్నారు. ఈ కార్యక్రమంలో స్పౌజ్ ఫోరం ప్రధాన కార్యదర్శి ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి పౌరస్మృతి ఆమోదించం

(మొదటిపేజి తరువాయి)

ఎన్నో ఉన్నా పట్టించుకోకుండా, గడచిన 9 ఏండ్లుగా బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. ప్రజలను రెచ్చగొట్టి, అనవసరమైన గొడవలు పెట్టి, రాజకీయ పబ్బం గడుపుకునేందుకే ఈ తరహా విభజన రాజకీయాలకు పాల్పడుతున్నదని ఘాటుగా విమర్శించారు. ఈ బిల్లును తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో తమపార్టీ ఎంపీలు దీన్ని వ్యతిరేకిస్తారని స్పష్టంచేశారు. దానికోసం భావ సారూప్యత కలిగిన పార్టీలను కలుపుకుపోతామని తెలిపారు.

దీనికి సంబంధించి పార్లమెంటు ఉభయ సభల్లో చేపట్టే కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్లమెంటరీ పార్టీ నేతలు కే కేశవరావు, నామా నాగేశ్వరరావులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు కార్యవర్గం సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపింది.

తప్పుడు పోస్టులు పెడితే ఖబడ్దార్

(మొదటిపేజి తరువాయి)

కొన్ని పోస్టులు ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉంటున్నాయి' అని ఆ లేఖలో తెలిపారు. అధికారి కానీ, సైనికుడు కానీ తిరుగుబాటు చేసేలా వ్యవహరిస్తే ఐపీసీలోని నిబంధనలు, సైనిక చట్టంలోని సెక్షన్ల ప్రకారం యావజ్జీవ కారాగార శిక్షకు గురవుతాడని ఆ లేఖలో గుర్తు చేశారు. సోషల్ మీడియాలో పెట్టే ఇలాంటి పోస్టులపై నిఘా వేసి ఉంచాలని, స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని స్థానిక సైనిక కమాండర్లకు సూచించారు.


సామాజిక మాధ్యమాలలో చేసే ప్రసంగాలు ద్వేషపూరితంగా, ప్రమాదకరంగా, తిరుగుబాటును ప్రోత్సహించేలా ఉన్నాయని లేఖలో తెలిపారు. ఈ పోస్టులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని, వారి మనసులో ద్వేష భావాన్ని కలిగిస్తున్నాయని వివరించారు.

దీప వచ్చేస్తోంది!



ఆసియా రేసులో స్టార్ జిమ్నాస్ట్

భువనేశ్వర్ : భారత స్టార్ జిమ్నాస్ట్, రియో ఒలింపిక్స్‌లో నాల్గో స్థానంలో నిలిచి పతకాన్ని తృటిలో చేజార్చుకున్న దీప కర్మాకర్.. పునరాగమనానికి రంగం సిద్ధమైంది. త్రిపుర సూపర్‌స్టార్ జూన్ 10తో 21 నెలల నిషేధం ముగించుకుంది. కొద్ది నెలలుగా కఠోర సాధన చేస్తున్న దీప కర్మాకర్.. ఆసియా క్రీడల్లో ఘనంగా రీ ఎంట్రీ ఇచ్చేందుకు ఎదురు చూస్తుంది. ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత జిమ్నాస్ట్ జట్టును ఎంపిక చేసేందుకు మంగళవారం భువనేశ్వర్‌లోని కళింగ స్టేడియంలో ఎంపిక ట్రయల్స్ నిర్వహించనున్నారు. రెండు రోజుల జాతీయ సెలక్షన్ ట్రయల్స్‌లో దీప కర్మాకర్ పోటీపడనుంది. ప్రపంచకప్, కామన్‌వెల్త్ క్రీడలు, ఆసియా చాంపియన్‌షిప్స్‌లో పతకాలు సాధించిన దీప కర్మాకర్ త్వరలో 30వ వసంతంలోకి అడుగుపెట్టనుంది. సుదీర్ఘంగా గాయాలతో పోరాడిన దీప కర్మాకర్ ఇప్పుడు వాల్ట్‌పై విన్యాసాలు ఏ మేరకు చేయగలదనేది ఆసక్తికరంగా మారింది. నేషనల్ సెలక్షన్ ట్రయల్స్‌కు మెన్, ఉమెన్ కలిపి 39 మంది అథ్లెట్లను ఎంపిక చేశారు. ట్రయల్స్‌లో ప్రదర్శన ఆధారంగా ఆసియా క్రీడలకు జట్టును ఎంపిక చేయనున్నారు.



లక్ష్యసేన్ అసమాన ప్రదర్శనతో అద్భుతం చేశాడు. 21 ఏండ్ల యువ షట్లర్ కెనడా ఓపెన్ చాంపియన్‌గా అవతరించాడు. చైనా షట్లర్ లి షి ఫెంగ్‌తో టైటిల్ పోరులో తడబాటుకు గురైనా.. గొప్పగా పుంజుకుని విజయాన్ని అందుకున్నాడు. రెండో గేమ్‌లో ఫెంగ్‌ను గేమ్ పాయింట్ వద్ద నిలిపిన లక్ష్యసేన్ వరుసగా ఆరు పాయింట్లతో అదరగొట్టాడు. ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌ను చిత్తు చేసిన మన చిచ్చరపిడుగు.. ఇండియా ఓపెన్ (2022) తర్వాత మరో బిడబ్ల్యూఎఫ్ సూపర్ 500 టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు.

కాల్గరీ (కెనడా)

లక్ష్యసేన్ అదిరెన్

- కెనడా ఓపెన్ టైటిల్ సేన్ వశం
- ఫైనల్లో ఫెంగ్‌పై సంచలన విజయం
- కెరీర్ రెండో సూపర్ 500 ట్రోఫీ సొంతం

పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రక్రియ మొదలైన కీలక తరుణంలో టీమ్ ఇండియా యువ షట్లర్ లక్ష్యసేన్ (21) అదిరే విజయం నమోదు చేశాడు. ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ విజేత, నాల్గో సీడ్ లీ షి ఫెంగ్ (చైనా)ను పురుషుల సింగిల్స్ ఫైనల్లో వరుస గేముల్లో మట్టికరిపించిన లక్ష్యసేన్ కెనడా ఓపెన్ చాంపియన్‌గా నిలిచాడు. 21-18, 22-20తో లక్ష్యసేన్ మెరుపు విజయం సాధించాడు. 2022 ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ ఫైనల్స్‌కు చేరిన అనంతరం.. ఫిట్‌నెస్ సమస్యలతో ఫామ్ కోల్పోయిన లక్ష్యసేన్ ఆ తర్వాత కెనడా ఓపెన్‌లోనే తొలిసారి ఫైనల్‌కు చేరుకున్నాడు. సుమారు గంట పాటు ఉత్కంఠగా సాగిన అంతిమ సమరంలో భారత యువ షట్లర్ పైచేయి సాధించాడు.

కెనడా ఓపెన్ విజయంతో వరల్డ్ నం.25 లక్ష్యసేన్.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో విలువైన స్థానాలు ఎగబాకి ఆరో ర్యాంక్ సాధించనున్నాడు!.

సేన్ సంచలనం

కెనడా ఓపెన్ ఫైనల్లో లక్ష్యసేన్ సంచలనం సృష్టించాడు. 21-18, 22-20తో వరుస గేముల్లోనే ఫెంగ్‌ను చిత్తు చేసిన లక్ష్యసేన్.. 50 నిమిషాల్లోనే టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఈ ఏడాది ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్ అనంతరం మరో టైటిల్‌పై కన్నేసిన ఫెంగ్.. కెనడా ఓపెన్ ఫైనల్లో దూకుడుగా ఆడే ప్రయత్నం చేశాడు. తొలి గేమ్‌లో లక్ష్యసేన్ ముందు నుంచీ ఆధిక్యంలో సాగాడు. 2-2 తర్వాత.. వరుసగా నాలుగు పాయింట్లతో 6-2తో ముందజ వేశాడు. విరామ సమయానికి 11-8తో మూడు పాయింట్ల ఆధిక్యం సాధించాడు. ద్వితీయార్థంలోనూ లక్ష్యసేన్ జోరు సాగినా.. 15-15 వద్ద ఫెంగ్ స్కోర్లు సమం చేశాడు. కానీ మరోసారి వరుసగా మూడు పాయింట్లు కొల్లగొట్టిన లక్ష్యసేన్ 18-15తో ఫెంగ్‌ను వెనక్కి నెట్టాడు. ఫెంగ్ పాయింట్ల పరంగా పురోగతి సాధించినా.. లక్ష్యసేన్ మెరుపు వేగంతో తొలి గేమ్‌ను కైవసం చేసుకున్నాడు.

కీలక రెండో గేమ్‌లో లక్ష్యసేన్ మాయజాలం ప్రదర్శించాడు. ఆరంభంలో ఎవరూ స్పష్టమైన ఆధిక్యత సాధించలేదు. సేన్ 6-5తో ముందకెళ్తుండగా వరుసగా ఐదు పాయింట్లు సాధించిన ఫెంగ్ 10-6తో ఆధిక్యం సాధించాడు. విరామ సమయానికి ముందంజలో నిలిచిన ఫెంగ్.. ద్వితీయార్థంలోనూ దూసుకెళ్లాడు. 20-16తో ఫెంగ్ గేమ్ పాయింట్ ముంగిట నిలిచాడు. మరో పాయింట్ సాధిస్తే రెండో గేమ్ ఫెంగ్ వశమయ్యేదే. కానీ లక్ష్యసేన్ ఇక్కడే మ్యాజిక్ చేశాడు. కండ్లుచెదిరే ఆటతీరుతో సత్తా చాటిన లక్ష్యసేన్ వరుసగా ఆరు పాయింట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఫెంగ్‌ను నాలుగు గేమ్ పాయింట్ల ముంగిట నిలువరించిన లక్ష్యసేన్ 20-20తో సమవుజ్జీగా నిలువటంతో పాటు అదే ఊపులో మరో రెండు పాయింట్లు సాధించాడు. 22-20తో రెండో గేమ్‌ను, కెనడా ఓపెన్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ప్రత్యర్థిని గేమ్ పాయింట్ వద్ద నిలువరించి లక్ష్యసేన్ సంధించిన స్మాష్‌లు టైటిల్ పోరుకు హైలైట్. ఈ విజయంతో ఫెంగ్‌తో ముఖాముఖి రికార్డును లక్ష్యసేన్ 5-2తో మరింత మెరుగుపర్చుకున్నాడు.



సరైన సమయంలో...

యువ షట్లర్ లక్ష్యసేన్ 17 నెలల టైటిల్ దాహానికి కెనడా ఓపెన్ విజయంతో తెరపడింది. గాయాలు, ఫిట్‌నెస్ సమస్యలతో షటిల్ కోర్టులో లయ కోల్పోయిన లక్ష్యసేన్.. ఏడాదిగా నిలకడగా నిరాశపరిచాడు. వ్యక్తిగత, జట్టు విభాగాల్లోనూ లక్ష్యసేన్ అంచనాలు అందుకోలేదు. భారత బ్యాడ్మింటన్ భవిష్యత్‌గా ఎదిగిన లక్ష్యసేన్.. సుదీర్ఘ కాలం వరల్డ్ బ్యాడ్మింటన్ టూర్ సిరీస్‌ల్లో నిరాశపరచటం ఊహించనిది. 2024 పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత ప్రక్రియ ప్రారంభమైన కీలక దశలో లక్ష్యసేన్ ఫామ్‌లోకి రావటం, కెరీర్ రెండో సూపర్ 500 టైటిల్ సాధించటం గొప్ప సానుకూలత. కెనడా ఓపెన్ విజయంతో లక్ష్యసేన్ తిరిగి ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-10లోకి అడుగుపెట్టాడు. కెనడా ఓపెన్ ఫైనల్లో చైనా షట్లర్ ఫెంగ్‌పై విజయం.. తన కెరీర్‌లోనే అతి గొప్ప విజయంగా లక్ష్యసేన్ అభివర్ణించాడు. వరల్డ్ క్లాస్ షట్లర్‌పై నాలుగు గేమ్ పాయింట్లు కాచుకుని మరీ నెగ్గటం సాధారణం కాదని, గ్రేట్ కమ్‌బ్యాక్‌గా లక్ష్య అన్నాడు.

'ఒలింపిక్స్ అర్హత దశలోకి అడుగుపెట్టాం. అయినా, ఫామ్ సాధించకపోటం కష్టంగా అనిపించింది. ఇది నాకు చాలా మంచి టోర్నమెంట్. ఫైనల్లో నా ప్రదర్శన గ్రేట్ కమ్‌బ్యాక్. శస్త్ర చికిత్స తర్వాత ట్రైనింగ్ బాగా జరిగింది. తరచుగా అస్వస్థతకు గురవటంతో రోగ నిరోధక శక్తి క్షీణించింది. ఎన్నో ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నాను. వంద శాతం ప్రదర్శన ఇవ్వలేకపోయాను. ఆల్ ఇంగ్లాండ్ చాంపియన్‌షిప్స్‌కు మంచిగా సన్నద్ధమైనా.. ఫలితం లేకపోయింది. కొరియా కోచ్ నిష్క్రమణతో నా సమస్యలు మరింత ఎక్కువయ్యాయి. ట్రైనింగ్‌లో ఎన్నో భిన్నమైనవి ప్రయత్నించాను. అవి ఇప్పుడు ఉపకరిస్తున్నాయి. ఒలింపిక్ క్వాలిఫయింగ్ ఏడాదిలో నా ఫామ్ ఇలాగే సాగుతుందని అనుకుంటున్నాను. ఒలింపిక్స్ అర్హత దారిలో ఈ విజయం ఓ గొప్ప ప్రేరణే కానీ ఉపశమనం ఏమాత్రం కాదు. ఇంకా ఎన్నో టోర్నమెంట్లు ఆడాల్సి ఉంది. ఆ పోటీలకు ఈ విజయం ఓ ప్రేరణ. యుఎస్ ఓపెన్‌లో ఆడేందుకు అక్కడికి వెళ్తున్నాను. కెనడా ఓపెన్ విజయాన్ని సెలబ్రేట్ చేసుకునే సమయం లేదని' లక్ష్యసేన్ అన్నాడు.

సింధు మెరిసేనా?

నేటి నుంచి యుఎస్ ఓపెన్



కౌన్సిల్ బ్లఫ్స్(యుఎస్ఏ) : వరుస టోర్నీల్లో నిరాశపరుస్తున్న ఒలింపిక్ మెడలిస్ట్, భారత స్టార్ షట్లర్ పి.వి సింధు సీజన్లో తొలి టైటిల్‌పై కన్నేసింది. నాణ్యమైన షట్లర్లతో పోరులో తడబడుతున్న పి.వి సింధు ఇటీవల కెనడా ఓపెన్ సెమీఫైనల్లోనూ అకానె యమగూచి చేతిలో పరాజయం పాలైంది. ఓ మ్యాచ్‌లో మెప్పిస్తూ.. మరో మ్యాచ్‌లో చతికిల పడుతున్న సింధు ఇంకా పూర్వవైభవం దిశగా అడుగులు వేయటం లేదు. పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రక్రియ సైతం ఆరంభం కావటంతో బ్యాడ్మింటన్ వరల్డ్ టూర్ సిరీస్‌ల్లో విజయాలు కీలకం కానున్నాయి. దీంతో నేటి నుంచి ఆరంభం కానున్న యుఎస్ఏ ఓపెన్‌లో టైటిలే లక్ష్యంగా పి.వి సింధు బరిలోకి దిగుతోంది. టైటిల్ వేటలో సింధుకు గట్టి సవాల్ ఎదురు కానుంది. తొలి రౌండ్లో క్వాలిఫయర్‌తో పోటీపడనున్న సింధుకు క్వార్టర్‌ఫైనల్లో ఐదో సీడ్ చైనీస్ తైపీ షట్లర్ వెన్ చి ఎదురయ్యే అవకాశం ఉంది. ఇక సెమీఫైనల్లో టాప్ సీడ్, థాయ్‌లాండ్ అగ్ర షట్లర్ రచనాక్ ఇంటనాన్ సవాల్ ఎదురుచూస్తుంది. యువ షట్లర్ గద్దె రుత్విక శివాని సైతం పోటీలో నిలిచింది. పురుషుల సింగిల్స్‌లో కెనడా ఓపెన్ విజేత లక్ష్యసేన్‌కు మూడో సీడ్ లభించింది. తొలి రౌండ్లో ఫిన్లాండ్ ఆటగాడితో ఆడనున్న లక్ష్యసేన్‌కు సెమీస్ వరకు పెద్దగా సవాల్ లేదు. సెమీఫైనల్లో చైనా షట్లర్, రెండో సీడ్ లి షి ఫెంగ్ ఎదురు కానున్నాడు!. మెన్స్ డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్, విష్ణువర్ధన్ జోడీ.. మహిళల డబుల్స్‌లో నాయక్, రమ్య సహా రుతుపర్ణ, శ్వేతపర్ణ సిస్టర్స్ బరిలో నిలిచారు. మంగళవారం అర్హత రౌండ్ మ్యాచులు జరుగనుండగా.. బుధవారం నుంచి ప్రధాన టోర్నీ ఆరంభం కానుంది.



ముమ్మరంగా సాధన

విండీస్‌తో భారత్ టెస్టు సవాల్

డొమినికా : కరీబియన్లతో టెస్టు సవాల్‌కు భారత క్రికెటర్లు సిద్ధమవుతున్నారు. భారత్, వెస్టిండీస్ తొలి టెస్టు వేదిక డొమినికాకు చేరుకున్న రోహిత్‌సేన.. ఇక్కడ రెండు రోజులుగా కఠోర సాధన చేస్తుంది. కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిలు నెట్స్‌లో తీవ్రంగా చెమటోడ్చారు. యువ బ్యాటర్లు శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ సహా వైస్ కెప్టెన్ అజింక్య రహానె బ్యాటింగ్ ప్రాక్టీస్‌పై ప్రత్యేక ధ్యాస పెట్టారు. హైదరాబాదీ పేసర్, కరీబియన్లతో టెస్టు సిరీస్‌లో భారత పేస్ దళపతి మహ్మద్ సిరాజ్ కొత్త బంతులతో నెట్స్‌లో విరుచుకుపడ్డాడు. జైదేవ్ ఉనద్కత్‌తో కలిసి కొత్త బంతులతో మహ్మద్ సిరాజ్ ముమ్మరంగా ప్రాక్టీస్ చేశాడు. భారత్, వెస్టిండీస్ తొలి టెస్టు బుధవారం నుంచి ఆరంభం కానుంది. భారత కాలమానం ప్రకారం రాత్రి 7.30 గంటలకు మ్యాచ్ ఆరంభం కానుంది.

ఆడిట్ నివేదికలు ఇవ్వండి!

స్పోర్ట్స్ స్కూల్స్, అకాడమీలకు శాట్స్ చైర్మన్ ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్ : క్రీడా పాఠశాలలు, క్రీడా అకాడమీలు సహా జిల్లా క్రీడా సంస్థలు తక్షణమే అంతర్గత ఆడిట్ పూర్తి చేసి నివేదికలను సమర్పించాలని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) చైర్మెన్ డాక్టర్ ఆంజనేయ గౌడ్ ఆదేశించారు. ఎల్బీ స్టేడియంలోని శాట్స్ చైర్మెన్ కార్యాలయం లో సోమవారం స్పోర్ట్స్ స్కూల్స్, అకాడమీలు, జిల్లా క్రీడా సంస్థల పై సమీక్ష సమావేశం నిర్వహించారు. శాట్స్ ఓఎస్‌డి డాక్టర్ లక్ష్మీ సహా శాట్స్ ఉన్నతాధికారులు సమావేశానికి హాజరయ్యారు. 'స్పోర్ట్స్ స్కూల్, అకాడమీల్లో అథ్లెట్ల వ్యక్తిగత ప్రొఫైల్ రూపొందించాలి. మరింత మెరుగైన ఫలితాల సాధన దిశగా నిరంతర పర్యవేక్షణ అవసరం. క్రీడలు, విద్య శిక్షణతో పాటు వ్యక్తిత్వ వికాసం వంటి అంశాల్లోనూ నిపుణులతో శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలి. అంతర్గత ఆడిట్‌ను వెంటనే పూర్తి చేసి నివేదికలు సమర్పించండి. పురోగతిపై మూడు నెలలకు ఓసారి సమీక్ష నిర్వహిస్తామని' సమావేశంలో ఆంజనేయ గౌడ్ అన్నారు.





విరాజ్ అశ్విన్

ఫ్రెష్ లవ్‌స్టోరీ

ఆనంద్ దేవరకొండ, విరాజ్ అశ్విన్, వైష్ణవి చైతన్య ప్రధాన పాత్రధారులుగా నటించిన మూవీ 'బేబీ'. 'కలర్ ఫొటో' సినిమాను ప్రొడ్యూస్ చేసిన సాయి రాజేష్ దర్శకత్వంలో ఈ సినిమా రాబోతోంది. ఈ ఫీల్ గుడ్ లవ్‌స్టోరీ ఈనెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరో విరాజ్ అశ్విన్ మీడియాతో మాట్లాడుతూ, 'ఈ సినిమాలో నా పాత్ర పేరు కూడా విరాజ్. తొలిసారి నా రియల్ నేమ్ క్యారెక్టర్ చేస్తుండటం సంతోషంగా ఉంది. ఈ సినిమాలో ఆనంద్, వైష్ణవి, నా పాత్రలు చాలా సహజంగా ఉంటాయి. రియల్ వరల్డ్‌తో కనెక్ట్ అయినట్లు బిహేవ్ చేస్తుంటాయి. నేను కాలేజ్ స్టూడెంట్‌గా నటించాను. ఇందులో ప్రతి క్యారెక్టర్‌కు ఒక బ్యాక్ స్టోరీ ఉంటుంది. మా సినిమా ట్రైలర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఈ సినిమాలో డైలాగ్స్ ప్రత్యేక ఆకర్షణ అవుతాయి. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ కొత్త టోన్ ఇచ్చింది. విజువల్‌గా బ్యూటీ ఉంటుంది. అలాగే విజయ్ బుల్గానిన్ మ్యూజిక్ హైలైట్‌గా నిలుస్తుంది. ఈ సినిమాకు విప్లవ్ ఎడిటింగ్ కూడా క్రిస్పీనెస్ తెచ్చింది. ఆనంద్, వైష్ణవి బాగా నటించారు. నేను చూసిన లవ్ స్టోరీస్‌తో పోల్చితే ఇదొక ఫ్రెష్ అప్రోచ్డ్ ప్రేమకథ. ట్రయాంగిల్ లవ్ స్టోరీ అయినా రొటీన్‌గా ఉండదు. నిర్మాత ఎస్‌కెఎన్ పర్ఫెక్ట్ ప్రొడ్యూసర్. ప్రస్తుతం 'మరీచిక' అనే మూవీ చేస్తున్నాను' అని చెప్పారు.

డిఫరెంట్ కథ

సంజయ్ రావు, ప్రణవి మానుకొండ జంటగా నటించిన చిత్రం 'స్లమ్ డాగ్ హజ్‌బెండ్'. చిన్న సినిమాగా మొదలైన ఈ చిత్రాన్ని రిలయన్స్ ఎంటర్టైన్మెంట్ లాంటి పెద్ద సంస్థ రిలీజ్ చేయబోతోంది. మైక్ మూవీస్ బ్యానర్ నిర్మించిన ఈ చిత్రానికి డైరెక్టర్ పూరీ జగన్నాథ్ శిష్యుడు డాక్టర్ ఏఆర్ శ్రీధర్ దర్శకత్వం వహించారు. బ్రహ్మాజీ, సప్తగిరి కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమా రిలీజ్ డేట్ (ఈనెల 21) పోస్టర్‌ను హీరో సత్య దేవ్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'ట్రైలర్ బాగుంది. సినిమా పెద్ద హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. బ్రహ్మాజీ మాట్లాడుతూ, 'నా కొడుకు హీరోగా ఎదిగినందుకు సంతోషంగా ఉంది. ఈ సినిమాలో ఓ పాత్ర కోసం నన్ను అప్రోచ్ అయ్యారు' అని తెలిపారు. 'ఈ చిత్రంలో ఎలాంటి అడల్ట్ కంటెంట్ ఉండదు. డాగ్‌కు మేల్ వాయిస్ పెట్టాం. కానీ అందులోనూ ఓ ట్విస్ట్ ఉంటుంది. మనుషులకంటే జంతువులే విధేయంగా ఉంటాయి. ఐశ్వర్య రాయ్ చెట్టుని పెళ్లి చేసుకుంది. ఆ రెండు పాయింట్లను అల్లుకుని ఈ కథను రాసుకున్నాను' అని డైరెక్టర్ శ్రీధర్ చెప్పారు. నిర్మాత అప్పిరెడ్డి మాట్లాడుతూ, 'ఇది చాలా వినోదాత్మకంగా ఉంటుంది. కొత్త పాయింట్, కొత్త కథ. అందర్నీ అలరిస్తుంది' అని తెలిపారు. సంజయ్ రావు మాట్లాడుతూ, 'సినిమాలో కంటెంట్ బాగుంది. బాగా లేకపోతే మీకు నచ్చినట్టుగా సోషల్ మీడియాలో కామెంట్ పెట్టండి. నేను ఆ విమర్శలను కూడా స్వీకరిస్తాను' అని చెప్పారు.



చైతన్యరావు, ప్రణవి మానుకొండ, సత్యదేవ్

నవచిత్రం

డబుల్ ఇస్మార్ట్ షురూ..



ఛార్మి, రామ్, పూరీ జగన్నాథ్

రామ్, డైరెక్టర్ పూరీ జగన్నాథ్ క్రేజీ కాంబినేషన్ మరోసారి ప్రేక్షకులని అలరించనుంది. వీరి కాంబోలో వచ్చిన బ్లాక్‌బస్టర్ 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' రానుంది. డబుల్ మాస్, డబుల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కబోయే ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్‌పై పూరీ జగన్నాథ్, ఛార్మి నిర్మించనున్నారు. సోమవారం కోర్ టీమ్, కొంతమంది ప్రత్యేక అతిథుల సమక్షంలో 'డబుల్ ఇస్మార్ట్' లాంచ్ వేడుక గ్రాండ్‌గా జరిగింది. ఛార్మి క్లాప్ ఇవ్వగా, హీరో రామ్ పోతినేనిపై చిత్రీకరించిన తొలి సన్నివేశానికి స్వయంగా పూరీ జగన్నాథ్ దర్శకత్వం వహించారు. ముహూర్తపు సన్నివేశంలో "ఇస్మార్ట్ శంకర్ అలియాస్ డబుల్ ఇస్మార్ట్' అని రామ్ చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంది.

'డబుల్ ది ఎంటర్‌టైన్‌మెంట్! డబుల్ ది యాక్షన్! డబుల్ ది మ్యాడ్‌నెస్! వి ఆర్ బ్యాక్ !! డబుల్‌ఇస్మార్ట్ మోడ్ ఆన్!' అంటూ లాంచింగ్ ఈవెంట్‌లో ఫోటోలని రామ్ ట్విట్టర్ ద్వారా అభిమానులతో షేర్ చేసుకున్నారు. ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ఈ నెల 12 నుంచి ప్రారంభం కానుంది.

ఇప్పటికే భారీ అంచనాలు ఉన్న ఈ చిత్రానికి పూరి జగన్నాథ్ చాలా పెద్ద స్పాన్ ఉన్న కథ రాశారు. ఇది అత్యున్నత స్థాయి సాంకేతిక ప్రమాణాలతో, భారీ స్థాయిలో భారీ బడ్జెట్‌తో రూపొందనుంది. రామ్‌ని 'ఇస్మార్ట్ శంకర్' కంటే మాసియర్ క్యారెక్టర్‌లో చూపించబోతున్నారు పూరి జగన్నాథ్. ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో మార్చి 8, 2024న మహా శివరాత్రికి పాన్ ఇండియా సినిమాగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రానికి సీఈఓ: విషు రెడ్డి.

పవన్‌కళ్యాణ్, సాయిధరమ్ తేజ్ కలయికలో పి.సముద్రఖని దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'బ్రో'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ సినిమాకి వివేక్ కూచిబొట్ల సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు. త్రివిక్రమ్ శ్రీనివాస్ స్క్రీన్ ప్లే, డైలాగ్స్ అందిస్తున్నారు. ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం నుంచి ఇటీవల 'మై డియర్ మార్కండేయ' పాట విడుదలై మెప్పించింది. ఈ నేపథ్యంలో తాజాగా సంగీత దర్శకుడు తమన్ మీడియాతో పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.



ఉన్నత స్థాయి సంగీత నేపథ్యం..

పవన్ కళ్యాణ్‌తో నేను చేసిన వకీల్ సాబ్, భీమ్లా నాయక్, బ్రో మూడు సినిమాలూ రీమేక్‌లే. పవర్‌స్టార్‌కి మ్యూజిక్ చేయడం ఒక అభిమానిగా ప్లెజర్, అభిమానుల నుంచి ప్రెజర్ (నవ్వుతూ). ఒరిజినల్ ఫిల్మ్‌లో పాటల్లేవు. నేపథ్య సంగీతం చాలా బాగా చేశారు. అక్కడ ముఖ్యమైన

ప్లెజర్, ప్రెజర్ రెండూ ఉంటాయ్

పాత్రను సముద్రఖని చేశారు కాబట్టి అది సరిపోతుంది. కానీ ఇక్కడ పవన్ కళ్యాణ్ నటించడంతో ఇంకా ఎక్కువ వర్క్ చేయాల్సి ఉంటుంది. ఈ సినిమాలని పాటల్లోనూ, నేపథ్య సంగీతంలోనూ కొత్తదనం కనిపిస్తుంది. ఉన్నత స్థాయి నేపథ్య సంగీతం ఉంటుంది. సముద్రఖనితో పని చేయడం చాలా బాగుంది. తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అదరగొట్టాడని అందరికీ చెప్పేశారు. అలాగే దర్శక, నిర్మాతలతో పాటు ఇతర చిత్ర బృందం ఇప్పటికే ఈ చిత్రం చూసి నేపథ్య సంగీతానికి కంటతడి పెట్టుకున్నారు.

చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి

పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ కలయికలో వచ్చే పాట ఛాలెంజింగ్‌గా అనిపించింది. ఎందుకంటే ఆ పాటను మాస్‌గా చేయలేం. సామెతలు లాగానే చెప్పాలి. ప్రత్యేక గీతాలు లాంటివి స్వరపరచలేం. ఇది అలాంటి సినిమా కాదు. కొన్ని పరిధులు ఉన్నాయి. ఇందులో నాలుగు పాటలు ఉంటాయి. పవన్ కళ్యాణ్, సాయి ధరమ్ తేజ్ అద్భుతంగా నటించారు. సినిమాలో చాలా సర్‌ప్రైజ్‌లు ఉన్నాయి. వాటిని తెరపైనే చూడాలి.

అందర్నీ కదిలించే సినిమా

జీవితం అంటే ఏంటో తెలిపేలా ఉండే ఈ సినిమా ఎంతోమందిని కదిలిస్తుంది. హత్తుకునే సన్నివేశాలు ఎన్నో ఉన్నాయి. స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ అద్భుతంగా ఉంటాయి. త్రివిక్రమ్ రచన సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లింది. పవన్ కళ్యాణ్, తేజ్ మధ్య ఎంత మంచి అనుబంధం ఉంటుందో అది తెర మీద బ్యూటిఫుల్‌గా ఉంటుంది. 'వకీల్ సాబ్, భీమ్లా నాయక్' సినిమాలకు పూర్తి భిన్నంగా కొత్త పవన్ కళ్యాణ్‌ని చూస్తాం.

ట్రోల్స్‌ని పట్టించుకోను..

ట్రోల్స్‌లో మంచిని తీసుకుంటాను, చెడుని పక్కన పెట్టేస్తాను. కొందరేదో కావాలని సోషల్ మీడియాలో విమర్శలు చేస్తే, మనం వాటిని పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ఆరు నెలల నుంచి 'గుంటూరు కారం' సినిమా మీద పని చేస్తున్నాం. బయట జరిగే అసత్య ప్రచారాలను నమ్మకండి. ఏదైనా ఉంటే నిర్మాతలే అధికారికంగా ప్రకటిస్తారు. కావాలని ఎవరూ ఫ్లాప్ సినిమాలు చేయరు. కొన్నిసార్లు సినిమా ఆలస్యమవ్వడం అనేది సహజం. దాన్ని భూతద్దంలో పెట్టి చూస్తూ పదే పదే దాని గురించి ట్రోల్ చేయాల్సిన పని లేదు.

- తమన్



దుశారా విజయన్, అర్జున్‌దాస్

బ్లడ్ అండ్ చాక్లెట్ విజయం ఖాయం

- డైరెక్టర్ శంకర్

డైరెక్టర్ శంకర్ ప్రొడక్షన్స్ ఎస్ పిక్చర్స్ పతాకంపై రూపొందిన 'ప్రేమిస్తే, వైశాలి, షాపింగ్ మాల్' లాంటి చిత్రాలన్నీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. అదే పంథాలో డైరెక్టర్ శంకర్ ప్రొడక్షన్‌లో మొదటిసారి సస్పెన్స్ థ్రిల్లర్‌గా 'బ్లడ్ అండ్ చాక్లెట్' చిత్రాన్ని నిర్మించారు. వసంతబాలన్ దర్శకత్వంలో అర్జున్ దాస్ హీరోగా, దుశారా విజయన్ హీరోయిన్‌గా నటించారు. ఈ చిత్ర ఆడియో డైరెక్టర్ శంకర్ చేతుల మీదుగా రిలీజ్ అయ్యింది.

జి.వి.ప్రకాష్ కుమార్ అందించిన సంగీతం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

ఈ సందర్భంగా డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ, 'వసంతబాలన్ సెన్సిటివ్ సబ్జెక్ట్‌లను డీల్ చేస్తు ఉంటారు. ఈ సినిమా చూడగానే నాకు చాలా బాగా నచ్చింది. ఓ పక్క సెన్సిటివ్ కథాంశాన్ని టచ్ చేస్తూ ఓ వైపు లవ్, మరో వైపు సస్పెన్స్.. రెండింటికి సమ న్యాయం చేస్తూ అద్భుతంగా రూపొందించారు' అని అన్నారు. ఈ చిత్రం తెలుగు, తమిళ భాషల్లో ఈనెల 21న విడుదలకానుంది. తెలుగులో ఎస్.ఆర్ డి.ఎస్ సంస్థ ఈ సినిమాని విడుదల చేయనుంది. సంగీత దర్శకుడు జీ.వి.ప్రకాష్‌కుమార్ నాలుగు అద్భుతమైన పాటలు అందించారు. ఆయన అందించిన నేపథ్య సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తుందని దర్శకుడు వసంతబాలన్ చెప్పారు.

ఆద్యంతం ఆసక్తికరం

గత ఏడాది 'టాప్‌గన్ మావెరిక్' వంటి బ్లాక్‌బస్టర్‌తో అలరించిన హాలీవుడ్ కథానాయకుడు టామ్ క్రూజ్ లేటెస్ట్‌గా 'మిషన్: ఇంపాజిబుల్-డెడ్ రికనింగ్ పార్ట్ 1' సినిమాతో ప్రేక్షకుల ముందకు రాబోతున్నారు. ఈ సినిమా ఈనెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమైంది. ఇది 'మిషన్: ఇంపాజిబుల్ -ఫాల్ అవుట్' (2018)కి సీక్వెల్. వయాకామ్ 18 స్టూడియోస్ ద్వారా ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగులో ఈనెల 12న విడుదలవుతోంది.

ఇందులో ఏతాన్ హంట్ (టామ్ క్రూజ్), అతని ఐఎమ్ఎఫ్ బృందం అత్యంత ప్రమాదకరమైన మిషన్‌ను ప్రారంభిస్తుంది. దీని వల్ల ఏం జరిగింది అనేదే సినిమా. ఈ సినిమాలోని యాక్షన్ సీక్వెన్స్ కోసం టామ్ క్రూజ్ పర్వతంపై బైక్ డ్రైవ్ చేస్తూ సాహసం చేశారు.

ఇందులో భాగంగా నార్వేలోని హెల్‌సెట్‌కోపెన్ పర్వతం, సముద్రం నుండి దాదాపు 1,200 మీటర్ల ఎత్తులో ఉన్న రాతి పై నుంచి ఆయన తన పారాచూట్ ఓపెన్ అవ్వడానికి ముందు 4,000 అడుగుల దిగువ లోయలో పడిపోయాడు. ఇప్పటివరకు చేయని అత్యంత ప్రమాదకరమైన స్టంట్‌ని టామ్ క్రూజ్ చేయటం విశేషం. వెండితెరపై మరోసారి 'మిషన్ ఇంపాజిబుల్: డెడ్ రికనింగ్ పార్ట్ 1' చరిత్ర సృష్టించడం ఖాయమని చిత్ర బృందం భావిస్తోంది. హేలీ అట్వెల్, వింగ్ రేమ్స్, సైమన్ పెగ్ వెనెస్సా కిర్బీ, హెన్రీ సెర్నీ నటించిన ఈచిత్రానికి సినిమాటోగ్రఫీ-ఫ్రేజర్ టాగర్ట్, సంగీతం-లోర్న్ బాల్ఫ్.



టామ్ క్రూజ్

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

ఉత్తరాదిన జలప్రళయం

ఇప్పటికి 51 మంది మృతి

- హిమాచల్‌ప్రదేశ్‌లో తీవ్ర ప్రభావం
- ఉత్తరాఖండ్, జమ్మూకాశ్మీర్, పంజాబ్, ఢిల్లీలలోనూ ఆందోళనకర పరిస్థితులు
- నీట మునిగిన ఇండ్లు.. రోడ్లన్నీ జలమయం
- ఇంకా భారీ వర్షాలే : ఐఎండీ అంచనా



న్యూఢిల్లీ : ఉత్తర భారతదేశంలో భారీ వర్షాలు బీభత్సాన్ని సృష్టిస్తున్నాయి. ముఖ్యంగా, హిమాచల్‌ప్రదేశ్ వర్షాల దాటికి తీవ్ర నష్టాన్ని ఎదుర్కొన్నది. జమ్మూకాశ్మీర్, ఉత్తరాఖండ్, పంజాబ్, చండీగఢ్‌లలోనూ పరిస్థితులు దారుణంగా ఉన్నాయి. భారీ వర్షాలకు దారులన్నీ జలమయమయ్యాయి. రోడ్లన్నీ నదులను తలపించాయి. మోకాళ్ల లోతు వరకు నీరు వచ్చి చేరటంతో ఇండ్లు నీట మునిగాయి. పలు నదులు ఉప్పొంగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఉత్తరాన గత మూడ్రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు 51 మంది వరకు చనిపోయినట్టు తెలుస్తున్నది. ఒక్క ఆదివారమే 19 మంది చనిపోయినట్టు సమాచారం. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, హర్యానా, జమ్మూకాశ్మీర్, రాజస్థాన్, వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అంచనా వేసింది. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఢిల్లీ రాష్ట్రాల్లో భారీ వర్షాలకు అనేక ప్రాంతాల్లో పరిస్థితులు భయంకరంగా మారాయి. వాహనాలు పేపర్ పడవల్లా కొట్టుకుపోయిన దృశ్యాలు కనిపించాయి. బురద నీరు ఇండ్లల్లోకి వచిచ చేరింది.

ఇండ్లు ధ్వంసం.. ఉప్పొంగుతున్న నదులు

హిమాచల్‌ప్రదేశ్‌లో మాత్రం పరిస్థితులు భయానకంగా మారాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. భారీ వర్షాలకు వరదలు సంభవించాయి. ఇండ్లు ధ్వంసమయ్యాయి. సాధారణ జనజీవనం అస్తవ్యస్తమైంది. ముఖ్యమైన నదులు రావి, బియాస్, సట్లేజ్, స్వాన్, చీనాబ్‌లు ఉప్పొంగటంతో మనాలీ, కులు, కిన్నౌర్, చంబా ప్రాంతాలలో దుకాణాలు, వాహనాలు భారీ వరదల్లో కొట్టుకుపోయాయి. రానున్న 24 గంటలు ప్రజలెవరూ బయటకు రావద్దని ఆ రాష్ట్ర సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖు కోరారు. అవసరం ఉంటే హెల్ప్ లైన్ నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. సహాయం కోసం తాను 24 గంటలూ అందుబాటులో ఉంటానని చెప్పారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని పంపారు. రోడ్డు ప్రమాదాలు వంటి కారణాలతో ఇప్పటి వరకు 20 మంది కంటే ఎక్కువ మంది ప్రాణాలు కోల్పోయారని ఆ రాష్ట్ర మంత్రి జగత్ సింగ్ నేగి తెలిపారు. జాతీయ రహదారులు, జిల్లా, అంతర్గత రోడ్లు.. ఇలా 1300కు పైగా రోడ్లు భారీ వరదలకు ప్రభావితమయ్యాయని వివరించారు. రానున్న రెండు రోజులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

భారీ వర్షాలకు నీరు నిలిచిపోయిన కారణంగా గురుగావ్, ఢిల్లీలలో అన్ని స్కూళ్లు మూత పడ్డాయి. యమునా నదిలోకి ఒక లక్ష క్యూసెక్కుల నీటిని హర్యానా విడుదల చేయటంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సమీక్షించటానికి ఢిల్లీ ప్రభుత్వం 16 కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసింది. వర్షాలు, వరద పరిస్థితులపై ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఉన్నతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. లోతట్టు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తామని ఆయన చెప్పారు. జమ్మూకాశ్మీర్‌లోనూ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నాయి. కథువా, సాంబ జిల్లాలకు రెడ్ అలర్ట్‌ను జారీ చేశారు. మూడు రోజుల విరామం తర్వాత పంజ్‌తర్ని, శేషనాగ్ బేస్ క్యాంపుల నుంచి అమర్‌నాథ్ యాత్రను కొనసాగించారు.

రాజస్థాన్, పంజాబ్, హర్యానా రాష్ట్రాలలో భారీ వర్షాలతో లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో అధికారిక యంత్రాంగాలు రంగంలోకి దిగి సహాయక చర్యలను ప్రారంభించాయి. అయితే, ఈ భారీ వర్షాలకు మద్యధరా ప్రాంతంలో ఉద్భవించే తుఫానులు, రుతుపవనాలు పరస్పరం కలిసిపోవటం కారణంగానే వాయువ్య భారత్‌లో భారీ వర్షాలకు కారణమవుతున్నట్టు ఐఎండీ వెల్లడించింది.

హిమాచల్, ఉత్తరాఖండ్ సీఎంలతో మాట్లాడిన మోడీ

హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధమీ ప్రధాని మోడీ మాట్లాడారు. ఈ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు, అక్కడి పరిస్థితుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. భారత ప్రభుత్వం సహాయ, సహకారాలు అందిస్తుందని రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ప్రధాని హామీ ఇచ్చారు. ఈ రెండు రాష్ట్రాలు భారీ వర్షాలకు తీవ్రంగా ప్రభావితమైన విషయం విదితమే.

మణిపూర్‌లో మళ్లీ హింస

- పోలీసు మృతి, 10మందికి గాయాలు



ఇంఫాల్ : మణిపూర్‌లో తెగల మధ్య బిజెపి రగిల్చిన మత చిచ్చు రావణ కాష్టంలా రగులుతూనే ఉంది. తాజాగా వెస్ట్ కాంగ్‌పోక్పి జిల్లాలో చెలరేగిన హింసాకాండలో ఒక పోలీసు మృతి చెందగా, 10 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. సోమవారం ఉదయం జిల్లాలోని కంగ్‌చుప్ ప్రాంతంలోని కొన్ని గ్రామాలను, కొండలను లక్ష్యంగా చేసుకుని సాయుధ దుండగులు కాల్పులు జరిపారని అధికారులు తెలిపారు. ఈ కాల్పుల్లో ఒక పోలీసు కానిస్టేబుల్ మృతి చెందగా, 10 మందికి పైగా గాయపడ్డారు. రాష్ట్రంలో వేరువేరు ప్రాంతాల్లో సోమవారం హింసాకాండ చోటుచేసుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఓసీలుగా ఉన్న మెయితీలను ఎస్టీ కేటగిరీలో చేర్చుతూ మణిపూర్ ప్రభుత్వం తీసుకున్న చర్యపై మైనార్టీలుగా ఉన్న కుకి తెగ ఆందోళనకు దిగింది. మెయితీలు హిందువులు కావడం, కుకీలలో క్రైస్తవులు ఎక్కువగా ఉండడంతో బిజెపి ప్రభుత్వం మైనార్టీలపైకి మెజార్టీలను ఉసిగొల్పి రాజకీయ లబ్ధి పొందేందుకు ఈ ఎత్తుగడ వేసింది. ఆ విధంగా మే 3న ప్రారంభమైన ఈ హింసాకాండ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఈ హింసాకాండలో ఇప్పటి వరకూ 150 మంది మరణించారు. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వీరంతా సహాయక శిబిరాల్లోను, కొండలపైన తలదాచుకుంటున్నారు.

శాంతిభద్రతల బాధ్యత ప్రభుత్వానిదే..: సుప్రీం

మణిపూర్‌లో శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత అక్కడి ప్రభుత్వానిదేనని సుప్రీంకోర్టు సోమవారం స్పష్టం చేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతల బాధ్యతను తాము అమలు చేయలేమని సిజెఐ డివై చంద్రచూడ్, జస్టిస్ పిఎస్ నరసింహలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. నిత్యావసర వస్తువుల రవాణాకు కీలకమైన మణిపూర్ జాతీయ రహదారిని స్థానికులు దిగ్బంధం చేయకుండా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలి వ్వాలని మణిపూర్ హైకోర్టు బార్ అసోసియేషన్ దాఖలు చేసిన పిటిషన్ విచారణలో సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. అసోసియేషన్ విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు విజ్ఞప్తి చేసింది. పోలీస్ స్టేషన్ల నుంచి ఆయుధాలు స్వాధీనం చేసుకోవడంపై స్టేటస్ రిపోర్టు దాఖలు చేయాలని మణిపూర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ధర్మాసనం ఆదేశించింది. ఈ కేసు తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

దొరలపాలనకు చరమగీతం పాడాలి

- కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం.. : మాజీ మంత్రి కుందూరు జనారెడ్డి



నవతెలంగాణ-పెద్దవూర

రాష్ట్రంలో దొరల పాలన ఇంకా కొనసాగుతుందని, దానికి చరమగీతం పాడాలని, ప్రతి కార్యకర్తనూ కంటికి రెప్పలా కాపాడుకుంటానని మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి అన్నారు. కాంగ్రెస్ గిరిజన చైతన్య పాదయాత్ర ముగింపు సందర్భంగా సోమవారం నల్లగొండ జిల్లా పెద్దవూర మండలం చింతపల్లి గ్రామంలో జరిగిన సభలో మాట్లాడారు. సాగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదన్నారు. అభివృద్ధిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దళితులకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయక మాయమాటలతో సీఎం ప్రజలను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సాగర్ నియోజకవర్గంలో 2 లక్షల ఎకరాలకు సాగునీరందించిన ఘనత జానారెడ్డికే దక్కిందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకొస్తే మహిళలకు రూ.500 గ్యాస్, రైతులకు రూ.2 లక్షలు ఏకకాలంలో రుణమాఫీ, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తామని చెప్పారు. రాష్ట్ర యువజన నాయకులు జయవీర్ మాట్లాడుతూ.. గిరిజన చైతన్య కాంగ్రెస్ పాదయాత్రకు సహకరించిన యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, పార్టీ కార్యకర్తలకు పాదాభివందనాలు చేస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలో 24 రోజులు 109 తండాల్లో 220 కిలోమీటర్లు పాదయాత్ర చేసి.. గతంలో కాంగ్రెస్ చేసినా అభివృద్ధి పనులను ప్రజలకు వివరించామన్నారు. ప్రజల నుంచి తమకు వస్తున్న ప్రేమ, ఆప్యాయత, అనురాగాలకు కాంగ్రెస్ గ్రాఫ్ ఒక్కసారిగా పెరిగిపోయిందని తెలిపారు. అనంతరం అధికార పార్టీ నుంచి ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షులు, ఎమ్మెల్సీ అనుచరులు పుట్లూరి రాజశేఖర్‌రెడ్డి, ఉమ్మడి తుంగతుర్తి ఎంపీటీసీ జ్యోతి కృష్ణ 200 మంది అనుచరులతో సొంత గూటికి చేరుకున్నారు. వారికి జానారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కుందూరు రఘువీర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ వైస్‌చైర్మెన్ కర్నాటి లింగారెడ్డి, డీసీసీ అధ్యక్షులు శంకర్‌నాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, నిడమానూరు జెడ్పీటీసీ రామేశ్వరి మట్టారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్ హామీని అమలు చేయమంటే అరెస్టులా!

- 'జగనన్నకు చెబుదాం'లో వినతిపత్రాలిచ్చే స్వేచ్ఛ లేదా?
- మంగళగిరి, తాడేపల్లి, దుగ్గిరాల స్టేషన్లకు ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు
- సమస్య పరిష్కారానికి సిఎంతో మాట్లాడుతా : సజ్జల



అమరావతి : 'జగనన్నకు చెబుదాం' ప్రోగ్రామ్‌లో భాగంగా ముఖ్యమంత్రి కార్యాలయంలో తమ సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు ఇచ్చేందుకు 26 జిల్లాల నుంచి తాడేపల్లికి వచ్చిన నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్ఎం) ఉద్యోగులను సోమవారం పోలీసులు ఎక్కడికక్కడే అరెస్టు చేశారు. యూనియన్ నేతలను, జిల్లాల్లో యాక్టివ్‌గా ఉన్న సభ్యులను ఆదివారం రాత్రి గృహ నిర్బంధం చేశారు. ముందస్తు గృహ నిర్బంధాలకు గురైన వారిలో ఏపి నేషనల్ హెల్త్‌మిషన్ జెఎసి గౌరవాధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు కూడా ఉన్నారు. పోలీసుల నిర్బంధాలను దాటుకుని తాడేపల్లికి వచ్చిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను సిఎం ఇంటికి వెళ్లే దారిలోని పెట్రోల్ బంకు వద్దకు వచ్చిన వారిని వచ్చినట్లే పోలీసులు వాహనాల్లో తరలించారు. తమ న్యాయమైన సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు సుదూర ప్రాంతాల నుంచి వస్తే కనీసం వినతిపత్రం ఇచ్చే స్వేచ్ఛ కూడా లేదా? అంటూ మహిళా ఉద్యోగులు పోలీసులను ప్రశ్నించారు. అరెస్టు చేసిన ఉద్యోగులను తాడేపల్లిలోని శుభమస్తు కళ్యాణ మండపంలో నిర్బంధించడంతో మహిళా ఉద్యోగులు తమను మండపంలో ఉంచాల్సిన అవసరమేంటి? ఏమి తప్పు చేశాం? తాము ఉద్యోగులమేనని, హక్కుల సాధనకు వస్తే ఇలా వ్యవహరించడమేంటని పోలీసులను ప్రశ్నించారు. సుమారు 200కు పైగా ఉద్యోగులను తాడేపల్లి, మంగళగిరి, దుగ్గిరాల పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఉద్యోగుల ఆందోళనతో పోలీసులు ఐదుగురు ప్రతినిధుల బృందాన్ని వినతిపత్రం ఇచ్చేందుకు తమ వాహనంలో తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఏపి నేషనల్ హెల్త్ మిషన్ జెఎసి కోశాధికారి జె సింహాచలం, శ్రీకాకుళం జిల్లా చైర్మన్ ఎం మహేశ్వరరావు, కోశాధికారి గణేష్, స్టాఫ్‌నర్స్ శిరీష, సెక్రటరీ ఆదిలక్ష్మిని సిఎంఒకు తీసుకెళ్లారు. వినతిపత్రం ఇచ్చిన అనంతరం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వద్దకు పోలీసులు తీసుకెళ్లారు. ఎన్ఎహెచ్ఎం ఉద్యోగులు వినతిపత్రం అందజేశారు. వారి సమస్యలను సిఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఎన్‌హెచ్ఎం జెఎసి నేతలు తెలిపారు.

అనంతరం ఎన్‌హెచ్ఎం ఉద్యోగులు మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఎన్నికల హామీ ప్రకారం తమను రెగ్యులరైజ్ చేయాలని, ఉద్యోగులకు మినిమం టైమ్ స్కేల్, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, సమాన పనికి సమాన వేతనం, అధికారులు హామీ ప్రకారం జిఓ నెంబరు 60ను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగుల అక్రమ అరెస్టులపై సిఐటియు ఖండన

ఇచ్చిన హామీ ప్రకారం రెగ్యులరైజ్ చేయాలని, జిఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, జగనన్నకు చెబుదాంలో వినతిపత్రాలు ఇచ్చేందుకు వచ్చిన ఎన్‌హెచ్ఎం ఉద్యోగులను అరెస్టు చేయడాన్ని సిఐటియు ఖండించింది. 24 గంటల ముందు నుంచే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులను నిర్బంధించడం, నాయకులను గృహ నిర్బాంధానికి గురి చేయడం వంటి అప్రజాస్వామిక చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం పాల్పడటం సరికాదని, ఎన్‌హెచ్ఎం కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

పవన్‌కల్యాణ్‌కు మహిళా కమిషన్ నోటీసులు



అమరావతి:రాష్ట్రంలో 30 వేలమంది మహిళలు మాయమయ్యారని, అందుకు వలంటీర్లే కారణమంటూ చేసిన వ్యాఖ్యలపై పది రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ జనసేన అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌కు రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ సోమవారం నోటీసులు జారీ చేశారు. మహిళల భద్రతపై భీతిగొలిపే విధంగానూ, ఒంటరి మహిళల గౌరవానికి భంగం కలిగించే విధంగానూ మీ వ్యాఖ్యలు ఉన్నాయని మహిళా కమిషన్ నోటీసులో పేర్కొంది. 'ఎంతమంది ఒంటరి మహిళలను వలంటీర్లు సంఘ విద్రోహ శక్తులకు అప్పగించారని కేంద్రం మీకు చెప్పింది? ఇందుకు సంబంధించిన ఆధారాలు మీకు చూపారా? లేక నిరాధార ఆరోపణలతో మహిళలను భయభ్రాంతులకు గురిచేసే మాటలతో రాజకీయం చేసేందుకు మాట్లాడారా?' అని ప్రశ్నించింది. 'మీరు వ్యాఖ్యానించిన విధంగా మహిళల అదృశ్య లెక్కలు, ఆధారాలను 10 రోజుల్లోగా మహిళా కమిషన్‌కు మీరు కానీ, మీ ప్రతినిధి ద్వారా కానీ తెలియజేయాలి' అని పేర్కొంది.

తుంగతుర్తిలో మంత్రి, ఎమ్మెల్యే అవినీతిలో పోటీ పడుతుండ్రు

- ఇసుక ఆపకుంటే..రైతులతో కలిసి లారీలు తగలబెడతాం: భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



నవతెలంగాణ-మోత్కూర్

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గంలో మంత్రి, ఎమ్మెల్యే కనుసన్నల్లో నడుస్తున్న ఇసుక మాఫియాను ఆపకుంటే రైతులతో కలిసి లారీలు తగలబెడతాం.. పోరాడి జాతీయ రహదారిని మంజూరు చేయించింది ఇసుక మాఫియా కోసమా.. అవినీతిలో మూడడుగుల మంత్రి, ఎమ్మెల్యే పోటీ పడుతున్నరు.." అని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. రూ.2200 కోట్లతో మంజూరు చేయించిన హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు గౌరెల్లి టు భద్రాద్రి కొత్తగూడెం ఎన్‌హెచ్ 930పీ జాతీయ రహదారి పనులను సోమవారం యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూర్ మండలం పాటిమట్ల ఎక్స్ రోడ్ వద్ద కోమటిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా యాదాద్రి కలెక్టర్ పమేలా సత్పతితో ఫోన్లో మాట్లాడి ఇసుక అక్రమ రవాణాను వెంటనే నిలిపి వేయించాలని, ఈ ప్రాంత అభివృద్ధి కోసం తాను ప్రధాని, కేంద్ర మంత్రులతో మాట్లాడి రూ.2200 కోట్లతో జాతీయ రహదారి మంజూరు చేయించింది ఇసుక మాఫియా కోసమా అని ప్రశ్నించారు. బిక్కేరు, మూసీ నుంచి ఇసుక అక్రమ రవాణాను ఆపకుంటే కలెక్టరేట్ ముందు ధర్నా చేస్తానని హెచ్చరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈ ప్రాంత ఎంపీగా రహదారుల అభివృద్ధితోనే పరిశ్రమలు వచ్చి గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతాయన్న లక్ష్యంతో పార్లమెంట్‌లో ఎన్నోసార్లు మాట్లాడానని, ప్రధాని, కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని పలుమార్లు కలిసి విన్నవించగా జాతీయ రహదారి మంజూరు చేశారని చెప్పారు. మొదటి ఫేజ్‌లో యాదాద్రి జిల్లా వలిగొండ నుంచి సూర్యాపేట జిల్లా తిరుమలగిరి వరకు పనులు జరుగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ -విజయవాడ రహదారిని ఆరు లైన్లుగా మంజూరు చేయించానన్నారు. గల్లీ తప్పితే ఢిల్లీ తెలియని మూడడుగుల మంత్రి జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యే గాదరి కిషోర్ తామే జాతీయ రహదారిని మంజూరు చేయించామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి జగదీశ్ రెడ్డి అక్రమ సంపాదనతో తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ పోటీ పడుతున్నారన్నారు.పనికిరాని మంత్రి, ఎమ్మెల్యే, నాలుగు పార్టీలు మారిన గుత్తా సుఖేందర్ రెడ్డి బయటకు వస్తే 12 కార్లు వెంటేసుకుని తిరుగుతున్నారని, గాలిలో వచ్చినోళ్లు గాలిలోనే పోతారన్నారు. అక్రమాలు ఆగాలన్నా, తెలంగాణ లూటీ ఆగాలన్నా రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని కోరారు. రానున్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఎవరున్నా మొదటి సంతకం రూ.4 వేల పెన్షన్ ఫైనే పెడతామన్నారు. ఈ నెల 20న కొల్లాపూర్‌లో ప్రియాంకగాంధీ సభ జరగనుందని, ఆ సభలో బీసీ డిక్లరేషన్ ప్రకటించబోతున్నట్టు తెలిపారు.

రెండు తరాల జర్నలిస్టుల మధ్య పోటీ పెట్టడం తగదు?

జేఎన్‌జే స్థలాలపై సుప్రీం తీర్పు సుధీర్ఘకాలం అమలు కాకపోవటం ఆశ్చర్యం : ఆంధ్రజ్యోతి ఎడిటర్ శ్రీనివాస్

- వేయి మంది జర్నలిస్టుల అంశాన్ని అయిదు వేల మందితో ఎందుకు ముడి పెడుతుంది?
- సంఘీభావం తోడుగా ముందుకు సాగాలి : పాశం యాదగిరి.
- జేఎన్‌జేకు 70 ఎకరాలు ఇస్తూనే మిగిలిన జర్నలిస్టులకు స్థలాలు ఇవ్వాలి : ఆర్టీఏ మాజీ కమిషనర్, దిలీప్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జెఎన్‌జె హౌజింగ్ సొసైటీ స్థలాల విషయంలో రెండు తరాల జర్నలిస్టుల మధ్య పోటీ పెట్టడం తగదని ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్ అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు వచ్చి పదినెలలు పూర్తయినా ఈ స్థలాలు స్వాధీనం చేయడంలో ప్రభుత్వం చేస్తున్న జాప్యం పట్ల సభ్యులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. స్థలాల స్వాధీనం కోసం అన్ని రాజకీయ పక్షాలను సమన్వయం చేసుకుని, ఉద్యమ కార్యాచరణతో ముందుకు వెళ్ళాలని జెఎన్‌జె సభ్యులకు సూచించారు.

సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జేఎన్‌జే సొసైటీ వ్యవస్థాపక సభ్యులు పీవీ రమణరావు అధ్యక్షతన జవహర్‌లాల్ నెహ్రూ జర్నలిస్ట్స్ మ్యాక్ హౌజింగ్ సొసైటీ(జేఎన్‌జే మ్యాక్ హెచ్ఎస్) మీడియా సంపాదకులు, ముఖ్యులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో శ్రీనివాస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తుది తీర్పు అమలు విషయంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదని చెప్పారు. సుప్రీం తీర్పును అమలు చేయకుండా కాలయాపన చేయడం ద్వారా ప్రభుత్వమే కోర్టు ధిక్కరణ పిటీషన్ వేసేందుకు అవకాశం ఇచ్చిందని చెప్పారు. ఆగస్టులోగా తుది నిర్ణయం తీసుకోవాల్సి వస్తుందని చెప్పారు. ఈలోగా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో చర్చించి వారి మద్దతు తీసుకోవాలనీ, దీని వలన ప్రభుత్వంపై ఒత్తిడి కల్పించేందుకు వీలవుతుందని సూచించారు. జేఎన్‌జే సొసైటీ మేనేజింగ్ కమిటీ ప్రభుత్వానికి చేరువగా ఉన్నా ఏమాత్రం సభ్యులకు ఉపయోగ పడకపోవడం విచారకరమన్నారు. పేట్ బషీరాబాద్ స్థలం విషయంలో జాప్యం ఎందుకు జరుగుతుందో చర్చించాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. . జేఎన్‌జేకి చెందిన 1,100 మందితో మిగతా 5 వేల మంది సభ్యుల స్థలాలతో పోటీపెట్టడం భావ్యం కాదని అన్నారు. గతంలో ప్రెస్ అకాడమీ చైర్మెన్ అల్లం నారాయణ నిర్వహించిన సమావేశంలో సైతం జెఎన్‌జె సొసైటీ స్థలాలు మరొకరితో ముడిపెట్టడం తగదనీ, వారి స్థలాలు వారికే ఇవ్వాలని సూచించిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. అయితే, ప్రభుత్వం సొసైటీ సభ్యులు ఇచ్చిన వినతి ప్రతాలకు సమాధానం చెప్పాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల సమస్య జఠిలంగా మారిందని వివరించారు.

ఇదే సరైన సమయం: దిలీప్ రెడ్డి

ఎన్నికల సమయంలోనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి స్థలాలు సాధించుకోవాలని ఆర్టీఏ మాజీ కమిషనర్ దిలీప్ రెడ్డి పిలుపునిచ్చారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలోనే పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించేందుకు చర్యలు చేపడతాయనీ, ఇందులో భాగంగానే ఈ జర్నలిస్టుల ఇండ్ల స్థలాల సమస్య కూడా పరిష్కారమవుతుందని చెప్పారు. ఇప్పటి వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మూడు దఫాలుగా ఇండ్ల స్థలాలు ఇచ్చిన చరిత్ర ఉందని, ప్రస్తుతం జెఎన్‌జె సొసైటీకి సంబంధించి స్థలాల అప్పగింత అంశం సుదీర్ఘంగా కొనసాగుతూనే ఉండడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తలచుకుంటే కోర్టు కేసులను కాదని ఇచ్చే అవకాశంకూడా ఉందని, కానీ ఇక్కడ ఆ పరిస్థితి లేదని దిలీప్‌రెడ్డి స్పష్టం చేశారు.

జీవన్మరణ సమస్య: మిట్టపల్లి శ్రీనివాస్

మన తెలంగాణ ఎడిటోరియల్ డైరెక్టర్ మిట్టపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిస్టుల స్థలాల సమస్య జీవన్మరణ సమస్యగా గుర్తించి ప్రభుత్వం స్పందించాలని కోరారు. తప్పనిసరి పరిస్థితుల్లో జర్నలిస్టులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచే విధంగా కార్యక్రమాలు చేపడుతున్నారనీ, దీనిని తప్పుగా భావించకుండా స్థలాలను స్వాధీనం చేయాలని కోరారు. పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాల స్థలాన్ని వెంటనే సొసైటీకి స్వాధీనపర్చాలని డిమాండ్ చేశారు. ఈ స్థలాల స్వాధీనం కోసం అవసరమైతే నిరాహార దీక్షలు నిర్విరామంగా కొనసాగించాలని సూచించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో, గాంధేయ విధానంలో ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని సూచించారు.

జర్నలిస్టులకు స్థలాల విషయంలో ఏకాభిప్రాయం వున్నదని సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి స్పష్టం చేశారు. స్థలాల కోసం జర్నస్టులంతా సామ, ధాన, భేద దండోపాయాలను అనుసరించాల్సిందేనని ఆయన సూచించారు. ఎన్నికల ప్రకటన వెలువడేలోగా ఇండ్ల స్థలాల సాధన ఉద్యమం తీవ్రతరం చేయాలని సూచించారు. సోషల్ మీడియాను ఉపయోగించుకుని మరింత చైతన్యంగా పోరాటం చేయాలనీ, అందరి సంఘీభావమే పునాదిగా ఏర్పరచుకుని, ముందుకు సాగాలని యాదగిరి సూచించారు. కలాలను పాశుపతాస్త్రాలుగా సంధించి స్థలాలు సాధించాలని పిలుపునిచ్చారు. జేఎన్‌జే సొసైటీ మేనేజింగ్ కమిటీ సరిగ్గా పనిచేయకపోవడం వల్లే ఈ దారుణమైన పరిస్థితి ఏర్పడిందని టివి9 అసైన్‌మెంట్ ఎడిటర్ జగన్మోహనరెడ్డి అన్నారు. సభ్యులే టీమ్ జేఎన్‌జేగా ఏర్పడి పోరాటం చేయడంపట్ల ఆయన అభినందనలు తెలిపారు.

జర్నలిస్ట్ ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి జి.అంజనేయులు మాట్లాడుతూ హైదరాబాద్ జర్నలిస్టులు ఏం పాపం చేశారనీ, వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చే విషయంలో ప్రభుత్వం ఎందుకు ఆలస్యం చేస్తున్నదో అర్థం కావడం లేదని తెలిపారు. జేఎన్‌జే సభ్యుల పోరాటం వల్ల ఇండ్ల స్థలాలు సాధించడం ద్వారా సానుకూల పరిస్థితులు ఏర్పడగలవని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ జర్నలిస్టు మ్యాడం మధు మాట్లాడుతూ జేఎన్‌జే సభ్యుల లక్ష్యం ఒక్కటేనని, ఇందులో ఎటువంటి విభేదాలు లేవన్నారు. ఎంతో మంది సభ్యులు చనిపోయారనీ, వారి ఆత్మలు స్థలాల కోసం ఘోషిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు రూ.2 లక్షల విలువైన స్థలాలు నేడు రూ.2 కోట్ల రూపాయలని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు క్షీరాభిషేకం చేసిన సభ్యుల కండ్లలో నేడు రక్తం కన్పిస్తోందన్నారు. 70 ఎకరాల స్థలం మనదేనని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన తీర్పు తర్వాత కూడా ఎందుకు జాప్యం జరుగుతోందని మెట్రో దినపత్రిక సంపాదకులు దేవరకొండ కాళిదాస్ ఆవేదన వ్యక్తం చేసారు.

అధ్యక్షత వహించిన జెఎన్‌జే ఫౌండర్ మెంబర్ పీవీ రమణరావు మాట్లాడుతూ ప్రతి సభ్యునికి స్థలాలు వచ్చేలాగా మా పోరాటం ఉంటుందని స్పష్టం చేసారు. యూ.ఎన్.ఐ. బ్యూరో ఛీఫ్ నాగేశ్వరరావు, బీసీ టైమ్స్ సంపాదకులు సూర్యారావు, సీనియర్ జర్నలిస్టులు ఆకుల అమరయ్య, మాలకొండయ్య, సుందర్‌శర్మ, కేపీఎస్ సుబ్రమణ్యం తదితరులు మాట్లాడారు. రౌండ్‌టేబుల్ సమావేశంలో పాల్గొన్న సంపాదకుల సంతకాలతో కూడిన వినతి పత్రం ముఖ్యమంత్రి కె. చంద్రశేఖరరావుకు అందజేస్తామన్నారు. ఈ సమావేశం సుప్రీంకోర్టు తీర్పు మేరకు పేట్ బషీరాబాద్‌లోని 38 ఎకరాల స్థలాన్ని తక్షణమే జెఎన్‌జె సొసైటీకి అప్పగించాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానం చేసింది. అలాగే పేట్ బషీరాబాద్ స్థలం స్వాధీనం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు ఆందోళన కార్యక్రమాల షెడ్యూల్‌ను సిద్ధం చేసింది. ఈ కార్యక్రమంలో వివిధ మీడియా సంస్థలకు చెందిన సంపాదకులు, జెఎన్‌జె సభ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలి

- ఉపాధి హామీలో వికలాంగులకు 200 రోజులు పని ఇవ్వాలి
- ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణను ఆపాలి
- వికలాంగుల పెన్షన్ రూ.5 వేలకు పెంచాలి : జంతర్ మంతర్ వద్ద ఎన్‌పీఆర్‌డీ భారీ ధర్నా
- జోరువానలో గళమెత్తిన వికలాంగులు



నవతెలంగాణ..న్యూఢిల్లీ బ్యూరో

వికలాంగులకు సామాజిక భద్రత కల్పించాలని దేశవ్యాప్త ఉద్యమాలు ఉధృతం చేస్తామని ఎన్‌పీఆర్‌డీ జాతీయ ప్రధాన కార్యదర్శి వి.మురళీధరన్ పేర్కొన్నారు. వికలాంగుల పెన్షన్‌లను పెంచడానికి, ఇతర సామాజిక భద్రతా చర్యలను అందించడానికి కేంద్ర ప్రభుత్వం నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) ఆధ్వర్యంలో సోమవారం నాడిక్కడ స్థానిక జంతర్ మంతర్‌లో భారీ ధర్నా జరిగింది. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వేలాది మంది వికలాంగులు జోరు వర్షంలో సమస్యలపై గళమెత్తారు. మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. ఈ ధర్నాకు సీపీఐ(ఎం)ఎంపీ నేత హన్నన్ మొల్లా, డీఎంకే నేత కనిమొళి, కాంగ్రెస్ నేత అజయ్ మాకెన్‌లు సంఘీభావం తెలిపారు. "పెన్షన్ రూ.5 వేలకు పెంచాలి. 40 శాతం వైకల్యం కలిగిన వికలాంగులందరికీ పెన్షన్ ఇవ్వాలి. పెన్షన్‌కు ఆధార్ లింక్ తీసివేయాలి. వికలాంగులందరికీ ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇవ్వాలి. వేతనం రూ.600కు పెంచాలి. ఎన్ఎంఎంఎస్ యాప్‌ను రద్దు చేయాలి. కేటాయింపులు, పని చేసేవారి సంఖ్య పెంచాలి. 200 రోజులు పని కల్పించాలి. రైల్వే రాయితీ విస్తరించాలి. రైల్వే ప్రయివేటీకరణ ఆపాలి. వికలాంగులకు అంత్యోదయ అన్న యోజన కార్డులు అందించాలి. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ఆపాలి" అని డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా ఎన్‌పీఆర్‌డీ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గిరీష్ కీర్తి, వి. మురళీధరన్ మాట్లాడుతూ వికలాంగులకు సామాజిక భద్రత కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. 2011 జనాభా లెక్కల ప్రకారం గుర్తించబడిన వికలాంగుల జనాభాలో కేవలం 3.8 శాతం మంది మాత్రమే పెన్షన్ అందుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో 2016 ఆర్‌పిడి చట్టం సెక్షన్ 24 ప్రకారం 25 శాతం అదనంగా చెల్లించాలని డిమాండ్ చేశారు. వికలాంగుల సహాయకులకు ప్రత్యేక అలవెన్స్ చెల్లించాలన్నారు. ప్రభుత్వ పథకాలు పొందాలంటే ఆధార్ కార్డు ఉండాలనే నిర్ణయాన్ని రద్దు చేయాలన్నారు. వికలాంగులకు ఆహార భద్రత కల్పించాల్సిన జాతీయ ఆహార భద్రత చట్టాన్ని ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం 23,73,336 మంది వికలాంగులకే జాబ్ కార్డులు జారీ చేశారని, అయితే ఎన్ని రోజులు పని కల్పించారో ప్రభుత్వం వద్ద లెక్కలు లేవని అన్నారు. 21 రకాల వైకల్యాలు కలిగిన వికలాంగులకు జాబ్ కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. 70శాతం మంది వికలాంగులు గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారని, వారందరికీ పని కల్పించే బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని అన్నారు. మోడీ సర్కార్ అమలు చేస్తున్న పథకాలు లబ్ది పొందాలంటే ఆధార్ కార్డ్ తప్పని సరిగా ఉండాలన్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. దేశంలో 2,68,14, 994 మంది వికలాంగులు ఉంటే, 2022 జనవరి నాటికి కేవలం 1,74,25,905 మందికే వైకల్య ధ్రువీకరణ పత్రాలు జారీ చేశారని పేర్కొన్నారు. వీరిలో 67,09,894 మందికే ఆధార్ కార్డులు జారీ చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, నేషనల్ ట్రస్ట్, ఆటిజం చట్టం, మెంటల్ హెల్త్ కేర్ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యా ఉద్యోగాల్లో సమాన అవకాశాలు కల్పించాలని కోరారు. హక్కుల పరిరక్షణ కోసం దేశవ్యాప్త ఉద్యమాలు ఉధృతం చేయాలని పిలుపు ఇచ్చారు. ప్రభుత్వం వికలాంగుల సమస్యలు పరిష్కారం చేయకుంటే 2024 పార్లమెంట్ ఎన్నికలో మోడీని ఇంటికి పంపుతామని హెచ్చరించారు.

చర్చలకు కేంద్రం ఆహ్వానం

వికలాంగుల సమస్యపై జంతర్ మంతర్ వద్ద జరుగుతున్న మహాధర్నా ప్రతినిధి బృందాన్ని కేంద్ర వికలాంగుల సాధికారత సంక్షేమ శాఖ కార్యదర్శి రాజేష్ అగర్వాల్ చర్చలకు ఆహ్వానించారు. ప్రతినిధి బృందం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేసింది. ఈ ధర్నాలో ఉపాధ్యక్షులు ఎం. అడివయ్య, ఝూన్సీరాణి, అనిర్బన్ ముఖర్జీ, సహాయ కార్యదర్శి కైరెల్లి తదితరులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కె. వెంకట్, రాష్ట్ర కోశాధికారి ఆర్. వెంకటేష్, కార్యవర్గ సభ్యులు జర్కోని రాజు, మధుబాబు, బలీశ్వర్, కషాప్ప, దశరథ్, ఆరిఫా, యశోద, ఉపేందర్ లతో పాటు వివిధ రాష్ట్రాల నాయకులు కార్యకర్తలు, వికలాంగులు పాల్గొన్నారు.

బిజినెస్

అదాని గ్రూపునపై సుప్రీంకు నివేదిక

- 41 పేజీలతో అందించిన సెబీ నేడు విచారణ..!



న్యూఢిల్లీ : అదాని గ్రూపు కంపెనీలు తీవ్ర ఆర్థిక అవకతవకలకు పాల్పడుతున్నాయనే హిండెన్‌బర్గ్ రిపోర్ట్‌తో ఇన్వెస్టర్లు లక్షలాది కోట్లు సొమ్ము నష్టపోయారు. దీనిపై విచారణ జరపాలని.. మదుపర్ల రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో స్పష్టం చేయాలని సెబీని సుప్రీంకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే. దీనిపై సెబీ తాజాగా 41 పేజీలతో కూడిన నివేదికను సోమవారం సుప్రీంకోర్టుకు అందజేసింది. 2019లో పారదర్శకత నిర్మాణ నిబంధనలను రద్దు చేయడం వల్ల అదాని గ్రూపు కంపెనీల్లో ఆర్థిక ఆసక్తులు కలిగిన వారిని గుర్తించడంలో సవాళ్లు నెలకొన్నాయని సెబీ తన రిపోర్ట్‌లో పేర్కొంది. అదే విధంగా 2019 నిబంధనల మార్పును సమర్థించింది. "2014-2019 మధ్య కాలంలో విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్‌పిఐ)లపై పరిమితులు తగ్గించబడ్డాయి. ప్రయోజనకరమైన యజమానులను నిర్ణయించడానికి ప్రాథమికంగా సమస్య తలెత్తింది. ఏదైనా ఆర్థిక ఆసక్తిని కలిగి ఉన్న ప్రతీ చివరి వ్యక్తి వివరాలను బహిర్గతం చేయాల్సిన అవసరం లేదు." అని సెబీ అఫిడవిట్‌లో తెలిపింది. మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పిఎంఎల్‌ఎ) నిబంధనలకు సంబంధించి ఎఫ్‌పిఐ సంస్థలు ఆర్థిక ఆసక్తి ఉన్న సంస్థలు అధికార ఏజెన్సీల పరిధిలో ఉన్నాయని గమనించినట్లు రెగ్యులేటర్ తెలిపింది. కానీ స్పష్టమైన నియంత్రణ లేదని సెబీ పేర్కొంది. దీనిపై జులై 11న (నేడు) సుప్రీంకోర్టు విచారించే అవకాశం ఉంది.

ఫోర్బ్స్ మహిళ సంపన్నుల్లో నలుగురు ఇండో అమెరికన్లు



న్యూఢిల్లీ : ఫోర్బ్స్ సంపన్న మహిళల జాబితా-2023లో నలుగురు భారతీయ-అమెరికన్ వనితలకు చోటు దక్కింది. ఈ జాబితాలో జయశ్రీ ఉల్లాల్, నీర్జా సేథి, నేహా నార్ఖేడే, ఇంద్ర నూయి ఉన్నారు. అమెరికాలో అత్యంత విజయవంతమైన, సగటు సంపద 124 బిలియన్ డాలర్లు కలిగిన వంద మంది మహిళా వ్యాపారవేత్తలు, ఎగ్జిక్యూటివ్‌ల సరసనన వీరు నిలిచారు. వీరి సంపద గత ఏడాది కంటే 12 శాతం పెరిగింది. టెక్ దిగ్గజం సిస్కో మాజీ నిపుణురాలు జయశ్రీ ఉల్లాల్ 2.2 బిలియన్ డాలర్ల సంపదతో 15వ స్థానంలో నిలిచారు. సింటెల్ సహ వ్యవస్థాపకురాలు నీర్జా సేథి 990 మిలియన్ డాలర్ల సంపదతో 25వ స్థానంలో ఉన్నారు. ఇన్‌ఫ్లూయెంట్ ఫౌండర్ నేహా నార్ఖడే 520 మిలియన్ డాలర్లతో నికర ఆస్తులతో 50వ స్థానంలో నిలిచారు. పెప్సికో మాజీ ఛైర్మన్, సిఇఒ ఇంద్రా నూయి 350 మిలియన్ డాలర్ల సంపదతో 77వ స్థానంలో ఉన్నారు.

వేదాంతకు ఫాక్స్‌కాన్ గుడ్‌బై

న్యూఢిల్లీ : భారత్‌లో చిప్‌ల తయారీకి వేదాంతతో కుదుర్చుకున్న ఒప్పందానికి ఫాక్స్‌కాన్ గుడ్‌బై చెప్పింది. సెమీ కండక్టర్ ప్లాంట్ ఏర్పాటు, తయారీకి సంబంధించిన సంయుక్త భాగస్వామ్యం నుంచి వైదొలుగుతున్నట్లు ఫాక్స్‌కాన్ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఆ ప్లాంట్‌తో భవిష్యత్తులో తమకు ఎలాంటి సంబంధమూ ఉండబోదని స్పష్టం చేసింది. సెమీ కండక్టర్ల ప్లాంట్ ఇక పూర్తి బాధ్యత వేదాంతదేనని తైవాన్‌కు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్స్ తయారీదారు ఫాక్స్‌కాన్ తెలిపింది. గుజరాత్‌లో రూ.1.5 లక్షల కోట్ల పెట్టుబడితో ఈ ప్లాంట్ ఏర్పాటుకు గతేడాది ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఫాక్స్‌కాన్ వైదొలిగినప్పటికీ.. ఇతర భాగస్వాములతో కలిసి ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్తామని వేదాంత తెలిపింది.

రూ.2వేల నోట్ల మార్పిడిలో కల్పించుకోలేం

- అత్యున్నత న్యాయస్థానం వెల్లడి



న్యూఢిల్లీ : ఎలాంటి గుర్తింపు పత్రం (ఐడీ ప్రూఫ్) లేకుండా రూ.2,000 నోట్ల మార్పిడి అంశంలో కల్పించుకోలేమని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. రిక్విజిషేన్ స్లిప్, ఐడీ ప్రూఫ్ లేకుండా రూ.2వేల నోట్ల మార్పిడిని అనుమతించాలన్న ఆర్బీఐ నిర్ణయాన్ని సవాలు చేస్తూ ఉపద్యాయ్ అనే వ్యక్తి పిటిషన్ దాఖలు చేయగా సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఎలాంటి చిరునామా, పత్రాలు లేకుండా రూ. 2,000 నోట్లను నేరస్తులు, ఉగ్రవాదులు మార్చుకుంటున్నారని ఉపధ్యాయ్ ఆరోపణ. తొలుత ఆయన అప్పీల్‌ను ఢిల్లీ హైకోర్టు కొట్టివేయగా.. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంను ఆశ్రయించగా అప్పీల్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు సోమవారం నిరాకరించింది. ఇది కార్యనిర్వాహక విధాన నిర్ణయమని న్యాయస్థానం పేర్కొంది.

నిరుపేద గుడిసె వాసులకు పట్టాలిచ్చి.. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఇవ్వాలి

- ఇండ్ల నిర్మాణానికి కేంద్రం రూ.10లక్షలు, రాష్ట్రం రూ.5లక్షలు:

ఐద్వా జాతీయ ప్రధాన కార్యదర్శి మరియం ధావలే



నవతెలంగాణ-హసన్‌పర్తి / ఎన్‌జీవోస్ కాలనీ

ఇండ్లు లేని నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇచ్చి పక్క గృహాలు నిర్మించి ఇవ్వాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం ప్రధాన కార్యదర్శి మరియం ధావలే ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. హన్మకొండ జిల్లాలోని గోపాలపురం బంధం చెరువు చావల కేంద్రంలో పేదలు వేసుకున్న గుడిసెలను సందర్శించారు. అనంతరం జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ.. వివిధ రాష్ట్రాల్లో పేదలు అనుభవిస్తున్న పంట పొలాలు, ఇండ్ల స్థలాలను పాలకులు తిరిగి వాటిని లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. వాటికి వ్యతిరేకంగా అక్కడ పెద్ద ఉద్యమాలను నిర్వహిస్తున్నారన్నారు. తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు ఇవ్వకపోవడంతో పేదలు ఇండ్ల స్థలాల కోసం పోరాటం చేస్తున్నారని, వాటిని సాధించేంత వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం 2022 నాటికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన ద్వారా నిరుపేదలందరికీ ఇండ్లు ఇస్తామని చెప్పిన హామీ ఇప్పటికీ నెరవేరలేదని ఆరోపించారు. అలాగే, రాష్ట్రంలో పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కట్టిస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో ఇవ్వడంలో వైఫల్యం చెందారని విమర్శించారు. పేదల ఇంటి నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.10 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకం కింద రూ.5 లక్షలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ధరలు ఆకాశన్నంటుతున్నాయని, పేదలు ఆర్థికంగా ఇబ్బందులకు గురి అవుతున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను ఆదానీ, అంబానీలకు దోచుపెడుతుండగా, రాష్ట్రంలో కేసీఆర్.. రియల్ ఎస్టేట్ వ్యాపారులకు భూములు కట్టబెడుతున్నారని విమర్శించారు. ఢిల్లీలో జహంగీర్ పూర్‌లో నివాసం ఉంటున్న నిరుపేదల ఇండ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తుంటే ఐద్వా ఆధ్వర్యంలో అడ్డుకున్నామని, తమ ఇండ్లకు ఏ సమస్య వచ్చినా ఐద్వా ఉంటుందని వారికి భరోసా ఇచ్చారు. ఈ పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని దేశవ్యాప్తంగా పోరాటాలకు రూపకల్పన చేస్తామని హామీ ఇచ్చారు. ద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. 58 జీవో ప్రకారం పేదలు ఆక్రమించుకొని గుడిసెలు వేసుకున్న ప్రభుత్వ భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గుడిసెవాసుల పట్ల నిర్బంధాన్ని ఆపాలని, అక్రమ కేసులను ఎత్తివేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జాతీయ ఆఫీస్ కార్యదర్శి షబానా, రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, జిల్లా నాయకులు ఎల్.దీప, జయశ్రీ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మడి వెంకట్రాజమ్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పుల్లా అశోక్, డీవైఎఫ్ఐ నాయకులు మంద సుచందర్, వ్యకాస రాష్ట్ర కమిటీ సభ్యులు అంబాల స్వరూప, ప్రజాసంఘాల నాయకులు, పాల్గొన్నారు.

కేసీఆర్‌దే హ్యాట్రిక్ విజయం

- ప్రతిపక్షాల దింపుడు కళ్ళం ఆశల్ని ప్రజలు తిప్పికొడతారు: ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు
- అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో 1127 మందికి పోడు పట్టాల పంపిణీ
- పటాన్‌చెరులో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు



నవతెలంగాణ-జహీరాబాద్. పటాన్‌చెరు

ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా.. రాబోయే ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించడం పక్కా అని ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ప్రతిపక్షాల దింపుడు కళ్ళం ఆశల్ని ప్రజలు తిప్పికొడతారన్నారు. సోమవారం సంగారెడ్డి జిల్లాలో పర్యటించిన మంత్రి.. జహీరాబాద్-పస్తాపూర్‌లోని ఎస్వీ కన్వెన్షన్ హాల్‌లో అందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లోని 1127 మందికి 1808.07 ఎకరాలకు పోడు భూముల పట్టాలను అందజేశారు. అలాగే పటాన్‌చెరు డివిజన్ పరిధిలో రూ.3 కోట్ల 26 లక్షలతో నిర్మించిన ఫ్రీడమ్ పార్క్, 150 అడుగుల జాతీయ జెండా, రూ.2 కోట్ల 40 లక్షలతో నిర్మించిన ఆర్ అండ్ బీ గెస్ట్ హౌస్, రూ.ఒక కోటీ 50 లక్షలతో నిర్మించిన డీసీసీబీ బ్యాంకు నూతన భవనాలను స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశాల్లో మంత్రి మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా పోడుకు పట్టం గట్టి గిరిజనులను రాజులను చేయడంతో పాటు.. ఎస్టీలకు 10 శాతం రిజర్వేషన్‌లను కల్పించిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో 3,146 తాండాలను గ్రామ పంచాయతీలుగా చేశారన్నారు. 'మా తండాలో మా రాజ్యం' అన్న గిరిజనుల కలను నిజం చేశారన్నారు. ప్రముఖ సినీ నటుడు రజినికి తెలంగాణలో జరిగిన అభివృద్ధి అర్థమయింది కానీ, రాష్ట్రంలో ఉన్న కొంతమంది గజనీలకు అర్థం అవడం లేదని, కనిపిస్తలేదని ఎద్దేవా చేశారు. ప్రధాని నరేంద్ర మోడీ దక్షిణాది రాష్ట్రాలపై చిన్న చూపు చూడటంతో పాటు తెలంగాణకు రావాల్సిన కోచ్ ఫ్యాక్టరీని ఉత్తరాది రాష్ట్రాలకు తరలించి కేవలం రూ.6000 కోట్లతో వ్యాగన్ల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం వారి వివక్షతకు నిదర్శనమని విమర్శించారు. బీజేపీ దక్షిణాది రాష్ట్రాలకు ఏమైనా ఇచ్చింది అంటే కేవలం 'శిష్యప్రియులు శూన్య హస్తాలు మాత్రమే' అని అన్నారు. తమ పార్టీ పక్కన పెట్టిన నాయకులను ప్రతిపక్ష పార్టీలు చేర్చుకుంటూ అధ్యక్షులుగా పట్టం కట్టాయని విమర్శించారు. ఆల్ఫాబెటికల్‌గా చివరలో ఉన్న జహీరాబాద్(ఇంగ్లీషులో జెడ్)ను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతానన్నారు. ఇక్కడ ఇప్పటికే చాలా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని, రహదార్లు, రైల్వేలు, సబ్ స్టేషన్లు, చెక్‌డ్యామ్‌లు, ఆస్పత్రులు, రైల్వే ఓవర్ బ్రిడ్జీలు నిర్మించామన్నారు. ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త ఢిల్లీ వసంత్ బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మంత్రి హరీశ్‌రావు కండువా కప్పి ఆయన్ను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాగా టీపీసీసీ నాయకులు వై.నరోత్తం ఇటీవలే సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారని, ఇప్పుడు ఢిల్లీ వసంత్ కూడా చేరడంతో ఇతర పార్టీలకు అభ్యర్థులే కరువయ్యారన్నారు. కార్యక్రమాల్లో ఎంపీ బీబీ పాటిల్, ఫైనాన్స్ కమిషన్ చైర్మెన్ భూపాల్ రెడ్డి, జిల్లా కలెక్టర్ శరత్, జిల్లా ఎస్పీ రమణ కుమార్, అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఎమ్మెల్యేలు మహిపాల్‌రెడ్డి, మాణిక్ రావు, చంటి క్రాంతికిరణ్, హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మెన్ చింతా ప్రభాకర్, డీసీఎంఎస్ చైర్మెన్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కుల వివక్షకు కారకులైన వారిని అరెస్టు చేయాలి

- దళితులకు ఊరు బయట చెట్ల కింద కటింగ్ చేస్తారా?
- అంటరానితనం పాటించిన వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి : కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్



నవతెలంగాణ జగదేవపూర్

తిమ్మాపూర్ గ్రామంలో అందరితో సమానంగా కటింగ్ షాపులో ఎస్సీలకు క్షవరం చేయకుండా ఊరు బయట చెట్టు కింద చేస్తూ కులవివక్ష పాటించిన వారిని వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ఉపాధ్యక్షులు అతిమేల మాణిక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్ గ్రామంలో దళితుల పట్ల జరుగుతున్న వివక్ష ఘటనపై అతిమేల మాణిక్‌తో పాటు ఇతర దళిత, సామాజిక, ప్రజాసంఘాల నాయకుల బృందం సోమవారం గ్రామాన్ని సందర్శించారు. బాధితులతో మాట్లాడారు. ఈ సందర్భంగా మాణిక్ మాట్లాడుతూ.. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ కులం పేరుతో అవమానపరచడం దారుణమన్నారు. రాజ్యాంగం ప్రకారం మనుషులంతా సమానమేనని, కంప్యూటర్ యుగంలో దళితులపై వివక్ష ఏంటని అన్నారు. గ్రామానికి చెందిన కొందరు పెద్దలు గత నెల 8న దశాబ్ది దినోత్సవాల సందర్భంగా నిర్వహించిన చెరువు పండుగలో భోజనాలు వడ్డించే విషయంలో దళితులను అవమానపరిచారని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో కుల వివక్షత జరిగినా అధికారులు పట్టీ పట్టనట్లు వ్యవహరించడం దారుణమన్నారు. ఈ నెల 5న సెలూన్ షాప్‌కు వెళ్లిన మాదిగలకు.. షాపులో మీకు క్షవరం చేయమని, గ్రామానికి చెందిన కొందరు పెద్దలు మీకు గౌరవం ఇవ్వొద్దని చెప్పారని, మీకు బయట చెట్టు కింద చేస్తామంటూ షాపు యజమానులు చెప్పడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అవమానం భరించని దళితులు.. తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. కానీ ఆరు రోజులైనా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బక్కెల్లి బాలకిషన్, కర్రోల్ల నవీన్, జిల్లా ఉపాధ్యక్షులు మరాఠి కృష్ణమూర్తి, జిల్లా సహాయ కార్యదర్శి కర్రోల్ల ఎల్లయ్య, మునగడప నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రపంచ గమనం

ఉక్రెయిన్ కు నిషేధిత క్లస్టర్ బాంబులు



న్యూయార్క్ : ఉక్రెయిన్ కు క్లస్టర్ బాంబులను పంపాలని అమెరికా అధ్యక్షుడు తాజాగా నిర్ణయించాడు. క్లస్టర్ బాంబులు విస్తృతమైన ప్రాంతంలో వెదజల్లబడి అవి అనేక దశాబ్దాలపాటు పౌరుల మరణాలకు, గాయపడటానికి కారణభూతమౌతాయి. ఉక్రెయిన్ రష్యాపై చేస్తున్న ప్రతిదాడి ఘోరంగా విఫలం కావటంతో అమెరికా మరింత వినాశకరమైన ఆయుధాలను ఉక్రెయిన్ కు పంపాలని నిర్ణయించింది. విల్నియస్ లో ఈ వారంలో నాటో శిఖరాగ్ర సభ జరగనున్న నేపథ్యంలో అమెరికా ఈ నిర్ణయం తీసుకుంది. ఈ శిఖరాగ్ర సభలోఅమెరికా, నాటో దేశాలు పెద్ద ఎత్తున ఉక్రెయిన్ యుద్ధంలో జోక్యం చేసుకోవాలని ప్రణాళికలు రచిస్తున్నాయి. ఉక్రెయిన్ యుద్ధం గురించి ఇప్పటికే అమెరికా లెక్కలు తప్పయినందువల్ల మరిన్ని తీవ్రమైన చర్యలు తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు బైడెన్ పైన వత్తిడి పెరుగుతోంది. క్లస్టర్ బాంబులను ఉక్రెయిన్ కు సరఫరా చేయటం వెనుక దీర్ఘకాలంలో పౌరుల మరణాలకు దారితీస్తుందనే విషయం అటుంచి రష్యా సైనికులను ఎంత ఎక్కువ సంఖ్యలో వీలైతే అంత ఎక్కువ సంఖ్యలో హతమార్చాలనే లక్ష్యం ఉంది. దీనితో విల్నియస్ లో జరగనున్న నాటో శిఖరాగ్ర సభకు ముందు అమెరికా ఎంత దూరమైనా వెళ్ళటానికి సిద్ధంగా ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాడీమీర్ పుతిక్ కు చెప్పినట్టయింది. ఉక్రెయిన్ ఘోర పరాజయాన్ని తప్పించటం కోసమే తాము ఈ నిర్ణయం చేసినట్టు అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సల్లివాన్ ప్రకటించాడు. ఉక్రెయిన్ వసంతకాల ప్రతిదాడితో రష్యాను ఓడించటం జరుగుతుందని అమెరికన్ మీడియా ఊదరగొడుతుండగా యుద్ధరంగంలో ఉక్రెయిన్ ఘోరంగా విఫలమౌతోంది. ఇప్పటికే తన సైన్యంలో ప్రధాన భాగాన్ని కోల్పోయింది. గతంలో అమెరికానే రష్యా క్లస్టర్ బాంబులను ఉపయోగిస్తున్నదని విమర్శించింది. 2022ఫిబ్రవరిలో ఐక్యరాజ్య సమితిలో అమెరికా రాయబారి, లిండా థామస్ ఉక్రెయిన్ లో రష్యా క్లస్టర్ బాంబులను ఉపయోగిస్తున్నదని ఆరోపించింది. 2022మార్చినెలలో నాటో సెక్రటరీ జనరల్ జెన్స్ స్టోల్టెన్ బర్గ్ కూడా అంతర్జాతీయ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా రష్యా క్లస్టర్ బాంబులను ప్రయోగిస్తున్నదని విమర్శించాడు. నిజానికి ఈ విమర్శలన్నీ ఉక్రెయిన్ యుద్ధాన్ని తీవ్రతరం చేయటానికి అమెరికా, నాటో ఆడుతున్న నాటకాలే. నిజానికి రష్యా-ఉక్రెయిన్ ల మధ్య జరుగుతున్న యుద్ధం అమెరికా ప్రపంచాధిపత్యం కోసం చేస్తున్న యుద్ధమే. ఈ యుద్ధంలో ఉక్రెయిన్ కేవలం మందుగుండు మాత్రమే. గత 50 సంవత్సరాలలో అమెరికా నేరపూరితంగా చేసిన అనేక యుద్ధాలవంటిదే ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధం. వియత్నాం యుద్ధ కాలంలో అమెరికా 4,13,130టన్నుల క్లస్టర్ బాంబులను కంబోడియా, లావోస్, వియత్నాంలలో ప్రయోగించింది. యుద్ధం ముగిసిన అనేక సంవత్సరాల తరువాత కూడా ఇప్పటికీ ప్రయోగించినప్పుడు పేలని బాంబులు పేలి ప్రజలు చనిపోవటమో, క్షతగాత్రులు కావటమో జరిగేది. 2003లో ఇరాక్ పైన అమెరికా దురాక్రమణ చేసినప్పుడు క్లస్టర్ బాంబులను నిర్విరామంగా వాడటం జరిగింది. క్లస్టర్ బాంబులు వాడటమే కాకుండా డిప్లీటెడె యురేనియం బాంబులను వాడటంవల్ల ఇరాక్ లోని ఫల్లుజా పట్టణం జపాన్ లోని హిరోషిమా, నాగసాకిల కంటే ఎక్కువగా నాశనం అయింది. 2001లో అఫ్ఘానిస్తాన్ పైన అమెరికా దాడిచేసినప్పుడు కూడా అమెరికా క్లస్టర్ బాంబులను ప్రయోగించింది. యెమెన్ లో జరిగిన యుద్ధంలో సౌదీ అనుకూల శక్తులకు అమెరికా క్లస్టర్ బాంబులను సరఫరా చేసింది. అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోడిమీర్ జెలెన్ స్కీ వత్తిడి చేయటంవల్లనే ఈ నిర్ణయం తీసుకున్నాడని న్యూయార్క్ టైమ్స్ రాసింది. ఉక్రెయిన్ యుద్ధ తీవ్రతను పెంచటం అమెరికా చేస్తున్న హెచ్చరికగా చూడాలి. అంది అంతిమంగా నాటో సైనిక జోక్యంతో మరింత తీవ్రతరమవ్వటమే కాకుండా మానవాళి భవితనే ప్రశ్నార్థకం చేసే దిశలో పయనించనుంది.

ఇంటర్నెట్ పాక్షిక పునరుద్ధరణపై నేడు సుప్రీం విచారణ

న్యూఢిల్లీ : మణిపూర్‌లో ఇంటర్నెట్ సేవలను పాక్షికంగా పునరుద్ధరించాలంటూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీంకోర్టు మంగళవారం విచారణ జరుపుతుంది. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. హింసాకాండతో అట్టుడికిపోయిన మణిపూర్‌లో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసిన విషయం తెలిసిందే. అయితే ఇంటర్నెట్ సేవలను కొన్ని ప్రాంతాలకు పరిమితం చేయాలంటూ రాష్ట్ర హైకోర్టు గత నెల 16న ప్రభుత్వాన్ని ఆదేశించింది. నిపుణుల కమిటీ సూచన మేరకు రక్షణ చర్యలు తీసుకుంటామని యాజమాన్యాలు హామీ ఇచ్చిన నేపథ్యంలో ఇంటర్నెట్ లీజ్ లైన్ (ఐఎల్ఎల్), ఫైబర్ టూ ది హోమ్ (ఎఫ్‌టీటీహెచ్) కనెక్షన్లపై నిషేధాన్ని ఎత్తివేయాలని ఈ నెల 7న మరోసారి హైకోర్టు ఆదేశించింది. అయితే ఈ ఆదేశాలను సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ పీఎస్ నరసింహతో కూడిన బెంచ్ మంగళవారం విచారణ జరుపుతుంది.

ముస్లిం సజీవ దహనం కేసులో ఆరుగురిపై అభియోగాలు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో 2020లో జరిగిన ఘర్షణల సందర్భంగా ముస్లిం యువకుడిని సజీవ దహనం చేసిన కేసులో ఢిల్లీ హైకోర్టు ఆరుగురు నిందితులపై అభియోగాలు నమోదు చేసింది. పౌరసత్వ సవరణ చట్టానికి అనుకూలంగా, వ్యతిరేకంగా ఉన్న గ్రూపుల మధ్య ఢిల్లీలో 2020 ఫిబ్రవరి 23-26 తేదీల మధ్య మత ఘర్షణలు జరిగిన విషయం తెలిసిందే. ఈ హింసాకాండలో 53 మంది చనిపోగా వందలాది మంది గాయపడ్డారు. ఈ ఘర్షణల్లో ముస్లింలు అధిక సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. నగరంలోని ఖాజురీ పస్తా రోడ్డులో ఫిబ్రవరి 25న జరిగిన ఓ ఘటనలో షాబాజ్ అనే ముస్లింను మతోన్మాదులు సజీవ దహనం చేశారు. ఈ కేసులో నిందితులైన ఆరుగురు వ్యక్తులపై ఈ నెల 8న అదనపు సెషన్స్ జడ్జి పులస్త్య ప్రామాచల అభియోగాలు నమోదు చేశారు. నిందితులు ముందస్తు పథకంతో కుట్ర పన్ని ఈ ఘాతుకానికి పాల్పడ్డారని న్యాయమూర్తి తెలిపారు. ముస్లింలపై ప్రతీకారం తీర్చుకోవడమే వారి ఏకైక లక్ష్యమని చెప్పారు. ఘటన జరగడానికి ఒక రోజు ముందు వీరందరూ సమావేశమై పథకానికి రూపకల్పన చేశారని అన్నారు. ఐపీసీలోని వివిధ సెక్షన్ల కింద న్యాయస్థానం నిందితులపై అభియోగాలు నమోదు చేసింది.

మణిపూర్ హింసకు ప్రభుత్వమే కారణం

- నిగ్గు తేల్చిన నిజ నిర్ధారణ బృందం
- దాని పైనే కేసు పెట్టిన ప్రభుత్వం

ఇంఫాల్ : మణిపూర్‌లో చెలరేగిన హింసాకాండకు ప్రభుత్వమే కారణమని ముగ్గురు సభ్యులతో కూడిన నిజ నిర్ధారణ బృందం నిగ్గు తేల్చింది. అయితే వాస్తవాలు బయటపెట్టిన బృందం సభ్యుల పైనే ప్రభుత్వం కేసు నమోదు చేసింది. బృందం సభ్యులు అన్నే రాజా, నిషా సిద్ధూ, దీక్షా ద్వివేదిపై ఈ నెల 8న ఇంఫాల్ పోలీస్ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. భారతీయ మహిళల జాతీయ సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ)కు చెందిన ఈ ముగ్గురు సభ్యులు గత నెల 28 నుండి ఈ నెల 1వ తేదీ వరకూ మణిపూర్‌లో పర్యటించారు. ఎన్ఎఫ్ఐడబ్ల్యూకు రాజా ప్రధాన కార్యదర్శిగా, సిద్ధూ జాతీయ కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. ద్వివేది ఢిల్లీకి చెందిన న్యాయవాది.

రాష్ట్ర ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించారని, రెచ్చగొట్టేలా వ్యవహరించారని, పరువుకు నష్టం కలిగించారని ఆరోపిస్తూ ఐపీసీలోని వేర్వేరు సెక్షన్ల కింద ముగ్గురిపై కేసు నమోదు చేశారు. విచారణలో తమ దృష్టికి వచ్చిన వాస్తవాలను వీరు విలేకరుల సమావేశంలో వివరించారు. దీనిపై లిబెన్ సింగ్ అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మణిపూర్ ఘర్షణలు మతపరమైనవి కావని, అవి రెండు జాతుల మధ్య జరిగినవి కూడా కావని బృందం సభ్యులు తెలిపారు. అవి భూమి, వనరులు, ఉగ్రవాదులు, మతోన్మాదులకు సంబంధించినవని చెప్పారు. ప్రభుత్వం తన కార్పొరేట్ అనుకూల అజెండాను అమలు చేసేందుకు రూపొందించుకున్న వ్యూహాలలో భాగంగానే హింస చెలరేగిందని విమర్శించారు. కాగా తమకు ఇంకా ఎఫ్ఐఆర్ ప్రతి అందలేదని, అందిన తర్వాతే దానిపై వ్యాఖ్యానిస్తామని బృందం సభ్యులు చెప్పారు.